బుధవారం
16•08•2017
హైదరాబాద్
• వెల.5 రూ.
• సంపుటి 7 • సంచిక 70
• పేజీలు : 16 + 24 + 8 పేజీల నిపుణ ప్రత్యేక అనుబంధం

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక
WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | KHAMMAM | NALGONDA | MAHABUBNAGAR | NIZAMABAD





స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా మంగళవారం గోల్కొండ కోటపై త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు



ఢిల్లీలోని ఎర్రకోట వద్ద మంగళవారం స్వాతంత్ర్యదిన వేడుకల్లో ప్రసంగిస్తున్న ప్రధాని నరేంద్రమోదీ

ఉద్యోగ తెలంగాణ

కొత్తగా 85వేల ఉద్యోగాలు ▪ నిరుద్యోగ యువతకు సీఎం కేసీఆర్ తీపికబురు

ఆశించినదానికంటే మిన్నగా 1,12,536 ఉద్యోగాల భర్తీ

యాసంగి నుంచి రైతులకు 24గంటల కరెంటు ▪ బతుకమ్మ పండుగకు మహిళలకు చీరలు

డిసెంబర్ చివరికి అన్ని గ్రామాలకు భగీరథ నీరు ▪ 81 సంవత్సరాల తర్వాత మళ్లీ భూసర్వే ▪ శ్రీరాంసాగర్‌కు పూర్వవైభవం

స్వాతంత్ర్య వేడుకలలో ముఖ్యమంత్రి వెల్లడి

దశాబ్దాల కరెంటు దుఃఖం దూరం చేశాం ▪ వచ్చే ఏడాది ఎకరానికి 8వేల పెట్టుబడి ఇస్తాం

కేసీఆర్ కిట్‌తో 42 వేలమందికి ప్రయోజనం ▪ వెయ్యి కోట్ల పెట్టుబడులు సాధించాం

96 లక్షల మె.ట. పంటతో నూతన చరిత్ర ▪ సమానత్వం-సామాజికన్యాయం మా ప్రాతిపదిక

గ్రామీణ మానవ వనరులను గుర్తించి ప్రోత్సహించాం

ప్రతిపక్షాల కుట్రలు సాగవు ▪ మా దీక్షను భంగపరుచలేరు

ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ

స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా తెలంగాణ యువతకు ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు తీపికబురు చెప్పారు. ఇప్పటి వరకు చేపట్టిన 27,660 నియామకాలకు తోడుగా మరో 84,876 ఉద్యోగాల నియామక ప్రక్రియను సత్వరమే చేపట్టబోతున్నట్టు ప్రకటించారు. వచ్చే యాసంగి నుంచి వ్యవసాయానికి 24గంటల కరెంటును అందించడానికి అన్ని ఏర్పాట్లు జరుగుతున్నట్టు ముఖ్యమంత్రి వెల్లడించారు. డిసెంబర్‌నాటికి ఇంటింటికీ శుద్ధి చేసిన నీరు అందించే మిషన్ భగీరథను పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. బతుకమ్మ పండుగ కానుకగా రాష్ట్రవ్యాప్తంగా తెల్లరేషన్ కార్డు కలిగిన 93 లక్షల మంది మహిళలకు చీరలను అందించే పథకం ప్రవేశపెడుతున్నామని చెప్పారు. ఆర్థిక లక్ష్యాలను సాధించడమే కర్తవ్యంగా భావించే యాంత్రిక ధోరణికి స్వస్తి చెప్పి.. సమానత్వం-సామాజికన్యాయం ప్రాతిపదికన సంక్షేమం-అభివృద్ధి రథచక్రాలుగా పరిపాలన కొనసాగిస్తున్నామని చెప్పారు. కొత్తరాష్ట్రాలు త్వరగా కుదురుకోవనే ఆనవాయితీని అధిగమించి అభివృద్ధిపథంలో దేశంలో అగ్రగామి రాష్ట్రంగా నిలిచామని పేర్కొన్నారు. గ్రామీణ మానవ వనరులను గుర్తించి, గ్రామీణార్థిక వ్యవస్థను పటిష్ఠంచేస్తూ గాంధీ మహాత్ముడు చెప్పిన గ్రామస్వరాజ్య సాధనకు కృషిచేస్తున్నామని అన్నారు. తెలంగాణ రైతులు అనుభవించిన దశాబ్దాల కరెంటు గోసను, విత్తనాలు, ఎరువుల కొరత వెతలను దూరం చేశామని తెలిపారు. తెలంగాణ రైతన్నకు ఇకపై చేయి చాచే దుస్థితి ఉండకూడదనే లక్ష్యంతో ఎకరానికి రూ.8 వేల పెట్టుబడి సమకూర్చబోతున్నామని చెప్పారు. ఉమ్మడిరాష్ట్రంలో విధ్వంసానికి గురైన చెరువుల పునరుద్ధరణకు చేపట్టిన మిషన్ కాకతీయ, 9 గంటల కరెంటు తదితర చర్యలతో తెలంగాణ రైతాంగం ఈ సంవత్సరం 96 లక్షల మెట్రిక్ టన్నుల పంటలు పండించి నూతన చరిత్ర లిఖించిందని పేర్కొన్నారు. గర్భిణులు పనుల్లోకి వెళ్లకుండా ఉండేందుకు అత్యంత మానవీయ కోణంలో చేపట్టిన కేసీఆర్ కిట్ పథకం వల్ల ప్రభుత్వ వైద్యశాలల్లో ప్రసవాలు పెరిగాయని తెలిపారు. రాష్ట్రాభివృద్ధికి చేపట్టే కార్యక్రమాలకు తీవ్ర విఘాతం కలిగించేందుకు ప్రతిపక్షాలు ఎన్ని

మిగతా 2వ పేజీలో

> శ్రామిక జనుల సౌభాగ్యంకోసం, సకలజనుల సంక్షేమంకోసం మొక్కవోని దీక్షతో ముందుకు సాగుతున్నాం. దీనికి విఘాతం కలిగించాలని ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు చేస్తున్నా ప్రజల ఆశీర్వాదంతో వాటిని ఛేదిస్తూ ముందడుగు వేయగలుగుతున్నాం. తెలంగాణ సర్వతోముఖాభివృద్ధికోసం నిరంతరం పాటుపడే మా ఏకాగ్రతను కుటిల ప్రయత్నాలతో మరల్చజాలరని మరోసారి స్పష్టం చేస్తున్నాను. ప్రజల అండదండలే మాకు తిరుగులేని ఆత్మబలం. అట్టడుగువర్గాల దాకా అభివృద్ధి ఫలాలను అందించే బంగారు తెలంగాణను సాకారం చేసే మా ప్రయత్నం కొనసాగుతుందని ప్రకటిస్తున్నాను.
>
> – ముఖ్యమంత్రి కేసీఆర్

> తెలంగాణ రాష్ట్రం సిద్ధిస్తే ఒక లక్ష మందికి నూతనంగా ఉద్యోగాలు లభిస్తాయని ఉద్యమ సమయంలో భావించాం. ఈ పవిత్ర స్వాతంత్ర్య దినోత్సవ వేళ తెలంగాణ నిరుద్యోగ యువతకు ఒక శుభవార్తను తెలియజేస్తున్నాను. ఇప్పటి వరకు చేపట్టిన 27,660 నియామకాలకు తోడుగా మరో 84,876 ఉద్యోగాల నియామక ప్రక్రియను సత్వరమే చేపట్టబోతున్నామని సంతోషంగా ప్రకటిస్తున్నాను.
>
> – ముఖ్యమంత్రి కేసీఆర్

2022 నాటికి
నవభారతం

సమిష్టి బలమే మన ఆయుధం ▪ ప్రేమతోనే కశ్మీర్‌లో శాంతిస్థాపన

రానున్న ఐదేండ్లలో మార్పు కోసం శ్రమిద్దాం ▪ దేశరక్షణలో ఏ సవాలునైనా ఎదుర్కొంటాం

నోట్లరద్దుతో నల్లధనాన్ని కట్టడిచేశాం ▪ 1.25 లక్షల కోట్ల బ్లాక్‌మనీని వెలికితీశాం

రూ. 1.75లక్షల కోట్ల డిపాజిట్లపై నిఘా ▪ జీఎస్టీతో సహకార వ్యవస్థకు జవసత్వాలు

ఎర్రకోట నుంచి స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ప్రధాని నరేంద్రమోదీ

75 ఏండ్లు పూర్తిచేసుకున్న క్విట్ ఇండియా ఉద్యమస్ఫూర్తితో రానున్న ఐదేండ్లలో నవభారతాన్ని నిర్మిద్దామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. 2022నాటికి సరికొత్త భారత్ స్వప్నాన్ని సాకారం చేసుకునేందుకు స్వాతంత్ర్యస్ఫూర్తితో సమిష్టి సంకల్పబలంతో శ్రమిద్దామని అన్నారు. దేశరక్షణలో రాజీపడబోమని, ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కొనేందుకు సిద్ధమని స్పష్టంచేశారు. అవినీతి, నల్లధనాన్ని ఉపేక్షించే ప్రసక్తే లేదని తెలిపారు. జీఎస్టీతో ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచామని పేర్కొన్నారు. 71వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మంగళవారం ఢిల్లీలోని ఎర్రకోటపై జాతీయజెండాను ప్రధాని ఆవిష్కరించారు. బుల్లెట్లతో ప్రజల మనసులు గెలువలేమని చెప్పిన మోదీ, ప్రేమతోనే కశ్మీర్‌లో శాంతిస్థాపన సాధ్యమని స్వాతంత్ర్య సందేశంలో పేర్కొన్నారు. 5

రేపటి నుంచి మూడురోజులు భారీవర్షాలు

బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

గురు, శుక్రవారాల్లో రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం మంగళవారం తెలిపింది. బంగాళాఖాతంలో పశ్చిమ ప్రాంతం నుంచి కోస్తా జిల్లాలవరకు ఉపరితల ఆవర్తనం విస్తరించి ఉన్నట్లు అధికారులు వివరించారు. ఒడిశా నుంచి రాయలసీమ మీదుగా దక్షిణ తమిళనాడు వరకు మరో ఉపరితల ద్రోణి వ్యాపించి ఉన్నదని, వీటి ప్రభావంతో బుధవారం అన్ని జిల్లాల్లో చిరుజల్లులు నుంచి ఓ మోస్తరు వర్షాలు

మిగతా 12వ పేజీలో

9 నోటిఫికేషన్లు..
2345 ఉద్యోగాలు

ఒకేరోజు భారీస్థాయిలో ప్రకటనలు విడుదలచేసిన టీఎస్‌పీఎస్సీ

వైద్యారోగ్యశాఖ, అటవీశాఖల్లో భర్తీకానున్న ఖాళీలు

అత్యధికంగా ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ల పోస్టులు 1,857

త్వరలో మరిన్ని నోటిఫికేషన్లు.. కమిషన్ చైర్మన్ ఘంటా చక్రపాణి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

స్వాతంత్ర్య దిన సంబురాల్లో తెలంగాణ ప్రభుత్వం నిరుద్యోగులకు వరాలు కురిపించింది. యువత.. ఉద్యోగాల కల సాకారం దిశగా మరిన్ని నోటిఫికేషన్లతో సంతోషాన్ని తెచ్చిపెట్టింది. తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) జెండా పండుగ సందర్భంగా పెద్దఎత్తున కొలువుల భర్తీకి ప్రకటన విడుదల చేసింది. 9 నోటిఫికేషన్ల ద్వారా 2,345 ఉద్యోగాలను భర్తీ చేయనున్నట్టు టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి వాణీప్రసాద్ తెలిపారు. వైద్యారోగ్యశాఖ, అటవీశాఖల్లో ఖాళీగా ఉన్న కొలువులను ఈ నోటిఫికేషన్ల ద్వారా భర్తీ చేయనున్నట్టు చెప్పారు. ఉద్యోగాల విద్యార్హతలు, కొలువుల ఇతర వివరాలు, దరఖాస్తు ప్రక్రియ కోసం తమ వెబ్‌సైట్‌ను సందర్శించాలని ఆమె కోరారు. రాష్ట్రంలోని నిరుద్యోగుల ఆకాంక్షలు ఫలించేలా ఉద్యోగాల భర్తీ ప్రక్రియను ముందుకు తీసుకుపోతున్నట్టు టీఎస్‌పీఎస్సీ చైర్మన్ ఘంటా చక్రపాణి తెలిపారు. ఇప్పటివరకు భర్తీచేసిన ఉద్యోగాల్లో పారదర్శకతకు పెద్దపీట వేయడమే ఇందుకు నిదర్శనమని చెప్పారు. టీఎస్‌పీఎస్సీ కార్యాలయంలో మంగళవారం జెండా వందనం అనంతరం ఘంటా చక్రపాణి ప్రసంగించారు. విద్యాశాఖలోని టీచర్ పోస్టులు, వైద్యారో గ్య శాఖ, అటవీశాఖ, వ్యవసాయశాఖలో పలు కొలువుల భర్తీతోపాటు వివిధ విభాగాల్లోని ఇంజినీర్ ఖాళీల భర్తీకి త్వరలో నోటిఫికేషన్లు రానున్నట్టు ప్రకటించారు. టీఎస్‌పీఎస్సీ ఏర్పాటయినప్పటి నుంచి ఉద్యోగులు, సభ్యులు సమన్వయంతో వ్యవహరించడం వల్ల నియామక ప్రక్రియలు సాఫీగా సాగుతున్నాయని తెలిపారు. త్వరలో పదవీ

మిగతా 6వ పేజీలో

వ్యవసాయ వర్సిటీలో
242 బోధన పోస్టుల భర్తీ

- వారంరోజుల్లో నోటిఫికేషన్ విడుదల
- ఉపకులపతి డాక్టర్ వీ ప్రవీణ్‌రావు వెల్లడి

6

టీచర్ల ఖాళీలపై స్పష్టత

- వచ్చేవారంలో టీఎస్‌పీఎస్సీకి వివరాలు
- కసరత్తు పూర్తిచేసిన విద్యాశాఖ అధికారులు
- భర్తీకానున్న 8,792 పోస్టులు







మంగళవారం స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో అమరజవానుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న సీఎం కే చంద్రశేఖర్‌రావు



గోల్కొండలో పంద్రాగస్టు వేడుకల్లో పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్



గోల్కొండలో జెండా వందనం అనంతరం అభివాదం చేస్తున్న సీఎం కేసీఆర్. చిత్రంలో సీఎస్ ఎస్పీ సింగ్, డీజీపీ అనురాగ్ శర్మ

ఉద్యోగ తెలంగాణ

మొదటిపేజీ తరువాయి...

కుట్రలు చేస్తున్నా ప్రజల ఆశీర్వాద బలంతో వాటన్నింటినీ ఛేదించి ముందడుగు వేస్తామని సీఎం స్పష్టం చేశారు. గోల్కొండ కోటలో మంగళవారం జరిగిన స్వాతంత్ర్యదిన వేడుకలలో సీఎం కేసీఆర్ ఉద్వేగభరితంగా ప్రసంగించారు. ముఖ్యమంత్రి ప్రసంగం ఆయన మాటల్లోనే..

లక్ష్యసాధన దిశగా పయనిస్తున్నాం

భారత జాతీయోద్యమం స్ఫూర్తితో, అహింసామార్గంలో.. శాంతియుత పంథాలో పోరాడి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నాం. ఏ ఆశయ సాఫల్యం కోసం స్వరాష్ట్రాన్ని కోరుకున్నామో ఆ లక్ష్యసాధన దిశగా పురోగమిస్తున్నందుకు హర్షం ప్రకటిస్తున్నాను. తెలంగాణ వైభవానికి ప్రతీకగా గోల్కొండ కోటలో మూడేండ్లకింద మొదటిసారి త్రివర్ణపతాకాన్ని ఎగురవేసి రాష్ట్రప్రగతికి పథనిర్దేశం చేసుకున్నాం. ఆనాడు ప్రకటించుకున్న ప్రణాళికల వెలుగులోనే అద్భుత విజయాలు సాధిస్తూ ముందడుగు వేస్తున్నాం. కొత్తగా ఏర్పడిన రాష్ట్రాలు అంత తొందరగా కుదురుకోవు. కానీ ఈ పరిస్థితిని మన రాష్ట్రం సమర్థంగా అధిగమించింది. 2016-17 ఆర్థిక సంవత్సరంలో 21.7శాతం ఆదాయ వృద్ధిరేటుతో తెలంగాణ దేశంలోనే అగ్రభాగాన నిలిచింది. ఇది మనందరికీ గర్వకారణం. రాష్ట్ర ప్రగతికి శుభసూచకం.



పేదలకు జీవనభద్రత కల్పిస్తున్నాం

కేవలం ఆర్థిక లక్ష్యాలను సాధించడమే కర్తవ్యంగా భావించే యాంత్రిక ధోరణిని ప్రభుత్వం విడనాడింది. సమానత్వం, సామాజికన్యాయం అనే ఉదాత్త లక్ష్యాలను సాధించే ప్రణాళికలు రూపొందించింది. అభివృద్ధి, సంక్షేమం అనే రెండుచక్రాల మీద పరిపాలన సాగుతున్నది. ప్రజలకు కనీస జీవన భద్రతను కల్పించేందుకు సంక్షేమరంగానికి బడ్జెట్‌లో సింహభాగాన్ని వెచ్చిస్తున్నాం. నిరుపేదలకు, నిస్సహాయులైన లక్షల మందికి ఆసరా పెన్షన్లను అందిస్తున్నాం. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, నేత, గీత కార్మికులు, ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులు, బీడీకార్మికులతోపాటు ఇటీవలనే ఒంటరి మహిళలకు కూడా జీవనభృతిని కల్పిస్తున్నాం. కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల కింద ఇచ్చే మొత్తాన్ని రూ.75 వేలకు పెంచాం.

నిరుద్యోగ యువతకు శుభవార్త

తెలంగాణ రాష్ట్రం సిద్ధిస్తే ఒక లక్ష మందికి నూతనంగా ఉద్యోగాలు లభిస్తాయని ఉద్యమ సమయంలో భావించాం. ఈ పవిత్ర స్వాతంత్ర్య దినోత్సవ వేళ తెలంగాణ నిరుద్యోగ యువతకు ఒక శుభవార్తను తెలియజేస్తున్నాను. ఇప్పటివరకు చేపట్టిన 27,660 నియామకాలతోపాటు, మరో 84,876 ఉద్యోగాల నియామక ప్రక్రియను సత్వరమే చేపట్టబోతున్నామని సంతోషంగా ప్రకటిస్తున్నాను. దీంతో తెలంగాణలో ఆశించినదాని కన్నా ఎక్కువగా 1,12,536 ఉద్యోగాలను ప్రభుత్వం భర్తీ చేస్తున్నది. వచ్చే సంవత్సరం ఏర్పడే ఖాళీలను భర్తీ చేయడానికి కూడా ఈ సంవత్సరమే ప్రక్రియ ప్రారంభించే ప్రయత్నంలో ప్రభుత్వం ఉన్నదని తెలియజేస్తున్నాను.

డిసెంబర్ నాటికే భగీరథ నీళ్లు

రాష్ట్ర ప్రజల దాహార్తిని శాశ్వతంగా పరిష్కరించే అపురూపమైన మిషన్ భగీరథ పథకం లక్ష్యాన్ని ముద్దాడే దిశగా సాగుతున్నది. ఈ ఏడాది డిసెంబర్ నాటికే అన్ని గ్రామాలకు శుద్ధి చేసిన నదీజలాలు అందించే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. గ్రామాలలో అంతర్గత పైప్‌లైన్లు, నీటిట్యాంకుల నిర్మాణం, ఇండ్లలో నల్లాల బిగింపు పనులు కొనసాగుతున్నాయి.

కేజీ టు పీజీ కింద కార్పొరేట్‌ను మించిన విద్య

కేజీ టు పీజీ ఉచిత విద్యావిధానంలో భాగంగా పెద్దఎత్తున గురుకుల పాఠశాలలను నెలకొల్పుతున్నాం. గడిచిన 58 ఏండ్ల చరిత్రలో 259 రెసిడెన్షియల్ పాఠశాలలను అరకొర వసతులతో ఏర్పాటు చేస్తే, కేవలం మూడేండ్ల వ్యవధిలో కార్పొరేట్ విద్యా సంస్థలను తలదన్నే వసతులతో 522 గురుకులాలను మనం ప్రారంభించుకున్నాం. అంతర్జాతీయ ప్రమాణాలకు సరితూగే నాణ్యమైన విద్య , సమతుల పౌష్టిక విలువలు కలిగిన మంచి ఆహారం, దుస్తులు, పుస్తకాలు, ఆట వస్తువులు అందిస్తూ విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తూ ఒక్కో విద్యార్థి మీద ప్రతి సంవత్సరం రూ.లక్షా 25వేలు వెచ్చిస్తున్నాం.'



ప్రగతిభవన్‌లో జెండా వందనం చేస్తున్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు. చిత్రంలో ప్రభుత్వ ప్రధాన సలహాదారు రాజీవ్ శర్మ, టీఎస్ఎండీసీ చైర్మన్ శేరి సుభాష్‌రెడ్డి, మిషన్ భగీరథ వైస్ చైర్మన్ వేముల ప్రశాంత్‌రెడ్డి తదితరులు

చిరుద్యోగులకు సముచిత వేతనాలు

తక్కువ వేతనాలతో, అర్ధాకలితోఅలమటిస్తున్న చిరుద్యోగుల వేతనాలను ప్రభుత్వం సముచితంగా పెంచింది. ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులను శ్రమదోపిడీనుంచి విముక్తం చేయాలన్న ప్రభుత్వ ఉదాత్త ఆశయానికి కొన్ని ప్రతీపశక్తులు సంకుచితత్వంతో అడ్డు తగులుతున్నాయి. అయినా వెనుకడుగు వేయకుండా, పట్టుదలతో ఉద్యోగుల జీతభత్యాలను ప్రభుత్వం పెంచింది.

సర్కారు దవాఖానల్లో పెరిగిన ప్రసవాలు

గర్భం దాల్చిన స్త్రీలు ఇల్లు గడువడం కోసం పనులకు పోవాల్సిరావటం బాధాకరం. ఈ పరిస్థితిని ప్రభుత్వం మానవతాదృక్పథంతో ఆలోచించి కేసీఆర్ కిట్ అనే మంచి పథకాన్ని ప్రవేశపెట్టింది. రెండున్నర నెలల్లోనే 42 వేలమంది ప్రయోజనం అందుకున్నారు. ప్రభుత్వ వైద్యశాలల్లో ప్రసవాల సంఖ్య గణనీయంగా పెరిగింది. పేదప్రజలకు వైద్యాన్ని అందించే ప్రభుత్వ దవాఖానల మీద ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధపెట్టి సదుపాయాలను మెరుగుపరిచింది. ఇటీవల గాంధీ హాస్పిటల్‌ను సందర్శించిన రాష్ట్ర గవర్నర్ నరసింహన్ అక్కడ అమలవుతున్న పారిశుద్ధ్యం, మెరుగైన వైద్యం గురించి ప్రశంసించారు.

గ్రామీణ మానవ వనరులను గుర్తించాం

గ్రామీణ ప్రాంతాల్లో తరతరాలుగా సంక్రమించిన నైపుణ్యంతో సేవలందించే కులవృత్తిదారులు మన రాష్ట్రానికి లభించిన అపార మానవ సంపదగా తెలంగాణ పభుత్వం గుర్తిస్తున్నది. నగరాల్లో, పరిశ్రమల్లో, కంప్యూటర్ల ముందు పనిచేసేవారు మాత్రమే మానవ వనరులనే అసమగ్ర వైఖరి వల్ల సమాజాన్ని అర్థం చేసుకోవడంలో గత పాలకులు వైఫల్యం చెందారు. ఇందుకు భిన్నంగా గ్రామీణ మానవ వనరులను గుర్తించడంలో సరికొత్త విధానాన్ని తెలంగాణ ప్రభుత్వం అవలంబిస్తున్నది. గొర్రెల పెంపకంలో గొప్ప ప్రావీణ్యం కలిగిన గొల్ల, కురుమలకు గొర్రెలు పంపిణీచేయడం ద్వారా రాష్ట్రంలో పెద్దఎత్తున గొర్రెలు పెంచే పథకాన్ని చేపట్టాం. ఇందుకోసం రూ.5 వేల కోట్లు వెచ్చిస్తున్నాం. 4 లక్షల దరఖాస్తులు వస్తాయని వేసిన అంచనాకు మించి 7 లక్షల దరఖాస్తులు వచ్చాయి. ఇప్పటికే 12 లక్షల గొర్రెలను 57 వేల కుటుంబాలకు అందించాం. రాబోయే రోజుల్లో మాంసం ఎగుమతి చేసేస్థాయికి తెలంగాణ రాష్ట్రం చేరుకుంటుంది. ఇదేవిధంగా రాష్ట్ర వ్యాప్తంగా నీటి వనరులన్నింటిలోనూ చేపల పెంపకాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నది. చేపల పెంపకాన్ని ఒక పరిశ్రమ స్థాయికి చేర్చేందుకు సమగ్ర చర్యలను తీసుకుంటున్నది. చేనేతలను, పవర్‌లూంలను ఆదుకునేందుకు సమగ్ర చేనేత విధానాన్ని రూపొందించి అమలుచేస్తున్నాం. నూలుతో పాటు అద్దకానికి అవసరమైన రసాయనాలను 50 శాతం సబ్సిడీతోఅందిస్తున్నాం. చేనేత కార్మికులు నేసిన వస్త్రాలను ప్రభుత్వమే కొంటున్నది. పవర్‌లూమ్ కార్మికులకు ప్రతినెల రూ.15 వేలకు తగ్గకుండా వేతనం ఇచ్చేవిధంగా యాజమాన్యాలను ఒప్పించాం. అన్ని ప్రభుత్వ శాఖల వస్త్రాల కొనుగోలు ఆర్డర్లను చేనేత, మరమగ్గాల సొసైటీలకే ఇవ్వాలని నిర్ణయించాం.

నేరాల సంఖ్య తగ్గింది

పోలీస్ వ్యవస్థను పటిష్టపరుచడంతో శాంతిభద్రతలు ఎంతో మెరుగుపడ్డాయి. నేరాల సంఖ్య తగ్గుముఖం పట్టింది. పేకాట, గుడుంబా మహమ్మారులను దాదాపు తరిమికొట్టగలిగాం. మహిళలపై వేధింపులను అరికట్టడంలో షీ-టీమ్‌లు సమర్థవంతంగా పనిచేస్తున్నాయి. ప్రజల కోరిక మేరకు జిల్లాల్లో షీ-టీమ్‌ల సంఖ్యను పెంచుతున్నాం. మన రాష్ట్రాన్ని ఆదర్శంగా తీసుకుని ఇతర రాష్ట్రాల్లోకూడా షీ-టీమ్‌లు ఏర్పాటవుతున్నాయి. మాదకద్రవ్యాలవంటి సామాజిక రుగ్మతలను ఆదిలోనే అంతం చేసేందుకు ప్రభుత్వం రాజీలేని వైఖరిని అవలంబిస్తున్నది.

పాలనా సంస్కరణలతో సత్ఫలితాలు

పరిపాలనా సౌలభ్యంకోసం ప్రభుత్వం సాహసోపేతమైన నిర్ణయం తీసుకొని రాష్ట్రంలో కొత్తగా 21 జిల్లాలను ఏర్పాటు చేసింది. వీటితోపాటు 25 డివిజన్లను, 125 మండలాలను ఏర్పాటు చేసింది. ఈ భారీ సంస్కరణల వల్ల పరిపాలన సౌలభ్యం పెరిగింది. కొత్త జిల్లాలలో కలెక్టరేట్లు, పోలీస్ కార్యాలయాల నిర్మాణం జరుగుతున్నది. పేదల ఆత్మగౌరవాన్ని పెంపొందించే డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణం ఊపందుకొన్నది. తెలంగాణ నేలను పచ్చదనంతో నింపాలనే ఆశయంతో చేపట్టిన తెలంగాణకు హరితహారం కార్యక్రమం ప్రజలందరి భాగస్వామ్యంతో విజయవంతమవుతున్నది.

కరెంటు దుఃఖం నుంచి రైతుకు విముక్తి

విద్యుత్‌రంగంలో తెలంగాణ ప్రభుత్వం విప్లవాత్మకమైన అభివృద్ధిని సాధించింది. ఒక్క నిమిషం కూడా కోత విధించకుండా, నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేస్తున్నది. వ్యవసాయరంగానికి 9 గంటలు పగటిపూట నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేస్తున్నది. వచ్చే యాసంగి నుంచి రాష్ట్రంలోని రైతులందరికీ 24 గంటల ఉచిత విద్యుత్‌ను అందించడానికి కృషి జరుగుతున్నది. దశాబ్దాల తరబడి కరెంటుకోసం తెలంగాణ రైతులు అనుభవించిన దుస్థితి నుంచి, దుఃఖంనుంచి ప్రభుత్వం విముక్తి కలిగించింది. ఈ పరిణామం తెలంగాణ రైతాంగంలో నూతనోత్సాహాన్ని, ఆశావహ దృక్పథాన్ని కలిగించింది. నిరంతర విద్యుత్ సరఫరాతో పారిశ్రామిక ఉత్పత్తి పెరిగింది. పరిశ్రమలు మూడు షిఫ్టులు నడువడంవల్ల కార్మికులకు ఎక్కువ పని దొరుకుతున్నది.

లోకం పోకడ



ప్రతి అభ్యర్థన పత్రంపై పన్ను వేస్తే సరి..!

ముహూర్తం



సూర్యోదయం: 6.03 గంటలకు



సూర్యాస్తమయం: 6.37 గంటలకు

హేవళంబి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, శ్రావణమాసం, కృష్ణపక్షం నవమి మధ్యాహ్నం 3.20 వరకు, తదుపరి దశమి. నక్షత్రం: కృత్తిక తె. 2.32 వరకు, తదుపరి రోహిణి. అమృత ఘడియలు: తె. 12.16 నుంచి 1.52 వరకు, తదుపరి ఉదయం 11.50 నుంచి 1.26 వరకు, రాహుకాలం: మధ్యాహ్నం 12.20 నుంచి 1.54 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 11.55 నుంచి 12.45 వరకు, వర్జ్యం: సాయంత్రం 5.25 నుంచి 7.01 వరకు.

సాగునీటితో గ్రామ స్వరాజ్య సాధన

పల్లె సీమలే దేశానికి పట్టుగొమ్మలని మహాత్మాగాంధీ అనేకసార్లు చెప్పారు. గ్రామ స్వరాజ్య భావనను ప్రతిపాదించారు. స్వావలంబనతో, స్వయంసమృద్ధితో విలసిల్లిన తెలంగాణ గ్రామీణ ఆర్థిక వ్యవస్థ ఉమ్మడి రాష్ట్రంలో కొనసాగిన వివక్ష, విద్రోహ పూరితవిధానాలతో పూర్తిగా ఛిన్నాభిన్నమైంది. శ్రమించే తత్వం, వృత్తినైపుణ్యం కలిగిన తెలంగాణ ప్రజానీకం 'అన్నమో రామ చంద్రా' అంటూ దూరదేశాలకు వలసపోవాల్సిన దుర్గతి వచ్చింది. కూలిన బతుకులను నిలబెట్టేందుకు, గ్రామీణార్థిక వ్యవస్థను పరిపుష్టం చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం నడుం కట్టింది. తెలంగాణకు జీవనరేఖలుగా ఉన్న గొలుసుకట్టు చెరువులను పునరుద్ధరించేందుకు మిషన్ కాకతీయ పథకాన్ని అమలుచేస్తున్నాం. 46,500 చెరువుల్లో ఇప్పటికే 20 వేల చెరువులను పునరుద్ధరించాం. చెరువుల్లో నీటినిల్వ పెరుగడం, విద్యుత్ సరఫరా మెరుగుకావడంతో ఈ సంవత్సరం చరిత్రలో ఎన్నడూ లేనంతగా దాదాపు 96 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పండించి తెలంగాణ రైతాంగం నూతన చరిత్రను లిఖించింది. ప్రభుత్వం తగిన సహకారం అందిస్తే తెలంగాణ రైతులు మట్టిలో బంగారం పండిస్తారనడానికి ఇది తిరుగులేని సాక్ష్యం.

శ్రీరాంసాగర్‌కు పునర్జీవం

ఇటీవలే ప్రభుత్వం శ్రీరాంసాగర్ పునర్జీవ పథకానికి శ్రీకారం చుట్టింది. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ ప్రజల ఒత్తిడి వల్ల గోదావరి మీద నిర్మించిన ఈ ఏకైక ప్రాజెక్టుపై దశాబ్దాల పాటు కొనసాగిన నిర్లక్ష్యం, వివక్ష వల్ల సాగర్ కాలువలు శిథిలమైనాయి. చివరికి ప్రాజెక్ట్ ఉండీ లేనట్టయింది. శ్రీరాంసాగర్ ఆయకట్టు రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు కాళేశ్వరం నుంచి గోదావరిని వరదకాలువ ద్వారా తెచ్చి శ్రీరాంసాగర్‌కు పూర్వవైభవం కల్పిస్తున్నాం. అతి తక్కువ సమయంలో, అతి తక్కువ ముంపుతో, అతి తక్కువ ఖర్చుతో పూర్తయ్యే ఈ పథకం సర్వత్రా ప్రజల అభినందనలను, హర్షామోదాలను పొందుతున్నది. నదీజలాల్లో మన రాష్ట్రవాటాను పూర్తిగా వినియోగించుకునేందుకు కాళేశ్వరం, పాలమూరు, సీతారామ వంటి ప్రాజెక్టుల నిర్మాణం శరవేగంగా జరుగుతున్నది.

సమగ్ర వ్యవసాయ సంస్కరణలు

ప్రభుత్వం సమగ్ర వ్యవసాయ సంస్కరణలను అమలుచేస్తున్నది. తెలంగాణ ఏర్పడిన వెంటనే రూ.17వేల కోట్ల వ్యవసాయ రుణాలను మాఫీ చేసింది. గతంలో విత్తనాలు, ఎరువులు సకాలంలో అందించకపోవడం వల్ల రైతులు ఎన్నో బాధలు పడ్డారు. మా ప్రభుత్వం కొరత లేకుండా సకాలంలో ఎరువులు, విత్తనాలను అందిస్తున్నది. కల్తీ విత్తనాలతో నష్టపోకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నది. పంట నిల్వ చేసుకునేందుకు 4లక్షల టన్నుల గోదాముల సామర్థ్యాన్ని 22.5 లక్షల టన్నులకు పెంచింది.



గోల్కొండలో పంద్రాగస్టు వేడుకలకు హాజరైన చిన్నారులను పలుకరిస్తున్న సీఎం కేసీఆర్

సమగ్ర భూసర్వేతో కొత్త చరిత్ర

సమగ్ర భూసర్వేతో తెలంగాణ రాష్ట్రం కొత్త చరిత్రను సృష్టించబోతున్నది. 1936లో నిజాం కాలంలో మాత్రమే భూసర్వే జరిగింది. మళ్లీ 81 సంవత్సరాల తర్వాత ఇన్నాళ్లకు తెలంగాణ ప్రభుత్వం భూసర్వేను నిర్వహిస్తున్నది. రాబోయే కొద్ది నెలల సమయంలో మొదలయ్యే ఈ భూ-సర్వే విజయవంతం కావడానికి రాష్ట్రంలోని రైతులే సారథ్యం వహించాలి. ఇది ఎవరి పనిగానో భావించి ప్రేక్షకపాత్ర వహించకుండా స్వచ్ఛందంగా ముందుకువచ్చి రైతు సంఘాలు సర్వేను విజయవంతం చేయాలని పవిత్ర స్వాతంత్ర్య దినోత్సవ శుభసందర్భాన పిలుపునిస్తున్నాను. సర్వే పూర్తయిన వెంటనే భూరికార్డులన్నీ పూర్తిగా సరిచేసి, కొత్త పాసుపుస్తకాలు పంపిణీ చేయడం జరుగుతుంది. ఇకపై భూసమస్యల పరిష్కారంకోసం రైతులు నెలల తరబడి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన దుస్థితి తప్పుతుంది.

బతుకమ్మ పండుగ నుంచి చీరల పథకం

వచ్చే బతుకమ్మపండుగ నుంచి రాష్ట్రవ్యాప్తంగా తెల్లరేషన్ కార్డు కలిగిన 93 లక్షల మంది మహిళలకు పండుగ కానుకగా చీరలను అందించే పథకాన్ని ప్రవేశపెడుతున్నాం. ప్రతి సంవత్సరం కూడా పండుగ సందర్భంగా కులమతాలకు అతీతంగా పేదలందరికీ పండుగ బట్టలను ప్రభుత్వం పంపిణీ చేస్తుంది. ఈ పథకంకోసం చేనేత, పవర్‌లూమ్‌ల ద్వారా ఉత్పత్తి అయిన చీరలనే కొనుగోలు చేస్తున్నాం. తద్వారా చేనేత, పవర్‌లూమ్‌ల ఉపాధికి పూర్తి హామీ ఏర్పడుతుంది. సిరిసిల్లలో అప్పరెల్ పార్క్ నిర్మాణాలకు కొద్దిరోజుల్లో శ్రీకారం చుట్టబోతున్నాం.

వృత్తిదారులకు చేయూత

గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్యప్రదమైన నవీన క్షౌరశాలలను ఏర్పాటు చేసుకునేందుకు నాయీబ్రాహ్మణులకు ఒక్కొక్కరికి లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందించే పథకాన్ని ప్రవేశపెడుతున్నాం. రజక సోదరులు బట్టలు పరిశుభ్రం చేసేందుకు అధునాతన యంత్రాలను అందించేందుకు సన్నాహాలు చేస్తున్నాం. ఇప్పటికీ స్థిరజీవనంలేని సంచార కులాలు, భిక్షాటన వృత్తిగా కలిగిన కులాలు అభివృద్ధి చెందాలనే సంకల్పంతో రూ.వెయ్యికోట్ల బడ్జెట్‌తో అత్యంత వెనుకబడినవర్గాల (ఎంబీసీ) కార్పొరేషన్‌ను ఏర్పాటు చేశాం. ప్రస్తుతం పథకాల రూపకల్పన జరుగుతున్నది. విశ్వకర్మలుగా పిలువబడే అవుసుల, కమ్మరి, కంచరి, వడ్రంగి, శిల్పకారులకు, బట్టలు కుట్టి జీవించే మేర కులస్థులకు, కల్లుగీతతో జీవించే గౌడ కులస్థులకు, కుమ్మరిపని తదితర కులవృత్తుల వారందరికీ అవసరమైన ఆర్థిక సహకారం, పరికరాల పంపిణీ చేయడానికి నిర్దిష్ట పథకాలను పభుత్వం రూపొందిస్తున్నది.

వెయ్యి కోట్ల పెట్టుబడులు సాధించాం

నేడు రాష్ట్రం సులభతర వాణిజ్యవిధానంలో దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది. టీఎస్ ఐపాస్ ప్రపంచవ్యాప్తంగా పారిశ్రామికవేత్తల దృష్టిని ఆకర్షించగలిగింది. అంతర్జాతీయ పారిశ్రామిక దిగ్గజాలు కార్యాలయాలను ఏర్పాటుచేస్తున్నాయి. ఇప్పటివరకు రూ.1,01,720 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. 4,118 నూతన పరిశ్రమలు అనుమతులు పొందాయి. 2 లక్షల 90 వేలమందికి ఉద్యోగావకాశాలు లభిస్తున్నాయి. ప్రపంచ పారిశ్రామికవేత్తల సదస్సుకు తెలంగాణ వేదిక కావడం మనందరికీ గర్వకారణం. నవంబర్ 28 నుంచి 30వ తేదీ వరకు హైదరాబాద్‌లో జరిగే ఈ సదస్సుకు భారత ప్రధాని నరేంద్రమోదీతో పాటు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కుమార్తె, అమెరికా ప్రభుత్వ సలహాదారు ఇవాంకా ట్రంప్ హాజరవుతున్నారు. ఈ సదస్సును విజయవంతం చేసి తెలంగాణ కీర్తిని దశదిశలా వ్యాపింపచేయడానికి ప్రభుత్వం ఘనమైన ఏర్పాట్లను చేస్తున్నది.

రైతులు చేయిచాపే స్థితి ఉండవద్దు

రైతు కష్టాలను తీర్చేందుకు వచ్చే సంవత్సరం నుంచి ఆదర్శవంతమైన పథకాన్ని ప్రభుత్వం ప్రవేశపెడుతున్నది. పంటవేసే సమయంలో పెట్టుబడి కోసం రైతులు అప్పులకు చేయిచాచే పరిస్థితి ఇక ఉండొద్దని ప్రభుత్వం నిశ్చయించింది. అప్పు చేసి పంటవేస్తే ప్రకృతి అనుకూలించక పంటనష్టం జరిగి అటు రుణభారం, ఇటు పంటనష్టం రెండూ కలిపి రైతును ఆర్థికంగా కుంగదీస్తున్నాయి. ఈ పరిస్థితి నుంచి గట్టెక్కించి రైతాంగాన్ని కాపాడుకోవడానికి ప్రభుత్వమే పంటకు అవసరమైన పెట్టుబడిని అందించాలని నిర్ణయించింది. సంవత్సరంలో రెండుపంటల కోసం ఎకరానికి 8వేల చొప్పున రాష్ట్రంలోని ప్రతి రైతుకు వచ్చే ఏడాది నుంచి ప్రభుత్వమే పెట్టుబడిని సమకూరుస్తుంది. రైతులకు పెట్టుబడి పథకం యావత్ దేశానికి ఆదర్శంగా నిలిచింది. రైతులను సంఘటితపరచి వారి ప్రయోజనాలు వారే రక్షించుకునే విధంగా రైతు సంఘాలను, సమాఖ్యలను ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్నది. పంటకు డిమాండ్ రావడం కోసం రాష్ట్రాన్ని పంటల కాలనీలుగా విభజిస్తున్నది. దీనివల్ల రైతులంతా ఒకే పంటవేసి నష్టపోయే పరిస్థితి ఉత్పన్నం కాదు. మార్కెటింగ్ సమస్య తలెత్తదు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు దేశంలో ఏ రాష్ట్రం కూడా అమలు చేయనటువంటి ఈ గొప్ప ప్రణాళికలో రైతులు నిబద్ధతతో భాగస్వాములు కావాలి.

మా దీక్షను భంగపరుచలేరు

తెలంగాణ ప్రభుత్వ సంకల్పానికి, ప్రజాహిత కార్యాక్రమాలకు తీవ్ర విఘాతం కలిగించాలని ప్రతీపశక్తులు ఎన్ని కుట్రలు చేస్తున్నా.. ప్రజల ఆశీర్వాదబలంతో వాటన్నింటినీ ఛేదిస్తూ ముందడుగు వేయగలుగుతున్నాం. తెలంగాణ ప్రజల సర్వతోముఖాభివృద్ధికోసం నిరంతరం పాటుపడే మా ఏకాగ్రతను, మా దృష్టిని కుటిల ప్రయత్నాలతో మరల్చలేరని మరోసారి స్పష్టం చేస్తున్నాను. శ్రామికజనుల సౌభాగ్యం కోసం, సకలజనుల సంక్షేమం కోసం తెలంగాణ ప్రభుత్వం మొక్కవోని దీక్షతో ముందుకు సాగుతుందని తెలియజేస్తున్నాను. ప్రజల అండదండలే మాకు తిరుగులేని ఆత్మబలాన్ని అందిస్తున్నాయి. మాలో అంకితభావాన్ని పెంపొందిస్తున్నాయి.అట్టడుగువర్గాలదాకా అభివృద్ధి ఫలాలను అందించే దిశగా బంగారు తెలంగాణను సాకారం చేసే మా ప్రయత్నంలో కలిసివస్తున్నవారందరికీ హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.



గోల్కొండలో జాతీయ జెండాను ఆవిష్కరించి వందనం చేస్తున్న సీఎం కేసీఆర్



మంగళ వారం గోల్కొండలో పంద్రాగస్టు వేడుకల్లో సీఎం కేసీఆర్ చేతుల మీదుగా అవార్డులు అందుకుంటున్న పాటల రచయితలు సుద్దాల అశోక్‌తేజ, జయరాజ్, ఆరోగ్య -కుటుంబసంక్షేమశాఖ కమిషనర్ వాకాటి కరుణ, టీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్ కార్యదర్శి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, పౌరసరఫరాల శాఖ కమిషనర్ సీవీ ఆనంద్, టెమ్రీస్ కార్యదర్శి షఫీవుల్లా, పౌరసరఫరాల కార్పొరేషన్ చైర్మన్ పెద్ది సుదర్శన్‌రెడ్డి



సాహిత్య పురస్కార గ్రహీత శ్రీభాష్యం విజయసారథికి పాదాభివందనం చేస్తున్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు



మంగళ వారం గోల్కొండలో జరిగిన 71వ స్వాతంత్ర్య దినోత్సవానికి హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు, అతిథులు



గోల్కొండలో పంద్రాగస్టు వేడుకల్లో పాల్గొన్న కేంద్ర మంత్రి దత్తాత్రేయ, ఎంపీలు కవిత, కే కేశవరావు, జితేందర్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, బూర నర్సయ్యగౌడ్, జీహెచ్‌ఎంసీ మేయర్ బొంతు రామ్మోహన్, టీఎస్ ఐసీసీ చైర్మన్ బాలమల్లు, టీఎస్‌ఎండీసీ చైర్మన్ శేరి సుభాష్‌రెడ్డి, మిషన్ భగీరథ వైస్ చైర్మన్ వేముల ప్రశాంత్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన సలహాదారు రాజీవ్‌శర్మ, పోలీస్ కమిషనర్ మహేందర్‌రెడ్డి తదితరులు

గోల్కొండ మురిసింది

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: విభిన్న కళారూపాల ప్రదర్శనతో గోల్కొండ కోట మురిసింది. కోటలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించిన రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, చారిత్రక వైభవాన్ని కండ్లకు కట్టేలా వినూత్న కళారూపాలను ప్రదర్శించింది. 24 కళారూపాలతో ఏర్పాటు చేసిన అద్భుత ప్రదర్శనలు ఆహూతులను మంత్రముగ్ధులను చేశాయి. కోయ, గుస్సాడి, లంబాడి, ఒగ్గుడోలు, యక్షగానం, షేరీ బాజా, పేరిణి శివతాండవం, దాండియా, డప్పుల దరువులు, పోతరాజుల నృత్యాలు చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి. భాగమతి సోలో నృత్యం అధికారులను ప్రత్యే ఆకర్షణగా నిలిచింది. మొత్తం 108 మంది కళాకారులు నృత్య విన్యాసాల్లో పాల్గొన్నారు. వేడుకలను వీక్షించేందుకు వచ్చిన సీనియర్ ఐఏఎస్, ఐపీఎస్, ఇతర ప్రముఖులు సాంస్కృతిక కార్యక్రమాలను ఆసక్తిగా తిలకించారు. కళారూపాలు గోల్కొండ కోట చారిత్రక వైభవాన్ని చాటిచెప్పడంతోపాటు తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించాయి.

నిరుద్యోగులకు సర్కారు చేయూత

డ్రైవర్లను ఓనర్లు చేసేందుకు 'ఓన్ యువర్ కార్' పథకం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: నిరుద్యోగులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేయూతనిస్తున్నది. ఓ వైపు కులవృత్తులకు ప్రాధాన్యం కల్పిస్తూనే మరోవైపు ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు చేపట్టింది. ఉపాధికోసం డ్రైవర్లుగా పనిచేస్తున్న ఎస్టీ, బీసీ యువతను ఓనర్లుగా మార్చేందుకు 'ఓన్ యువర్ కార్' పథకం అమలు చేస్తున్నది. రాష్ట్రవ్యాప్తంగా రూ.81.5 కోట్లతో వెయ్యిమంది ఎస్టీ, బీసీ యువతకు ఈ పథకం ద్వారా ఉపాధి కల్పించేందుకు ఆయాశాఖల అధికారులు ప్రణాళికలు రూపొందించారు. ఇప్పటికే హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల పరిధిలో 60 మంది డ్రైవర్లకు సబ్సిడీపై కార్లను అందజేశారు. ఆయా జిల్లాల పరిధిలో లబ్దిదారుల ఎంపిక ప్రక్రియపై ఎస్టీ, బీసీ సంక్షేమశాఖలు కార్యాచరణ చేపట్టాయి.

మేనేజ్‌మెంట్ కోటాలో మెడికల్ రెండో జాబితా

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో మేనేజ్‌మెంట్ కోటా కింద మిగిలిన సీట్ల భర్తీ కోసం రెండోవిడుత మెరిట్ జాబితాను కాళోజీ నారాయణరావు హెల్త్ వర్సిటీ మంగళవారం విడుదల చేసింది. మొదటి దశ కౌన్సెలింగ్‌లో సీటు వచ్చినా చేరని ఖాళీల స్థానంలో రెండోవిడుత మెరిట్ జాబితా ప్రకారం విద్యార్థులను ఎంపికచేసింది. ఆయా కోర్సుల్లో ప్రవేశానికి అర్హత సాధించిన విద్యార్థులు ఈ నెల 19వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోపు కళాశాలల్లో చేరాలని వర్సిటీ సూచించింది. జాబితా ప్రకారం అర్హుల వివరాల కోసం వర్సిటీ వెబ్‌సైట్‌ను సందర్శించాలని కోరింది.

ప్రగతిపథంలో హౌస్‌ఫెడ్

తెలంగాణ రాష్ట్రంలో రూ.1.30 కోట్లకు పెరిగిన రికవరీ

చిక్కడపల్లి: తెలంగాణ సహకార గృహనిర్మాణ సంఘాల సమాఖ్య (హౌస్‌ఫెడ్) ప్రగతిపథంలో పయనిస్తున్నదని ఆ సంస్థ చైర్మన్ నవనీత్‌రావు తెలిపారు. హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని హౌస్‌ఫెడ్ కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ..ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఏడాదికి రూ.70 లక్షల రికవరీ ఉండేదని, ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైన తర్వాత రికవరీ పెరిగి రూ.1.30 కోట్లకు చేరుకున్నదని తెలిపారు. 2009కి ముందు రుణాలు తీసుకున్న సొసైటీలకు పీనల్ ఇంట్రస్ట్ లేకుండా చెల్లింపులకు అవకాశం కల్పించడంతో రికవరీలు పెరిగాయని తెలిపారు. సొసైటీల నుంచి రూ.45 కోట్లు బకాయి రావాల్సి ఉండగా, తాము చెల్లించాల్సిన రుణం రూ.25 కోట్లు ఉన్నదని ఆయన వివరించారు. నేషనల్ కో ఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నుంచి రూ.20 కోట్ల రుణం కోసం దరఖాస్తు చేసుకున్నామని తెలిపారు. తెలంగాణ హౌస్‌ఫెడ్‌లో 430 సొసైటీలు సభ్యత్వం కలిగి ఉన్నాయని వివరించారు. ఈ ఏడాది తెలంగాణ హౌస్‌ఫెడ్ సభ్యులు 15 సొసైటీలకు రుణాలు ఇచ్చామని తెలిపారు.

రాజ్‌భవన్‌లో ఎట్‌హోం



స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మంగళవారం రాజ్‌భవన్‌లో నిర్వహించిన ఎట్ హోం కార్యక్రమంలో గవర్నర్ నరసింహన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీఎం కే చంద్రశేఖర్‌రావు



ఎట్ హోం కార్యక్రమంలో నవ్వులు చిందిస్తున్న సీఎం కేసీఆర్, ఏపీ సీఎం చంద్రబాబు, కేంద్రమంత్రి దత్తాత్రేయ, టీపీసీసీ చీఫ్ ఉత్తమ్, జన సేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్... హాజరైన మంత్రులు కేటీఆర్, లక్ష్మారెడ్డి, తలసాని, మహేందర్‌రెడ్డి, ఈటల రాజేందర్, జగదీశ్‌రెడ్డి, ఎంపీ డీఎస్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్, ఏపీ మంత్రి కామినేని, కాంగ్రెస్ నేత సుబ్బరామిరెడ్డి

తెలంగాణ, ఏపీ ముఖ్యమంత్రుల హాజరు

హాజరైన కేంద్రమంత్రులు దత్తాత్రేయ, సుజనాచౌదరి, రాష్ట్ర మంత్రులు

ఇద్దరు సీఎంలతో గంటన్నరకుపైగా చర్చించిన గవర్నర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాజ్‌భవన్‌లో మంగళవారం సాయంత్రం గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ ఎట్‌హోం కార్యక్రమం నిర్వహించారు. తెలంగాణ ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు, ఏపీ సీఎం చంద్రబాబును గవర్నర్ దంపతులు తేనీటి విందుకు సాదరంగా ఆహ్వానించారు. సాయంత్రం 6.40గంటలకు గవర్నర్ నరసింహన్ ఇద్దరు సీఎంలతో కలిసి తన అధికార నివాసంలోకి వెళ్లారు. దాదాపు గంటన్నరపాటు వారి సమావేశం కొనసాగింది. కార్యక్రమంలో ఇద్దరు సీఎంలు గవర్నర్ నరసింహన్‌కు చెరోవైపు కూర్చున్నారు. కేంద్రమంత్రులు బండారు దత్తాత్రేయ, సుజనాచౌదరి, జనసేన పార్టీ అధినేత, సినీనటుడు పవన్‌కల్యాణ్, పలువురు ప్రజాప్రతినిధులు కొద్దిసేపు సరదాగా గడిపారు. సినీనటుడు పవన్‌కల్యాణ్‌తో ఫొటో దిగేందుకు సికింద్రాబాద్‌కు చెందిన ఆయన అభిమాని వరప్రసాద్ రాజ్‌భవన్‌లోకి దూసుకెళ్లేందుకు ప్రయత్నించగా భద్రతా సిబ్బంది అడ్డుకున్నారు. మామిడి, చాక్లెట్ టార్ట్, వెజ్‌పఫ్, వేయించిన జీడిపప్పు, స్టార్టెడ్ శాండ్‌విచ్, స్టార్టెడ్ రోల్ తదితర పదార్థాలను విందులో ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రులు కడియం శ్రీహరి, మహమూద్‌అలీ, మంత్రులు కేటీఆర్, జగదీశ్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, నాయిని నర్సింహారెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్, మహేందర్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ప్రతిపక్ష నాయకుడు జానారెడ్డి, మండలిలో విపక్ష నేత షబ్బీర్ అలీ, ప్రభుత్వ ప్రధాన సలహాదారు రాజీవ్‌శర్మ, సీఎస్ ఎస్పీ సింగ్, డీజీపీ అనురాగ్‌శర్మ, మేయర్ బొంతు రామ్మోహన్, ఎంపీలు కేకే, కొత్త ప్రభాకర్‌రెడ్డి, డీఎస్, సుబ్బిరామిరెడ్డి, మాజీ గవర్నర్ రోశయ్య, ఏపీ అసెంబ్లీ స్పీకర్ కోడెల శివప్రసాదరావు, ఏపీ మంత్రి కామినేని శ్రీనివాస్, బీజేపీ రాష్ట్రశాఖ అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ్, క్రికెటర్ వీవీఎస్ లక్ష్మణ్, బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపిచంద్, పలువురు స్వాతంత్ర్య సమరయోధులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, పాత్రికేయులు పాల్గొన్నారు.

విభజన సమస్యలపై ఇద్దరు సీఎంలతో గవర్నర్ చర్చ

ఎట్‌హోం కార్యక్రమానికి హాజరైన ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు, ఏపీ సీఎం చంద్రబాబుతో గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఉద్యోగుల విభజన, సచివాలయంలో ఏపీకి చెందిన భవనాల అప్పగింత, తొమ్మిది, పదో షెడ్యూల్‌కు సంబంధించిన పలు అంశాల గురించి సీఎంలతో ఆయన చర్చించారు. రెండురాష్ట్రాల మధ్య ఉన్న పలు సమస్యలను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవాలని గవర్నర్ సూచించినట్లు సమాచారం.

తెలంగాణలో సాధ్యమైంది.. ఆంధ్రాలో ఏమైంది?

కేసీఆర్‌లా మీరు రుణమాఫీ చేయలేరా?.. చంద్రబాబును నిలదీస్తున్న ప్రతిపక్ష నేత జగన్

నంద్యాల ఉపఎన్నికలో ప్రచారాస్త్రాలుగా మారిన తెలంగాణ పథకాలు

జోగులాంబ గద్వాల, నమస్తే తెలంగాణ ప్రతినిధి:

ఏపీలోని నంద్యాల అసెంబ్లీ ఉపఎన్నికలో తెలంగాణ రాష్ట్ర పథకాలు ప్రతిపక్షాలకు ప్రచారాస్త్రాలుగా మారాయి. '2014 ఎన్నికల సమయంలో రైతుల రుణాలన్నీ భేషరతుగా మాఫీ చేస్తానని ఏపీ సీఎం చంద్రబాబు ప్రకటించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ విషయమే మరిచిపోయారు. పక్క రాష్ట్రం తెలంగాణలో వేల కోట్ల రైతు రుణాలు వడ్డీతో సహా మాఫీ చేశారు. అక్కడ సాధ్యమైన రైతు రుణమాఫీ మన రాష్ట్రంలో ఎందుకు సాధ్యం కావడం లేదు' అని ప్రతిపక్ష నేత, వైసీపీ నాయకుడు జగన్ ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్ర పథకాలు ప్రచారాస్త్రాలుగా మారి, ఏపీలో అధికార పార్టీని ఇరకాటంలో పెడుతున్నాయి. రూ. 45 వేల కోట్ల అప్పుల్లో రైతులు ఉన్నారని, ఈ మూడేండ్లలో రూ. 15 వేల కోట్ల అపరాధ వడ్డీ కట్టాల్సి ఉన్నదని జగన్ ప్రచారంలో చెప్పారు. తెలంగాణ రాష్ట్రంలో రైతులకు రుణాలు మాఫీ చేశారని, వేల కోట్ల భారాన్ని ప్రభుత్వం భరించి ఎన్నికల హామీ నెరవేర్చిందని కానీ ఏపీలో మాత్రం ప్రధాన హామీగా ఉన్న రైతురుణాలు, డ్వాక్రా రుణాల మాఫీని చంద్రబాబు మర్చిపోయారన్నారు. రుణమాఫీ చేయకుండా రైతులను మోసం చేశారన్నారు. ఇప్పుడు నంద్యాల ఉప ఎన్నికల సందర్భంగా మళ్లీ అవే హామీలతో మోసం చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారంటూ జగన్ మండిపడ్డారు. అదేవిధంగా తెలంగాణ రాష్ట్రంలో ముస్లింల రిజర్వేషన్ పెంపు ప్రక్రియను ప్రకటించారని, ముస్లింల కోసం ప్రత్యేక విద్యాసంస్థలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని అన్నారు. వాల్మీకి బోయలను ఎస్టీల్లో చేర్చే అంశంపై తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే ప్రకటన చేసిందని, ఈ విషయంలో ఇక్కడి ముస్లింలను, వాల్మీకి బోయలను చంద్రబాబు మరోమారు మోసం చేస్తున్నారన్నారు. నంద్యాల నియోజకవర్గంలో ముస్లింల ఓట్లు ప్రభావితం చూపించే అవకాశం ఉండటంతో తమ పార్టీ అధికారంలోకి వస్తే తెలంగాణ ప్రభుత్వం తరహాలోనే ఏపీలో ముస్లింల రిజర్వేషన్లు పెంచి, వాల్మీకి బోయలను ఎస్టీల్లో చేరుస్తామని జగన్ చెప్తూ ఎన్నికల ప్రచారం చేస్తున్నారు.

నంద్యాలలో 9 మంది మంత్రుల మకాం

ఈనెల 23న నంద్యాల ఉపఎన్నికలు జరుగనున్నాయి. టీడీపీ తరుపున దివంగత నేత భూమా నాగిరెడ్డి సోదరుడి కుమారుడు బ్రహ్మానందారెడ్డి, వైసీపీ నుంచి శిల్పా మోహన్‌రెడ్డి బరిలో ఉన్నారు. అధికార టీడీపీ, ప్రతిపక్ష వైసీపీ మధ్య పోటీ తీవ్రంగా మారడంతో అధికార పార్టీ తరపున తొమ్మిది మంది మంత్రులు నంద్యాలలోనే మకాం వేశారు. వైసీపీ తరుపున జగన్‌తో పాటుగా ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలు ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈనెల 21వరకు జగన్ నంద్యాలలో ప్రచారం నిర్వహించనుండగా, టీడీపీ నుంచి హిందూపూర్ ఎమ్మెల్యే, సినీ నటుడు బాలకృష్ణ బుధవారం ప్రచారం చేయనున్నారు. ఈనెల 19 లేదా 20న చంద్రబాబు నంద్యాలలో బహిరంగ సభ నిర్వహించనున్నారు.

10వేల మంది పోలింగ్ సిబ్బంది..

ఏ ఉప ఎన్నికలకు లేని విధంగా నంద్యాల ఉపఎన్నికలు జరుగుతున్నాయి. నంద్యాల నియోజకవర్గంలో 2,18,858 మంది ఓటర్లుండగా, మొత్తం 255 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మకంగా గుర్తించారు. నంద్యాల ప్రాంతంలో పనిచేసే అధికారులు, ఉద్యోగులను ఎన్నికల విధులకు దూరంగా ఉంచారు. 2500 మందిని పోలింగ్ కేంద్రాల్లో విధుల కోసం కేటాయించి, స్థానిక పోలీసులను బందోబస్తుకు దూరంగా ఉంచారు. కేంద్ర పారామిలటరీ బలగాలను సైతం మోహరించారు. వీరితో పాటుగా ఏపీ ఎస్పీ పోలీసులను బందోబస్తుకు వినియోగిస్తున్నారు.

నోట్ల కట్టలు ..

నంద్యాల ఉపఎన్నికల నేపథ్యంలో ఇప్పటి వరకు ఓటర్లకు పంచుతూ పట్టుబడిన సొమ్ము రూ. 36.76 లక్షలు. ఇవి కాకుండా మంగళవారం నంద్యాలలో రూ. 1.79 లక్షలు పట్టుబడ్డాయి. రెండు పార్టీలు భారీగా నగదు పంపకాలు చేపట్టినట్లు తెలుస్తున్నది. హైదరాబాద్, బెంగళూరు నుంచి భారీగా నగదు చేరుతున్నట్లు ఎన్నికల అధికారులు అనుమానిస్తున్నారు. దీంతో రాష్ట్ర సరిహద్దులో నిఘా కట్టుదిట్టం చేశారు.

డ్రగ్స్ నిర్ధారణకు స్పాట్ టెస్టింగ్ కిట్స్

రాష్ట్ర ఎక్సైజ్‌శాఖకు పరికరాల సరఫరా

కేంద్రం ఆధ్వర్యంలోని నార్కోటిక్స్ సెంట్రల్ బ్యూరో నిర్ణయం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో డ్రగ్స్ మూలాలు లేకుండా చేయడానికి ప్రభుత్వం పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతున్నది. వివిధ దేశాల నుంచి అక్రమంగా డ్రగ్స్‌ను రాష్ట్రానికి తెప్పిస్తూ సరఫరా చేస్తున్న ముఠాల ఆటకట్టించింది. ఈ నేపథ్యంలోనే డ్రగ్స్ నిర్ధారణ పరికరాలను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు రాష్ట్ర పోలీస్, ఎక్సైజ్‌శాఖలు కేంద్ర ప్రభుత్వ సాయం కోరాయి. దీంతో స్పాట్ టెస్టింగ్ కిట్లను రాష్ట్రానికి అందించాలని కేంద్ర నార్కోటిక్ సెంట్రల్ బ్యూరో నిర్ణయించినట్లు తెలిసింది. ఈ టెస్టింగ్ కిట్లు అమెరికాలో తయారవుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం వాటిని అక్కడి నుంచి తెప్పించి రాష్ట్రానికి ఇవ్వాల్సి ఉన్నది. పట్టుబడిన డ్రగ్ తీవ్రతను స్పాట్‌లోనే టెస్టింగ్ కిట్ల ద్వారా పరీక్షిస్తారు. ప్రస్తుతం ఉపయోగిస్తున్న బ్రీత్ ఎనలైజర్ మాదిరిగానే ఈ టెస్టింగ్ కిట్లను ఉపయోగించి డ్రగ్స్ ముఠాల ఆటకట్టించేందుకు వీలు కలుగుతుంది. ఇందులో పలురకాల టెస్టింగ్ పద్ధతులుంటాయి. వీటిలో ఏ1, ఏ2, ఏ3, బీ1, బీ2, బీ3, సీ1, సీ2, సీ3 అనే మూడు విభాగాల పరీక్షలు ఉంటాయి. ఈ పరికరం రసాయనాల ద్వారా డ్రగ్ తీవ్రతను పరీక్షించి వెంటనే నివేదికను అందిస్తుంది. పట్టుబడ్డ డ్రగ్‌పై నార్కోటిక్ స్ప్రే కిట్‌తో స్ప్రే చేసి, అది రంగుమారే విధానాన్ని బట్టి అందులో ఎలాంటి మత్తు పదార్థం ఉన్నదో గుర్తిస్తారు. ప్రస్తుతం ఈ పరికరాలు ఎన్‌సీబీ (నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో) వద్ద మాత్రమే ఉన్నాయి.

క్లూస్ టీం వద్ద ఆధునిక పరికరాలు

ఎట్టిపరిస్థితుల్లోనూ నేరస్థులు తప్పించుకోకుండా పకడ్బందీగా ఆధారాలను సేకరించేందుకు క్లూస్‌టీం ఆధునిక పరికరాలను ఉపయోగిస్తున్నది. సేకరించిన ఆధారాలను పరీక్షించేందుకు అభివృద్ధి చెందిన దేశాలైన అమెరికా, ఆస్ట్రేలియా, జర్మనీ, ఇజ్రాయెల్ తరహాలో నానో టెక్నాలజీతో తయారు చేసిన పరికరాలను సమకూర్చుకున్నది. ఇటీవల ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు పట్టుబడ్డ డ్రగ్స్ ముఠా వద్ద లభ్యమైన డ్రగ్స్‌ను పరిశీలించిన క్లూస్‌టీం నిమిషాల వ్యవధిలోనే సమాచారం అందించింది. దేశంలోని మరే రాష్ట్రంలోనూ ఇలాంటి ఆధునిక టెక్నాలజీని వాడటం లేదు.

నేరస్థులు తప్పించుకోలేరు



ఏవైనా మత్తు పదార్థాలు పట్టుబడితే ఈ స్పాట్ టెస్టింగ్ కిట్ల ద్వారా వెంటనే నేరం రుజువవుతుంది. దీంతో నేరస్థుడు తప్పించుకునే అవకాశం ఉండదు. ఇటీవల నార్కోటిక్ డ్రగ్ డిటెక్షన్‌పై బెంగళూరులో శిక్షణ సదస్సు జరిగింది. రాష్ట్రం నుంచి నాతోపాటు ఐదుగురు ప్రతినిధులం వెళ్లాం. డ్రగ్స్ అవశేషాలు, వాటి తీవ్రతను కనుగొనే పరికరాలపై అధ్యయనం చేశాం. ఈ కిట్లు అందుబాటులోకి వస్తే సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో నేరాన్ని పక్కాగా రుజువు చేయవచ్చు.

- సీ వివేకానందరెడ్డి, ఎక్సైజ్‌శాఖ డిప్యూటీ కమిషనర్



మాకు దేశ పాలన, న్యాయ వ్యవస్థలపై విశ్వాసమున్నది. కొంతమంది జమ్ముకశ్మీర్‌ను 1947కు పూర్వపు స్థితికి తీసుకుపోవటానికి ప్రయత్నిస్తున్నారు. సుప్రీంకోర్టు ముందున్న 'ఆర్టికల్-35ఎ' ను తిరస్కరిస్తుందన్న విశ్వాసమున్నది. కశ్మీర్ సమస్య మానవీయ సమస్య.

మెహబూబా ముఫ్తీ, జమ్ముకశ్మీర్ ముఖ్యమంత్రి

జమ్ముకశ్మీర్ దేశ ఉత్తరభాగపు కొసన చిన్న రాష్ట్రంగా ప్రత్యేక పరిస్థితుల్లో ఏర్పడింది. కశ్మీర్‌కు స్వయంప్రతిపత్తి అనేది చరిత్రాత్మకమైనది. కరెన్సీ, కమ్యూనికేషన్స్, రక్షణ, విదేశీ వ్యవహారాలు లాంటివే కేంద్రం ఆధీనంలో ఉంటాయి. అలా అని చెప్పి మేం 'వన్ ఇండియా, వన్ కంట్రీ'కి వ్యతిరేకం కాదు.

ఒమర్ అబ్దుల్లా, జమ్ముకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి



చరిత్రలో నేడు




1936

బెర్లిన్‌లో ముగిసిన పదకొండవ ఒలింపిక్స్ గేమ్స్.

1946



కలకత్తాలో పెద్ద ఎత్తున మత ఘర్షణలు. నాలుగువేల మంది మృతి, లక్షమంది నిర్వాసితులయ్యారు.



1954

'స్పోర్ట్స్ ఇల్యూస్ట్రేటెడ్' పత్రిక ప్రారంభం.

హాంగ్‌కాంగ్‌లో పద్నాలుగేండ్ల జాషువా వాంగ్, మరో ఇద్దరు పిల్లలు ప్రజాస్వామ్య ఉద్యమానికి కేంద్ర బిందువుగా మారారు. ఇరువై ఏండ్ల కిందట బ్రిటన్ హాంగ్‌కాంగ్‌ను చైనాకు అప్పగించింది. ఆనాడు హాంగ్‌కాంగ్‌లోని పశ్చిమ దేశాల తరహా స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు చైనా భూభాగాన్ని ప్రభావితం చేయగలవనే ఆశాభావం ఉండేది. కానీ ఇప్పుడు అందుకు వ్యతిరేక పరిస్థితి ఏర్పడ్డది. ఇప్పుడు తలెత్తుతున్న ప్రశ్న- అమెరికా, బ్రిటన్ ఇతర దేశాలు హాంగ్‌కాంగ్‌లోని ప్రజాస్వామ్య ఉద్యమకారులకు మద్దతు ఇస్తాయా అనేది.

ది న్యూయార్క్ టైమ్స్

కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు, గూర్ఖాలాండ్ ఉద్యమ సమన్వయ కమిటీకి మధ్య ఆదివారం జరిగిన సమావేశం- ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి (తాత్కాలికంగానైనా) ముగింపు పలికినట్టేనా? ఉద్యమాన్ని నిలిపివేసి రాష్ట్ర ప్రభుత్వంతో చర్చలు జరుపవలసిందిగా రాజ్‌నాథ్ ఉద్యమ నాయకులకు చెప్పారు. కనీసం కేంద్రంతో కలిపి త్రైపాక్షిక చర్చలు జరుపాలన్న ఉద్యమకారుల సూచనను పట్టించుకోలేదు. గూర్ఖాలాండ్ డిమాండ్‌ను సానుభూతితో పరిశీలిస్తామంటూ హామీ ఇచ్చి రెండు లోక్‌సభ స్థానాలు గెలిచిన బీజేపీ మాట మార్చడం ఆ పార్టీ నాయకులకే మింగుడు పడటం లేదు.

హిందుస్థాన్ టైమ్స్

ప్రగతి సందేశం

స్వాతంత్ర్య దినోత్సవ వేడుక సందర్భంగా ప్రధాని మోదీ ఎర్రకోటపై, ముఖ్యమంత్రి కేసీఆర్ గోల్కొండ కోటపై పతాకావిష్కరణ జరుపడం ఒక ఉద్వేగభరిత ఘట్టం. ఒకప్పుడు పంద్రాగస్టు అంటే ప్రభుత్వ కార్యక్రమాలు మొక్కుబడిగా సాగేవి. పాలకులు, అధికారులు జెండా ఆవిష్కరణలు జరిపి చేతులు దులుపుకొనేవారు. కానీ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి తెలంగాణ ప్రజలు ఈ జాతీయ పర్వదినాన్ని ఆనందోత్సాహాలతో జరుపుకుంటున్నారు. గోల్కొండ కోటపై ముఖ్యమంత్రి కేసీఆర్ జెండా ఆవిష్కరణ తెలంగాణ సమాజానికి స్వాభిమాన సంకేతంగా మారిపోయింది. ప్రధాని మోదీ దేశంలో పేరుకుపోయిన అవినీతి నిర్మూలన, సమున్నత ప్రగతి దేశ ప్రజల ముందున్న ఆకాంక్షగా ప్రకటించారు. ఈ ఏడాది నుంచి వచ్చే ఐదేండ్లు (2022 నాటికి) లక్ష్యసిద్ధి సంవత్సరాలుగా పరిగణించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్ర సమగ్రాభివృద్ధే సురాజ్య లక్ష్యాలను తమ సందేశంలో వినిపించారు. సొంత రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ముఖ్యమంత్రి ప్రసంగం రాష్ట్ర ప్రజలకు బతుకుపై భరోసా ఇచ్చేదిగా, ప్రభుత్వంపై విశ్వాసం పెంచేదిగా ఉన్నది. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించుకున్న లక్ష్యాలను, పురోగతిని వివరించారు.

మన దేశం పరపాలన శృంఖలాలను తెంచుకుని ఏడు దశాబ్దా లు గడిచిపోయాయి. 1947 ఆగస్టు 15నుంచి దేశం ముందున్న సవాళ్లను ఎదుర్కొని దాటి వచ్చిన తీరు, సాధించిన ప్రగతి తక్కువేమీ కాదు. స్వేచ్ఛాస్వాతంత్ర్యాలు సిద్ధించిన సమయంలో దేశ ప్రజల ముందు అన్నీ సమస్యలే. జనాభాలో 83శా తం మంది నిరక్షరాస్యులు. సగటు ఆయుఃప్రమాణం 32 ఏండ్లు. ఈ డెబ్బై ఏండ్ల ప్రయాణంలో తీవ్రమైన ఆహారకొరత, కరువు కాటకాలతో అల్లాడిన దేశం సంపూర్ణ ఆహార భద్రత దిశగా ఎదిగింది. ఇప్పుడు అక్షరాస్యత 74శాతం. సగటు జీవితకాలం 68ఏండ్లు. మెరుగైన రవాణా సౌకర్యాలు, సేవలు మారుమూల గ్రామం వరకూ చేరాయి. ఈ క్రమంలో శాస్త్రసాంకేతిక రంగాల అభివృద్ధికి తార్కాణంగా ఊహకందని విజయాలు సాధించాం. మన అంతరిక్ష పరిశోధనల విజయా లు అభివృద్ధి చెందిన రాజ్యాల సరసన భారత్‌ను నిలిపాయి. సంపద పెరిగింది, వృద్ధి రేటు పెరిగింది. ఎన్నో ప్రాజెక్టులు, కర్మాగారాలు నిర్మాణమయ్యాయి. అనేక సామాజిక రుగ్మతలను పారదోలాం. మన సమాజం ఏకశిలా సదృశమైనది కాదు. అనేక రకాల భాషలు, మతాలు, ప్రాంతాల సమాహారం. ఈ వైవిధ్యం అభివృద్ధికి ఆటంకం కాలేదు. దీన్నొక శక్తిగా మలుచుకోవటంలో విజయం సాధించాం. కాబట్టే ఇవ్వాళ దేశం సమైక్యంగా, సగర్వంగా నిలిచింది. అయితే దేశీయంగా చూస్తే మన ముందు అనేక సవాళ్లున్నాయి. దేశంలో నెలకొన్న అవినీతి, నల్లధనం నిర్మూలన కోసం చేపట్టిన చర్యలన్నీ ఆశించిన ఫలితాలు ఇవ్వడం లేదు. కుల, మత వైషమ్యాల జాడ్యం వీడలేదు. ఆహారపు అలవాట్లు, ఆచార వ్యవహారాలు దాడులకు హేతువులుగా మారుతున్నాయి. సామాజిక శాంతి, సమగ్రాభివృద్ధి అందని కలగానే మిగులుతున్నది. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజాజీవనంతో ముడిపడి ఉన్న అనేకానేక సమస్యలు అలాగే వెంటాడుతున్నాయి. వీటి పరిష్కారం కోసం మన శక్తి యుక్తులన్నింటినీ ధారపోయాలె.

> **సాగు, తాగునీరు అందిస్తూ దశాబ్దాలుగా తెలంగాణ సమాజాన్ని పట్టిపీడిస్తున్న సమస్యలను దూరం చేసేందుకు యుద్ధ ప్రాతిపదికన పనులు సాగుతున్నవి. కరువు కాటకాలు, వలస బతుకుల తెలంగాణను పైరు పచ్చల తెలంగాణగా మార్చేదిశగా అడుగులు వడివడిగా పడుతున్నవి. సమస్త సామాజిక సమూహాల జీవన ముఖచిత్రాలు మార్చే దిశగా తెలంగాణ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన, పెడుతున్న పథకాలు తెలంగాణ ప్రజా జీవన రూపురేఖలనే మార్చి సుఖశాంతుల తెలంగాణగా తీర్చిదిద్దుతాయనటంలో సందేహం లేదు**

దేశ ప్రగతి ప్రస్థానం నేపథ్యంలోనే తెలంగాణ రాష్ట్ర మూడేళ్ల ప్రగతి ప్రయాణం కూడా విస్మరించరానిది. స్వాతంత్ర్యం ఇస్తే విభిన్న భాషా ప్రాంతాలు, మతాలు కలిగిన భారతదేశం ముక్కలు చెక్కలు అవుతుందని నాటి బ్రిటిష్ ప్రధాని చర్చిల్ అన్నట్లే, తెలంగాణ రాష్ట్రసాధనోద్యమం ఊపిరిపోసుకుంటున్న సందర్భంలో సీమాంధ్ర పాలకులు రాష్ట్ర ఏర్పాటును వ్యతిరేకిస్తూ ప్రజల్లో భయాందోళనలు రేపటానికి ప్రయత్నించారు. రాష్ట్రం ఏర్పడితే తెలంగాణ అశాంతికి ఆలవాలంగా మారుతుందని, వామపక్షతీవ్రవాదం పెట్రేగి పోతుందన్నారు. మత వైషమ్యాలు పెరిగిపోయి హైదరాబాద్ నగర అభివృద్ధి నిలిచిపోతుందని భయపెట్టారు. చిన్న రాష్ట్రం మనుగడ సాగించలేక విచ్ఛిన్నమై పోతుందని జోస్యాలు చెప్పారు. కానీ వలసాధిపత్య పాలకుల శాపనార్థాలు నిజం కాలేదు. చర్చిల్ అన్నట్టు దేశం ముక్కచెక్కలు కాలేదు. ఎన్ని రకాల అవాంతరాలు ఎదురైనా ఏటికి ఎదురీదుతూ ముందుకు సాగుతున్నది. అలాగే తెలంగాణ రాష్ట్రం కూడా అవరోధాలన్నింటిని అధిగమించి ముందుకు సాగుతున్నది. మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ లాంటి పథకాలు మొదలు కళ్యాణలక్ష్మి, చేతివృత్తులకు పూర్వ వైభవం తెచ్చే అనేక పథకాలతో దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నది. సాగు, తాగునీరు అందిస్తూ దశాబ్దాలుగా తెలంగాణ సమాజాన్ని పట్టిపీడిస్తున్న సమస్యలను దూరం చేసేందుకు యుద్ధ ప్రాతిపదికన పనులు సాగుతున్నవి. కరువు కాటకాలు, వలస బతుకుల తెలంగాణను పైరు పచ్చల తెలంగాణగా మార్చేదిశగా అడుగులు వడివడిగా పడుతున్నవి. సమస్త సామాజిక సమూహాల జీవన ముఖచిత్రాలు మార్చే దిశగా తెలంగాణ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన, పెడుతున్న పథకాలు తెలంగాణ ప్రజా జీవన రూపురేఖలనే మార్చి సుఖశాంతుల తెలంగాణగా తీర్చిదిద్దుతాయనటంలో సందేహం లేదు.

జనగళం

శబ్ద కాలుష్యాన్ని అరికట్టాలె

పట్టణాల్లో తిరుగుతున్న బస్సులు, లారీలు 90 నుంచి 120 డెసిబుల్స్ శబ్దం చేస్తూ నగరంలో యథేచ్ఛగా తిరుగుతున్నాయి. ధ్వని కాలుష్యానికి కారణమవుతున్నాయి. కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ జారీ చేసిన 'శబ్ద కాలుష్య చట్టా'నికి ఇది విరుద్ధం. శబ్ద కాలుష్యం వల్ల గుండెపోటు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. అన్నిరకాల వాహనాల్లో 75 డెసిబుల్స్‌కు మించని హారన్లను మాత్రమే వినియోగించాలి. కొందరైతే విచక్షణారహితంగా అవసరం లేని చోట కూడా హారన్లను మోగిస్తున్నారు. వీరిపై చట్టరీత్యా చర్యలు తీసుకొని శబ్దకాలుష్యాన్ని అరికట్టాలె.

- పుల్లూరు రాంనర్సింహారెడ్డి, నల్గొండ

చెరువులను రక్షించుకోవాలె

వినాయక చవితి సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా యువత రసాయన రహిత రంగులతో ఉన్న వినాయకులనే పూజించాలె. పెద్దపెద్ద, రంగురంగుల రసాయనలతో తయారుచేసే ప్రతిమల నిమజ్జనం ద్వారా చెరువుల్లోని నీళ్లు కలుషితం అవుతాయి. తద్వారా చెరువుపై ఆధారపడి జీవించే కుల వృత్తుల వారు ఉపాధి కోల్పోయే అవకాశం ఉంటుంది. కాబట్టి మట్టి వినాయకులకే ప్రాధాన్యం ఇవ్వాలె.

- నారదాసు రాజేందర్, తార్నాక, హైదరాబాద్

సద్వినియోగం చేసుకోవాలె

స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్ పెద్ద ఎత్తున ఉద్యోగ నియామక ప్రకటన వెలువరించడం అభినందనీయం. ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

- కొత్వాల్ ప్రవీణ్, బేగంపేట్, హైదరాబాద్

ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@namasthetelangaana.com Fax-040-23291118

తెలంగాణం

డాక్టర్ కనకదుర్గ దంటు

రాష్ట్రంలో వి'చిత్ర'పక్షాలు

ఏ రాష్ట్రంలో అయినా అధికారపక్షంతో పాటు చిన్నదో, పెద్దదో విపక్షం కూడా ఉంటుంది. తెలంగాణ రాష్ట్రంలో మాత్రం విచిత్ర పక్షం ఉన్నది. ఇంద్రధనస్సు రంగులు అనుకోవటానికి లేదు, మోడ్రన్ చిత్రం లాగా అర్థం కాని రంగులు, అయోమయం కలిగించే కాంబినేషన్లు! ఒక్కొక్క పార్టీని (పేర్లున్నాయిగా మరి) గమనిస్తే ఇంకా విచిత్రాలు బయటపడుతాయి. వందేళ్ళ వృద్ధా పార్టీలో ముఖ్యమంత్రులు ఉన్నారు గానీ నాయకులు లేరు. అందుకే ఎవరి ప్రోగ్రామ్స్ వాళ్ళకే కానీ, అందరూ కలిసి ఒకలా ఉండరు. ఏ పనిచేసినా, ఏమీ చేయకపోయినా ప్రభుత్వాన్ని విమర్శించటం ఒక్కటే అందరూ కామన్‌గా చేసే పని.

అయితే ఆ మాటల్లో కూడా నిజం గానీ, నిజాయితీగాని కనిపించదు. అందరూ తలోమాట. తెలంగాణ రాష్ట్ర సాధన కాంగ్రెస్ నాయకుల వల్ల ఎందుకు సాధ్యపడలేదో వారి మాటలు వింటే అర్థమవుతుంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడవద్దని ఆంధ్రలో అన్నిపార్టీల నాయకులు ఒక్కటైతే, తమకు ప్రత్యేక రాష్ట్రం కావాలన్న విషయంలో ఒక కాంగ్రెస్ పార్టీ నాయకులు కూడా ఒక్క తాటిమీద నిలబడలేకపోయారు. ఇక దేశంలోనే అంతరించిపోతున్న ఈ పార్టీ 2019 తరువాత కనపడకపోవచ్చు.

ఇక మహానాయకుడు ఎన్టీఆర్ స్థాపించిన తెలుగుదేశం! అసలు పేరులో వైరుధ్యం! అది ఆంధ్ర దేశమనీ, తెలుగుకీ దానికీ ఏమీ సంబంధం లేదని తెలంగాణ వారందరికీ తెలుసు! ఇక తెలంగాణ తెలుగుదేశంలో ఉన్న వారందూ అల్పసంతోషులు. ఆంధ్ర నాయకుడు చంద్రబాబు బానిసలే కానీ వారిలో నాయకులూ లేరు, ముఖ్యమంత్రులూ లేరు. మరి ఖర్మ కాలి తెలుగుదేశంలో తెలంగాణలో ఎప్పటికైనా గెలిస్తే ముఖ్యమంత్రి అయ్యే తెలంగాణ నాయకుడు ఎవరు? అందరూ బాంచలేకదా!

ఇక కేటీఆర్ గారు చెప్పినట్టు వామపక్షాలు దోమపక్షాలయ్యాయి. సోదిలోకి లేకుండాపోయాయి. ఇప్పటికీ ఎక్కడ గొడువ జరుగుతుందా అని ఎర్రచొక్కాలతో ఎదురుచూస్తున్న కొందరు అమాయక కార్యకర్తలే కానీ నాయకులు లేని పార్టీలవి! ఇక దేశాన్నంతా ఆక్రమిస్తున్న భారతీయ జనతా పార్టీ! అఖండమైన గెలుపుతో కేంద్ర ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసిన ఈ పార్టీని గత మూడేళ్లుగా గమనించిన వారికి ఒక విషయం అర్థమవుతుంది. బీజేపీకి చాతనైన విషయం ఒక్కటే. హిందువు లు, గోవులు, అంటూ మానవ బలహీనతలను రెచ్చగొట్టి, ఒకే పార్టీలోగానీ, రెండు పార్టీలలో గానీ సమానులుగా ఉన్నవాళ్ళ మధ్య చిచ్చుపెట్టి, వారిని విడదీసి తమ భవిష్యత్తు నిర్మించుకునే పార్టీ. ఒక రాష్ట్రంలో ఉన్న ప్రాంతీయ పార్టీతో ఒక్క ఎన్నికలలో కలిసి పోటీచేసి రెండో పార్టీగా అయినా గెలువడం, తర్వాత వచ్చే ఎన్నికల్లో ఆ పార్టీని నాశనం చేసి ఎన్నిక గెలువడం! ఏ సిద్ధాంతాలూ లేకుండా ఎలా అయినా ఎన్నిక గెలువడం మాత్రమే వీరి ఆశయం. గత మూడేళ్లలో ఎన్నో ఎన్నికలు ఎదుర్కొని గెలువడం తప్ప బీజేపీ ప్రభుత్వం సామాన్య జనాలకు ఏం చేసిందో ఒక మేలు చెప్పగలరా ఎవరైనా? డీమానిటైజేషన్, జీఎస్టీ లాంటివి చేసి మధ్య తరగతి ప్రజల నడ్డి విరువడం తప్ప, మామూలు జనాలకు బీజేపీ చేసిన ఒక్క మంచి పని చెప్పండి. విదేశాల్లో నల్లధనం తెచ్చి ఒక్కొక్కరికి 15 లక్షలు ఇచ్చారా? కనీసం డీమానిటైజేషన్ వల్ల పట్టుబడిన నల్లధనంలో ఒక్కక్కరికి 15 రూపాయలైనా ఇచ్చారా? యువతకు ఉద్యోగావకాశాలు ఎన్ని పెంచారు? మహిళల రక్షణ పెరిగిందా? అయినా సర్దార్ పటేల్ విగ్రహానికి 200 కోట్లు, దేశంలోని మహిళలందరి రక్షణకు 100 కోట్లు ఇచ్చే ప్రభుత్వం ఏం చేయగలదు?



దేశం సంగతి వదిలి మన రాష్ట్రం సంగతి చూద్దాం. హైకోర్టు విభజన, నదీ జలాల సమస్యలు, ఉద్యోగస్తుల అలాట్‌మెంట్ ఏమీ అవకుండానే మళ్లీ ఎన్నికలు వచ్చేటట్టున్నాయి. కానీ తెలంగాణ బీజేపీ పై సమస్యల గురించి కాకుండా రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్ని తప్పులు చేస్తున్నారో లెక్క పెడుతుంటుంది. కేంద్ర ప్రభుత్వం ఇవ్వని డబ్బులు రాష్ట్ర ప్రభుత్వ పథకాల మీద ఖర్చు చేయటం లేదని ఆరోపిస్తుంటుంది. తాము మాట్లాడిన దాంట్లో ఎంత నిజమున్నది అన్న విషయం విస్మరించి నిస్సిగ్గుగా అబద్ధాలు చెప్తుంటుంది.

ఇక ఈ పార్టీల గ్రూపులకు చెందని ఇంకొక నాయకుడు. ఆయన ఏ పార్టీకి, ఏ విపక్షానికి చెందడు. కానీ ప్రభుత్వాన్ని అన్ని విషయాల్లో తప్పుపడుతుంటాడు. మూడు దశాబ్దాలు పిల్లలకు పాఠాలు చెప్పిన ప్రొఫెసర్ అయి ఉండీ ఏది మంచి, ఏది చెడు అన్న విచక్షణ చూపించడు. తెలంగాణ రాష్ట్ర సమితి ఏది చేస్తే, అది ఆయనకు తప్పు. ఒక ప్రాజెక్ట్ డిజైన్ అయింది అనగానే దానిమీద చిలువలు, పలువలు అల్లగలడు. అంతేకాదు అప్పడప్పుడు హాస్యాన్ని కూడా పిండిస్తుంటాడు. డాక్టర్ జయశంకర్ సార్ అడుగుజాడల్లో నడుస్తున్నామని చెప్తాడు. వలస పాలకుల వివక్షను, అన్యాయాలను తన మాటలతో, రాతలతో ఎండగట్టారే గాని జయశంకర్ ఎప్పుడైనా కోర్టులో ప్రభుత్వాలకు వ్యతిరేకంగా కేసు వేశారా? మీటింగులలో ప్రజా సమస్యల గురించి మాట్లాడే వారు గానీ, అబద్ధాల సహాయంతో పాదయాత్రలు చేశారా? తన పరిశోధన ద్వారా నిజాలను వెలికితీయడం, ప్రజలను చైతన్యపరుచడం చేశారు కానీ, అమాయక ప్రజలను ప్రభుత్వానికి వ్యతిరేకంగా రెచ్చగొట్టారా? ఎంతో వివక్ష చూపించి అంతులేని అన్యాయాలు ఈ ప్రాంత వాసుల పట్ల చేసిన వలస నాయకులు కూడా వ్యతిరేకంగా మాట్లాడలేదు. మనుషుల గురించికాక జరుగుతున్న అన్యాయాల గురించి మాత్రమే వాదించారు, తప్పు బట్టారు. మరి ఇప్పుడు అంతరించిపోయిన జేఏసీ అనే సంస్థకు అధ్యక్షుడినని అన్ని విపక్షపార్టీలతో, చేతులు కలుపుతున్న కోదండరాంను ఏమని పిలువాలి? లేక 2019 ఎన్నికల ముందు ఈ ముసుగులన్ని తొలిగిపోయి ఈ విపక్షాలన్నీ ప్రొఫెసర్ గారి నాయకత్వం కింద ఒక కొత్త పార్టీ పెడుతాయా? ఎందుకంటే కాంగ్రెస్, టీడీపీ తమ సొంత బ్యానర్ల కింద గెలిచే ప్రసక్తి లేదు. వామపక్షాలు పూర్తిగా మాయమవుతాయి. ఇప్పటిలాగే అసత్యాలు మాట్లాడుతూ ఉంటే బీజేపీ ఇప్పుడున్న సీట్లు కూడా కోల్పోతుంది. పైగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పట్ల కేంద్రం చూపిస్తున్న వివక్ష కూడా ఆ పార్టీకి అశనిపాతం అవుతుంది. ఏడు మండలాలు ఆంధ్రలో కలిపి, హైకోర్టు విభజన చేయకుండా, నదీజలాల్లో ఏపీ ప్రభుత్వ తొండి పనులు అడ్డుకోకుండా, ఉద్యోగస్తుల విభజన కూడా అయిదేళ్ళలో చేయని బీజేపీ ప్రభుత్వానికి, ఏ చిత్తశుద్ధి ఉన్న తెలంగాణ వాసి ఓటు వేస్తాడు? వెరసి ఈ పార్టీలన్నీ మాజీ జేఏసీ నాయకుడైన కోదండరాం ఆధ్వర్యం కింద తెలంగాణ రాష్ట్ర సమితి వ్యతిరేక పార్టీ (టీఆర్ఎస్ఓపీ) స్థాపించి 2019 ఎన్నికలకు వెళ్లినా, తెలివైన తెలంగాణ ప్రజలు మళ్లీ టీఆర్ఎస్‌కే పట్టం కట్టడం ఖాయం. అప్పుడు ఈ పార్టీలన్నీ కలిసిన పార్టీ విపక్ష పార్టీ కాకుండా విచిత్ర పార్టీగా మిగలడం ఖాయం. సామాన్యులకు కూడా ఇంత స్పష్టంగా కనిపిస్తున్న నిజాలు పై నాయకులకు, రాజకీయపార్టీలకు కనిపించకపోవడం వారి దురదృష్టం, తెలంగాణ ప్రజల అదృష్టం.

> ఏడు మం డలాలు ఆంధ్రలో కలిపి, హైకోర్టు విభజన చేయకుండా, నదీజలాల్లో ఏపీ ప్రభుత్వ తొండి పనులు అడ్డుకోకుండా, ఉద్యోగస్తుల విభజన కూడా అయిదేళ్ళలో చేయని బీజేపీ ప్రభుత్వానికి, ఏ చిత్తశుద్ధి ఉన్న తెలంగాణ వాసి ఓటు వేస్తాడు? వెరసి ఈ పార్టీలన్నీ మాజీ జేఏసీ నాయకుడైన కోదండరాం ఆధ్వర్యం కింద తెలంగాణ రాష్ట్ర సమితి వ్యతిరేక పార్టీ (టీఆర్ఎస్ఓపీ) స్థాపించి 2019 ఎన్నికలకు వెళ్లినా, తెలివైన తెలంగాణ ప్రజలు మళ్లీ టీఆర్ఎస్‌కే పట్టం కట్టడం ఖాయం. అప్పుడు ఈ పార్టీలన్నీ కలిసిన పార్టీ విపక్ష పార్టీ కాకుండా విచిత్ర పార్టీగా మిగలడం ఖాయం.

చైనా వస్తువులకు చెక్

విశ్లేషణ



కొట్టె మురళీకృష్ణ

చైనా నుంచి భారత్‌కు ఎదురవుతున్న ప్రమాదాలు, బెదిరింపులు, ఆక్రమణ ధోరణులు రోజురోజుకూ శ్రుతిమించుతున్నాయి. ప్రపంచంలో ఇండియా బలమైనశక్తిగా ఎదుగుతున్న తీరే దీనికి ప్రధాన కారణం.ఈ పరిణామాలన్నింటిని దేశ సార్వభౌమత్వంపై దాడిగా పరిగణించాలి. చైనా విస్తరణవాదం, సామ్రాజ్యవాద ధోరణులకు ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్రం అనుసరిస్తున్న దౌత్య సంబంధాలు కంటగింపుగా మారాయి. గత ప్రభుత్వాలు అనుసరించిన ఉదాసీనత నేడు లేదు. ఇది చైనాను కలవరపాటుకు గురి చేస్తున్నది.

కేంద్ర ప్రభుత్వం చేపట్టిన మేక్ ఇన్ ఇండియా, మేడ్ ఇన్ ఇండియా కార్యక్రమాలతో భారత్‌కు భారీగా పెట్టుబడులు వస్తున్నాయి. దీంతో పరిశ్రమల సంఖ్య, ఉత్పాదకత పెరిగింది. దీనివల్ల భారత్‌కు తమ ఎగుమతులు తగ్గి తమ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతుందని చైనా కుతంత్రాలు పన్నుతున్నది. చైనాను ఎదుర్కొనేందుకు ప్రభుత్వ చర్యలతో పాటు ఈ దేశ పౌరులుగా మనపైనా బాధ్యత ఉన్నది. దీనికి మనం చైనా వస్తువుల బహిష్కరణను అమలుచేయాలి. స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సాహిస్తూ ఎగుమతులను పెంచే స్థాయికి చేరుకోవాలి. చైనా 1962లో భారత్‌ను దొంగదెబ్బ తీసింది. మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ అరుణాచల్ ప్రదేశ్ పర్యటనకు వెళ్ళినప్పుడు భారత్‌ను హెచ్చరించింది. 2012లో అప్పటి రక్షణమంత్రి ఆంటోనీ అరుణాచల్‌ప్రదేశ్ పర్యటనకు వెళ్ళినప్పుడూ హెచ్చరించింది. అరుణాచల్‌లో ప్రధాని చేసిన ప్రసంగాన్ని అధిక్షేపించింది. చైనాలో భారత రాయబారిని మహిళ అని కూడా కనికరించకుండా అర్ధరాత్రి ఆమెను నిద్ర లేపి మరీ తన అభ్యంతరాన్ని తెలిపింది.

చైనా తక్కువ ధరలకు టెండర్లు వేసి దేశంలోని 40 శాతం పైగా పనులు చేజిక్కించుకుంటున్నది. చైనా 2007 నుంచి ఇప్పటికి 1200 సార్లు దేశ సరిహద్దుల్లోకి చొరబాట్లకు పాల్పడింది. చైనా నుంచి భారత్‌లోకి ఉత్పత్తికంటే తక్కువ ధరకు డంప్ చేయబడుతున్న వస్తువుల మొత్తం విలువ మూడు లక్షల కోట్లు. అంటే పన్నులోని 12 శాతం మన దేశంలో అమ్మబడుతున్న చైనా ఉత్పత్తుల నుంచి వచ్చే ఆదాయంగా చైనాకు తరలిపోతున్న సంపద. ఉగ్రవాదులకు, పాకిస్థాన్‌కు ఆర్థిక, అస్త్ర, శస్త్ర సహకారం చేస్తున్నది. మయన్మార్‌లోని కోకో ద్వీపంలో రాడార్ స్థాపించింది. నేపాల్ రాజకీయాన్ని తమకు అనుకూలంగా మార్చుకున్నది. 50 దేశాలతో కూడి న ఇస్లామిక్ సంస్థలతో సంబంధాలు కలిగి ఉన్నది. 10 రాష్ట్రాలకు జీవమైన బ్రహ్మపుత్ర నదిపై ఆనకట్ట కట్టి సొరంగమార్గ నిర్మాణం ద్వారా పైపులైన్లు వేద్దామని ప్రయత్నిస్తున్నది. సుడాన్లో 20 లక్షల మంది ప్రజలపై అత్యాచారాలు జరిపింది. 21 శాతానికి పైగా కార్బన్ ఉద్గారాలను విడుదల చేసే చైనా అమెరికాతో సమానంగా పర్యావరణాన్ని దెబ్బతీస్తున్నది. చైనా 1962లో భారత్‌కు చెందిన 38,000 చ.కి. భూభాగాన్ని ఆక్రమించుకున్నది. భారత్ చేతిలో చైనాకు చెందిన 90,000 చ.కి. భూభాగం ఉందని ఐదేండ్ల నుంచి చైనా కొత్త పాట పాడుతున్నది. 'డోకలా-డోక్లాం'పచ్చిక మైదానాన్ని చైనా వారి 'పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ' పిఎల్ఏ ముష్కరులు గత వారం దురాక్రమించడానికి ఏకైక ప్రాతిపదిక టిబెట్ ఇంకా చైనా దురాక్రమణలో కొనసాగుతుండటం! ఈ అబద్ధాల ప్రచారంలో భాగంగానే చైనా ప్రభుత్వం డోక్లాం తమ దేశానికి చెందిన పచ్చిక మైదానమని వాదిస్తున్నది. కొన్నిరోజుల కిందట భారత్‌లోని చైనా రాయబార కార్యాలయం నుంచి భారత ప్రజలను ఉద్దేశించి ఒక వీడియో జారీ చేసింది. వీడియోలోని విషయాన్ని పరిశీలిస్తే భారత ప్రజలను హెచ్చరిస్తున్నట్లుగా ఉన్నది. ఒక దేశ రాయబార కార్యాలయం మరొక దేశ ప్రజలతో అసలు ఎలా సంవాదం జరుపుతున్నదన్ని కనీస విచక్షణ కూడా చైనాకు పట్టడం లేదు. అందుకే భారత రక్షణ మంత్రి అరుణ్ జైట్లీ నేటి భారత్ 1962 నాటి భారత్ కాదని చైనాకు తెలిసేలా చెప్పారు. కేంద్రంలో నూతన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత చైనాకు కంటిలో కునుకు లేకుండాపోయింది. ఓ పక్క ప్రపంచంపై అమెరికా ప్రాబల్యం బాగా తగ్గుతున్నది. ఈ పరిస్థితిలో చైనా ప్రపంచాన్ని శాసించాలని కలలుగంటున్నది. ఇతర దేశాల భూభాగాలను తమ ఆధీనంలోకి తెచ్చుకోవాలని తహతహలాడుతున్నది. 2017 జూన్ 16న చైనా భారత భూభాగమైన డోక్లాంలోకి ప్రవేశించి అక్కడ రోడ్డు నిర్మాణం పనులు ప్రారంభించేందుకు ప్రయత్నించింది. దీన్ని భారతీయ సైన్యం అడ్డుకున్నది. చైనా కొంత కాలంగా భారత సరిహద్దులకు అతి దగ్గర రైలు, రోడ్డు మార్గాల నిర్మాణం చేపట్టింది. 2020 కల్లా ఈ పనులు పూర్తి చేయాలనుకుంటున్న ది. చైనా ఇలా తన విస్తరణ పని కొనసాగిస్తున్నది. అలాగే లోలోన భారత్ ఎదుగుతున్న శక్తిని చూస్తూ ఆలోచనలో పడింది. అందుకే ఎన్నో అబద్ధాలను కూడా ప్రచారం చేస్తున్నది. ఇందులో భాగంగానే ఇటీవలే (వాస్తవానికి అటువంటి కార్యక్రమమేదీ లేనప్పటికీ) మోదీ-జిన్ పింగ్ కలిసి మాట్లాడుకునే కార్యక్రమం రద్దు అయిందని వ్యాఖ్యానించింది. రాబోయే రోజుల్లో భారత్-అమెరికా సంయుక్తంగా పెద్ద ఎత్తున సైన్య విన్యాసం చేయబోతున్నాయి. తద్వారా భారత్ కూడా చైనాకు భయపడేది లేదనే బలమైన సందేశం ఇచ్చే ప్రయత్నం జరుగుతున్నది.

తమ దేశంలో తయారైన చౌకబారు వస్తువులను, తక్కువ ధరకు భారత్‌లో డంప్ చేయడం ద్వారా భారత ఆర్థిక శక్తిని దెబ్బతీయాలని చైనా దశాబ్దాల కాలంగా ప్రయత్నం చేస్తున్నది. డోక్లాం మైదానంలోకి చైనా దళాలు చొరబడిన సమయంలోనే మరికొన్ని చైనా వాణిజ్య సంస్థలు మన దేశంలో కొత్త పెట్టుబడులను పెట్టినట్టు ప్రచారమైంది. చైనా చుంబీ వేలీని ఎలాగైనా తన అధీనంలోకి తెచ్చుకోవాలని శతవిధాల ప్రయత్నిస్తున్నది. పాకిస్థాన్ ఉగ్రవాదుల చేతిలో తన సైనికులు చంపబడినప్పటికీ చైనా పాకిస్థాన్‌తో సంబంధాలు నెరపుతున్నది. భారత్‌కు న్యూక్లియర్ సప్లయర్స్ గ్రూప్ (ఎన్ ఎస్ జీ) సభ్యత్వం రాకుండా అడ్డుకుంటున్నది. ఈ క్లిష్టమైన సమయంలో ప్రభుత్వం కఠినమైన విధానాలు, నిర్ణయాలను అమలుచేయాలి. అదే సమయంలో విజ్ఞత కలిగిన పౌరులుగా చైనా కుతంత్రాలను ఎదుర్కొనేందుకు చైనా వస్తు బహిష్కరణ మంత్రాన్ని ప్రజలకు వివరించాలి.

ఒక సామాన్య పౌరుడిగా మనం మేల్కోవాలి. ప్రజలను మేల్కొల్పాలి. చైనా వస్తువులు కొనడం మానేయాలి. తద్వారా చైనాపై భారత్ సగం గెలుపు సాధించగలదు. మిగతాది ప్రభుత్వాలు చూసుకుంటాయి. స్వాతంత్ర్య సమర కాలంలో వీర సావర్కర్ విదేశీ వస్త్ర బహిష్కరణ, దహన సంస్కార కార్యక్రమం నిర్వహించారు. దీనిద్వారా తెల్లవాడికి బలమైన నష్టాన్ని చేకూర్చగలిగారు. ఈ విదేశీ వస్త్ర బహిష్కరణ, దహన సంస్కార కార్యక్రమాన్నే తర్వాత కాలంలో గాంధీ దేశవ్యాప్తం చేసి తెల్లవారి నడ్డివిరిచారు. కాబట్టి మనం చైనా వస్తు బహిష్కరణ చేయడం ద్వారా చైనాను ఆర్థికంగా కొంతైనా దెబ్బతీయగలుగాలి. దీనివల్ల భారత్, చైనాతో సమస్థాయిలో మాట్లాడగలిగే ధైర్యం, సాహసం సమకూరుతాయి. చైనా వస్తువులు కొన డం మానేస్తే, దేశానికి ఎంతో సమర్పణ చేసిన వారమవుతాం. చైనా దురాక్రమణకు సంబంధించిన విషయాలు అధ్యయనం చేసి ప్రజల్లో అవగాహన తీసుకురావాలి. జూలై 8,9 తేదీల్లో ఆగ్రా వద్ద భారత్- టిబెట్ సహయోగ్ మంచ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశం చైనా వస్తు బహిష్కరణపై దేశవ్యాప్తంగా కార్యక్రమాలు చేపట్టింది. ఈ నేపథ్యంలో గత కొన్నే ళ్లుగా రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్, స్వదేశీ జాగరణ మంచ్ లాంటి అధిక సంఖ్యలో మానవ వనరులు కలిగిన సంస్థలు తమ కార్యాచరణను ప్రకటించాయి. చైనా వస్తు బహిష్కరణపై విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహించాలి. భారతీయులతో చైనా వస్తువులు కొనమని ప్రతిజ్ఞ చేయించాలి.

> స్వాతంత్ర్య సమర కాలంలో వీర సావర్కర్ విదేశీ వస్త్ర బహిష్కరణ, దహన సంస్కార కార్యక్రమం నిర్వహించారు. దీనిద్వారా తెల్లవాడికి బలమైన నష్టాన్ని చేకూర్చగలిగారు. ఈ విదేశీ వస్త్ర బహిష్కరణ, దహన సంస్కార కార్యక్రమాన్నే తర్వాత కాలంలో గాంధీ దేశవ్యాప్తం చేసి తెల్లవారి నడ్డివిరిచారు. కాబట్టి మనం చైనా వస్తు బహిష్కరణ చేయడం ద్వారా చైనాను ఆర్థికంగా కొంతైనా దెబ్బతీయగలుగాలి.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.437, Near Velama Kalyana Mandapam, Devara Yamjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078,
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.



71వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మంగళవారం ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో నిర్వహించిన 'ఎట్ హోమ్' కార్యక్రమంలో రాష్ట్రపతి రామనాథ్ కోవింద్, త్రివిధ దళాల అధిపతులు



71వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా బెంగళూరులోని ఓ వాణిజ్య సముదాయాన్ని సోమవారం రాత్రి ఇలా అలంకరించారు. పది అంతస్తుల భవనాన్ని మహాత్మాగాంధీ చిత్రం దర్శనమిచ్చేలా విద్యుద్దీపాలతోపాటు ఆసక్తికరంగా తీర్చిదిద్దారు





71వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రఖ్యాత ఇంటర్నెట్ సెర్చ్ ఇంజిన్ గూగుల్ తన లోగోను ఈ విధంగా తీర్చిదిద్దింది

అసోంను ముంచెత్తిన వరదలు అక్కడి ప్రజల దేశభక్తిని మాత్రం ఆటంకపరుచలేకపోయాయి. మూడురోజులుగా కురుస్తున్న వర్షాలతో దుబ్రి జిల్లాలోని నస్కారా పాఠశాలలో నిండానీరు చేరింది. మంగళవారం నడుంలోతు నీటిలోనూ విద్యార్థులతో కలిసి ఉపాధ్యాయులు తాజెమ్ సిక్దర్, నృపేన్ రభా, మిజానర్ రెహ్మాన్ జాతీయ జెండా ఎగురవేశారు

2022 నాటికి నవభారత్

రానున్న ఐదేండ్లలో మార్పు కోసం శ్రమిద్దాం ■ దేశరక్షణలో ఏ సవాలునైనా ఎదుర్కొంటాం ■ జీఎస్టీతో సహకార వ్యవస్థకు జవసత్వాలు ■ బుల్లెట్లతో కాదు ఆలింగనంతోనే కశ్మీర్ సమస్యకు పరిష్కారం ■ గోరఖ్‌పూర్ ఘటన దురదృష్టకరం ■ ఎర్రకోట నుంచి ప్రసంగంలో ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, ఆగస్టు 15:

'క్విట్ ఇండియా' పిలుపు నుంచి 'స్వాతంత్ర్యం' సాధన వరకు ఐదేండ్లలో భారత సంకల్పబలం యావత్ ప్రపంచానికి తెలిసిందని, రానున్న ఐదేండ్లలో అదే సామర్థ్యం, అంకితభావంతో 'నవ భారత్' నిర్మాణం దిశగా ప్రజలందరూ కంకణబద్ధులు కావాలని ప్రధాని నరేంద్రమోదీ పిలుపునిచ్చారు. 125 కోట్ల మంది సమిష్టి సంకల్పంతో 2022లో జరుపుకోనున్న 75వ స్వాతంత్ర్య దినోత్సవం నాటికి ఆ లక్ష్యాన్ని చేరుకోగలమని వ్యాఖ్యానించారు. 71వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎర్రకోట నుంచి చేసిన ప్రసంగంలో సుదర్శన చక్రం మొదలు మహాత్మాగాంధీ చరఖా వరకు అనేక అంశాలను, శ్రీకృష్ణుడు, రాముడు, హనుమంతుడు... ఇలా అనేక పౌరాణిక అంశాలను ప్రస్తావించారు. యువత చేతుల్లో మన దేశ భవిత ఉన్నదని, ముఖ్యంగా ఈ శతాబ్దిలో జన్మించిన వారు నవభారత నిర్మాణంలో పోషించాల్సిన పాత్ర చాలా కీలకమైనదని అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ఎర్రకోటపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయడానికి ముందు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జాతిపిత మహాత్మా గాంధీ సమాధి వద్ద నివాళులర్పించారు. అనంతరం ఎర్రకోట దగ్గర త్రివిధ దళాల గౌరవ వందనాన్ని స్వీకరించారు.

క్విట్ ఇండియా 75వ వార్షికోత్సవాన్ని, చంపారన్ సత్యాగ్రహం శతాబ్ది వేడుకలను, తిలక్ ప్రబోధించిన జై జవాన్ – జై కిసాన్ నినాదానికి వందేండ్లు నిండాయని, గణేశ్ ఉత్సవాలకు 125 ఏండ్లు వచ్చాయని పేర్కొన్నారు. ఇటీవలి కాలంలో దేశంలో అనేక చోట్ల ప్రకృతి వైపరీత్యాలు సంభవించాయని, వరదలతో అపార నష్టం జరిగిందని, గోరఖ్‌పూర్ దవాఖానలో చిన్నారులు మృతి చెందడం బాధాకరమని, ఇలాంటి సంక్లిష్ట సమయాల్లో ఐక్యంగా ఉండాల్సిన అవసరం ఉందని అన్నారు.

కశ్మీర్‌ను ప్రేమతోనే గెలువగలం

పిడికెడు మంది వేర్పాటువాదుల వల్లే జమ్ముకశ్మీర్‌లో అశాంతి పరిస్థితులు నెలకొన్నాయని ప్రధాని మోదీ అన్నారు. 'న గాలీసే, న గోలీసే పరివర్తన్ హోగా.. సమస్య సుల్జేగీ గలే లగానేసే' (తిట్లతో,బుల్లెట్లతో మార్పు తీసుకురాలేం. ఆలింగనంతోనే సమస్య పరిష్కారమవుతుంది) అని మోదీ తెలిపారు. కశ్మీరీల ప్రేమను గెల్చుకోవడం ద్వారా మాత్రమే శాంతిస్థాపన సాధ్యమన్నారు. కశ్మీర్‌కు భూతల స్వర్గమన్న పేరును తిరిగి తీసుకువస్తామని ప్రకటించారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా జరుగుతున్న పోరులో ప్రపంచదేశాలు మనకు అండగా ఉన్నాయని చెప్పారు. దేశ సరిహద్దుల్లో మన సైనికులు మనకు రక్షణగా ఉన్నారని, శత్రుమూకలు ఆకాశం, సముద్రం, భూతలం, సైబర్ స్పేస్... ఎక్కడినుంచి దాడిచేసినా దీటుగా ఎదుర్కొనే శక్తి సామర్థ్యాలు భారత్‌కు ఉన్నాయని అన్నారు. ఉగ్రవాదం, వామపక్ష తీవ్రవాదం, చొరబాటు శక్తుల నుంచి మనల్ని కాపాడడానికి త్రివిధ దళాల సైనికులు, పారా మిలిటరీ బలగాలు, పోలీసులు అహర్నిశలూ పహారా కాస్తున్నాయని, ఇటీవలి 'సర్జికల్ స్ట్రైక్స్'తో మన శక్తి సామర్థ్యాలు యావత్ ప్రపంచానికి తెలిశాయని చెప్పారు.



ఢిల్లీలోని ఎర్రకోటపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసిన అనంతరం జాతినుద్దేశించి ప్రసంగిస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ

ప్రగతిపథంలో దూసుకెళ్తున్న భారత్

దేశంలో రోడ్ల నిర్మాణం రెట్టింపు వేగంతో జరుగుతున్నదని, తొమ్మిది కోట్ల మంది రైతులకు భూసార గుర్తింపు కార్డులు వచ్చాయని, 29 కోట్ల మంది కొత్తగా బ్యాంకు ఖాతాలు తెరిచారని, 14 వేల గ్రామాలకు విద్యుత్ సౌకర్యం కలిగిందని, రెండు కోట్ల మందికి ఎల్పీజీ వంటగ్యాస్ కనెక్షన్లు లభించాయని, చిట్టచివరి వ్యక్తికి కూడా ప్రభుత్వ అభివృద్ధి ఫలాలు అందుతున్నాయని మోదీ వ్యాఖ్యానించారు. ఆర్థిక రంగంలో ద్రవ్యోల్బణం అదుపులో ఉందని, నిరుద్యోగ యువతకు బ్యాంకు రుణాలు లభిస్తున్నాయని, రుణాలపై వడ్డీరేటు తగ్గిందని, మధ్యతరగతిపై గృహనిర్మాణ రుణాల భారం తగ్గిందని.. అనేక అంశాల్లో దేశం ముందుకు పోతున్నదని అన్నారు. గృహవసతి లేని కుటుంబాలకు ఇండ్ల నిర్మాణం, విద్యుత్ సౌకర్యం లేని గ్రామాలకు కొత్తగా విద్యుత్ సరఫరా, కరెంటు బిల్లు భారాన్ని తగ్గించడానికి ఎల్ఈడీ బల్బుల సరఫరా, పేదలకు చౌక ధరలకు ఔషధాలు అందడానికి జన ఔషధి కేంద్రాలు, ప్రతి జిల్లా కేంద్రంలో డయాలసిస్ కేంద్రాలు.. ఇలా అనేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

జీఎస్టీ అమలుపై ప్రపంచమే ఆశ్చర్యపోయింది

అతి తక్కువ సమయంలో విప్లవాత్మకమైన ఆర్థిక సంస్కరణ అయిన జీఎస్టీని మనం అమల్లోకి తేవడం పట్ల ప్రపంచ దేశాలు ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశాయని, సహకార సమాఖ్య స్ఫూర్తికి అనుగుణంగా అన్ని రాష్ట్రాల సహకారంతో, సాంకేతిక పరిజ్ఞాన తోడ్పాటుతో అద్భుతాన్ని సాధించగలిగామని చెప్పారు. సరుకుల రవాణా 30శాతం ఆదా అయ్యిందని, భారత్‌ను ఒకే మార్కెట్‌గా మార్చే అంతరాష్ట్ర ఆటంకాలను జీఎస్టీతో తొలగించామని పేర్కొన్నారు. రాష్ట్రాల ప్రయోజనాల విషయంలో కేంద్రం పెద్దన్న పాత్ర పోషిస్తున్నదని మోదీ తెలిపారు. నాలుగు దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న 'వన్ ర్యాంక్.. వన్ పెన్షన్'ను సాకారం చేశామన్నారు.

ట్రిపుల్ తలాక్‌పై గొంతెత్తడం అభినందనీయం

ట్రిపుల్ తలాక్‌తో ముస్లిం మహిళలు అనేక బాధలు అనుభవించారని, ఇప్పుడు వారంతా దానికి వ్యతిరేకంగా గళం విప్పడం ఆహ్వానించదగినదని ప్రధాని చెప్పారు. మహిళా సాధికారత దిశగా ఇది గొప్ప ముందడుగు అని, దీనికి దేశప్రజలు అండగా ఉంటారని అన్నారు. త్వరలోనే ఊహించని మార్పు వస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తంచేశారు. భారతీయ సంస్కృతిలో హింసకు తావులేదని ప్రధాని స్పష్టం చేశారు. ఏ రూపంలోనూ హింసను ఆమోదించే ప్రసక్తే లేదని హెచ్చరించారు. విశ్వాసాల పేరుతో హింసకు పాల్పడేవారి పట్ల కఠినంగా వ్యవహరించక తప్పదని స్పష్టం చేశారు.

1.25లక్షల కోట్ల నల్లధనాన్ని బయటకు తెచ్చాం..

నోట్లరద్దును ప్రకటించిన తర్వాత యావత్ ప్రపంచం ఆశ్చర్యపోయిందని ప్రధాని మోదీ అన్నారు. సర్కారుకు గడ్డుకాలం ప్రారంభమైందని అంతా అనుకున్నారని, కానీ 125 కోట్ల మంది ప్రజలు తమ నిర్ణయానికి మద్దతు పలికారని తెలిపారు. ప్రజలిచ్చిన నమ్మకంతోనే అవినీతిరహిత పాలనను, సుపరిపాలనను అందించడానికి మార్గం ఏర్పడిందని చెప్పారు. గడిచిన మూడేండ్లలో 1.25లక్షల కోట్ల నల్లధనాన్ని వెలికితీశామని వెల్లడించారు. లెక్కల్లోకి రాని మూడు లక్షల కోట్ల రూపాయలను తిరిగి బ్యాంకింగ్ వ్యవస్థలోకి నోట్ల రద్దు నిర్ణయంతో తీసుకురాగలిగామని చెప్పారు. ఆదాయ వివరాలు సరిగాలేని 18లక్షలమందిపై విచారణ సాగుతున్నదని, నోట్లరద్దు తర్వాత బ్యాంకుల్లో జమ అయిన 1.75లక్షల కోట్ల డిపాజిట్ల లెక్కలు తీస్తున్నామని తెలిపారు. నోట్లరద్దుతో పన్ను చెల్లింపుదారుల సంఖ్య రెండురెట్లయ్యిందని చెప్పారు. ఇక ఆదాయపు పన్ను రిటర్న్‌లలో చూపిన ఆదాయం కంటే చాలా ఎక్కువ ఆర్జిస్తున్న వారి సంఖ్య దాదాపు 18లక్షల వరకు ఉన్నట్లు తేలిందని, ఐటీ విచారణ అనంతరం దాదాపు నాలుగున్నర లక్షల మంది పన్ను చెల్లించి వారి తప్పులను ఒప్పుకున్నారని ప్రధాని గుర్తుచేశారు. మూడు లక్షల బోగస్ కంపెనీల భాగోతం బట్టబయలైందని, ఇందులో 1.75 లక్షల కంపెనీల లైసెన్సులు రద్దయ్యాయని పేర్కొన్నారు. ఒకే చిరునామాతో 400 కంపెనీలు రిజిస్టర్ అయ్యాయంటే పరిస్థితి ఏ రకంగా ఉందో అర్థం చేసుకోవచ్చునని అన్నారు. ఆధార్ అనుసంధానంతో అవినీతి, నల్లధనం జాడ్యానికి మంగళం పాడుతున్నామని తెలిపారు. ఇటీవల బినామీ ఆస్తుల స్వాధీన చట్టం వచ్చాక రూ. 800 కోట్లను ప్రభుత్వం స్వాధీనం చేసుకున్నదని తెలిపారు.

ప్రసంగాన్ని 55నిమిషాలకు కుదించుకున్న ప్రధాని

ప్రధాని హోదాలో నాల్గవసారి ఎర్రకోటపై జెండాను ఎగురవేసి జాతిని ఉద్దేశించి ప్రసంగించిన మోదీ ఈసారి తన ప్రసంగానికి 55నిమిషాలకే ముగించారు. 2014లో 65 నిమిషాలు, 2015లో 86 నిమిషాలు, 2016లో 96 నిమిషాలపాటు మోదీ ప్రసంగించారు. గత నెల మన్‌కీ బాత్ ప్రసంగంలో ప్రజల నుంచి వచ్చిన స్పందన మేరకు గంటకే ప్రసంగాన్ని ముగించాలని అభిప్రాయాలు రావడంతో 55 నిమిషాలకే ఈసారి తన ప్రసంగాన్ని ముగించారు. తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ 1967లో గరిష్ఠంగా 72 నిమిషాల పాటు చేసిన ప్రసంగమే ఇప్పటివరకు రికార్డు. పదేండ్ల పాటు ప్రధానిగా ఉన్న మన్మోహన్‌సింగ్ సైతం సగటున తన ప్రసంగాన్ని45 నిమిషాలకే ముగించారు. వాజపేయి సైతం సగటున 30 నిమిషాల పాటే ప్రసంగించారు.

మళ్లీ ప్రొటోకాల్‌ను దాటి..



ఎర్రకోటపై నుంచి ప్రసంగించిన తర్వాత ప్రధాని మోదీ స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూపు ప్రొటోకాల్ నిబంధనలకు విరుద్ధంగా చిన్నారుల మధ్యకు వెళ్లారు. ముందు వరుసలో కూర్చున్న చిన్నారులంతా ఒక్కసారిగా ప్రధానితో కరచాలనం చేయడానికి పోటీ పడ్డారు. ఒక దశలో ఒక్కసారిగా పిల్లలంతా గుంపుగా ప్రధాని మీదకు దూసుకురావడంతో అదుపు చేయడానికి ఎస్పీజీ సిబ్బంది అనేక అవస్థలు పడ్డారు. కృష్ణాష్టమి కూడా కావడంతో చిన్నారుల్లో చాలా మంది బాలకృష్ణుడి వేషంలో ఉండడంతో వారిపై మోదీ దృష్టిపడింది. గతేడాది కూడా ఇదే తరహాలో మోదీ చిన్నారుల మధ్యకు దూసుకెళ్లారు.

సెక్యూరిటీని బెంబేలెత్తించిన నల్ల పతంగి

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ఎర్రకోటపై ప్రధాని భద్రతాసిబ్బందిని ఓ పతంగి బెంబేలెత్తించింది. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని దేశరాజధానిలో పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేశారు. ఎర్రకోట వద్ద 9,100మంది సిబ్బందితో భద్రత చేపట్టారు. ఈ నేపథ్యంలో సరిగ్గా ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రసంగించే వేదిక పోడియం వద్దకు నల్ల పతంగి ఎగురుకుంటూ వచ్చింది. ప్రధాని ప్రసంగానికి ఎలాంటి ఆటంకం కలిగించకుండా పోడియం కిందే అది ఆగిపోయినప్పటికీ భద్రతాధికారులు మాత్రం ఆందోళన చెందారు.

ఇండో పసిఫిక్ ప్రాంతంలో శాంతి స్థాపనకు కృషి

■ ప్రధాని మోదీ, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అంగీకారం



వాషింగ్టన్, ఆగస్టు 15: ఇండో పసిఫిక్ ప్రాంతంలో శాంతి స్థాపనకు కృషి చేసేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, భారత ప్రధాని నరేంద్రమోదీ అంగీకరించారు. సోమవారం రాత్రి ట్రంప్ ప్రధాని మోదీకి ఫోన్ చేసి స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారిద్దరూ పలు అంశాలపై చర్చించుకున్నారు. అమెరికాలోని టెక్సాస్ నుంచి భారత్‌కు మొట్టమొదటి క్రూడాయిల్ సరఫరా నౌక ఈ నెలలోనే బయలుదేరుతున్నదని ట్రంప్ తెలిపారు. భారత్‌కు శక్తి వనరులను అందించే అవకాశం తమకు సుదీర్ఘకాలం లభించాలని ఆయన ఆకాంక్షించారు. ఇండో పసిఫిక్ ప్రాంతంలో శాంతి, సుస్థిరతల స్థాపనకు రెండు దేశాల మంత్రివర్గాల మధ్య వ్యూహాత్మక చర్చలు జరగాలని ఇద్దరు నేతలు అంగీకారానికి వచ్చారు. నవంబర్‌లో భారత్‌లో నిర్వహించనున్న గ్లోబల్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ సమ్మిట్‌కు యూఎస్ ప్రతినిధి బృందానికి నాయకత్వం వహించాల్సిందిగా తన కూతురు, సలహాదారు ఇవాంకాను కోరాని, ట్రంప్ చెప్పగా, ఇందుకు ప్రధాని మోదీ కృతజ్ఞతలు తెలిపారు. బలమైన నాయకత్వంతో ప్రపంచాన్ని ఐక్యంగా ఉంచేందుకు కృషి చేస్తున్నారని ట్రంప్‌ను ప్రధాని మోదీ కొనియాడారు.

విశ్వాసాలకు అతీతంగా భారతీయులుగా గర్వపడండి

- ■ రాజ్యాంగం ఉన్నది అందుకోసమే..
- ■ నేను జన్మతః భారత పౌరుడిని కాకపోయినా అవకాశాలు దక్కాయి
- ■ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జేఎస్ ఖేహర్



న్యూఢిల్లీ, ఆగస్టు 15: భిన్న మతవిశ్వాసాలు, భిన్న జాతులు ఉన్నప్పటికీ అందరూ భారతీయులుగా గర్వపడాలని, ఆ భావన దేశ ప్రజల్లో తీసుకొచ్చేందుకే రాజ్యాంగం ఉన్నదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జేఎస్ ఖేహర్ అన్నారు. 'క్రిస్టియన్లు, బౌద్ధులు, హిందువులు, జొరాస్ట్రియన్లు, ముస్లింలు, జైనులు.. అందరూ తమ తమ జాతి విశ్వాసాలపై గర్వపడినట్లే, భారతీయులైనందుకూ గర్వించాలి. రాజ్యాంగం ఉన్నది అందుకే. చెప్తున్నదీ అదే' అని ఆయన తెలిపారు. మంగళవారం ఢిల్లీలోని సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో సీజేఐ ప్రసంగించారు. దళితుడిగా జన్మించి, పూరిపాకలో బాల్యం గడిపిన వ్యక్తి ఈ రోజు భారత రాష్ట్రపతిగా ఉన్నారు. రైతు కుటుంబం నుంచి వచ్చి పార్టీ వాల్‌పోస్టర్లు అతికించిన వ్యక్తి ఉపరాష్ట్రపతిగా కొనసాగుతున్నారు. జీవితపు ఒకానొకదశలో చాయ్ అమ్ముకున్న వ్యక్తి ఈరోజు భారత ప్రధాని' అని జస్టిస్ ఖేహర్ తెలిపారు. తాను భారత పౌరుడిగా జన్మించలేదని, జన్మతః కెన్యా పౌరుడినని చెప్పారు. ఒక్కసారి భారత పౌరసత్వం అందుకున్నాక, అందరితో సమానంగా తనకు అవకాశాలు దక్కాయని సీజేఐ గుర్తు చేసుకున్నారు. ఇక న్యాయశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ మాట్లాడుతూ ఎమర్జెన్సీ సందర్భంగానే 'లౌకిక' అనే పదాన్ని మాత్రమే రాజ్యాంగ పీఠికలో చేర్చారని, కానీ చారిత్రక వారసత్వమంతా భారతదేశం లౌకికరాజ్యంగానే కొనసాగుతూ వచ్చిందని తెలిపారు.

ప్రపంచవ్యాప్తంగా పంద్రాగస్టు వేడుకలు

పలుదేశాల్లో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ సంబురాలు



ఇస్లామాబాద్‌లో భారత జెండాను ఆవిష్కరిస్తున్న భారత హై కమిషనర్ గౌతమ్ బంబావాలే

బీజింగ్/మెల్‌బోర్న్, ఆగస్టు 15: భారత 71వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పలు దేశాల్లో భారతీయులు ఘనంగా జరుపుకొన్నారు. బీజింగ్‌లో భారత రాయబార కార్యాలయంలో జరిగిన స్వాతంత్ర్య వేడుకలకు పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. బీజింగ్‌లో భారత రాయబారి విజయ్‌గోఖలే, షాంఘై, గాంగ్జౌల్లో జరిగిన కార్యక్రమాల్లో భారత కాన్సులేట్ జనరల్స్ ప్రకాశ్ గుప్తా, వైకే శైలాస్ తంగల్ భారత పతాకాలను ఆవిష్కరించారు. 'సంపూర్ణ సార్వభౌమాధికారాన్ని సాధించుకొని ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం ఉదయించిన రోజు' అంటూ ఆస్ట్రేలియా ప్రధానమంత్రి మాల్కమ్ టర్న్‌బుల్ తన సందేశంలో శుభాకాంక్షలు తెలిపారు. కాన్‌బెర్రా, మెల్‌బోర్న్, సిడ్నీ నగరాల్లోని భారత సంతతి ప్రజలు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. ఫిలింఫెస్టివల్ కోసం మెల్‌బోర్న్ వచ్చిన బాలీవుడ్ నటి ఐశ్వర్యా రాయ్ కూడా స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొన్నారు. భారత రాయబారులు సుజయ్ చినాయ్ (జపాన్), సంజయ్ భట్టాచార్య(ఈజిప్ట్), పవన్ కపూర్ (ఇజ్రాయెల్), జావెద్ అష్రఫ్ (సింగపూర్) త్రివర్ణపతాకాలను ఎగురవేశారు. దక్షిణాఫ్రికాలోని డర్బన్, ప్రిటోరియా, కేప్‌టౌన్, జొహన్నెస్‌బర్గ్‌లలోనూ, యూఏఈలోనూ స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా జరిగాయి.

విదేశీనేతల శుభాకాంక్షలు

న్యూఢిల్లీ, ఆగస్టు 15: 71వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా భారతదేశానికి పలుదేశాల అధినేతలు శుభాకాంక్షలు తెలిపారు. 'ప్రధాని మోదీకి అభినందనలు, భారతదేశ పౌరులకు స్వాతంత్ర్య దినోత్సవ అభినందనలు.. మన స్నేహం ఎల్లప్పుడూ ఇలాగే కొనసాగుతుంది' అని ఆఫ్ఘనిస్థాన్ అధ్యక్షుడు అష్రాఫ్ ఘనీ ట్వీట్ చేశారు. 'సన్నిహిత దేశం భారత్‌కు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు' అని శ్రీలంక అధ్యక్షుడు మైత్రిపాల సిరిసేన ట్వీట్ చేశారు. 'భారతదేశ స్నేహితులకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు, ఇరుదేశాల మధ్య స్నేహం ఇలాగే కొనసాగి మరింత బలపడాలని ఆకాంక్షిస్తున్నా' అని భూటాన్ ప్రధానమంత్రి త్సేరింగ్ టోబ్గే ట్వీట్ చేశారు. వీరికి ధన్యవాదాలు తెలుపుతూ ప్రధాని మోదీ రీట్వీట్ చేశారు.

లండన్‌లో ఫ్రీడం మార్చ్



లండన్: బ్రిటన్ రాజధాని లండన్‌లోని భారత హై కమిషన్ ఆధ్వర్యంలో ఇండిపెండెన్స్ డే ఫ్రీడం మార్చ్ నిర్వహించారు. పార్లమెంట్ స్క్వేర్ నుంచి భారత హైకమిషన్ కార్యాలయం వరకు ఈ ప్రదర్శన సాగింది. తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ యునైటెడ్ కింగ్‌డమ్ (టాక్) సభ్యులు 'జైభారత్', 'జై తెలంగాణ' అని నినాదాలు చేశారు. భారత హైకమిషనర్ వైకే సిన్హా, టాక్ వ్యవస్థాపకుడు అనిల్ కూర్మాచలం, భారత హైకమిషన్ ప్రతినిధులు ఏఎస్ రాజన్, విజయ్ వసంత, టాక్ సభ్యులు నవీన్‌రెడ్డి, అశోక్, రత్నాకర్, సత్య, రాకేశ్ వాకా, ప్రవీణ్ వీర తదితరులు పాల్గొన్నారు.

పంద్రాగస్టు వేడుకల నుంచి వస్తున్న 8వ తరగతి విద్యార్థినిపై లైంగికదాడి

చండీగఢ్, ఆగస్టు 15: 'మహిళలు అర్ధరాత్రి నిర్భయంగా బయట తిరుగగలిగినప్పుడే దేశానికి నిజమైన స్వాతంత్ర్యం వచ్చినట్టు' అని మహాత్మాగాంధీ చెప్పారు. కానీ, పట్టపగలే బాలికలు తిరుగలేని దుస్థితి దేశంలో దాపురించింది. పాఠశాలలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు హాజరై వస్తున్న ఎనిమిదో తరగతి విద్యార్థినిపై చండీగఢ్‌లోని 23వ సెక్టార్‌లో లైంగికదాడి జరుగడమే ఇందుకు ప్రత్యక్ష సాక్ష్యం. మంగళవారం చిల్డ్రన్ పార్కు సమీపం నుంచి వెళ్తున్న ఎనిమిదో తరగతి విద్యార్థిని (12) ముఖంపై ఓ వ్యక్తి ముసుగు వేశాడు. అనంతరం బాలికను చెట్ల పొదల్లోకి ఎత్తుకెళ్లి లైంగికదాడికి పాల్పడ్డాడు. ఆమె అరుపులు విని స్థానికులు రావడంతో నిందితుడు పరారయ్యాడు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని నిందితుడి కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. బాలికను చికిత్స నిమిత్తం ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

నిషేధాజ్ఞలున్నా జెండా ఎగురవేసిన ఆర్‌ఎస్‌ఎస్ అధినేత భగవత్

పలకాడ్(కేరళ)/ న్యూఢిల్లీ, ఆగస్టు 15: సీపీఎం నేతృత్వంలోని కేరళ ప్రభుత్వం జారీ చేసిన నిషేధాజ్ఞలను ఉల్లంఘించి రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) అధినేత మోహన్ భగవత్ మంగళవారం జాతీయజెండా ఎగురవేశారు. ప్రొటోకాల్ ప్రకారం ప్రభుత్వ గుర్తింపు పొందిన కర్ణగి అమ్మన్ పాఠశాలలో ఎన్నికైన ప్రతినిధులు లేదా పాఠశాల అధికారులు మాత్రమే జాతీయ పతాకం ఎగురవేయాల్సి ఉన్నది. ఇతరులెవరూ జాతీయ జెండాను ఎగురవేయడానికి వీలులేదని పలకాడ్ జిల్లా కలెక్టర్ పీ మేరీకుట్టి సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీచేశారు. అయితే, పాఠశాల యాజమాన్యం సహాయంతో ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్‌తో మంగళవారం జాతీయ జెండాను ఎగురవేశారు. నిషేధాజ్ఞలు ఉల్లంఘించి జెండా ఎగురవేసినందుకు కేసు నమోదు చేయాలని కలెక్టర్ పోలీసులను ఆదేశించారు.



మదర్సాలలో స్వాతంత్ర్య వేడుకలు

- ■ దేశభక్తిని ప్రశ్నించడంపై ఆవేదన
- ■ వీడియో రికార్డింగ్ చేయాలన్న యూపీ ప్రభుత్వ ఆదేశాలపై అభ్యంతరం

లక్నో, ఆగస్టు 15: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నిర్వహణతోపాటు ఆధారాల కోసం వీడియో తీయాలన్న ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఆదేశాలపై మదర్సాలు ఆవేదన వ్యక్తంచేశాయి. యూపీ ప్రభుత్వ ఆదేశం తమను ఇబ్బంది పెట్టిందని, తమ దేశభక్తికి పరీక్ష పెట్టడం బాధాకరమని కాన్పూర్‌లోని సున్నీ ఉలేమా కౌన్సిల్ కన్వీనర్ హాజి మహ్మద్ సలీహ్ వ్యాఖ్యానించారు. 'సారే జహా సే అచ్చా' గేయం తమ సంప్రదాయ గీతమని అన్నారు. కాన్పూర్‌లోని మదర్సాలు కూడా వీడియో తీయాలన్న ప్రభుత్వాదేశాలను పాటించలేదు. రాష్ట్రంలో 16 వేల మదర్సాల్లో ప్రభుత్వ నిధులతో నడుస్తున్నవి 600 ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలను పాటించకున్నా, పలు ప్రాంతాల్లోని మదర్సాల్లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు కన్నులపండువగా సాగాయి. వారణాసిలోని కమల్‌గార్హా ప్రాంతం మొఘల్‌సరాయి రోడ్డులోని జామియా అరబియా మాట్లాల్ ఉలూమ్ మేనేజర్ మహ్మద్ మంజూర్ అహ్మద్ మాట్లాడుతూ 'చిన్నప్పటి నుంచి మదర్సాలో స్వాతంత్ర్య వేడుకలు జరుపుతున్నాం' అని చెప్పారు. జామియా మహ్మదియా అష్రఫుల్ ఉలూమ్ జామై డైరెక్టర్ మౌలానా మాతీన్–ఉల్–హక్ ఉసామా ఖాస్మీ మాట్లాడుతూ స్వాతంత్ర్య వేడుకలను వీడియో తీయించాలని మదర్సాలను మాత్రమే ప్రభుత్వం ఆదేశించడం బాధాకరమని అన్నారు. బరేలీలోని మంజారే ఇస్లాం అనే మదర్సాలో పతాకాన్ని ఎగురవేసి, సారే జహా సే అచ్చా అనే గేయాన్ని విద్యార్థులు ఆలపించారు.

రాష్ట్రాల్లో మువ్వన్నెల రెపరెపలు



ఉగ్రవాదుల కాల్పుల్లో మరణించిన కీర్తిచక్ర సీఆర్పీఎఫ్ కమాండర్ ప్రమోద్ కుమార్ పనిచేసిన కరన్‌నగర్‌లోని 49వ బెటాలియన్‌లో మంగళవారం జెండా ఆవిష్కరించిన ఆయన భార్య నేహా, కుమార్తె ఆర్ణ

న్యూఢిల్లీ, ఆగస్టు 15: దేశవ్యాప్తంగా 71వ స్వాతంత్ర్య దినోత్సవ సంబురాలు అంబరాన్నంటాయి. రాష్ట్రాల్లో ముఖ్యమంత్రులు జెండా ఆవిష్కరించి, స్వాతంత్ర్య సందేశమిచ్చారు. జమ్ముకశ్మీర్ సీఎం మెహబూబా ముఫ్తీ మాట్లాడుతూ.. రాష్ట్రానికి ప్రత్యేక హోదానిచ్చే ఆర్టికల్–35ఏపై సుప్రీంకోర్టు అనుకూలంగా తీర్పునిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. జమ్ముకశ్మీర్ ఎప్పటికీ భారత్‌లో భాగమేనని చెప్పారు. ఉత్తరప్రదేశ్‌లో సీఎం ఆదిత్యనాథ్ మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం వచ్చిన 70 ఏండ్ల తర్వాత కూడా అపరిశుభ్రతతో వచ్చే మెదడువాపు వంటి వ్యాధులతో చిన్నారులు చనిపోవడం బాధాకరమన్నారు. ఉత్తరాఖండ్‌లో 100 శాతం అక్షరాస్యతను సాధిస్తామని ఆ రాష్ట్ర సీఎం త్రివేంద్ర సింగ్ రావత్ ప్రకటించారు. నెలరోజుల్లో రైతులందరికీ రుణమాఫీ అమలు చేస్తామని పంజాబ్ సీఎం అమరీందర్ సింగ్ హామీ ఇచ్చారు. గుజరాత్ ముఖ్యమంత్రి విజయ్ రూపానీ రాష్ట్రంలోకి పరిశ్రమలను ఆకర్షించేందుకు 10 ఇండస్ట్రియల్ ఎస్టేట్లను ఆవిష్కరించారు. 2019 నాటికి మహారాష్ట్రలోని నిరుపేదలందరికీ ఇండ్లు కట్టించి ఇస్తామని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ తెలిపారు. వరద బాధితులను అన్నివిధాలా ఆదుకుంటామని బీహార్ సీఎం నితీశ్, అసోం ముఖ్యమంత్రి సర్బానంద సోనోవాల్ చెప్పారు. కేరళ ప్రజల మధ్య చిచ్చుపెట్టేందుకు ప్రయత్నిస్తున్న శక్తులను తిప్పికొట్టాలని ఆ రాష్ట్ర సీఎం పినరాయి విజయన్ పిలుపునిచ్చారు. తమిళనాడు ముఖ్యమంత్రి కే పళనిస్వామి అమ్మ భక్తిని చాటుకున్నారు. దివంగత సీఎం జయలలిత చూపిన మార్గంలో నడుస్తామన్నారు. కన్నడ ప్రజలపై ఇతర భాషలను రుద్దేందుకు ప్రయత్నించడాన్ని కర్ణాటక సీఎం సిద్ధరామయ్య ఖండించారు. ఒడిశా రాజధాని భువనేశ్వర్‌లో జరిగిన సభలో ప్రసంగిస్తుండగా ఆ రాష్ట్ర సీఎం నవీన్ పట్నాయక్ అస్వస్థతకు గురయ్యారు. ప్రసంగం ముగించిన తర్వాత అధికారులు ఆయనను దవాఖానకు తీసుకెళ్లారు. తన ఆరోగ్యపరిస్థితి మెరుగుపడిందని ఆయన ట్విట్టర్ ద్వారా తెలిపారు.

ఇస్రో శాస్త్రవేత్తల సంగీతం వీడియో విడుదల



ఎన్-బ్యాండ్ సంగీత బృందంలోని శాస్త్రవేత్తలు

తిరువనంతపురం, ఆగస్టు 15: నిత్యం గగనవీధిలోకి ప్రయోగించే ఉపగ్రహాల నుంచి వచ్చే మూసపోత శబ్దాల్లో నిమగ్నమయ్యే భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) శాస్త్రవేత్తలు వీనులవిందైన సంగీతాన్ని ఆవిష్కరించగలమని రుజువు చేశారు. 71వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా భారత సంస్కృతిలో వైవిధ్యానికి ప్రతిబింబంగా రాక్ 'ఎన్' బ్యాండ్ పేరిట తమ తొలి సంగీత వీడియోను విడుదల చేశారు. విక్రం సారాభాయ్ అంతరిక్ష కేంద్రం (వీఎస్సెస్), లిక్విడ్ ప్రొపల్షన్ సిస్టమ్ సెంటర్ (ఎల్పీఎస్సీ), ఇస్రో ఇనర్టియల్ సిస్టమ్స్ యూనిట్ (ఐఐఎస్‌యూ)లకు చెందిన 21 మంది శాస్త్రవేత్తలు భాగస్వాములై 'స్పేస్ ఇంజినీర్స్ అసోసియేషన్ (ఎస్ఈఏ) ఏర్పాటు చేశారని శిజు జీ థామస్ తెలిపారు. రోజువారీగా విధులు నిర్వర్తిస్తూనే తొలి మలయాళ సంగీత వీడియోను రూపొందించడానికి ఏడాదిన్నర పట్టిందని థామస్ వివరించారు.





మంగళ వారం గోల్కొండ కోటలో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరపున అవార్డులు అందుకున్న అధికారులు, సాహితీవేత్తలతో ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్, డీజీపీ అనురాగ్ శర్మ తదితరులు.

లక్షను మించి ఉద్యోగాల భర్తీ

రోడ్‌మ్యాప్ ప్రకటించిన సీఎం కేసీఆర్

తెలంగాణ లక్ష్యాల సాధనలో మరో మైలురాయి

నిధులు, నీళ్ల తర్వాత నియామకాల పూర్తిపై కార్యాచరణ

1,12,536 ఉద్యోగాల భర్తీకి నిర్ణయం

వచ్చే యేడు ఖాళీలు కూడా ఇప్పుడే భర్తీ

శాఖలవారీగా ఖాళీలన్నీ గుర్తింపు

భర్తీ చేసినవి..చేయనున్న వాటిపై స్పష్టత

రెండువేల పోస్టులతో నోటిఫికేషన్లు ప్రారంభం

ఇదీ లెక్క

ఇప్పటిదాక భర్తీ చేసినవి: 27,660

భర్తీ ప్రక్రియలో ఉన్నవి: 36,806

భర్తీకి సిద్ధంగా ఉన్నవి: 48,070

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ రాష్ట్ర సాధన ప్రధాన ఆశయాల సాకారంలో మరో ముందడుగు. ఇప్పటిదాకా నిధులు, నీళ్ల అంశాలను తదేక దీక్షతో శ్రమించి కొలిక్కి తెచ్చిన ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు, ఇపుడు నియామకాల మీద వేగవంతమైన కార్యాచరణ ప్రారంభించారు. స్వాతంత్ర్యదినోత్సవం సందర్భంగా గోల్కొండ కోట పైనుంచి లక్షా 12వేల పైచిలుకు ఉద్యోగాల భర్తీకి రోడ్‌మ్యాప్‌ను ప్రకటించారు. శాఖలవారీగా ఖాళీలు, భర్తీ చేసినవి, భర్తీ ప్రక్రియ కొనసాగుతున్నవి, భర్తీ చేయబోతున్నవి పక్కా లెక్కలతో స్పష్టత ఇచ్చారు. లక్ష ఉద్యోగాలు భర్తీ చేస్తామన్న వాగ్దానాన్ని నిలబెట్టుకుంటూనే మరో 12 వేలకు పైగానే ఉద్యోగాలు భర్తీ చేస్తున్నామని స్పష్టం చేశారు. తెలంగాణ ఆవిర్భావం తర్వాత సాగుతున్న నియామకాల ప్రక్రియ తీరు తెన్నులను వివరించారు. ఇప్పటివరకు 27,660 ఉద్యోగాలు భర్తీ చేశామని, 36,806 ఉద్యోగ నియామక ప్రక్రియ కొనసాగుతున్నవి, మరో 48,070 భర్తీకి సిద్ధంగా ఉన్నాయని సీఎం వివరించారు. నియామకాల కార్యాచరణకు సంకేతంగా టీఎస్‌పీఎస్సీ స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా రెండు వేల పైచిలుకు ఉద్యోగాల భర్తీకి ప్రకటన చేసింది.

విభాగాల వారీగా ఖాళీల వివరాలు

క్రమ సంఖ్య	ఉద్యోగాల సంఖ్య	విభాగం
1.	37,820	పోలీస్ శాఖ
2.	12,961	విద్యుత్ శాఖ
3.	12,005	విద్యాశాఖ(టీచర్లు)
4.	12,436	గురుకులాలు
5.	8,347	వైద్యారోగ్యం
6.	7,485	సింగరేణి
7.	3,950	ఆర్టీసీ
8.	2,506	రెవెన్యూ
9.	2,435	వ్యవసాయ, ఉద్యానశాఖ
10.	2,033	అటవీశాఖ
11.	1,952	పురపాలక, పట్టణాభివృద్ధి
12.	1,678	ఉన్నతవిద్య
13.	1,058	నీటిపారుదల
14.	720	ఆర్థిక
15.	587	మహిళా, శిశుసంక్షేమం
16.	513	రోడ్లు, భవనాలు
17.	340	ఆబ్కారీ
18.	182	రవాణా
19.	3,528	పంచాయతీరాజ్
మొత్తం	1,12,536	

ఇదీ భర్తీ ప్రక్రియ

క్రమ సంఖ్య	ఉద్యోగాల సంఖ్య	విభాగం	ఇప్పటికే భర్తీ చేసినవి	ఖాళీలు
1.	37,820	పోలీస్ శాఖ	10,499	27,440
2.	12,961	విద్యుత్ శాఖ	–	–
3.	12,005	ఉపాధ్యాయులు	–	12,005
4.	12,436	గురుకులాలు	–	12,436
5.	8,347	వైద్యారోగ్యం	–	8,347
6.	7,485	సింగరేణి	5,515	1,970
7.	3,950	ఆర్టీసీ	3950	–
8.	2,506	రెవెన్యూ	–	2,506
9.	2,435	వ్యవసాయ, ఉద్యానవనశాఖ	1506 (వెటర్నరీ అసిస్టెంట్) 929	2,435
10.	2,033	అటవీశాఖ	–	2,033
11.	1,952	పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ	102(గ్రౌండ్ వాటర్)	–
12.	1,678	ఉన్నతవిద్యా శాఖ	–	1,678
13.	1,058	నీటిపారుదల శాఖ	–	–
14.	720	ఆర్థిక శాఖ	–	720
15.	587	మహిళా, శిశుసంక్షేమశాఖ	–	–
16.	513	రోడ్లు, భవనాలశాఖ	–	513
17.	340	ఆబ్కారీ శాఖ	340	–
18.	182	రవాణా శాఖ	182	–
19.	3,528	పంచాయతీరాజ్‌శాఖ	123	3,528
మొత్తం	1,12,536			

ఏయే ఉద్యోగాలు.. ఎన్నెన్ని ఖాళీలు?

		ఖాళీలు	మొత్తం
1)	**పోలీస్ శాఖ**		
	సబ్ ఇన్‌స్పెక్టర్స్	1,739	
	పోలీస్ కానిస్టేబుల్స్	36,081	37,820
2)	**విద్యుత్ శాఖ**		12,961
3)	**పాఠశాల విద్యాశాఖ**		
	మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్స్	88	
	పీజీటీ	477	
	టీజీటీ	365	
	టీచర్ పోస్టుల ఖాళీలు :		
	స్కూల్ అసిస్టెంట్స్	1,950	
	సెకండ్ గ్రేడ్ టీచర్స్	5,415	
	లాంగ్వేజీ పండిట్స్	1,011	
	పీఈటీ	416	
	డైట్ కాలేజీ లెక్చరర్లు	49	
	డైట్ సీనియర్ లెక్చరర్లు	19	
	సీటీఈ, ఐఏఎస్ఈ లెక్చరర్లు	18	
	ఇతర పోస్టులు	2,197	12,005
4)	**గురుకుల పాఠశాలల టీచర్లు**	-	12,436
5)	**వైద్యారోగ్య శాఖ :**		
	డాక్టర్లు (అన్ని రకాలు)	4,347	
	ల్యాబ్ అసిస్టెంట్లు/ ఇతర పోస్టులు	4,000	8,347
6)	**సింగరేణిలో మజ్దూర్ పోస్టులు/ ఇతర సిబ్బంది పోస్టులు**	-	7,485
7)	**టీఎస్ ఆర్టీసీ :**		
	జూనియర్ అసిస్టెంట్స్ (ఫైనాన్స్)	39	
	జూనియర్ అసిస్టెంట్స్ (పర్సనల్)	33	
	మెకానికల్ సూపర్‌వైజర్స్‌ట్రైనీ	123	
	ట్రాఫిక్ సూపర్‌వైజర్ ట్రైనీ	84	
	ఆఫీస్ అండర్ ట్రైనీ జనరల్	33	
	ఆర్టీసీ కానిస్టేబుల్స్	280	
	శ్రామిక్స్	743	
	ఇతర పోస్టులు	2,615	3,950
8)	**రెవెన్యూ శాఖ :**		
	జూనియర్ అసిస్టెంట్/టైపిస్ట్	421	
	డిప్యూటీ కలెక్టర్స్	08	
	డిప్యూటీ తహసీల్దార్లు	38	
	వీఆర్వోలు	700	
	డిప్యూటీ సర్వేయర్లు	210	
	కంప్యూటర్ డ్రాఫ్ట్‌మెన్	50	
	డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్	07	
	సబ్-రిజిస్ట్రార్	22	
	జూనియర్ అసిస్టెంట్స్	50	
	ఇతర పోస్టుల వివరాలు	1,000	2,506
9)	**వ్యవసాయ శాఖ :**		
	ఏఈవోలు	1,311	
	హార్టికల్చర్ ఆఫీసర్స్	75	
	అగ్రికల్చర్ ఆఫీసర్స్	120	
	వెటర్నరీ అసిస్టెంట్స్	489	
	ఇతర కింద స్థాయి పోస్టులు	440	2,435
10)	**అటవీ శాఖ :**		
	ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్స్	200	
	ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్స్	616	
	ఫారెస్ట్ బీట్ ఆఫీసర్స్	1,000	
	అసిస్టెంట్ బీట్ ఆఫీసర్స్	217	2,033
11)	**ఎంఏయూడీ :**		
	అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్స్	73	
	ఏఈ/ఎంఏఈ/టీవో పోస్టులు	202	
	టీపీబీవో	123	
	టీపీఎస్	200	
	ఫుడ్ ఇన్‌స్పెక్టర్స్	20	
	మేనేజర్స్ ఇంజినీర్(నోటిఫైడ్)	146	
	అసిస్టెంట్ ఎఫ్ఏ(నోటిఫైడ్)	115	
	జనరల్ ఎంప్లాయిస్	658	
	ఇతర కిందస్థాయి ఉద్యోగాలు	415	1,952
12)	**ఉన్నత విద్యాశాఖ :**		
	జూనియర్ లెక్చరర్లు	392	
	ఫిజికల్ డైరెక్టర్స్	68	
	లైబ్రేరియన్స్	50	
	ల్యాబ్ అటెండర్స్	429	
	కాలేజీయేట్ ఎడ్యుకేషన్:		
	ఫిజికల్ డైరెక్టర్స్	25	
	లైబ్రేరియన్స్	21	
	ల్యాబ్ అసిస్టెంట్స్	301	
	సాంకేతిక విద్యా శాఖ :		
	లెక్చరర్స్	192	
	ఫిజికల్ డైరెక్టర్స్	31	
	లైబ్రేరియన్స్	28	
	ల్యాబ్ అటెండర్స్	141	1,678
13)	**నీటి పారుదల శాఖ :**		
	ఇంజినీర్స్ అండ్ ఆఫీసర్స్ స్టాఫ్	–	1,058
14)	**ఆర్థిక శాఖ :**		
	ఆడిట్ ఆఫీసర్స్/ ట్రెజరీ ఆఫీసర్స్	–	720
15)	**మహిళా, శిశు,సంక్షేమ శాఖ :**		
	సూపర్ వైజర్స్	–	587
16)	**రోడ్లు, భవనాల శాఖ**		
	ఇంజినీర్ అండ్ ఆఫీసర్స్ స్టాఫ్	–	513
17)	**ఎక్సైజ్ శాఖ :**		
	కానిస్టేబుల్స్	–	340
18)	**రవాణా శాఖ :**		
	ఏఎంవీ ఇన్‌స్పెక్టర్స్	45	
	కానిస్టేబుల్స్	137	182
19)	**పంచాయతీరాజ్ శాఖ :**		
	ఇంజినీర్ అండ్ ఆఫీస్ స్టాఫ్	–	3,528
	మొత్తం ఉద్యోగాల సంఖ్య		**1,12,536**

వ్యవసాయ వర్సిటీలో 242 బోధన పోస్టుల భర్తీ

- వారంరోజుల్లో నోటిఫికేషన్ విడుదల
- ఉపకులపతి డాక్టర్ వీ ప్రవీణ్‌రావు వెల్లడి



వ్యవసాయ వర్సిటీలో జెండా వందనం చేస్తున్న వీసీ ప్రవీణ్‌రావు తదితరులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంలో 242 బోధన పోస్టుల భర్తీకి వారంరోజుల్లో నోటిఫికేషన్ విడుదలచేస్తామని ఉపకులపతి డాక్టర్ వీ ప్రవీణ్‌రావు తెలిపారు. వర్సిటీ పరిపాలన భవనంవద్ద మంగళవారం జాతీయజెండాను ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ అనతికాలంలోనే వర్సిటీ దేశంలో 12వ, దక్షిణ భారతదేశంలో మూడో ర్యాంకు సాధించిందని తెలిపారు. రాష్ట్రంలో ఏర్పాటు చేయబోయే పంటకాలనీలతో ఆగ్రోప్రాసెసింగ్ పరిశ్రమలను అనుసంధానం చేయడంపై తగిన ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు. దీనివల్ల రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లభిస్తుందన్నారు. ఆహారభద్రతను కల్పించేందుకు అందుబాటులో ఉన్న పరిమిత వనరులతోనే సమృద్ధిగా ఆహారధాన్యాల ఉత్పత్తి జరిగేందుకు కృషి చేయాలన్నారు. పంట ఉత్పాదకత పెంచడం, నీటి యాజమాన్యం, ఎరువుల సమర్థ వినియోగంపై దృష్టిపెట్టాలని సూచించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు రూపొందించిన వేమన శతకాల సీడీని ఉపకులపతి డాక్టర్ వీ ప్రవీణ్‌రావు , రిజిస్ట్రార్ డాక్టర్ ఎస్ సుధీర్‌కుమార్ విడుదల చేశారు. కార్యక్రమంలో యూనివర్సిటీ సిబ్బంది పాల్గొన్నారు.

టీచర్ పోస్టులపై స్పష్టత

- వచ్చేవారంలో టీఎస్‌పీఎస్సీకి ఖాళీల వివరాలు
- కసరత్తు పూర్తిచేసిన విద్యాశాఖ అధికారులు
- భర్తీకానున్న 8,792 పోస్టులు
- కొత్త జిల్లాలవారీగా భర్తీ చేయాలని ప్రభుత్వం సూత్రప్రాయ నిర్ణయం
- న్యాయపరమైన సమస్యలు రాకుండా జాగ్రత్తలు
- 17న అధికారికంగా ప్రకటించనున్న డిప్యూటీ సీఎం కడియం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ : పాఠశాల విద్యాశాఖలో భర్తీ చేయాల్సిన టీచర్ పోస్టుల ఖాళీలపై స్పష్టత వచ్చింది. త్వరలో టీఎస్‌పీఎస్సీ ద్వారా భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ విడుదలకు సంబంధించిన నియామక నిబంధనలను అధికారులు రూపొందించారు. ఖాళీలు, నియామక నిబంధనల ఫైల్‌పై సీఎం కేసీఆర్ సంతకం చేయాల్సి ఉన్నది. ఇప్పటికే 8,792 టీచర్ పోస్టులను ప్రకటించగా, అందులో స్కూల్ అసిస్టెంట్ టీచర్ పోస్టులు 1,950, సెకండ్ గ్రేడ్ టీచర్లు 5,415, భాషా పండితులు 1,011, పీఈటీలు 416 చొప్పున ఖాళీలు ఉన్నట్టు పాఠశాల విద్యాశాఖ స్పష్టంచేసింది. పాత 10 జిల్లాల ప్రకారం కాకుండా మొత్తం 31 జిల్లాల వారీగానే విద్యాశాఖలోని టీచర్ పోస్టుల భర్తీ చేయాలని ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయం తీసుకున్నది. కొత్తగా అమలులోకి వచ్చిన ఏకీకృత సర్వీస్ నిబంధనలను కూడా టీచర్ నియామకాలకు అనువదిస్తున్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా శాశ్వత సర్వీస్ నిబంధనలను రూపొందిస్తున్నారు. టీచర్ నియామకంలో కచ్చితంగా జాతీయ ఉపాధ్యాయ విద్యామండలి ప్రకారం కనీస విద్యార్హతలను పాటించాలని నిర్ణయించారు. ఈక్రమంలో భవిష్యత్‌లో ఎలాంటి న్యాయపరమైన సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు సాధారణ పరిపాలనశాఖ, న్యాయశాఖల ఆమోదం పొందాలని విద్యాశాఖ నిర్ణయం తీసుకున్నది. వారం రోజుల్లో టీచర్ పోస్టుల ఖాళీల వివరాలు, జిల్లాలవారీగా, రోస్టర్ పాయింట్లవారీగా నోటిఫికేషన్ విడుదల చేయడం కోసం టీఎస్‌పీఎస్సీకి పంపడానికి విద్యాశాఖ కసరత్తు పూర్తిచేసింది. ఈ నెల 17న విద్యాశాఖ అధికారులతో డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి సమావేశం ఏర్పాటు చేయనున్నారు. అనంతరం టీచర్ పోస్టుల భర్తీపై ఆయన తుది ప్రకటన చేయనున్నారు.



మంగళవారం టీఎస్‌పీఎస్సీ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన పంద్రాగస్టు వేడుకల్లో పాల్గొన్న కమిషన్ చైర్మన్ ఘంటా చక్రపాణి, సభ్యులు, ఇతర సిబ్బంది

9 నోటిఫికేషన్లు.. 2345 ఉద్యోగాలు

మొదటిపేజీ తరువాయి...

విరమణ చేయనున్న టీఎస్‌పీఎస్సీ సభ్యుడు వివేక్‌కు చైర్మన్ ముందస్తుగా శుభాకాంక్షలు తెలిపారు.

నోటిఫికేషన్ల ఆధారంగా ఉద్యోగాల వివరాలు

నోటిఫికేషన్ నంబరు	క్యాటగిరీ	ఖాళీలు
40/2017	సివిల్ అసిస్టెంట్ సర్జన్స్ (స్పెషలిస్ట్స్)-తెలంగాణ వైద్యవిద్య విధాన పరిషత్	205
41/2017	డెంటల్ అసిస్టెంట్ సర్జన్స్ (స్పెషలిస్ట్స్)-తెలంగాణ వైద్యవిద్య విధాన పరిషత్	10
42/2017	ట్యూటర్స్ ఇన్ -డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్	65
43/2017	లెక్చరర్స్ ఇన్ రేడియోలాజికల్ ఫిజిక్స్, ఫిజిసిస్ట్స్ ఇన్ -డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్	06
44/2017	సివిల్ అసిస్టెంట్ సర్జన్స్ (స్పెషలిస్ట్స్)-ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్	43
45/2017	అసిస్టెంట్ ఫిజియోథెరపిస్ట్-ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్	02
46/2017	ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్స్-ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్	67
47/2017	ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్స్-ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్	90
48/2017	ఫారెస్ట్ బీట్ ఆఫీసర్స్-ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్	1857
	మొత్తం ఖాళీలు	2345

బోరుబావిలో పడిన రెండేండ్ల బాలుడు

ఏపీలోని గుంటూరు జిల్లా ఉమ్మడివరంలో ఘటన

అమరావతి, నమస్తే తెలంగాణ: నీరు పడలేదని కొందరు రైతులు నిర్లక్ష్యంగా వదిలేస్తున్న బోరుబావులు చిన్నారుల పాలిట మృత్యు కుహరాలుగా మారుతున్నాయి. ఏపీలోని గుంటూరు జిల్లా వినుకొండ మండలం ఉమ్మడివరంలో అలా వదిలేసిన ఓ బోరులో మంగళవారం రెండేండ్ల బాలుడు పడిపోయాడు. తండ్రి మల్లికార్జున్‌తో కలిసి పశువుల కొట్టం వద్దకు వెళ్లిన చంద్రశేఖర్ ఆడుకుంటూ బోరుబావిలో పడ్డాడు. 20 అడుగుల లోతులో బాలుడు చిక్కుకున్నట్టు తెలుస్తున్నది. చిన్నారికి పైపు ద్వారా ఆక్సిజన్ అందిస్తున్నారు. మరో వైపు భారీవర్షం కురుస్తున్నా బోరుబావికి సమాంతరంగా పొక్లెయినర్‌తో గొయ్యి తవ్వుతున్నారు. జిల్లా కలెక్టర్, గుంటూరు రూరల్ ఎస్పీ, డీఎంహెచ్‌వో ఘటనా స్థలానికి చేరుకొని సహాయ చర్యలను పర్యవేక్షిస్తున్నారు. ఎన్డీఆర్‌ఎఫ్ బృందాలు కెమెరాలను బావిలోపలికి పంపించి బాబు పరిస్థితిని తెలుసుకుంటున్నాయి. బోరుబావి ఘటనపై ఏపీ సీఎం చంద్రబాబు, హోంమంత్రి చినరాజప్ప ఆరా తీశారు. బాలుడిని సురక్షితంగా బయటకు తీసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



గుంటూరు జిల్లా ఉమ్మడివరంలోని బోరుబావిలో పడ్డ బాలుడిని బయటకు తీసేందుకు కొనసాగుతున్న సహాయ చర్యలు. (ఇన్‌సెట్) చిన్నారి చంద్రశేఖర్ (ఫైల్)



టీఎన్జీవో అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి జన్మదినోత్సవం మంగళ వారం హైదరాబాద్‌లోని టీఎన్జీవో భవన్‌లో నిర్వహించారు. బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ దేవీప్రసాద్ కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా హాజరై కారం రవీందర్‌రెడ్డికి కేక్ తినిపించారు. కార్యక్రమంలో టీఎన్జీవో ప్రధాన కార్యదర్శి మామిండ్ల రాజేందర్, సంఘం నేతలు రామినేని శ్రీనివాసరావు, కొండల్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, కస్తూరి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.
- సుల్తాన్‌బజార్

విద్వేషాలు రగిలిస్తున్న హరగోపాల్

- భువనగిరి ఎంపీ బూర నర్సయ్యగౌడ్ ధ్వజం



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: డిండి ప్రాజెక్టుపై తన అనుచిత వ్యాఖ్యలతో ప్రొఫెసర్ హరగోపాల్ ప్రజల మధ్య విద్వేషాలను రెచ్చగొడుతున్నారని భువనగిరి ఎంపీ బూర నర్సయ్యగౌడ్ అన్నారు. మేధావి అని చెప్పుకొనే హరగోపాల్ వ్యక్తిగత ఎజెండా పెట్టుకొని రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నారని మంగళవారం ఒక ప్రకటనలో విమర్శించారు. నల్లగొండ జిల్లాలో అత్యంత ఫ్లోరైడ్ పీడిత ప్రాంతాలైన దేవరకొండ, మునుగోడు నియోజకవర్గాలకు సాగునీరు అందించేందుకు డిండి ఎత్తిపోతల పథకాన్ని సీఎం కేసీఆర్ చేపడుతుంటే హరగోపాల్ తప్పుడు వ్యాఖ్యలుచేసి జిల్లాల ప్రజల మధ్య చిచ్చు పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని అన్నారు. హరగోపాల్ వంటి మేధావులు హుందాగా వ్యవహరించి రాష్ట్ర ప్రగతికి మంచి సూచనలు ఇస్తే మంచిదని హితవుపలికారు.

ఉద్యోగులకు ప్రోత్సాహకాలు గొప్ప నిర్ణయం: కారం రవీందర్‌రెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రవ్యాప్తంగా 98 మందిని ఉత్తమ ఉద్యోగులుగా ఎంపికచేసి ఇంక్రిమెంట్ ఇవ్వడం గొప్ప నిర్ణయమని టీఎన్జీవో అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి, తెలంగాణ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఏ పద్మాచారి అన్నారు. ప్రతీ ఉద్యోగిలో ఆరోగ్యవంతమైన పోటీ పెరుగడానికి అవార్డులు, ఇంక్రిమెంట్లు ఉపయోగపడతాయని వారు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ప్రోత్సాహాన్ని టీఎన్జీవో సంఘంలో ఉన్న ఉద్యోగులు స్ఫూర్తిగా తీసుకొని ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కారం రవీందర్‌రెడ్డి కోరారు.



ఈమెకు ఒత్తిడి.. అంతకంతకూ పెరిగిపోతున్నది. అప్పటికే ఎంతోమంది డాక్టర్ల దగ్గరకు తిరిగింది, ఎంతో ఖర్చు చేసింది. అయినా ఫలితం లేదు. భర్త ఆర్మీ ఆఫీసర్. కవల పిల్లలు. మానసిక ఒత్తిడితో జీవితం ఎటువెళ్తుందో తెలియని స్థితి.. తనో డాన్సర్ అనే విషయాన్ని కూడా మర్చిపోయింది. వన్ ఫైన్ మార్నింగ్.. యూట్యూబ్‌లో చూసిన ఓ డాన్స్ వీడియో ఆమెను ఎంతగానో ఆకట్టుకున్నది. దాని గురించి ఆరా తీస్తే అది జుంబా డాన్స్ అని తెలిసింది. కట్ చేస్తే.. ఆ జుంబా డాన్స్‌కే రారాణి అయింది విజయ తుప్రాణి. 'గురువులేని విద్య గుడ్డిది' అంటుంటారు. అది ముమ్మాటికీ తప్పు అని.. స్వయంకృషి, పట్టుదల ఉంటే ఏదైనా సాధ్యమని నిరూపించింది. జుంబా డాన్స్‌తో ఫిట్‌నెస్‌ను బోధిస్తూ.. దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్నది. ఎన్నో అవార్డులూ గెలుచుకుంది.

జుంబా రారాణి

జుంబా విజయ.. తెలుగు రాష్ర్టాల్లో పరిచయం అక్కర్లేని పేరు. తనకు ఇంత పేరు రావడం వెనుక ఎన్నో ఏండ్ల శ్రమ, కృషి, పట్టుదల దాగివుంది. తానేంటో ఈ ప్రపంచానికి నిరూపించుకోవాలన్న తపన ఉంది. ఎన్ని చెమట చుక్కల్ని చిందిస్తే తను ఈ స్థాయికి చేరుకుందో?! ఎందుకంటే జుంబా డాన్స్ అంటే మామూలు విషయం కాదు. అదో ఫిట్‌నెస్ డాన్స్. మ్యూజిక్, రిథమ్‌కు తగ్గట్లుగా డాన్స్ చేయాలి. శరీరంలోని ప్రతి అవయవం కదులాలి. అప్పుడే ఫిట్‌గా ఉండగలం. సుమారు 40 ఏళ్ల వయసులోనూ తీగలా తిరుగుతూ.. ఫిట్‌నెస్ పాఠాలు బోధిస్తున్నది విజయ. ఏమిటీ మీ సీక్రెట్ అంటే.. కేవలం డాన్స్ అనే అంటుంది. దానినే ప్రేమిస్తుంది. దానిలోనే జీవిస్తుంది. దానినే లైఫ్ స్టయిల్‌గా మార్చుకుంది.



నన్నుగా గుర్తిస్తే చాలు..

హిప్హాప్, సాల్సా, జుంబా అన్నీ సొంతంగానే నేర్చుకున్నా. నాకంటూ ప్రత్యేకంగా గురువు ఎవ్వరూ లేరు. ఎవ్వరికీ ఉన్నతస్థాయి అంతా ఈజీగా రాదు. ఒకస్థాయి రావాలంటే దాని వెనుక ఎంతో కృషి, కష్టం ఉండాలి. నేను లక్ష్యం చేరుకోవడానికి ఎన్నో ఒడిదుడుకులు, ఆత్మ సంఘర్షణ ఎదుర్కొన్నా. జీవితంలో నన్ను నన్నుగా గుర్తించింది నా భర్తే. ఆయన తోడ్పాటు నా విజయాలకు సోపానం. నేనిప్పుడు ఎక్కడికి వెళ్లినా నా ముఖం చూసి గుర్తుపడుతున్నారు. నాకది చాలు.

విజయ తుప్రాణి

జుంబా.. ఇది ఫిట్‌నెస్ బేస్డ్ డాన్స్. ఏరోబిక్స్, హిప్‌హప్, సల్సాకు అప్‌డేట్‌గా వచ్చిందే ఈ జుంబా డాన్స్. ఇది పూర్తిగా ఫిట్‌నెస్ వర్క్అవుట్. దీనిని క్రమం తప్పకుండా చేయడం వల్ల బరువు తగ్గడం, బాడీ టోనింగ్, హెల్దీ మైండ్, జీవక్రియ స్థాయి పెరుగుతుంది. మానసిక ప్రశాంతత వస్తుంది. జుంబా డాన్స్ ప్రధాన కేంద్రం ఫ్లోరిడాలో ఉంది. ఈ డాన్స్ నేర్చుకున్న వాళ్లకు సర్టిఫికెట్ ఇస్తారు. ఇది రెండు రోజుల కార్యక్రమం. నిర్వాహకుల అనుమతితో లైసెన్స్ తీసుకుని డాన్స్ నేర్చుకున్న వాళ్లకు సర్టిఫికెట్ ఇవ్వొచ్చు. జుంబాను నేర్చుకోవాలంటే కచ్చితంగా డాన్స్ వచ్చి ఉండాలి. శరీరంలోని క్యాలరీలు కరిగించుకోవడానికి ఎంతో ఉపయోగపడుతుంది. జుంబా డాన్స్ సెషన్ ఒక గంటపాటు ఉంటుంది. మ్యూజిక్‌తో లయబద్ధంగా డాన్స్ చేయడం దీని ఉద్దేశం. ఫాస్ట్, స్లో, మీడియం.. ఇలా రిథమ్‌ను ఫాలో అవుతూ డాన్స్ చేయాలి. విజయ తన స్టూడెంట్స్‌కు ప్రత్యేకంగా లాటిన్, కమర్షియల్, బాలీవుడ్ పాటలతో బెల్లీడాన్స్‌ను మిక్స్ చేస్తూ జుంబా నేర్పిస్తున్నది. ఒక్క సెషన్‌లో దాదాపు 600 నుంచి 1000 కేలరీలు బర్న్ అవుతాయి. ఒక్కగంటలోనే దాదాపు 7 వేల నుంచి 9 వేల వరకు స్టెప్స్ వేయిస్తారు. ఇది సుమారు 8 కిలోమీటర్ల జాగింగ్‌తో సమానం.

సెలబ్రెటీల చూపూ జుంబా వైపే

2012 ఫిబ్రవరిలో ఆస్ట్రేలియా నుంచి హైదరాబాద్‌లో వచ్చిన ఓ ట్రైనర్‌తో కలిసి విజయ ఈ జుంబా డాన్స్ నేర్చుకున్నది. వాళ్లు ఇచ్చిన సర్టిఫికేషన్‌తో పాటు డాన్స్ సీడీలు, పాటలు, మ్యూజిక్ వంటివి అప్‌డేట్ చేస్తూ.. వాటిపై నాలెడ్జ్ పెంచుకుని డాన్స్‌ను కంపోజ్ చేస్తుంది విజయ. తన ప్రతిభ తెలిసిన వివిధ రంగాల్లోని సెలబ్రెటీలు, యాక్టర్లు సైతం జుంబా డాన్స్ నేర్చుకున్నారు. వీరిలో యామిని భాస్కర్, నందినీరాయ్, దీక్షాపంత్ మొదలుకుని దాదాపు 15 మంది వరకు సెలబ్రెటీలు ఉన్నారు. ఒక్క హైదరాబాద్‌లో 2500 మందికి పైగా తనకు స్టూడెంట్స్ ఉన్నారు. విజయ చెప్పే ఆన్‌లైన్ క్లాసులకు దేశవ్యాప్తంగా లక్షా 45 వేలకు పైగా సబ్‌స్క్రైబర్స్ ఉన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఫాలోవర్స్‌ను సంపాదించుకుంది. తాను అప్‌లోడ్ చేసే డాన్స్ వీడియోలకు 3 మిలియన్స్ పైగా వ్యూస్ వస్తున్నాయి.

విజయ ముంగిట్లో అవార్డులు

2012 ఏప్రిల్ నుంచి ఇప్పటి రోజుకు రెండు చొప్పున ఎన్నో వర్క్‌షాపులు నిర్వహించింది విజయ. ఐసీసీఐ, ఫేస్‌బుక్, డాక్టర్‌రెడ్డీస్ ల్యాబ్, కాగ్నిజెంట్, జీఈఎనర్జీ, స్టాండర్డ్ ఛార్టెడ్ బ్యాంకు, డ్యూపాంట్ మల్టీనేషనల్ కంపెనీ, గూగుల్, జేపీ మోర్గాన్ చేస్, డీఈ షా, మారియట్ హోటల్స్ వంటి కార్పొరేట్ కంపెనీల్లో జుంబాడాన్స్ వర్క్‌షాపులు నిర్వహించింది. అపోలో, యశోద ఆస్పత్రులకు ఫిట్‌నెస్ ప్రతినిధిగా వ్యవహరిస్తున్నది. అంతేకాకుండా గ్రేటర్ హైదరాబాద్ అడ్వెంచర్ క్లబ్‌తో కలిసి ఎలైట్ లేడీస్ క్లబ్, పింక్, ఉట్‌కర్ష్, కాకతీయ వంటి లేడీస్ క్లబ్‌లలో వర్క్‌షాపులు నిర్వహించింది. జుంబా డాన్స్‌ను కెరీర్‌గా ఎంచుకుని ఎంతోమందికి ఆరోగ్యం పంచినందుకు 10కే రన్ ఫౌండేషన్ విజయను బిగ్‌మోటివేటర్‌గా గుర్తించింది. 2014-15-16 సంవత్సరాలకు ఉమెన్ ఎచీవర్, ఉమెన్ ఆఫ్ ది ఇయర్ అవార్డులు గెలుచుకుంది. సొంతంగా 'ఫివా ఫిట్‌నెస్' సెంటర్‌ను ఏర్పాటు చేసింది.

కొత్తగా పౌండ్ ఫిట్‌నెస్


మధ్యతరగతి కుటుంబానికి చెందిన విజయ నాయనమ్మ క్లాసికల్ సింగర్. ఆమె విజయకు మూడేళ్ల వయసులో క్లాసికల్ డాన్స్ నేర్పించింది. తర్వాత కూచిపూడి, భరతనాట్యం, కథక్, ఒడిస్సీ వంటి శాస్త్రీయ నృత్యాల్లో శిక్షణ పొందింది. చదువు ముగిసిన తర్వాత హైదరాబాద్‌కు చెందిన ఆర్మీ ఆఫీసర్‌ను పెళ్లి చేసుకుంది. తనకు కవల పిల్లలు. తన విజయాల్లో భర్త ప్రోత్సాహం మరువలేనిది. అప్పట్లో 75-80 కేజీలు ఉన్న విజయ.. డాన్స్‌తో తన శరీర రూపాన్నే మార్చుకుంది. జుంబాతోపాటు హిప్‌హప్, సల్సా కూడా నేర్చుకుంది. ప్రతిసారి కొత్త డాన్స్‌లను పరిచయం చేస్తున్న విజయ.. ఈసారి 'పౌండ్ ఫిట్‌నెస్' అనే కొత్తరకం డాన్స్‌ను నేర్చుకుంటున్నది. అమెరికాకు చెందిన పౌండ్ ఫిట్‌నెస్ వాళ్లు వచ్చే నెలలో ముంబైలో ట్రైనింగ్ ఇవ్వనున్నారు. దానిని నేర్చుకుని హైదరాబాద్‌కు పరిచయం చేద్దామని అనుకుంటున్నది. ఎందుకంటే హైదరాబాద్ అంటే తనుకు చాలా ఇష్టమట.

అనాథల కోసం :

ఫ్యామిలీ కోసం కొంత సమయం కేటాయించాలనే ఉద్దేశంతో వీకెండ్స్‌లో వర్క్‌షాపులకు వెళ్లడం మానేసింది విజయ. తనకు డాన్స్ నచ్చినట్లే పిల్లలకు ఇష్టమైన రంగం ఏదైనా ఉందంటే వాళ్లను అటువైపే వెళ్లమని చెబుతానంటున్నది విజయ. ఎన్జీఓలతో కలిసి సామాజిక కార్యక్రమాలు చేపట్టాలని, అనాథ పిల్లలకు స్కాలర్‌షిప్‌లు ఇచ్చి చదివించాలని ఉందట. జీవితంతో పోటీపడి పరుగుపెట్టడం ఆపి.. జీవితంతో కలిసి నడుస్తూ.. లైఫ్‌స్టైల్‌ను మార్చుకోవాలని చెబుతున్నది. తెలిసిన నాలెడ్జ్‌ను ఇతరులకు పంచడంతోనే ఎక్కువ విజ్ఞానాన్ని పొందగలమని అంటున్నది.

బిట్స్ కార్నర్

ఫార్మర్ టు బ్యాంకర్



ఎప్పుడూ జాబ్‌లో బిజీబిజీ. లైఫ్ ఎప్పుడూ ఇలాగే ఉంటే బోర్ కొట్టేస్తుంది. కొంచెం కూడా కొత్తగా లేకపోతే ఎలా? ఆ కొత్త ఆలోచన కూడా అందరికీ ఉపయోగపడేదిగా ఉంటే ఎంత బాగుంటుంది! ఇలాగే ఆలోచించింది, దాన్ని ఆచరణలో పెట్టింది ఈ జంట.

ఢిల్లీకి చెందిన దీపక్ మల్టీ నేషనల్ బ్యాంకులో మంచి ఉద్యోగం సంపాదించాడు. కొన్నాళ్ల పాటు సౌతాఫ్రికాలో, మరి కొన్నేళ్లు కెనడాలో పనిచేశాడు. ఎంత సంపాదిస్తున్నా రొటీన్‌గా ఉన్న ఉద్యోగజీవితం ఆయనకు బోర్ కొట్టేసింది. ఇండియాకు వచ్చేశాడు. రసాయన పద్ధతుల్లో పండించిన కాయగూరలు తిని జనాలు రోగాల బారిన పడుతున్న విషయాన్ని గుర్తించాడు. అందుకే వారికి సేంద్రీయ పద్ధతుల్లో పండించిన సహజమైన కాయగూరలు, పండ్లను అందించాలని నిర్ణయించుకున్నాడు. అందుకే ఢిల్లీ, గుర్‌గావ్ పరిసరాల్లోని గ్రామాలను పర్యటించి రైతుల దగ్గర కాయగూరల్ని సేకరించి పట్టణ ప్రజలకు అందించడం మొదలుపెట్టాడు. కొన్నాళ్ల తర్వాత వారే సహజంగా వాటిని పండించుకుని, స్వయంగా కోసుకునే ఏర్పాట్లు చేయాలనుకున్నాడు. కొన్ని ఎకరాల భూమిని కొని, దానిలో చిన్న భాగాలు చేసి సేద్యంపై ఇష్టం ఉన్నవారికి రెంటుకు ఇవ్వడం మొదలుపెట్టాడు. ఉత్సాహవంతులెవరైనా భూమిని కిరాయికి తీసుకుని కాయగూరల్ని పండించుకోవచ్చు. వాళ్లే స్వయంగా కోసుకెళ్లొచ్చు. దీపక్ సహజసిద్ధమైన ఆహారం అందించడంపై దృష్టిపెడితే, భార్య స్మిత సహజసిద్ధమైన బట్టల వినియోగంపై అవగాహన కల్పించడంలో బిజీ అయిపోయింది. సహజమైన నేత వస్ర్తాలను ఉపయోగించేలా జనాల్లో అవగాహన కల్పిస్తున్నది. ప్రత్యేకంగా ఎగ్జిబిషన్లను ఏర్పాట్లు చేస్తున్నది.

మూఢవిశ్వాసాలను జయించి..

స్వాతంత్రం వచ్చి డెబ్బై ఏళ్లయినా దేశంలో ఇప్పటికీ మూఢవిశ్వాసాల జాఢ్యం మారుమూల పల్లెల్లో కనిపిస్తూనే ఉన్నది. అలాంటి పరిస్థితుల్ని తనను తాను కాపాడుకుని, వాటివల్ల జరిగే నష్టాలపై అందరికీ అవగాహన కల్పిస్తున్నది ఈ అమ్మాయి.



175 కుటుంబాలు కలిగిన మారుమూల పల్లెలో రమ్య కుటుంబం జీవిస్తున్నది. రిక్షాతొక్కి కుటుంబాన్ని పోషించే తండ్రి ప్రమాదానికి గురై మంచానికే పరిమితమయ్యాడు. అమ్మ పనికి వెళ్లాల్సి రావడంతో ఇంటి బాధ్యత రమ్యపై పడింది. కానీ ఆమెకు చదువంటే ఎంతో ఇష్టం. ఎలాగోలా ఐదో తరగతి వరకు చదువుకున్నది. కానీ హైస్కూలు వెళ్లాలంటే ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న పక్క ఊరుకు నడిచి వెళ్లాలి. తల్లిదండ్రులు వద్దని చెప్పినా, కష్టపడి హైస్కూలును పూర్తి చేసింది. అంతేకాదు మంచి కాలేజీలో సీటు సంపాదించింది. కానీ, వారి సామాజిక వర్గంలో ఎన్నో ఏళ్లుగా కొనసాగుతున్న బాల్యవివాహమనే మూఢాచారం ఆమెకు ఇబ్బందిగా మారింది. తల్లిదండ్రులు ఆమెకు పెళ్లి చేసి బాధ్యత తీర్చుకోవాలనుకున్నారు. ఉన్నత చదువులు చదువుకుంటానని వారికి నచ్చజెప్పింది రమ్య. అప్పుడే ఆమెకు పలు స్వచ్ఛంద సంస్థలతో పరిచయం ఏర్పడింది. వాటి ద్వారా బాలల హక్కులపై పూర్తి అవగాహన పెంచుకున్నది. తనలాగే మూఢాచారాల బారిన పడి భవిష్యత్తును నాశనం చేసుకుంటున్న వారిని కాపాడాలనుకున్నది. ముందుగా తన పల్లెలో అందరినీ ఒక్కచోట చేర్చి.. బాల్యవివాహాలు చేయొద్దంటూ ప్రచారం మొదలు పెట్టింది. ఎన్నో బాల్యవివాహాలను అడ్డుకున్నది. చుట్టు పక్కల గ్రామాల్లోనూ అవగాహన కల్పిస్తున్నది.

క్యారెట్ తినకూడదా?!



క్యారెట్ తింటే ఆరోగ్యానికి చాలా మంచిదని అంటుంటారు. అందుకే కేజీలకు కేజీలు లాగించేస్తుంటారు. కానీ క్యారెట్ తక్కువగా తింటే మంచిదని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

క్యారెట్ తినడం వల్ల రక్తం పడుతుందని అంటుంటారు. అలా అని ఎక్కువ తినేస్తే ఒంటికి అస్సలు మంచిది కాదంటున్నారు నిపుణులు. పరిశోధనలు జరిపి మరీ ఈ విషయాన్ని వెల్లడించారు. క్యారెట్‌ని మామూలు కన్నా ఎక్కువ మోతాదులో తీసుకోవడం వల్ల అందులో ఉండే కార్బోహైడ్రేట్లు, ఫైబర్ జీర్ణం కాక అసిడిటీ సమస్య వస్తుందట. అలాగే చక్కెర వ్యాధిగ్రస్తులు వైద్యుల సహాయం లేకుండా క్యారెట్ అస్సలు తీసుకోవద్దు. క్యారెట్‌లో షుగర్ శాతం ఎక్కువగా ఉండి.. అది రక్తంలో గ్లూకోజ్ స్థాయి పెంచుతుంది. దీనివల్ల ఒంట్లోని చక్కెర స్థాయిలు పెరుగుతాయి. అదేవిధంగా పాలు ఇచ్చే తల్లులు కూడా క్యారెట్ తక్కువగా తీసుకుంటే మంచిందంటున్నారు వైద్యులు. ఏదైనా మితిమీరి తింటే ప్రమాదమేనని గుర్తుంచుకొని తినండి.

ఈ బెంగ తీర్చగలరా?



నా వయసు 24 సంవత్సరాలు. సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేస్తున్నాను. ఇంకా పెళ్లి కాలేదు. ఈ మధ్య నా తల మాడు మీద జుట్టు ఎక్కువగా రాలుతున్నది. చాలా రకాల నూనెలు, షాంపులు మార్చి చూశాను. కానీ పెద్దగా ఫలితం లేదు. నాకు ఈ విషయం చాలా బెంగ కలిగిస్తున్నది. ఇలా జుట్టు రాలడం వల్ల నా వయసు కంటే పెద్దవాడిలా కనిపిస్తున్నాను. దయచేసి నా సమస్యకు పరిష్కారం చూపగలరు.

విజయ్, హైదరాబాద్



డాక్టర్ కవిత
డెర్మటాలజిస్ట్
నియోడెర్మ
హైదరాబాద్

ఇలా జుట్టురాలే సమస్యకు నూనెలు, షాంపులు మార్చడం వల్ల పెద్దగా ఉపయోగం ఉండదు. ఇలా జరుగడానికి అంతర్గత కారణాలు ఏమున్నాయో నిపుణులు పరీక్షించి నిర్ధారించాల్సి ఉంటుంది. సంపూర్ణ సమతుల ఆహారం తీసుకుంటున్నారా లేదా? మీరు తీసుకుంటున్న ఆహారం, మీ ఒత్తిడి వంటివన్నీ ఇందుకు కారణం కావొచ్చు. అంతేకాదు రక్తంలో హిమోగ్లోబిన్ స్థాయి, థైరాయిడ్ హార్మోన్ స్థాయి వంటి వాటినన్నింటినీ పరీక్షించి, ఆ రిపోర్టుల ఆధారంగా చికిత్స అందించాల్సి ఉంటుంది. ఇందుకు మినోక్సిడిల్ సిరంలతో పాటు ప్లేట్‌లెట్ రిచ్ ప్లాస్మా వంటి అత్యాధునిక చికిత్సలు అందుబాటులో ఉన్నాయి. వీటిలో మీకు ఏది అవసరమవుతుందనేది నిపుణులు నిర్ధారిస్తారు. మీకు దగ్గరలో ఉన్న డెర్మటాలజిస్ట్‌ను సంప్రదించి తగిన చికిత్స తీసుకుంటే మీ సమస్య తప్పకుండా పరిష్కారం అవుతుంది.

మాకు రాయండి

మీకు ఆరోగ్యపరమైన సమస్యలు, సందేహాలున్నాయా? అయితే మాకు రాయండి. నిపుణులతో సలహాలు ఇప్పిస్తాం.నమస్తే తెలంగాణ - అడుగండి చెబుతా(హెల్త్‌డెస్క్)
మా అడ్రస్ : #8-2-3\1\7\8\9, క్రిష్ణాపురం, రోడ్ నెం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. health@ntdaily.news

వాట్సప్!

ట్వీట్

కమల్‌హాసన్
@ikamalhaasan



కమల్ హాసన్‌ను ట్విట్టర్‌లో ఫాలో అవుతున్న వారి సంఖ్య

1,660,137

తమిళ నాడు రాష్ట్రం గొప్పగా ఉండాలనేది నా లక్ష్యం. నాతో పాటు గొంతు కలుప డానికి ఎవరొచ్చినా వాళ్లకు సహకరిస్తాను.

సమ్‌థింగ్ స్పెషల్



బడికి బామ్మలు..
అక్షరాస్యులే దేశానికి పట్టుగొమ్మలు!

వైరల్ వీడియో



కళ్ల ముందే కన్నబిడ్డలు రాలిపోతుంటే, డ్రగ్స్ మహమ్మారి మత్తులో పసివాళ్లు తమ జీవితాన్ని కోల్పోతుంటే, గుండె బరువెక్కి చేసిన చిన్న ప్రయత్నం ఈ వీడియో. యువతని రక్షిద్దాం.. వారి భవిష్యత్తును కాపాడుదామనే నినాదంతో చేసిన వీడియో ఇది.
"Oh Yuvatha" Drug Abuse Awareness Music Video | Lakshmi Bhoopal | Raghu Kunche | BFC

Published on Aug 14, 2017

షేరింగ్

తెలివైన కుక్క కథ

ఒక కిరాణా షాపు వాడు షాపు కట్టేస్తూ ఉండగా ఒక కుక్క వచ్చింది. దాని నోట్లో సరుకుల లిస్టు ఉంది. షాపువాడు ఆశ్చర్యపోతూనే సరుకులన్నీ సంచిలో ప్యాక్ చేసి దాని నోటికందించాడు. అది అక్కడనుంచి కదిలింది. షాపు వాడికి ఇదంతా ఎంతో ముచ్చటగా అనిపించింది. షాపు కట్టేసి కుక్కని ఫాలో అయ్యాడు. కుక్క చాలా క్రమశిక్షణతో రెడ్‌లైట్ దగ్గర ఆగి గ్రీన్ లైట్ వెలిగాక రోడ్ క్రాస్ చేసి బస్టాప్‌లో నిలబడింది. వస్తున్న బస్‌ల నంబర్లు అన్నీ చదివి తనకి కావాల్సిన బస్ రాగానే ఎక్కింది. కిరాణా షాపు యజమాని ఇంకా ఆశ్చర్యంతో దాన్ని అనుసరిస్తూనే ఉన్నాడు. తాను దిగాల్సిన బస్టాప్ దగ్గర దిగి ఇంటి మెట్ల దాక కిరాణా సామాను పెట్టి కాలెత్తి కాలింగ్ బెల్ కొట్టడానికి ప్రయత్నించింది. అది ఎత్తుగా ఉండడంతో అందలేదు. కాళ్లతో తలుపు కొట్టింది. ఆ చప్పుడు బహుశా ఇంట్లో వాళ్లకి వినపడలేదనుకుంట. ఎవరూ వచ్చి తలుపు తీయలేదు. కుక్క ఇంటి పక్కవైపు వెళ్లి బెడ్‌రూమ్ కిటికీ పైకి ఎక్కింది. కిటికీ తలుపుల్ని తలతో గట్టిగా బాదసాగింది. లోపల ఎవరో కదిలిన అలికిడి వినిపించిన తర్వాత కిందికి గెంతి డోర్ దగ్గరికి తిరిగి వచ్చింది. షాపు వాడు ఈ చర్యలన్నీ నమ్మలేనంత సంభ్రమాశ్చర్యంతో చూస్తున్నాడు. అప్పుడే నిద్రలోంచి లేచి బయటకొచ్చిన ఇంటి యజమాని ఆ కుక్కని బూతులు తిడుతూ కాలితో తన్నసాగాడు. ఆ కిరాణా వాడు చప్పున పరిగెత్తుకుంటూ వెళ్లి 'ఏం చేస్తున్నావయ్యా నువ్వు? అసలు బుద్ధుందా? ఏమైనా తెలుస్తుందా? ఈ కుక్క అద్భుతమైన తెలివి తేటలుగల కుక్క. సినిమాల్లో అయితే లక్షలు సంపాదించగలదు. అసలిలాంటి తెలివైన కుక్కని ఈ ప్రపంచంలోనే చూడలేం' అన్నాడు చాలా ఉద్వేగంతో. ఆ యజమాని దానికి సమాధానం ఇస్తూ 'ఇది తెలివైందా? బయటికి వెళ్తున్నప్పుడు ఇంటి తాళం చెవి తీసుకువెళ్లకుండా, వెళ్లి తిరిగొచ్చి డిస్టర్బ్ చేయడం ఈ వారంలో ఇది రెండోసారి' అన్నాడు.

మనకెన్ని తెలివి తేటలున్నా.. మనపై వాళ్లకు నచ్చకపోతే అవి వృథా. మనలో ఎన్ని మంచి గుణాలున్నా వాటికి గుర్తింపు లేకపోతే ఇలాగే ఉంటుంది.

–ఓ వాట్సప్ మెసేజ్

ఎవరు ఆదుకుంటారు? ఎవరు ఎవరికి ఆసరాగా నిలుస్తారు? అనే కదా మీ డౌట్. అవగాహన, చైతన్యం లేకపోవడం వల్ల ఎన్నో ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయి. బతికే అవకాశం ఉన్న ఏ ప్రాణం పోకూడదనే సరికొత్త ఆలోచనతో ముందుకొచ్చింది సాధనా యూనిక్ ఇన్నోవేటివ్ సర్వీసెస్ (సూట్స్) సంస్థ. ఆ సంస్థ వ్యవస్థాపకుడు సోమ శేఖర్ రెడ్డి ఐడియా గురించి, దాని ప్రాసెస్ గురించి ఇలా వివరించారు.



స్టార్టప్ కహానీ

ఆదుకుంటారు.. ఆసరాగా నిలుస్తారు!

ఎవరు వస్తారు? ఎవరు ఇస్తారు? ఎవరూ రారు.. ఏమీ ఇవ్వరు. ఏం చేసుకున్నా.. ఏం తీసుకున్నా, నీ కోసం నువ్వు తప్ప.. నీ వాళ్లకు నువ్వు తప్ప. నీ కష్టాల్లో పాలుపంచుకోరు.. నీకు ఆసరాగా నిలువరు. ఒకానొక సమయంలో ఎవ్వరూ కనిపించరు. నువ్వు కూడా ఎవ్వరికీ కనిపించవు. కొన్ని సమయాల్లో నువ్వు సంపాదించిన మంచి రాదు. వెనకేసుకున్న సంపాదన కాపాడుతుంది. ఇక్కడ మ్యాటర్ సంపాదన గురించి కాదు. వేలు, లక్షలు, కోట్ల గురించి అసలే కాదు. వందల గురించి ఆలోచించి ఆచరిస్తే కొన్ని ప్రాణాలైనా నిలుస్తాయి. కొన్ని కుటుంబాలకైనా ఆసరా లభిస్తుంది.

ఒక ఉదాహరణ.. ఒక ఉదారత..

కూలీ పనిచేసుకునే శ్రీనివాస్ తన సంపాదనతో ఇల్లు గడుపడమే గగనంగా ఉంది. ఓ రోజు మేడ్చల్ జిల్లా కీసర వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. హుటాహుటిన అంబులెన్స్‌లో దగ్గరిలోని దవాఖానాకు తరలించారు. పరిస్థితి విషమించడంతో ఓ కార్పొరేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఇల్లు గడువడమే కష్టంగా ఉన్న శ్రీనివాస్ ఎక్కడి నుంచి ఖరీదైన వైద్యం చేయించుకోగలుగుతాడు. అక్కడి నుంచి గాంధీ ఆసుపత్రికి తరలిస్తుండగానే మార్గ మధ్యలో కన్నుమూశాడు. శ్రీనివాస్ వైద్యానికి ఇక్కడ డబ్బు అవసరం. అది శ్రీనివాస్ దగ్గర లేదు. ఇప్పుడు శ్రీనివాస్ కుటుంబసభ్యులకు అతడు అవసరం. కానీ అతడు లేడు. శ్రీనివాస్ లేని లోటును ఎవరూ తీర్చలేరు. శ్రీనివాస్ మరణానికి రోడ్డు ప్రమాదం ఒక కారణమైతే దీని వెనుక కొన్ని కారణాలున్నాయి. ఒకటి పేదరికం.. డబ్బుంటే పెద్ద దవాఖానాల్లో మంచి వైద్యం చేయించుకొని బతికేవాడు. ఇంకోటి ముందు చూపు లేకపోవడం. పాలసీలు, ఇన్సూరెన్స్‌లు లేకపోవడం వల్ల ఎలాంటి వైద్యానికి పనికొచ్చే అవకాశం వర్తించలేదు. ఏదో ఒక పాలసీనో, ఇన్సూరెన్సో చేసుకొని ఉంటే వైద్యం అందిన తర్వాత అతడు బతుకకపోయినా, మరణించిన తర్వాత అతని కుటుంబసభ్యులకైనా కొంత డబ్బు వచ్చేది. ఒక ఆసరాగా ఉండేది. కొంత భరోసా మిగిలేది. శ్రీనివాస్ ఒక్కడే కాదు.. దేశ వ్యాప్తంగా ఎంతోమంది రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్నారు. కొందరు డబ్బుండి వైద్యం చేయించుకోగలుగుతున్నారు. ఇంకొందరు అవగాహన ఉండి పాలసీలు, ఇన్సూరెన్స్‌లు చెల్లుబాటు చేసుకుంటున్నారు. భీమా సౌకర్యాల గురించి తెలిసిన వాళ్లు ముందే సభ్యత్వం తీసుకొని వాటిని సద్వినియోగపరుచుకుంటున్నారు. ధరలెక్కువని కొందరు భయపడి దూరంగా ఉంటే.. వాటి గురించి తెలియక వాడుకోలేకపోతున్నారు. సాధనా యూనిక్ ఇన్నోవేటివ్ సర్వీసెస్ సామాన్యులకు కూడా ఇన్సూరెన్స్‌లు అందాలని, ఖరీదైన వైద్యంతో పాటు బీమా సదుపాయం వర్తించేలా చేసేందుకు ముందుకొచ్చింది.

ఎవరొస్తారు? ఎందుకొస్తారు?

రూ.799 రూపాయలు చెల్లిస్తే రెండు లక్షల రూపాయల వైద్యం అందించే ఒక ఇన్సురెన్స్ పాలసీని మార్కెట్‌లోకి తీసుకొచ్చాడు సోమశేఖర్. యాక్సిడెంట్ అయినా ఇంకే ప్రమాదమైనా 12నెలల వ్యాలిడిటీతో ఉచిత వైద్యాన్ని దీనితో పొందొచ్చు. హైదరాబాద్‌లో 30 పెద్ద ఆసుపత్రులతో దీనికి సంబంధించి ఒప్పందం కూడా కుదుర్చుకున్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో 1500 ఆసుపత్రుల్లో వీళ్ల సర్వీస్ అందుబాటులో ఉన్నది. అంతేకాదు.. సంవత్సరకాలంలో మీరు చందాదారులుగా ఉండి ఎలాంటి ప్రమాదాలకు గురవకుంటే.. ఆ డబ్బుతో వేరే వాళ్లకి వైద్యం అందించే వెసులుబాటు ఉంటుంది. దీని వల్ల మీ ప్రాణాలు కాపాడుకోవడమే కాదు.. చారిటీ రూపంలో మరొకరి ప్రాణాన్ని రక్షించే వాళ్లుగా నిలిచిపోవచ్చు. ఇప్పటి వరకు ఈ పాలసీ ద్వారా మూడువేల మందికి అత్యవసరంగా చికిత్స అందించగలిగారు. ఇప్పటికే పలు సంస్థలు, కాలేజీలు సభ్యత్వాలు తీసుకోవడానికి పోటీపడుతున్నాయి. కానీ సాధారణ ప్రజలకు మాత్రం చేరువ కాలేకపోయింది.



యాక్సిడెంట్.. ఇన్సిడెంట్

దేశంలో రోడ్డు ప్రమాదాల వల్ల చాలామంది చనిపోతున్నారు. కారణం సమయానికి సరైన వైద్యం అందకపోవడం ఒకటైతే, వైద్యం సమయంలో డబ్బు చేతిలో ఉండకపోవడం. వైద్య వృత్తిలో రాణించాలని చిన్నతనం నుంచి కసిగా చదివి డాక్టర్ అయిన సోమశేఖర్, చదువు వల్ల పదికోట్లు సంపాదించలేకపోయినా పదిమందికి పనికొచ్చేలా ఉండాలనుకున్నాడు. నిరుపేదలకు ఖరీదైన వైద్యం అందేలా ఏదైనా సరికొత్త ఆలోచన చేయాలనుకున్నాడు. అలా పుట్టుకొచ్చిందే ఈ ఆరోగ్య బీమా పథకం. దీంతో అందరికీ ధీమా కల్పించొచ్చు అనుకున్నాడు. అప్పులు చేసి డాక్టర్ చదివిన తాను అప్పులు తెచ్చే రోగులకు వైద్యం చేయాలనుకోలేదు. డాక్టర్ అయ్యాక లక్ష్యం చేరుకున్నా కదా అని ఆగిపోలేదు. పేద, మధ్యతరగతి ప్రజలకు మెరుగైన వైద్యాన్ని అందించాలనే సంకల్పంతో సాధనా యూనిక్ ఇన్నోవేటివ్ సర్వీసెస్‌ను మిత్రులతో కలిసి ప్రారంభించాడు.

ఏం చేస్తారు? ఎలా చేస్తారు?

ట్రామాకేర్ సేవల కోసం ముఖ్యంగా ఈ పాలసీ ప్రారంభించారు. రూ.799 లు చెల్లించి సభ్యత్వం పొందాక రెండు లక్షల రూపాయాల వరకు ఉచితంగా వైద్యం చేయించుకోవచ్చు. దీనికి షరతులు ఏమీ వర్తించవు. 18 ఏళ్ల నుంచి 50 ఏళ్ల మధ్య వయసు వారు ఎవరైనా మెంబర్‌షిప్ తీసుకోవచ్చు. సూట్స్‌లో సభ్యత్వం పొందాక మీకు ఎలాంటి ప్రమాదం జరిగిన మీ వద్ద ఉన్న కార్డుపై ఉన్న నంబర్‌కి కాల్ చేస్తే కాల్ సెంటర్ ద్వారా కేర్ టీం సభ్యులకు సమాచారం అందుతుంది. సూట్స్ కేర్ టీం సభ్యుడు మీరున్న దవాఖానకు వచ్చి దగ్గరుండి జాగ్రత్తలు తీసుకుంటాడు. మీకు అవసరమయ్యే వైద్యాన్ని డాక్టర్లతో సంప్రదించి సరైన సమయంలో అందేలా చేస్తాడు. 200 మంది వైద్యులు సూట్స్ తరపున ప్రస్తుతానికి సేవలందిస్తున్నారు. దేశవ్యాప్తంగా ఇప్పటికే 5,500 ఆసుపత్రులతో సూట్స్ ఒప్పందం కుదుర్చుకొని సామాజిక బాధ్యతను నిర్వర్తిస్తున్నది. లాభం లేకుండా ఏ వ్యాపారం నడువదు. బతికే అవకాశం ఉన్న ఏ ప్రాణం పోకూడదనే ముఖ్య ఉద్దేశంతో సోమశేఖర్ దీన్ని మొదలుపెట్టాడు. అమెరికాలో షిప్ కార్నివాల్ క్రూయిజ్ లైన్స్‌లో ఫిజీషియన్‌గా పనిచేస్తున్న సోమశేఖర్ ఆరు నెలలు ఉద్యోగం చేస్తూ ఆరు నెలలు సూట్స్ బాధ్యతల్ని భుజాన వేసుకుంటున్నాడు. ఇప్పటి వరకు సంస్థకు ఎలాంటి లాభం రాకపోయినా నిరుపేదలకు వైద్యం అందించాలని తపిస్తున్నాడు. హైదరాబాద్ కేంద్రంగా రెండు తెలుగు రాష్ట్రాల్లో సూట్స్ సేవలందిస్తున్నది. భవిష్యత్తుల్లో దేశవ్యాప్తంగా విస్తరించి మరింతమంది ప్రాణాలకు కాపాడాలనుకుంటున్నారు. మరిన్ని వివరాలకు.. suitseveryone.com లాగిన్ అవ్వండి.

పరగడుపున వద్దు!

ఆరోగ్యకరమైన ఆహార పదార్థాలే కానీ.. వీటిని ఉదయం లేవగానే తినకూడదు, తాగకూడదు. ఇంతకీ ఏవేవీ మాను కోవాలో ఒక జాబితా ఇస్తున్నాం.



- పచ్చిగా ఉన్న అరటికాయను ఉదయాన్నే తినడం మంచిది కాదు. దీనివల్ల రక్తంలో మెగ్నీషియం స్థాయి పెరుగుతుంది. ఫలితంగా గుండె ఆరోగ్యం దెబ్బ తింటుంది.
- కాఫీ తాగందే రోజు ప్రారంభం కాదు చాలామందికి. ఖాళీ కడుపుతో కాఫీ తీసుకోవడం వల్ల జీర్ణవ్యవస్థ దెబ్బ తింటుంది.
- కారం ఎక్కువగా ఉండే ఆహారాన్ని పరగడుపున తింటే గ్యాస్ట్రిక్ సమస్యలు ఉత్పన్నమవుతాయి. మసాలా దినుసులు ఆరోగ్యానికి ఏ మాత్రం మంచివి కావు.
- సిట్రస్ ఫలాలను, జ్యూస్‌లను ఉదయాన్నే తీసుకోవడం మంచిది కాదు. దీనివల్ల అసిడిటీ ఫామ్ అయి గ్యాస్ట్రిక్ సమస్యలకు దారి తీయొచ్చు.
- పచ్చి ఆకుకూరలు శరీరానికి ఎంతో మేలు చేస్తాయి. కానీ పరగడుపునే వీటిని తినకూడదట. దీనివల్ల స్టమక్ లైనింగ్ దెబ్బతిందంటున్నారు నిపుణులు.
- స్వీట్లు, క్యాండీల్లో.. చక్కెర మోతాదు అధికంగా ఉండడం వల్ల లివర్‌పై ఎక్కువ ప్రభావం పడుతుంది. రోజూ ఉదయాన్నే స్వీట్లు తినడం వల్ల అవయవాల పనితీరు మందగిస్తుంది.

కలల సంరక్షకులు..

యువతరం ఆలోచనలు మారుతున్నాయి. సమాజసేవపై ఆసక్తి చూపుతున్నవారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్నది. ఈ యంగ్‌స్టర్స్ ఆ కోవకు చెందినవారే. ఇంతకీ వాళ్లేం చేశారో తెలుసా?



అనాథలు.. ఈ మాటలోనే తీరని వ్యథ ఉన్నది. అలాంటి అనామకులకు ఆసరా దొరుకడమే గగనం. అలాంటిది కలల్ని సాకారం చేసుకొనే పరిస్థితులెక్కడుంటాయి? కానీ వారి కలలకు మేము సంరక్షకులుగా ఉంటామని ముందుకొచ్చారు ఓ నలుగురు యంగ్‌స్టర్స్. గ్లోరియా బెన్నీ, సుజిత్ వార్కి, ఆదిత్య సుర్నేని, మేకా టీ కలిసి అనాథ పిల్లల కోసం 'గార్డియన్స్ ఆఫ్ డ్రీమ్స్' పేరిట స్వచ్ఛందసంస్థను ప్రారంభించారు. 2015 ఆగస్టు 17న ప్రారంభమైన ఈ సంస్థ అనాథలకు ఆసరాగా నిలువడమే లక్ష్యంగా పనిచేస్తున్నది. వీళ్లంతా ఒక టీమ్‌గా ఏర్పడి దేశవ్యాప్తంగా 23 నగరాల్లో పేద, అనాథ పిల్లలకోసం ఏర్పాటు చేసిన 80 ఆశ్రయ గృహాల నిర్వహణను చూస్తున్నారు. సుమారు 5వేల మంది పిల్లలు వీరి సంరక్షణలో చదువుకుంటున్నారు. పిల్లల బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తున్నారు. వారి కలల్ని నిజం చేసేందుకు ప్లానింగ్ ప్రకారం చదువుకునేలా ప్రోత్సహిస్తున్నారు. విషయ పరిజ్ఞానంతో పాటు, అన్ని రంగాల పట్ల అవగాహన కల్పించేలా ప్రాజెక్టులు చేయిస్తున్నారు. వర్క్‌షాపుల ద్వారా, స్పెషల్ ఈవెంట్స్ ద్వారా వారిలో ఆత్మస్థైర్యం పెంచే ప్రయత్నం చేస్తున్నారు. అందరూ మెరిట్‌లో పాసయ్యేలా వ్యూహరచన చేస్తున్నారు ఈ యంగ్‌స్టర్స్. మీరు కలలు కనండి, దానిని కష్టపడి నిజం చేసేందుకు మేమున్నామంటూ అనాథలకు భరోసా ఇస్తున్నారు.

ఆరోగ్యానికి ఆలుగడ్డలు



- ఆలుగడ్డల్లో ఎన్నో పోషకవిలువలు ఉన్నాయి. ఇతర పచ్చి కూరగాయల కంటే ఇవి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని నిపుణులు చెబుతున్నారు.
- ఆలూ ద్వారా శరీరానికి కావాల్సిన పొటాషియం పుష్కలంగా లభిస్తుంది.
- ఇటీవల పరిశోధనలు చేసిన వాషింగ్టన్ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు పోషక విలువలను అందించే ఆహార జాబితాలో ఆలుగడ్డకు మొదటి స్థానం కట్టబెట్టారు.
- ఆలుగడ్డలో పొటాషియంతో పాటు ఫైబర్, విటమిన్ సి, మెగ్నీషియం ఎక్కువగా ఉంటాయి. రోజూ తినే ఆహారంలో ఆలుగడ్డను భాగం చేసుకోవడం ఆరోగ్యానికి మంచిది.

ఐబీఎస్‌కు హోమియో బెస్ట్



మానవ జీర్ణవ్యవస్థను మ్యాజిక్ బాక్స్ అంటారు. కడుపు నొప్పికి కారణాలు అనేకం. ఇది ఎందువల్ల వస్తుందో నిర్ధారించడం కష్టం. దీర్ఘకాలికంగా కడుపునొప్పి, విరేచనాలు వేధిస్తున్నాయంటే పేగుల్లో ఇబ్బందికర మార్పులేవో ఇందుకు కారణం కావచ్చు. ముఖ్యంగా పేగుల్లో పూత, వాపు వల్ల ఇటువంటి లక్షణాలు కనిపించవచ్చు. ఈ సమస్యలను ఇన్‌ఫ్లమేటరీ బవెల్ సిండ్రోమ్ అంటారు.

ఇన్‌ఫ్లమేటరీ బవెల్ సిండ్రోమ్ ఆహార నాళాలకు సంబంధించిన ఒక దీర్ఘకాలిక సమస్య. మన శరీరంలో జీర్ణాశయానికి లోపలి వైపున అనేక మ్యూకోసిల్ పొరలు ఉంటాయి. ఇవి వాపు, మంట, తాపానికి గురికావడాన్ని ఇన్‌ఫ్లమేషన్ అని అంటారు. ఈ సమస్య వయసుతో సంబంధం లేకుండా స్త్రీ, పురుషులెవరిలోనైనా సమానంగా కనిపిస్తుంది. సాధారణంగా 30 సంవత్సరాల లోపు వయసు వారిలో ఎక్కువగా కనిపిస్తుంది.

కారణాలు

జన్యుపరమైన సమస్యలు, రోగనిరోధక వ్యవస్థ పొరపాటున జీర్ణ వ్యవస్థ పై దాడి చెయ్యడం, కుటుంబ చరిత్ర, కాలుష్యం, పొగ తాగడం వంటివి ప్రధాన కారణాలు.
ఇన్‌ఫ్లమేటరీ బవెల్ సిండ్రోమ్ రెండు రకాలుగా ఉంటుంది.

- **అల్సరేటివ్ కోలైటిస్ –** చాలా వరకు ఈ సమస్య పెద్దపేగుకు మాత్రమే పరిమితం అవుతుంది. పెద్దపేగుకు లోపల వైపుగా ఉండే మ్యూకోసిల్ పొరలు ఎర్రగా మారి, వాపునకి గురికావడం, పుండ్లు ఏర్పడడం వల్ల విరేచనాలు, కొందరిలో రక్తంతో కూడిన విరేచనాలు మలవిసర్జనలో ఆత్రుత, కడుపు నొప్పి వంటి సమస్యలు వస్తుంటాయి.
- **క్రౌన్స్ డిసీజ్–** ఈ సమస్య జీర్ణవ్యవస్థ అనగా నోటి నుంచి మొదలుకొని మలద్వారం వరకు ఎక్కడైనా రావచ్చు. ముఖ్యంగా చిన్నపేగు చివరి భాగంలో వచ్చే అవకాశాలు ఎక్కువ. ఇది కేవలం పైన ఉండే మ్యూకోసిల్ పొరలకు మాత్రమే కాకుండా లోపల ఉండే అన్ని పొరలకు ఇన్‌ఫ్లమేషన్ వ్యాపిస్తుంది. దీనివల్ల దీర్ఘకాలికంగా విరేచనాలు, కడుపులో నొప్పి, మెలితిప్పినట్టు ఉండడం, రక్తంతో కూడిన విరేచనాలు ప్రధానంగా ఉంటాయి. నిర్లక్ష్యం చేస్తే చిన్న పేగు మూసుకుపోవడం, పుండ్లు ఏర్పడడం, పేగులో రంధ్రాలు ఏర్పడడం, ఫిస్టులా వంటి తీవ్ర సమస్యలకు దారి తీస్తుంది. ఫలితంగా రక్తహీనత, నీరసం, ఆకలి తగ్గడం, బరువు తగ్గడం వంటి సమస్యలు తలెత్తుతాయి.
- ఐబీఎస్ కేవలం జీర్ణవ్యవస్థకే కాకుండా కీళ్లు, చర్మం, కాలేయం, కళ్లు వంటి అవయవాలపై కూడా ప్రభావం చూపుతుంది.

పరీక్షలు

రోగి లక్షణాలను బట్టి రక్త పరీక్ష, మల పరీక్ష, కొలనోస్కోపి, సిగ్మాయిడోస్కోపి, ఎక్స్‌రే, సీటీ స్కాన్, ఎంఆర్ఐ, ఎండోస్కోపీ వంటి పరీక్షల ద్వారా వ్యాధిని నిర్ధారించడమే కాకుండా ఇతర జీర్ణవ్యవస్థ సంబంధించిన సమస్యలు కూడా నిర్ధారించడం జరుగుతుంది.

హోమియో చికిత్స

జెనెటిక్ కాన్‌స్టిట్యూషనల్ సిమిలియం ద్వారా ఇన్‌ఫ్లమేటరీ బవెల్ సిండ్రోమ్ వల్ల దీర్ఘకాలికంగా వచ్చే కడుపునొప్పి విరేచనాలు ఇతర లక్షణాలను తగ్గించడమే కాకుండా ఐబీఎస్ కి గల కారణాలను ముఖ్యంగా వికటించిన రోగనిరోధక వ్యవస్థను చికిత్స ద్వారా సరిచేసి ఈ సమస్యను, శాశ్వతంగా దూరం చేయవచ్చు.
హోమియోకేర్‌లో వైద్యం ద్వారా ఐబీఎస్ సమస్యతో బాధపడుతున్న వారిలో సుమారు 82 శాతం మందిలో మంచి ఫలితాలు కనిపించాయి.

డా. శ్రీకాంత్ మోర్లావార్ CMD
హోమియోకేర్ ఇంటర్‌నేషనల్
టోల్ ఫ్రీ 1800 1081212
ఉచిత కన్సల్టేషన్
955 000 1188/99
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళ నాడు



బీఎమ్ఆర్‌సీఎల్ లో సెక్షన్ ఇంజినీర్లు

కర్ణాటకలోని బెంగళూరు మెట్రో రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ (బీఎమ్ఆర్‌సీఎల్) ఖాళీగా ఉన్న సెక్షన్ ఇంజినీర్ పోస్టుల భర్తీకి (తాత్కాలిక ప్రాతిపదికన) అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.



వివరాలు:

బీఎమ్ఆర్‌సీఎల్ అనేది కేంద్రం, కర్ణాటక ప్రభుత్వాల జాయింట్ వెంచర్ ప్రాజెక్ట్.

- **పోస్టు పేరు:** సెక్షన్ ఇంజినీర్
- మొత్తం పోస్టుల సంఖ్య -20
- **విభాగాలవారీగా ఖాళీలు:** టెలికం-2, రోలింగ్ స్టాక్-2, ట్రాక్షన్-2, ఏఎఫ్‌సీ-2, సిగ్నలింగ్-1, సివిల్/ఆర్ఎస్ఎస్-2, సిస్టమ్ డిజైన్-2, లిఫ్ట్స్ అండ్ ఎస్కలేటర్స్, ఈ అండ్ ఎం-3, టీవీఎస్ అండ్ ఈసీఎస్-2, డిపో-2
- **అర్హత:** గుర్తింపు పొందిన బోర్డ్/యూనివర్సిటీ నుంచి సంబంధిత ఇంజినీరింగ్‌లో బీఈ/బీటెక్ ఉత్తీర్ణత. సంబంధిత విభాగంలో మూడేండ్ల అనుభవం ఉండాలి
- **పే స్కేల్:** రూ. 35,910 (కన్సాలిడేటెడ్ పే),
- **వయస్సు:** 35 ఏండ్లకు మించరాదు.
- **ఎంపిక:** ఇంటర్వ్యూ
- **దరఖాస్తు:** ఆన్‌లైన్ ద్వారా. పూర్తి వివరాలతో పాటు వినియోగంలో ఉన్న ఈ-మెయిల్ ఐడీ, మొబైల్ నంబర్ ఎంటర్ చేయాలి. ఆన్‌లైన్ హార్డ్‌కాపీలను నిర్ణీత తేదీలోగా సంబంధిత పర్సనల్ అధికారికి పంపాలి.
- **చిరునామా:** General Manager (HR), Bangalore Metro Rail Corporation Limited, III Floor, BMTC Complex, K.H.Road, Shanthinagar, Bangalore 560027
- **చివరితేదీ:** ఆగస్టు 26
- **వెబ్‌సైట్:** www.bmrc.co.in

ఐఆర్‌డీఏలో అసిస్టెంట్ మేనేజర్లు

ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఐఆర్‌డీఏ)లో అసిస్టెంట్ మేనేజర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది.

వివరాలు:

ఐఆర్‌డీఏను పార్లమెంట్ చట్టం ద్వారా ఏర్పాటుచేశారు. ఇది ప్రభుత్వ పరిధిలోని సంస్థ. ప్రస్తుత నోటిఫికేషన్‌ను హైదరాబాద్ కార్యాలయం విడుదల చేసింది.

- **పోస్టు:** అసిస్టెంట్ మేనేజర్
- **ఖాళీల సంఖ్య - 30.** వీటిలో జనరల్ - 16, ఓబీసీ - 7, ఎస్సీ-4, ఎస్టీ - 3 ఖాళీలు ఉన్నాయి.
- **నోట్:** వీటిలో 4 పోస్టులు యాక్చురియల్, నాలుగు అకౌంట్స్, 2 లీగల్ స్పెషలైజేషన్స్ పోస్టులుగా గుర్తించారు.
- **అర్హతలు:** యాక్చురియల్ పోస్టులకు కనీసం 60 శాతం మార్కులతో డిగ్రీ, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యాక్చురియస్ ఆఫ్ ఇండియా నుంచి 9 పేపర్లు ఉత్తీర్ణత. అకౌంట్స్ పేపర్‌కు కనీసం 60 శాతం మార్కులతో డిగ్రీ, ఏసీఏ, ఏఐసీడబ్ల్యూ, ఏసీఎంఏ, సీఎఫ్ఏల్లో ఏదో ఒక కోర్సు ఉత్తీర్ణత.
- లీగల్ పోస్టులకు కనీసం 60 శాతం మార్కులతో డిగ్రీ, ఎల్ఎల్‌బీ ఉత్తీర్ణత.
- జనరల్ పోస్టులకు కనీసం 60 శాతం మార్కులతో డిగ్రీ ఉత్తీర్ణత.
- **వయస్సు:** 2017, సెప్టెంబర్ 5 నాటికి 21 - 30 ఏండ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు ఐదేండ్లు, ఓబీసీలకు మూడేండ్లు, పీహెచ్‌సీలకు పదేండ్లు వయోపరిమితిలో సడలింపు ఇస్తారు.
- **ఎంపిక:** ఫేజ్ - Iలో ఆన్‌లైన్ ప్రిలిమినరీ పరీక్ష నిర్వహిస్తారు. ఇది ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. ఇది కేవలం క్వాలిఫయింగ్ పరీక్ష మాత్రమే.
- ఫేజ్ - II డిస్క్రిప్టివ్ ఎగ్జామ్. దీనిలో మూడు పేపర్లు ఉంటాయి.
- ఫేజ్ - III ఇంటర్వ్యూ.
- **పరీక్ష కేంద్రాలు:** రాష్ట్రంలో హైదరాబాద్
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** సెప్టెంబర్ 5
- **వెబ్‌సైట్:** https://www.irdai.gov.in

సీడీఎస్ (II) - 2017

- **త్రివిధ దళాల్లో ఉన్నత ఉద్యోగాలు**
- **డిగ్రీ, ఇంజినీరింగ్ విద్యార్థులకు సువర్ణావకాశం**
- **పదోన్నతులు, చాలెంజింగ్ కెరీర్**
- **దేశసేవ చేసుకొనే అవకాశం**
- **మంచి జీతభత్యాలు, ఆకర్షణీయమైన అలవెన్స్‌లు**



త్రివిధ దళాల్లో ఉన్నత హోదా ఉద్యోగాలు. కేంద్ర కొలువులు. భద్రమైన జీవితానికి భరోసా. చాలెంజింగ్ కెరీర్ కావాలనుకొనే వారికి ఇదొక మంచి అవకాశం. ఏటా రెండుసార్లు నిర్వహించే కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ (సీడీఎస్) నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో వాటి వివరాలు సంక్షిప్తంగా...

సీడీఎస్ -2017

కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ ఎగ్జామినేషన్ -2017 (II) నోటిఫికేషన్‌ను యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ విడుదల చేసింది.

వివరాలు:

మొత్తం ఖాళీల సంఖ్య - 414. వీటిలో..

- ఇండియన్ మిలిటరీ అకాడమీ (డెహ్రాడూన్) - 100
- ఇండియన్ నేవల్ అకాడమీ (ఎజిమల) - 45
- ఎయిర్‌ఫోర్స్ అకాడమీ (హైదరాబాద్) - 32
- ఆఫీసర్ ట్రెయినింగ్ అకాడమీ (చెన్నై) - 225 (పురుష అభ్యర్థులకు మాత్రమే. వీటిలో ఎన్‌సీసీ సీ సర్టిఫికెట్ అభ్యర్థులకు 50 పోస్టులు కేటాయించారు)
- ఆఫీసర్ ట్రెయినింగ్ అకాడమీ (చెన్నై) - 12 (నాన్ టెక్నికల్, మహిళా అభ్యర్థులకు మాత్రమే)

విద్యార్హతలు:

- ఐఎంఏ అండ్ ఆఫీసర్స్ ట్రెయినింగ్ అకాడమీ: గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీ ఉత్తీర్ణత.

ఇండియన్ నేవల్ అకాడమీ

- గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఇంజినీరింగ్ డిగ్రీ

ఎయిర్ ఫోర్స్ అకాడమీ

- గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీ ఉత్తీర్ణత. ఇంటర్‌లో మ్యాథ్స్, ఫిజిక్స్ సబ్జెక్టులు చదివి ఉండాలి లేదా బీఈ/బీటెక్ ఉత్తీర్ణత.
- **వయస్సు:** 2018, జూలై 1 నాటికి 20 - 24 ఏండ్ల మధ్య ఉండాలి. అంటే 1994, జూలై 2 నుంచి 1998, జూలై 1 మధ్య జన్మించి ఉండాలి.
- **నోట్:** అభ్యర్థులు అవివాహితులై ఉండాలి. శిక్షణ సమయంలో కూడా వివాహం చేసుకోకూడదు.
- **శారీరక ప్రమాణాలు:** కనీసం 157.5 సెం.మీ. ఎత్తు ఉండాలి. నేవీకి 157 సెం.మీ., ఎయిర్‌ఫోర్స్‌కు 162.5 సెం.మీ. ఎత్తు ఉండాలి. ఎత్తుకు తగ్గ బరువు ఉండాలి.
- **ఫిజికల్ కండిషనింగ్:** రన్నింగ్ - 15 నిమిషాల్లో 2 - 4 కి.మీ. పరుగెత్తాలి.
- పుష్ అప్స్ - సిట్ అప్స్- కనీసం 20, చిన్ అప్స్- కనీసం 8, రోప్ క్లైంబింగ్ - 3 - 4 మీటర్లు.
- **ఫీజు:** రూ. 200/- (ఎస్సీ/ఎస్టీ, మహిళా అభ్యర్థులకు ఫీజు లేదు)

పరీక్ష విధానం:

- రాతపరీక్ష + ఇంటర్వ్యూ ద్వారా
- ఇండియన్ మిలిటరీ అకాడమీ, ఇండియన్ నేవల్ అకాడమీ, ఎయిర్‌ఫోర్స్ అకాడమీల్లో

రాతపరీక్ష విధానం:

- రాతపరీక్ష ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది.
- ప్రశ్నపత్రం ఇంగ్లిష్, హిందీ భాషల్లో ఉంటుంది.
- ప్రశ్నపత్రంలో మ్యాథ్స్ పదోతరగతి స్థాయిలో ఉంటుంది.
- నెగెటివ్ మార్కింగ్ విధానం ఉంది.
- **పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, తిరుపతి, విశాఖపట్నం, చెన్నై, బెంగళూరు తదితర పట్టణాల్లో ఉన్నాయి.

ఇంటెలిజెన్స్ పర్సనాలిటీ టెస్ట్

- ఇవి రెండు దశల్లో ఉంటాయి. స్టేజ్ -1లో అర్హత సాధించిన వారిని స్టేజ్ -2లోకి అనుమతిస్తారు.
- స్టేజ్ -1లో ఆఫీసర్ ఇంటెలిజెన్స్ రేటింగ్ టెస్ట్‌లు ఉంటాయి. వీటిలో పిక్చర్ పర్సెప్షన్ అండ్ డిస్క్రిప్షన్ టెస్ట్‌లు ఉంటాయి.
- స్టేజ్ -2లో ఇంటర్వ్యూ, గ్రూప్ టెస్టింగ్ ఆఫీసర్ టాస్క్స్, సైకాలజీ టెస్ట్‌లు ఉంటాయి.
- అభ్యర్థి వ్యక్తిత్వాన్ని ఇంటర్వ్యూయింగ్ ఆఫీసర్, గ్రూప్ టెస్టింగ్ ఆఫీసర్, సైకాలజిస్ట్‌లు పరీక్షిస్తారు.

పరీక్ష విధానం:

సబ్జెక్టు	మార్కులు
ఇంగ్లిష్	100
జనరల్‌నాలెడ్జ్	100
ఎలిమెంటరీ మ్యాథ్స్	100
మొత్తం మార్కులు	300

పరీక్ష కాలవ్యవధి - ఒక్కో సబ్జెక్టుకు రెండు గంటలు.

ఆఫీసర్స్ ట్రెయినింగ్ అకాడమీలో ప్రవేశాల కోసం...

సబ్జెక్టు	మార్కులు
ఇంగ్లిష్	100
జనరల్‌నాలెడ్జ్	100

కాలవ్యవధి - ఒక్కో సబ్జెక్టుకు 2 గంటలు

శిక్షణ వివరాలు:

- వైద్యపరీక్షల అనంతరం శిక్షణకు ఎంపికచేస్తారు.
- ఫ్లయింగ్ బ్రాంచీ (పైలట్)కి ఎయిర్‌ఫోర్స్ అకాడమీలో 74 వారాల శిక్షణ ఇస్తారు. ఈ సమయంలో నెలకు రూ. 21,000/- స్టయిఫండ్ చెల్లిస్తారు.
- ఆఫీసర్ ట్రెయినింగ్ అకాడమీలో శిక్షణకు ఎంపికైన వారికి 49 వారాల శిక్షణ ఇస్తారు.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** 2017, సెప్టెంబర్ 8 (సాయంత్రం 6)
- **వెబ్‌సైట్:** www.upsconline.nic.in

యూపీఎస్సీ-అసిస్టెంట్ ప్రొఫెసర్లు

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) వివిధ కేంద్ర ప్రభుత్వ విభాగాల్లో ఖాళీగా ఉన్న గ్రేడ్ -3 స్పెషలిస్ట్ (అసిస్టెంట్ ప్రొఫెసర్) పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది



వివరాలు:

యూపీఎస్సీ స్వతంత్ర ప్రతిపత్తిగల సంస్థ.

- మొత్తం పోస్టుల సంఖ్య: 54
- గ్రేడ్ - 3 స్పెషలిస్ట్ (అసిస్టెంట్ ప్రొఫెసర్) -37 పోస్టులు
- **విభాగాలవారీగా ఖాళీలు :** అనాటమీ-8, ఒబ్‌స్టెట్రిక్స్ అండ్ గైనకాలజీ-13, ఆప్తల్మాలజీ-3, ఆర్థోపెడిక్-1, పిడియాట్రిక్ కార్డియాలజీ-2, రేడియోథెరపీ-10
- అసిస్టెంట్ డైరెక్టర్-1 పోస్టు
- అసిస్టెంట్ ఇంజినీర్ (ఎలక్ట్రికల్/మెకానికల్ ఇంజినీరింగ్)-3 పోస్టులు
- అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్-6 పోస్టులు
- డ్రిల్లర్ ఇన్‌చార్జ్-5 పోస్టులు
- లెక్చరర్ (ఎలక్ట్రికల్/మెకానికల్)-2 పోస్టులు
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి సంబంధిత సబ్జెక్ట్‌లో మాస్టర్ డిగ్రీ, బీఈ లేదా బీటెక్, ఎమ్మెస్సీ, ఎంబీబీఎస్‌తోపాటు మాస్టర్ డిగ్రీ (సూపర్ స్పెషాలిటీ) లేదా తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణత.
- **వయస్సు:** 30 ఏండ్లకు మించరాదు. పోస్టులను బట్టి వేర్వేరుగా వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.
- **అప్లికేషన్ ఫీజు:** రూ. 25/-, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ, మహిళా అభ్యర్థులకు ఫీజు లేదు.
- **ఎంపిక:** పర్సనల్ ఇంటర్వ్యూ
- **దరఖాస్తు:** ఆన్‌లైన్ ద్వారా
- **దరఖాస్తులకు చివరితేదీ:** ఆగస్టు 31
- దరఖాస్తు ప్రింట్ తీసుకోవడానికి **చివరితేదీ:** సెప్టెంబర్ 1
- **వెబ్‌సైట్:** http://upsconline.nic.in

ఎంవోఐఎల్‌లో మేనేజర్లు

నాగ్‌పూర్‌లోని ఎంవోఐఎల్ లిమిటెడ్ వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న మేనేజర్, ఎగ్జిక్యూటివ్ ట్రెయినీ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.



వివరాలు:

మినిస్ట్రీ ఆఫ్ స్టీల్ పరిధిలో పనిచేస్తున్న ఎంవోఐఎల్ లిమిటెడ్ అనేది పూర్వం మాంగనీస్ ఓర్ (ఇండియా)గా పిలిచేవారు. ఇది ఒక మినీరత్న కంపెనీ.

- మొత్తం పోస్టుల సంఖ్య:13
- మేనేజర్ (మెడికల్ సర్వీసెస్)-8 పోస్టులు
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఎంబీబీఎస్‌లో ఉత్తీర్ణత.
- ఎగ్జిక్యూటివ్ ట్రెయినీ-3 పోస్టులు
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి మాస్టర్ డిగ్రీ (జియాలజీ/అప్లయిడ్ జియాలజీ)
- సీనియర్ మేనేజర్(జియాలజీ)-1 పోస్టు
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి జియాలజీ/అప్లయిడ్ జియాలజీలో పీజీ ఉత్తీర్ణత.
- మేనేజర్ (సెక్యూరిటీ)-1 పోస్టు
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఏదైనా బ్యాచిలర్ డిగ్రీలో ఉత్తీర్ణత.
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్ ద్వారా లేదా నిర్ణీత నమూనాలో దరఖాస్తులను నింపి పర్సనల్ అధికారికి పంపాలి. ఇంటర్వ్యూ తేదీన అర్హత కలిగిన అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో రిక్రూట్‌మెంట్ ఆఫీసర్ వద్ద హాజరుకావాలి
- **ఎంపిక:** ఇంటర్వ్యూ ద్వారా. మేనేజర్ (మెడికల్ సర్వీసెస్) పోస్టుకు ఇంటర్వ్యూతేదీ: ఆగస్టు 20
- **చివరితేదీ:** సెప్టెంబర్ 4 (మిగతా పోస్టులకు)
- **వెబ్‌సైట్:**www.moil.nic.in

ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో ఉద్యోగాలు



ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ (ఐఏఎఫ్)లోని ఎయిర్ ఇండియా హెడ్‌క్వార్టర్ (న్యూ ఢిల్లీ) ఖాళీగా ఉన్న గ్రూప్ సీ (స్టోర్ కీపర్, సూపరింటెండెంట్) పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

వివరాలు:

ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ భారతదేశానికి చెందిన త్రివిధ దళాల్లో అత్యంత ముఖ్యమైన సేనా విభాగం. దీన్ని 1932 అక్టోబర్ 8న ఏర్పాటుచేశారు.

- మొత్తం పోస్టుల సంఖ్య: 95 (జనరల్-72, ఓబీసీ-15, ఎస్సీ-8)
- స్టోర్ కీపర్-40 పోస్టులు (జనరల్-32, ఓబీసీ-5, ఎస్సీ-3)
- గుర్తింపు పొందిన బోర్డ్/సంస్థ నుంచి ఇంటర్/10+2 లేదా తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణత. పబ్లిక్/ప్రైవేట్ సంస్థలో స్టోర్స్ , అకౌంట్స్ విభాగంలో అనుభవం ఉండాలి.
- **పే స్కేల్:** రూ. 5,200 - 20,200 + గ్రేడ్ పే రూ.1,900/-
- సూపరింటెండెంట్ - 55 పోస్టులు (జనరల్-40, ఓబీసీ-10, ఎస్సీ-5)
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఏదైనా బ్యాచిలర్ డిగ్రీలో ఉత్తీర్ణత. పబ్లిక్/ప్రైవేట్ సంస్థలో స్టోర్స్, అకౌంట్స్ విభాగంలో అనుభవం ఉండాలి.
- **పే స్కేల్:** రూ. 5,200-20,200 + గ్రేడ్ పే రూ.2,400/-
- **వయస్సు :** 18 నుంచి 25 ఏండ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదేండ్లు, ఓబీసీ అభ్యర్థులకు మూడేండ్ల వరకు వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.
- **ఎంపిక:** రాత పరీక్ష ద్వారా
- రాత పరీక్షలో జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్, న్యూమరికల్ ఆప్టిట్యూడ్, జనరల్ ఇంగ్లిష్, జనరల్ అవేర్‌నెస్ అంశాల నుంచి ప్రశ్నలు వస్తాయి.
- **దరఖాస్తు:** వెబ్‌సైట్ నుంచి దరఖాస్తులను డౌన్‌లోడ్ చేసుకొని, పూర్తిగా నింపి అవసరమైన సర్టిఫికెట్లను జతపరిచి సంబంధిత పర్సనల్ అధికారికి ఆర్డినరీ పోస్టులో మాత్రమే పంపాలి.
- **చిరునామా:** Director PC (AHC), Air Headquater, J Block, New Delhi-110106
- **చివరితేదీ:** ఎంప్లాయ్‌మెంట్ న్యూస్‌లో ప్రకటన విడుదలైన 30 రోజుల్లోగా పంపాలి. ప్రకటన పూర్తి వివరాలకు ఆగస్టు 12-18న వెలువడిన ఎంప్లాయ్‌మెంట్ న్యూస్‌లో చూడవచ్చు.

ఎన్‌హెచ్‌డీసీలో ట్రెయినీ ఆఫీసర్లు

మధ్యప్రదేశ్‌లోని ఎన్‌హెచ్‌డీసీ లిమిటెడ్ వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న ట్రెయినీ ఆఫీసర్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

వివరాలు:

ఎన్‌హెచ్‌డీసీ లిమిటెడ్ అనేది నేషనల్ హైడ్రోఎలక్ట్రిక్ పవర్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎన్‌హెచ్‌పీసీ), మధ్యప్రదేశ్ ఉమ్మడిగా ఏర్పాటు చేసిన సంస్థ.

- మెడికల్ ఆఫీసర్-2 పోస్టులు
- ట్రెయినీ ఆఫీసర్-9 పోస్టులు
- సూపర్‌వైజర్ (సేఫ్టీ)-1 పోస్టు
- **అర్హత:** ఎంబీబీఎస్, లా డిగ్రీ, కంపెనీ సెక్రటరీ (సీఎస్), సీఏ, డిప్లొమాలో ఉత్తీర్ణత.
- **వయస్సు:** 2017 జూలై 31 నాటికి 30 ఏండ్లకు (మెడికల్ ఆఫీసర్‌కు 33 ఏండ్లు) మించరాదు.
- **ఎంపిక:** రాతపరీక్ష/ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు:** ఆన్‌లైన్ ద్వారా.
- **చివరితేదీ:** ఆగస్టు 22
- **వెబ్‌సైట్:**www.nhdcindia.com

ఎయిర్ ఇండియాలో

ఎయిర్ ఇండియా సదరన్ రీజియన్‌లో కాంట్రాక్టు ప్రాతిపదికన ఆపరేటర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది.

వివరాలు:

ఎయిర్ ఇండియా భారత ప్రభుత్వ రంగ సంస్థ.

- **పోస్టు:** ఫ్లైట్ ఆపరేషన్స్ ఆపరేటర్
- **కాలపరిమితి:** మొదట ఐదేండ్ల కాలానికి తీసుకొంటారు.
- **ఖాళీలు యూనిట్ల వారీగా:** హైదరాబాద్ -2, బెంగళూరు - 2, చెన్నై -2 ఖాళీలు ఉన్నాయి.
- **ఎంపిక:** ఇంటర్వ్యూ ద్వారా
- **ఇంటర్వ్యూతేదీ:** సెప్టెంబర్ 7
- **అర్హతలు:** ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత. ఇంటర్ స్థాయిలో మ్యాథ్స్, ఫిజిక్స్ సబ్జెక్టులను చదివి ఉండాలి.
- **వయస్సు:** 30 ఏండ్లు మించరాదు. రిజర్వ్‌డ్ వర్గాలకు నిబంధనల ప్రకారం వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.
- **దరఖాస్తు:** నిర్ణీత నమూనాలో
- **వెబ్‌సైట్:** http://www.airindia.com

ఈసీఐఎల్ లో టెక్నికల్ ఆఫీసర్లు

హైదరాబాద్‌లోని ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఈసీఐఎల్) ఖాళీగా ఉన్న టెక్నికల్ ఆఫీసర్ (తాత్కాలిక ప్రాతిపదికన) పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.



వివరాలు:

ఇది డిపార్ట్‌మెంట్ అటామిక్ ఎనర్జీ పరిధిలో పనిచేస్తుంది.

- మొత్తం ఖాళీలు: 4
- **పోస్టు పేరు:** టెక్నికల్ ఆఫీసర్
- **అర్హత:** ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజినీరింగ్‌లో 60 శాతం మార్కులతో బీఈ/బీటెక్‌లో ఉత్తీర్ణత. సంబంధిత విభాగంలో రెండేండ్ల అనుభవం ఉండాలి.
- **వయస్సు:** 2017 జూలై 31 నాటికి 30 ఏండ్లకు మించరాదు.
- **పే స్కేల్:** 21,000/- (కన్సాలిడేటెడ్ పే)
- **ఎంపిక:** పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్ ద్వారా. వెబ్‌సైట్ నుంచి దరఖాస్తులను డౌన్‌లోడ్ చేసుకొని, దానికి సంబంధిత సర్టిఫికెట్లను జతపరిచి ఇంటర్వ్యూ జరుగు రోజున పర్సనల్ అధికారి వద్ద హాజరుకావాలి.
- **ఇంటర్వ్యూ తేదీ:** ఆగస్టు 18
- **వెబ్‌సైట్:** www.ecil.co.in

నిట్ రూర్కెలాలో 203 ఖాళీలు

రూర్కెలాలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్) వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న ప్రొఫెసర్ (తాత్కాలిక/రెగ్యులర్ పద్ధతి) పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.



వివరాలు:

ఇంజినీరింగ్, సైన్స్ అండ్ టెక్నాలజీలో ఉన్నత విద్యను అభ్యసించడానికి దీన్ని ఏర్పాటుచేశారు. గతంలో దీన్ని రీజినల్ ఇంజినీరింగ్ కాలేజ్ రూర్కెలా గా పిలిచేవారు.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 203 (జనరల్-40, ఓబీసీ-82, ఎస్సీ-40, ఎస్టీ-26)
- **విభాగాలు:** ఇంజినీరింగ్, ఇండస్ట్రియల్ డిజైన్, ఆర్కిటెక్చర్, సైన్సెస్/ హ్యూమనిటీస్ అండ్ సోషల్ సైన్సెస్, స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్
- **పోస్టు పేరు:** ప్రొఫెసర్.
- అసిస్టెంట్ ప్రొఫెసర్ (కాంట్రాక్ట్ పద్ధతి)
- **పే స్కేల్:** రూ. 15,600-39,100+ గ్రేడ్ పే రూ. 6000 లేదా రూ.7000/-
- అసిస్టెంట్ ప్రొఫెసర్ (రెగ్యులర్ పద్ధతి)
- **పే స్కేల్:** రూ. 15,600-39,100+ గ్రేడ్ పే రూ. 8000/-
- అసోసియేట్ ప్రొఫెసర్ (రెగ్యులర్ పద్ధతి)
- **పే స్కేల్:** రూ. 37,400-67,000 +గ్రేడ్ పే రూ. 9500/-
- ప్రొఫెసర్ (రెగ్యులర్ పద్ధతి)
- **పే స్కేల్:** రూ. 37,400-67,000 + గ్రేడ్ పే రూ. 10,500/-
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి సంబంధిత సబ్జెక్ట్‌లో బీఈ/బీటెక్, బ్యాచిలర్ ఆఫ్ డిజైన్, బీఆర్క్/ఎంఆర్క్, మాస్టర్ డిగ్రీ, పీజీడీబీఎం/ఎంబీఏతోపాటు పీహెచ్‌డీ ఉండాలి. సంబంధిత పీజీ/డిగ్రీలో కనీసం 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత లేదా తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణత. టీచింగ్/రిసెర్చ్‌లో అనుభవం ఉండాలి.
- **వయస్సు:** సంస్థ నింబంధనల ప్రకారం అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు 30 లేదా 35 ఏండ్లు, పోస్టులను బట్టి వేర్వేరుగా వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.
- **ఎంపిక:** రాత పరీక్ష/ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు:** ఆన్‌లైన్ ద్వారా
- **చివరితేదీ:** సెప్టెంబర్ 11
- **వెబ్ సైట్:** www.nitrkl.ac.in

'పబ్లిక్ కోఆపరేషన్'లో కన్సల్టెంట్లు

న్యూఢిల్లీలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ కో ఆపరేషన్ అండ్ చైల్డ్ డెవలప్‌మెంట్ (ఎన్ఐపీసీసీడీ) ఖాళీగా ఉన్న కన్సల్టెంట్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.



వివరాలు:

పిల్లల హక్కులు, సంరక్షణ, అభివృద్ధి చేయడంలో ఎన్ఐపీసీసీడీ ముఖ్యపాత్ర పోషిస్తుంది.

- **పోస్టు పేరు:** కన్సల్టెంట్లు
- మొత్తం ఖాళీలు-25 పోస్టులు
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి మాస్టర్ డిగ్రీ (సైన్స్, కామర్స్, సోషల్ సైన్స్) లేదా తత్సమాన విద్యార్హతలో 55 శాతం మార్కులతో ఉత్తీర్ణత. పీహెచ్‌డీ/ఎంఫిల్, ప్రొఫెషనల్/టెక్నికల్ అర్హతలు ఉన్నవారికి ప్రాధాన్యం ఇస్తారు.
- **ఎంపిక:** రాతపరీక్ష, స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్ ద్వారా. నిర్ణీత నమూనాలో దరఖాస్తులను నింపి సంబంధిత పర్సనల్ అధికారికి పంపాలి.
- **చివరితేదీ:** ఆగస్టు 31
- **వెబ్‌సైట్:** www.nipccd.nic.in

ప్రభాస్‌కు జోడీగా...


శ్రద్ధాకపూర్

'బాహుబలి' చిత్రంతో ప్రపంచ వ్యాప్తంగా పాపులారిటీని సొంతం చేసుకున్నారు ప్రభాస్. ఆయన నటిస్తున్న తాజా చిత్రం 'సాహో'. సుజిత్ దర్శకత్వం వహిస్తున్నారు. దాదాపు 150 కోట్ల భారీ బడ్జెట్‌తో యు.వి.క్రియేషన్స్ పతాకంపై వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్న ఈ సినిమాపై సర్వత్రా అంచనాలు నెలకొన్నాయి. 'బాహుబలి' సంచలన విజయాన్ని దృష్టిలోపెట్టుకుని ఈ చిత్రాన్ని కూడా అదే స్థాయిలో తెరకెక్కించడానికి చిత్ర వర్గాలు సన్నాహాలు చేస్తున్నాయి. తెలుగు, తమిళ, మలయాళ, హిందీ భాషల్లో ఏకకాలంలో విడుదల కానున్న ఈ చిత్రంలో ప్రభాస్‌కు జోడీగా కత్రినా కైఫ్, అనుష్క, పూజాహెగ్డే వంటి పలువురు క్రేజీ కథానాయికల పేర్లు వినిపించాయి. అయితే తాజాగా చిత్ర వర్గాలు బాలీవుడ్ సోయగం శ్రద్ధాకపూర్‌ను ఎంపిక చేశారు. ఇటీవలే ఆమెను సంప్రదించిన చిత్ర వర్గాలు శ్రద్ధాకపూర్‌ను ఖరారు చేసినట్లు తెలిపారు. వచ్చే వారం నుంచి ప్రభాస్ చిత్రీకరణలో పాల్గొననున్నట్లు తెలిసింది. కాగా ఆరు నెలల్లో చిత్రాన్ని పూర్తి చేసి సమ్మర్‌లో ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని చిత్ర వర్గాలు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిసింది.


అనుష్క

అవధుల్లేని 'బ్రహ్మా'నందం

బ్రహ్మానందం పేరు వినగానే తెలుగు ప్రజల మోములపై చిరునవ్వులు విరబూస్తాయి. తనదైన విలక్షణ హాస్యంతో ప్రేక్షకుల్ని నవ్వుల జడిలో ముంచెత్తుతారాయన. అయితే మిగతా తారలతో పోల్చితే బ్రహ్మానందం సోషల్‌మీడియాకు దూరంగా వుంటారు. తన వ్యక్తిగత విషయాల్ని పంచుకోవడానికి పెద్దగా ఆసక్తి చూపించరు. తాజాగా ఆయన తన మనవడు పార్థను (గౌతమ్ కుమారుడు) ఎత్తుకొని మురిసిపోతున్న ఓ ఫొటోను ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేశారు. దీనికి పార్థ అనే హ్యాష్‌ట్యాగ్‌ను జోడించారు. ప్రస్తుతం ఈ ఫొటో సోషల్‌మీడియాలో నెటిజన్లను విశేషంగా ఆకట్టుకుంటున్నది.


మనవడు పార్థతో బ్రహ్మానందం

మనుషులకు భయపడే దయ్యం


కె, సుధీర్‌బాబు, ప్రభాస్, మహి, తాప్సీ, శ్రీనివాసరెడ్డి, విజయ్‌కుమార్

'భారతీయ సినిమాలో మొదటిసారి దెయ్యం మనుషులకు భయపడటమనే కాన్సెప్ట్‌తో 'ఆనందో బ్రహ్మ' చిత్రాన్ని రూపొందించారు. ట్రైలర్ చాలా ఆసక్తికరంగా వుంది' అన్నారు ప్రభాస్. తాప్సీ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'ఆనందో బ్రహ్మ'. శ్రీనివాసరెడ్డి, వెన్నెల కిషోర్, షకలక శంకర్ ముఖ్యపాత్రల్ని పోషించారు. 70 ఎం.ఎం. ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై విజయ్ చిల్లా, శశిదేవిరెడ్డి నిర్మించారు. మహి.వి.రాఘవ దర్శకుడు. ఈ నెల 18న విడుదలకానుంది. సోమవారం హైదరాబాద్‌లో ప్రీరిలీజ్ వేడుకను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రభాస్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ 'ఈ చిత్ర నిర్మాత విజయ్‌కుమార్ నాకు సన్నిహితుడు. అతనికి సినిమాలే లోకం. ఎప్పుడు కలిసినా సినిమాల గురించే మాట్లాడతాడు. తాప్సీతో కలిసి నేను 'మిస్టర్‌పర్‌ఫెక్ట్' చిత్రంలో నటించాను. ఈ సినిమాలో ప్రేక్షకులు ఓ అందమైన దయ్యాన్ని చూడబోతున్నారు. ఈ సినిమా పెద్ద విజయం సాధించాలని కోరుకుంటున్నాను' అన్నారు. 'పనిలో కొత్తదనం కనిపించాలంటే సాహసాలు చేయాల్సిందే. లేకుంటే జీవితం బోర్‌గా అనిపిస్తుంది. నా దృష్టిలో ఈ సినిమా ఓ సాహసం. ప్రేక్షకులకు సరికొత్త అనుభూతినిస్తుంది' అని తాప్సీ చెప్పింది. శరీరంలేని ఆత్మలు మనిషిని ఏం చేయలేవనే అంశాన్ని సినిమాలో చెప్పే ప్రయత్నం చేశానని దర్శకుడు చెప్పారు.

భాగమతికి గుమ్మడికాయ!

'బాహుబలి ది కన్‌క్లూజన్' తర్వాత కొత్త చిత్రాల ఎంపికలో ఆచితూచి అడుగులు వేస్తున్నది అనుష్క. మహిళా ప్రధాన చిత్రాలు, విలక్షణ కథాంశాల వైపు మొగ్గుచూపుతున్నది. ఆమె ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'భాగమతి'. అశోక్.జి దర్శకత్వం వహిస్తున్నారు. యు.వి. క్రియేషన్స్ పతాకంపై వంశీ, ప్రమోద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. చిత్రీకరణ పూర్తయినట్లు నిర్మాతలు ప్రకటించారు. సినిమాకు సంబంధించిన మరిన్ని కొత్త విషయాల్ని త్వరలో వెల్లడిస్తామని ట్విట్టర్ ద్వారా వెల్లడించారు. సూపర్ నేచురల్ టెక్నో థ్రిల్లర్ కథాంశంతో రూపొందుతున్న ఈ చిత్రంలో ఆధునిక యువతిగా, శక్తివంతమైన మహిళగా అనుష్క పాత్ర భిన్న పార్శ్వాల్లో సాగనున్నట్లు సమాచారం. దాదాపు యాభై కోట్ల భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఆది పినిశెట్టి, ఉన్నిముకుందన్ కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి తమన్ సంగీతాన్ని సమకూర్చుతున్నారు. తెలుగుతో పాటు తమిళంలో ఏకకాలంలో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు.

ఐయామ్ బ్లైండ్...బట్ ట్రైన్డ్!


రవితేజ

రవితేజ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'రాజా ది గ్రేట్'. 'వెల్‌కమ్ టు మై వరల్డ్' అని ఉపశీర్షిక. అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తున్నారు. మెహరీన్ కథానాయిక. శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్‌రాజు సమర్పణలో శిరీష్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్ర టీజర్‌ను స్వాతంత్ర్యదినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం విడుదల చేశారు. కెరీర్‌లో తొలిసారి రవితేజ అంధుడిగా ఓ వినూత్నమైన పాత్రలో నటిస్తున్నారు. ఆత్మవిశ్వాసంగల ఓ అంధుడి జీవితంలో చోటుచేసుకునే అనూహ్య సంఘటనల సమాహారంగా దర్శకుడు అనిల్ రావిపూడి ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. విడుదల చేసిన టీజర్‌లో 'సర్వేంద్రియానాం నయనం ప్రధానం అన్నారు' అనే డైలాగ్‌కి రవితేజ ధీటుగా...'నోర్ముయ్...ఆ నయనాలు లేకుండానే పాతికేళ్ల నుంచి కుమ్మేస్తున్నానిక్కడ. మిగతా పార్టులు అమ్మేసుకుంటారా? సర్వేంద్రియానాం సర్వం ప్రధానం .... ఐయామ్ బ్లైండ్..బట్ ఐయామ్ ట్రైన్డ్... అనే డైలాగ్‌తో పాటు 'నా కొడుకు ఈ ప్రపంచాన్ని చూడలేకపోవచ్చు. కానీ నా కొడుకేంటో ఈ ప్రపంచం చూడాలి' అంటూ రవితేజ తల్లి పాత్రలో నటిస్తున్న సీనియర్ నటి రాధిక చెప్పే డైలాగ్‌లు కూడా విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. రవితేజ తన పంథాకు భిన్నంగా అంధుడి పాత్రలో నటిస్తున్నారని, ఆయన పాత్ర చిత్రణ సినిమాకు ప్రధాన హైలైట్‌గా నిలుస్తుందని చిత్ర వర్గాలు చెబుతున్నాయి. సాయి కార్తీక్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రంలో ప్రకాష్‌రాజ్, సంపత్‌రాజ్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

శత్రువులపై సమరం


అజిత్

అజిత్ కథానాయకుడిగా తమిళంలో రూపొందుతున్న చిత్రం 'వివేగం'. శివ దర్శకుడు. వంశధార క్రియేషన్స్ పతాకంపై నవీన్ శొంఠినేని ఈ చిత్రాన్ని 'వివేకం' పేరుతో తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నారు. కాజల్ అగర్వాల్, అక్షర హసన్ కథానాయికలు. అనిరుధ్ స్వరాలను సమకూర్చిన గీతాలను చిత్ర బృందం ఇటీవల విడుదలచేసింది. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'జేమ్స్‌బాండ్ చిత్రాల తరహాలో సాగే స్టైలిష్ యాక్షన్ ఎంటర్‌టైనర్ ఇది. ఈ నెల 24న సినిమాను ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నాం' అని తెలిపారు. తెలుగు టీజర్ ప్రతి ఒక్కరిని అలరిస్తున్నదని, తెలివితేటలు, ధైర్యంతో శత్రువుల్ని ఎదురించే ఓ ప్రత్యేక అధికారి కథ ఇదని, ఈ చిత్రం ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని పంచుతుందని నిర్మాత నవీన్ చెప్పారు. ఈ కార్యక్రమంలో త్యాగరాజన్, అర్జున్ త్యాగరాజన్, వెట్రి, అనిరుధ్ రవిచంద్రన్ పాల్గొన్నారు.

దేశభక్తి నేపథ్యంలో...


మనోజ్‌నందం, ప్రియాసింగ్

మనోజ్ నందం, ప్రియా సింగ్ జంటగా నటిస్తున్న చిత్రం 'మనసైనోడు'. హసీబుద్దిన్ నిర్మాత. సత్యవరపు వెంకటేశ్వర రావు దర్శకుడు. సుభాష్ ఆనంద్ స్వరాలను సమకూర్చిన ఈ చిత్ర గీతాలు ఇటీవల హైదరాబాద్‌లో విడుదలయ్యాయి. చిత్ర గీతాలను గోపీనాథ్‌రెడ్డి ఆవిష్కరించారు. దర్శకుడు మాట్లాడుతూ 'దేశభక్తి, కుటుంబ విలువలతో ముడిపడిన చిత్రమిది. దివంగత రచయిత సి.నారాయణరెడ్డి రాసిన 'జయ జయ జయహే భారతావని...' గీతం సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తుంది. సందేశాత్మక కథాంశంతో తెరకెక్కిన ఈ చిత్రం యువతరాన్ని మెప్పిస్తుంది' అని తెలిపారు. దేశం పట్ల ఉన్న ప్రేమతో తాను నిర్మించిన సినిమా ఇదని, ఆరు పాటలు అద్భుతంగా కుదిరాయని నిర్మాత తెలిపారు.

లండన్ బాబుల హంగామా!


స్వాతి, రక్షిత్

రక్షిత్, స్వాతి జంటగా నటిస్తున్న తాజా చిత్రం 'లండన్ బాబులు'. చిన్నికృష్ణ దర్శకత్వం వహిస్తున్నారు. మారుతి టాకీస్, ఏవీఎస్ స్టూడియోస్ పతాకాలపై మారుతి నిర్మిస్తున్నారు. చిత్రీకరణ పూర్తయింది. మంగళవారం ఈ చిత్రంలోని తొలి పాటని దర్శకుడు హరీష్‌శంకర్, టీజర్‌ను దర్శకనిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ హైదరాబాద్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా మారుతి మాట్లాడుతూ 'దర్శకుడు చిన్నికృష్ణ అండ్ టీమ్ జెన్యూన్‌గా చేసిన ప్రయత్నమిది. కె అందించిన మ్యూజిక్, నేపథ్య సంగీతం సినిమాకు పెద్ద ఎస్సెట్ అవుతుంది. వచ్చే నెల మొదటి వారంలో చిత్రాన్ని విడుదల చేయాలని సన్నాహాలు చేస్తున్నాం. 'ఆండవన్ కట్టాలై' అనే తమిళ చిత్రం నచ్చడంతో స్వీట్ మ్యాజిక్ ప్రసాద్‌గారు ఆ చిత్రాన్ని నన్ను చూడమన్నారు. పక్కా కమర్షియల్‌గా అనిపించింది. ఇది హీరో రక్షిత్‌కు మంచి సినిమా అవుతుందని రీమేక్ చేశాం. పాస్‌పోర్ట్ కోసం పడే కష్టాల్ని ఇందులో చూపించాం. స్వాతి ఈ సినిమాకు ప్లస్ అవుతుంది. ఆమెలో ఓ డైరెక్టర్, రచయిత వున్నారు. ఈ సినిమాను చేయడానికి ఆమె సుముఖత వ్యక్తం చేయడం ఆనందాన్ని కలిగించింది' అన్నారు. 'లండన్ వెళ్లాలనుకునే ఓ యువకుడి కథ ఇది. ప్రతి పాత్రకు ప్రాధాన్యత వుంటుందని దర్శకుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో రక్షిత్, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

ప్రేమ ఎంత మధురం


రాధిక

చంద్రకాంత్, రాధిక మెహరోత్రా జంటగా నటిస్తున్న చిత్రం 'ప్రేమ ఎంత మధురం ప్రియురాలు అంత కఠినం'. గోవర్ధన్ దర్శకుడు. రఘురాం, గోవర్ధన్ నిర్మాతలు. ఈ చిత్ర మోషన్ పోస్టర్‌ను ఇటీవల హైదరాబాద్‌లో నిర్మాత బెక్కెం వేణుగోపాల్ విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'అమెరికా నేపథ్యంలో సాగే అందమైన ప్రేమకథా చిత్రమిది. థ్రిల్లర్, రొమాన్స్ అంశాలకు ప్రాధాన్యముంటుంది. తన ప్రేమను ఓ యువకుడు ఎలా సఫలం చేసుకున్నాడు? ఈ క్రమంలో అతడికి ఎదురైన పరిణామాలతో ఆద్యంతం ఆసక్తికరంగా సాగుతుంది' అని తెలిపారు. తనికెళ్లభరణి, తులసి, పల్లవి దొర ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి నేపథ్య సంగీతం: సిద్దార్థ్ సదాశివుని, సంగీతం: జితిన్ రోషన్.







అక్రమంగా తిష్టవేసిన విదేశీయులపై నిఘా

- సమగ్ర సర్వేతో 12 మంది గుర్తింపు
- పోలీసుల అదుపులో నలుగురు.. మిగితావారు స్వదేశాలకు

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: వీసా గడువు ముగిసినా, సరైన పత్రాలు లేకుండా నగరంలో నివసిస్తున్న విదేశీయులను గుర్తించి వారి స్వదేశానికి పంపించే ప్రక్రియను రాచకొండ కమిషనరేట్ పోలీసులు వేగవంతం చేశారు. ఇందులో భాగంగా గత వారం రోజుల్లో సరైన పత్రాలు లేకుండా నగరంలో నివాసం ఉంటున్న 8 మందిని వారి స్వదేశాలకు సాగనంపారు. ఆఫ్రికా దేశాలకు చెందిన పలువురు నగరంలో అక్రమంగా తిష్ట వేసి నేరాలకు పాల్పడుతున్నట్టు పోలీసులు గుర్తించారు. ఈ అంశంపై సీరియస్‌గా దృష్టి పెట్టి సమగ్ర సర్వే చేపట్టారు. 19 ఆఫ్రికా దేశాలకు చెందిన వారిని గుర్తించేందుకు ఎఫ్ఆర్ఆర్వో అధికారులతో కలిసి లెక్కలు తీయగా, రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మొత్తం 560 మంది విదేశీయులు ఉన్నట్టు తేలింది. వీరిలో 150 మందివి చిరునామాలు ఉన్నా.. వారు అందుబాటులో లేరు. మరో 12 మంది ఆఫ్రికా దేశీయులు వీసా, పాస్‌పోర్ట్ గడువు ముగిసినా అక్రమంగా ఉంటున్నట్టు గుర్తించారు. వీరిలో 8 మందిని ఎఫ్ఆర్ఆర్వో అధికారులతో కలిసి వారి దేశానికి పంపించేశారు. మరో నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. త్వరలో వీరిని కూడా వారి స్వదేశాలకు పంపుతామని సీపీ మహేశ్ భగవత్ తెలిపారు. ఇప్పటివరకు టాంజానియాకు చెందిన బెనార్డ్ నిజాలాలే, మౌరీన్ జాక్సన్, క్రిస్టీనా కిగోడిని, కాంగో దేశానికి చెందిన అర్నాల్డ్ డుంబా, చేరువా అమనీ, అసాము అల్ అమిన్ కబీర్, దక్షిణాఫ్రికాకు చెందిన ఏసీ ఉర్‌హోబా, రువాండాకు చెందిన జీన్ పాల్‌ను స్వదేశాలకు తిప్పి పంపారు. సూడాన్‌కు చెందిన ఇబ్రహీం అల్తాయిబ్, యూసుఫ్ సల్మాన్, నైజీరియాకు చెందిన సామ్యూల్ ఆక్పన్, సేనమ్ ఆండ్రో నేరేడ్‌మెట్, కీసర, జవహర్‌నగర్ పోలీసుల కస్టడీలో ఉన్నారు. వీరిని కూడా స్వదేశాలకు పంపించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. వీరంతా స్టూడెంట్, విజిట్ వీసాలపై వచ్చి ఇక్కడే అక్రమంగా తిష్ట వేశారని చెప్తున్నారు. అక్రమంగా ఉంటున్న విదేశీయుల వివరాలను రాచకొండ పోలీసులు సేకరించారు. వారి కార్యకలాపాలపై నిఘా పెంచారు.


మూడుచింతలపల్లి గ్రామ సభలో మాట్లాడుతున్న సీఐ భాస్కర్‌రెడ్డి

గ్రామానికి ఒకే వినాయక మండపం

మూడుచింతలపల్లి, లక్ష్మాపూర్, తుర్కపల్లిలో తీర్మానం

శామీర్‌పేట: శాంతియుత వాతావరణాన్ని నెలకొల్పేందుకు గ్రామ పంచాయతీలు ముందుకు రావాల్సిన అవసరం ఉన్నదని మేడ్చల్ జిల్లా శామీర్‌పేట సీఐ భాస్కర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శామీర్‌పేట మండలంలోని మూడుచింతలపల్లి, లక్ష్మాపూర్, తుర్కపల్లిల్లో మంగళవారం గ్రామ సభలు నిర్వహించి గ్రామానికి ఒక్క వినాయక మండపం మాత్రమే ఏర్పాటు చేయాలని తీర్మానం చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గ్రామాల్లో యువజన సంఘాలు, గ్రామ పెద్దలు సంఘటితంగా గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో వినాయక మండపాలు ఏర్పాటు చేసుకొని నవరాత్రి ఉత్సవాలను నిర్వహించాలని కోరారు. గ్రామాల్లో కేవలం ఒకే వినాయక మండపం ఏర్పాటు చేస్తూ తీర్మానాలు చేసిన సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, యువజన సంఘాలను సీఐ అభినందించారు. కార్యక్రమంలో మూడుచింతలపల్లి సర్పంచ్ పద్మాలక్ష్మారెడ్డి, ఉపసర్పంచ్ మురళి గౌడ్, గ్రామ పెద్ద మధుసూదన్‌రెడ్డి, లక్ష్మాపూర్‌లో సర్పంచ్ శామల, ఉపసర్పంచ్ నర్సింలు, టీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు చిత్తాగౌడ్, మాజీ ఎంపీపీ సింగం సత్యనారాయణ, బండి జగన్నాథం, శ్రీనివాస్‌గుప్తా, ఆంజనేయులు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి వందనం చేస్తున్న మెట్రోరైలు ఎండీ ఎన్వీఎస్ రెడ్డి

సాకారానికి చేరువగా మెట్రోరైలు

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: నగర ప్రజల మెట్రోరైలు కల త్వరలో సాకారం కానున్నదని మెట్రోరైలు ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. మియాపూర్ నుంచి నాగోల్ వరకు 30 కిలోమీటర్ల మేర ప్రయాణాన్ని నవంబర్ చివరి వరకు అందుబాటులోకి తేవాలని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఆదేశించినట్టు ఆయన పేర్కొన్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం బేగంపేటలోని మెట్రోరైలు భవన్‌లో ఇతర ఉద్యోగులు, సిబ్బందితో కలిసి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. మియాపూర్ నుంచి అమీర్‌పేట వరకు 13 కిలోమీటర్లు, నాగోల్ నుంచి అమీర్‌పేట వరకు 17 కిలోమీటర్ల వరకు మెట్రోరైలు రెండు స్ట్రెచ్‌లను సిద్ధం చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో చీఫ్‌సిగ్నల్ అండ్ టెలికమ్యూనికేషన్స్ ఇంజినీర్ కే లక్ష్మణ్, సూపరింటెండెంట్ ఇంజినీర్ ఎం విష్ణువర్ధన్‌రెడ్డి, జనరల్ మేనేజర్ బీన్ రాజేశ్వర్ ఇంజినీర్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

14 ప్రాంతాల్లో మట్టి వినాయకుల అమ్మకాలు

రేపు శిల్పారామంలో పీసీబీ ఆధ్వర్యంలో మొదటి స్టాల్ ప్రారంభం



హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: పర్యావరణ హిత విగ్రహాలను ప్రోత్సహించేందుకు కాలుష్య నియంత్రణ మండలి(పీసీబీ) గ్రేటర్ హైదరాబాద్‌లోని 14 ప్రాంతాల్లో మట్టి వినాయక విగ్రహాలను అందుబాటులో ఉంచనున్నది. ఈ ప్రాంతాల్లో స్టాళ్లను ఏర్పాటు చేసి విగ్రహాలను విక్రయించనున్నది. గురువారం మాదాపూర్‌లోని శిల్పారామం వద్ద తొలిస్టాల్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఈ స్టాల్‌ను పర్యావరణ, అటవీ, బీసీ సంక్షేమశాఖల మంత్రి జోగు రామన్న ప్రారంభించనున్నారు. మొత్తం 14 స్టాళ్లలో ఇప్పటి వరకు 11 ప్రాంతాలను గుర్తించగా, మిగిలిన మూడు స్టాళ్ల ఏర్పాటుపై త్వరలో నిర్ణయం తీసుకోనున్నారు. ఈ స్టాళ్లను నగరంలోని కోఠి మహిళా కాలేజీ ఎదుట, వైఎంసీఏ గణేశ్ టెంపుల్-మారేడ్‌పల్లి, మెహదీపట్నం రైతుబజార్, అమీర్‌పేట సత్యంథియేటర్, జీడిమెట్ల సుభాష్‌నగర్ బస్టాప్, మల్కాజిగిరి గౌతంనగర్, ఉప్పల్ రింగ్‌రోడ్, మల్లాపూర్ మాణిక్‌చంద్ చౌరస్తా, సనత్‌నగర్ పీసీబీ కార్యాలయం, ఎర్రగడ్డ రైతుబజార్, మాదాపూర్‌లోని శిల్పారామం వద్ద ఏర్పాటు చేయనున్నారు.

దక్షిణ మధ్య రైల్వే
Follow us on @SCRailwayIndia
ద.మ. రైల్వే యొక్క టెండరు ప్రకటనల వివరాలను మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.inలో చూడవచ్చును
ఇ-టెండరు ప్రకటన నం. 02/DEN/LGD/SC/OT/ET-2017-18కు సవరణ
పై ఇ-టెండరు ముగింపు తేదీని 30-08-2017కు బదులుగా 31-08-2017గా చదువుకోవలెను.
డివిజినల్ ఇంజినీర్, క్యారేజ్ వర్క్‌షాప్, లాలాగూడ
తదుపరి టెండరు నిబంధనలు/వివరాల కోసం మరియు టెండరు డాక్యుమెంట్ల డౌన్‌లోడింగ్ కోసం వెబ్‌సైట్ http://www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.in దర్శించండి.

నేను మీ చీఫ్ సర్వెంట్‌ను

- రాష్ట్ర అభివృద్ధికి మక్కాలో దువా చేయండి
- లండన్, పారిస్‌లోని మన ఆస్తులను తీసుకొస్తాం
- హజ్‌యాత్రికుల వీడ్కోలు సభలో సీఎం కేసీఆర్


హజ్ యాత్రికులకు వీడ్కోలు పలికేందుకు హైదరాబాద్‌లోని హజ్‌భవన్‌కు వస్తున్న సీఎం కే చంద్రశేఖర్‌రావు. చిత్రంలో డిప్యూటీ సీఎం మహమూద్ అలీ, రాష్ట్ర మైనారిటీ సంక్షేమశాఖ సలహాదారు ఏకే ఖాన్ తదితరులు


జెండా ఊపి హజ్ యాత్రను ప్రారంభిస్తున్న సీఎం కేసీఆర్. చిత్రంలో డిప్యూటీ సీఎం మహమూద్ అలీ, మేయర్ బొంతు రామ్మోహన్ తదితరులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: 'నేనేమీ గొప్పవాడ్ని కాదు. నేను మీ సర్వెంట్‌ను. మీ సేవకుడిని. చీఫ్ మినిస్టర్ అంటే చీఫ్ సర్వెంట్. నేను యావత్ తెలంగాణ ప్రజల చీఫ్ సర్వెంట్‌ను' అని సీఎం కే చంద్రశేఖర్‌రావు పేర్కొన్నారు. రాష్ట్రం బంగారు తెలంగాణ కావాలని మక్కాలో దువా (ప్రత్యేక ప్రార్థనలు) చేయాలని హజ్ యాత్రికులకు విజ్ఞప్తిచేశారు. సురక్షితంగా హజ్‌యాత్ర నుంచి తిరిగి రావాలని ఆకాంక్షించారు. హజ్‌యాత్రకు వెళ్తున్న యాత్రికుల బృందానికి వీడ్కోలు కార్యక్రమం మంగళవారం హైదరాబాద్‌లోని హజ్‌హౌస్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి సీఎం కేసీఆర్ ముఖ్యఅతిథిగా హాజరై జెండా ఊపి యాత్రను ప్రారంభించా రు. అంతకుముందు యాత్రికులను ఉద్దేశించి మాట్లాడారు. 'మన ఆస్తులు కొన్ని లండన్, పారిస్ నగరాల్లో ఉన్నాయంటున్నారు. వాటిని వెలికితీస్తా. మన ఆస్తులు చాలా ఉండేవి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో బర్బాద్ చేశారు. దేవుడి దయతో ఒక్కొక్కటి వెలికితీసి, వాటిని పరిరక్షిస్తూ నిలదొక్కుకునే ప్రయత్నాలు చేస్తున్నాం. తెలంగాణ ప్రజల జీవితం దేశానికే కాదు, ప్రపంచ దేశాలకే ఆదర్శంగా నిలువాలనేది నా తపన. తెలంగాణ రాష్ట్ర సాధన సమయంలో దేశంలో చాలామంది ప్రత్యేక రాష్ట్రం ఎందుకు కావాలి? అని అడిగారు. వారికి తెలంగాణ గత చరిత్రను, సంస్కృతి, విధానాలను వివరిం చి ఆ తరహా తెలంగాణ మళ్లీ రావాలని కోరుకుంటున్నామని చెప్పాను. ఒక జమానాలో హైదరాబాద్‌కు చెందిన హుజూర్ నిజాం దేశంలోనే కాదు ప్రపంచంలోనే సంపన్న రాజుగా ఉన్నారు. 1964లో చైనాతో జరిగిన యుద్ధం సందర్భంగా మన దేశ ఆర్థిక పరిస్థితి దివాళా తీసింది. అప్పటి ప్రధాని లాల్‌బహదూర్‌శాస్త్రి దేశంలోని రాజులు, ప్రముఖులను ఆర్థికసాయం అందించాలని విజ్ఞప్తిచేశారు. హైదరాబాద్‌కు వచ్చి నిజాంను కోరగా.. దేశంలో ఎవరూ సాయం చేయకపోయినా నిజాం ఆరు టన్నుల బంగారాన్ని అందజేశారు. దీన్ని ఇక్కడి నుంచి ఢిల్లీకి లారీల్లో తరలించారు. ప్రధాని శాస్త్రి ఈ మొత్తాన్ని తిరిగి ఇస్తామని చెప్తే.. దేవుడు నాకు చాలా ఇచ్చాడు.. తిరిగి ఇవ్వాల్సిన అవసరంలేదు. చైనాతో యుద్ధం బాగా చేయండి. తొలుత దేశాన్ని కాపాడుకోండి అని నిజాం చెప్పారు' అని కేసీఆర్ గుర్తుచేశారు. 'ఇది మన షాన్. ఇది మన చరిత్ర. దీన్ని ఉల్టా, పల్టా చేసి చరిత్రలో చూపించారు' అని చెప్పారు. రాష్ట్ర ఆదాయం వృద్ధిరేటులో మిగితా రాష్ట్రాలకంటే ముందున్నామని, 21.7 శాతం వృద్ధి రేటుతో నంబర్ వన్ స్థానంలో ఉన్నామన్నారు. రెండోస్థానంలో ఉన్న ఛత్తీస్‌గఢ్ వృద్ధి రేటు 10.6శాతంతో మనలో సగం ఉన్నదన్నారు. దేవు డు కరుణించాడు కనుకే మనం సంతోషంగా ఉన్నామన్నారు.

అంతర్జాతీయ ప్రమాణాలతో విద్య

మైనారిటీల సంక్షేమానికి వార్షిక బడ్జెట్‌లో ప్రస్తుతం ప్రభుత్వం రూ.1,250 కోట్లు ఇస్తున్నదని, ఇది తన దృష్టిలో చాలా తక్కువని సీఎం పేర్కొన్నారు. వృద్ధి రేటును లెక్కించే ఆర్థిక నిపుణులు కూడా ఇదే చెప్తున్నారన్నారు. 'ఈ రోజు మన రాష్ట్ర వార్షిక బడ్జెట్ 1.5 లక్షల కోట్లు కాగా, 2024 నాటికి ఇది రూ.5 లక్షల కోట్లకు చేరుకుంటుందని వారి అంచనా. అప్పుడు ముస్లింల సంక్షేమం, అభివృద్ధి కోసం వార్షిక బడ్జెట్ రూ.12 వేల కోట్లు కావాల్సిన అవసరం ఉన్నది. మైనారిటీ విద్యార్థుల కోసం 200కుపైగా రెసిడెన్షియల్ స్కూళ్లను ప్రారంభిస్తున్నప్పుడు.. ఒక్కో విద్యార్థిపై ఏడాదికి రూ.1.25 లక్షల ఖర్చు వస్తున్నది. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో వారికి విద్య అందడం సంతోషంగా ఉన్నది. తల్లిదండ్రులు సైతం సంతోషం వ్యక్తంచేస్తున్నారు' అని పేర్కొన్నారు.

యాత్రికులకు మంచి ఏర్పాట్లు

హజ్ యాత్రికులకు తెలంగాణలో మంచి ఏర్పాట్లుచేస్తున్నామని సీఎం కేసీఆర్ చెప్పారు. 'మక్కాలో మన హుజూర్ నిజాం రుబాత్ ఉన్నది. కొంతకాలంగా పట్టించుకోని రుబాత్‌ను.. తెలంగాణ ప్రభుత్వం వచ్చాక అక్కడి నిర్వాహకులతో మాట్లాడి తెరిపించి అభివృద్ధి చేశాం. ఇప్పుడు 1,300 మంది వరకు బస చేయడానికి ఉపయోగపడుతున్నది. 1927లో హైదరాబాద్ వివేకవర్ధని కాలేజీలో జరిగిన కార్యక్రమంలో మహాత్మాగాంధీ పాల్గొని.. ఉత్తర భారతదేశంలో ప్రజలు కొట్లాడుకుంటున్నారని, హైదరాబాద్ ప్రజలు కలిసిమెలిసి ఉన్నారని కొనియాడారు. హైదరాబాద్ వాళ్లను చూసి నేర్చుకుంటే మంచిదని గాంధీ చెప్పారు' అని సీఎం గుర్తుచేశారు.


యాత్రికుల వీడ్కోలు సభలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్

తెలంగాణ ఏర్పాటు కాబోతున్న సమయంలో చాలామంది దుష్ప్రచారం చేశారని, తెలంగాణలో ఎంతో శాంతి ఉన్నదని, దీన్ని మరింత పటిష్ఠం చేస్తూ ఇదే పాలన కొనసాగిస్తామని సీఎం కేసీఆర్ స్పష్టంచేశారు.

ముస్లింలకు సముచిత స్థానం: డిప్యూటీ సీఎం మహమూద్ అలీ
సీఎం కేసీఆర్ పాలనలో తెలంగాణలో ముస్లింలకు సముచిత స్థానం లభిస్తున్నదని డిప్యూటీ సీఎం మహమూద్ అలీ పేర్కొన్నారు. ముస్లింల సంక్షేమానికి ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ఇతర రాష్ట్రాల నుంచి మన రాష్ట్రానికి వచ్చి వెళ్తున్న మంత్రులు, ప్రముఖ సంస్థల ప్రతినిధులు కొనియాడుతున్నారని చెప్పారు. సీఎం ముస్లింల కోసం ఒక మసీహా లాగా పనిచేస్తున్నారని కొనియాడారు. హజ్‌యాత్రికులకు ఏర్పాట్లు కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం, తెలంగాణ హజ్ కమిటీ దేశంలోనే నంబర్ వన్‌గా నిలిచాయని, కేంద్ర హజ్ కమిటీ సభ్యుడు స్వయంగా అంగీకరించడం హర్షణీయమన్నారు. రాష్ట హజ్ కమిటీ స్పెషల్ ఆఫీసర్ ప్రొఫెసర్ ఎస్‌ఏ షుకూర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వక్ఫ్‌బోర్డు చైర్మన్ మహ్మద్ సలీం, టీఎస్‌రెడ్కో చైర్మన్ అలీం, ఎమ్మెల్సీలు ఫరీదుద్దీన్, ఫారుఖ్ హుస్సేన్, ఎమ్మెల్యే మెహెరాజ్ హుస్సేన్, జీహెచ్ఎంసీ మేయర్ బొంతు రామ్మోహన్, స్థానిక కార్పొరేటర్ మమత, ముఫ్తీ తజమ్ముల్ హుస్సేన్, మౌలానా సాబెర్ పాషా, రాష్ట్ర మైనారిటీ సంక్షేమశాఖ సలహాదారు ఏకే ఖాన్, మైనారిటీ సంక్షేమశాఖ కార్యదర్శి ఉమర్ జలీల్ పాల్గొన్నారు.

ఓడీఎఫ్‌గా హైదరాబాద్!

- నేడో, రేపో జీహెచ్ఎంసీ ప్రకటన
- దేశంలోనే మొదటి ఓడీఎఫ్ నగరంగా గుర్తింపు
- స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మరింత మెరుగు

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: త్వరలోనే హైదరాబాద్ 'బహిరంగ మలమూత్ర విసర్జన రహిత (ఓడీఎఫ్) నగరం'గా మారనున్నది. ఈ మేరకు నేడో, రేపో జీహెచ్ఎంసీ అధికారులు ప్రకటన చేయనున్నారు. దీంతో దేశంలోనే మొట్టమొదటి ఓడీఎఫ్‌గా రాష్ట్ర రాజధాని నిలువనున్నది. రాష్ట్ర ప్రభుత్వ సహకారం.. జీహెచ్ఎంసీ అధికారుల కృషి ఫలితంగా ఈ ఘనత దక్కించుకోనున్నది. మరోవైపు స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మన నగర స్థానం మరింత మెరుగు కానున్నది. కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛభారత్ మిషన్‌లో భాగంగా నిర్వహిస్తున్న స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ఓడీఎఫ్‌కు ఎంతో ప్రాముఖ్యత ఉన్నది. గత ఏడాది నిర్వహించిన సర్వేక్షణ్ సర్వేలో వందశాతం ఓడీఎఫ్ సాధించిన నగరాలకు 900 మార్కులుగా నిర్ధారించారు. అప్పుడు హైదరాబాద్‌కు 733 మార్కులు దక్కాయి. అప్పటికి హైదరాబాద్ పరిధిలోని 150 వార్డుల్లో 112 వార్డులను మాత్రమే ఓడీఎఫ్‌గా ప్రకటించడంతో తక్కువ మార్కులు వచ్చాయి. దేశవ్యాప్తంగా సర్వే చేసి విడుదల చేసిన 434 నగరాల జాబితాలో మన రాజధాని నగరానికి 22వ స్థానం దక్కింది. వచ్చే ఏడాది మరోసారి 'స్వచ్ఛ సర్వేక్షణ్-2018' నిర్వహించనున్నారు. ఇందులో లక్ష జనా భా దాటిన 4,041 నగరాలు, పట్టణాల మధ్య పోటీ జరుగనున్నది. గత సర్వేలో వివిధ పారిశుద్ధ్య పనులకు 2,000 మార్కులను నిర్ధారించగా, ఈ సారి 4,000 మార్కులు కేటాయించారు. హైదరాబాద్ ను ఓడీఎఫ్‌గా ప్రకటిస్తే మంచి మార్కులు వస్తాయని అధికారులు చెప్తున్నారు.



రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

హైదరాబాద్‌ను ఓడీఎఫ్‌గా మార్చడంపై రాష్ట్ర ప్రభుత్వం మొదటి నుంచీ ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నది. స్వచ్ఛభారత్ మిషన్‌లో భాగంగా కేంద్రం వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలను ప్రోత్సహిస్తున్నది. ఒక్కో మరుగుదొడ్డి నిర్మాణానికి రూ.12 వేలు మంజూరు చేస్తున్నది. అయితే హైదరాబాద్‌లో దాదాపు 1400 మురికివాడలు ఉన్నట్టు అంచనా. ఇందులో చాలా వరకు రైల్వే ట్రాక్‌లు, ప్రభుత్వ స్థలాల్లో ఉన్నాయి. ఇవన్నీ చిన్నచిన్న గుడిసెలు, కచ్చా ఇండ్లతో నిండి ఉన్నాయి. ఇక్కడ నివసించే వారికి వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకునే అవకాశాలు చాలా తక్కువగా ఉంటాయి. మరుగుదొడ్డి కట్టుకునేంత స్థలం లేకపోవడం ఒక సమస్య కాగా, ఆ ఇండ్లకు అనుమతులు లేకపోవడంతో అధికారికంగా మరుగుదొడ్లు మంజూరు చేయడం కుదురదు. ఈ సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించి పరిష్కారం చూపింది. రైల్వే ట్రాక్‌ల వెంబడి, ప్రభుత్వ స్థలాల్లో ఇండ్లు నిర్మించుకున్న వారు మరుగుదొడ్లు కట్టుకునేందుకు ముందుకు వస్తే అనుమతి ఇచ్చింది. స్థల సమస్య ఉన్న ప్రాంతాల్లో సామూహిక మరుగుదొడ్లు నిర్మించింది. దీంతో జీహెచ్ఎంసీ అధికారులు నగరంలోని వివిధ ప్రాంతాల్లో సర్వే చేసి నివేదిక ఆధారంగా మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టారు. మరుగుదొడ్ల నిర్మాణానికి మురికివాడల నుంచి 2,800 దరఖాస్తులు వచ్చాయి. వీటితోపాటు పలుచోట్ల సామూహిక మరుగుదొడ్ల నిర్మాణానికి అనుమతులు ఇచ్చారు. ఇప్పుడు అవన్నీ పూర్తయినట్టు అధికారులు తెలిపారు. రాజేంద్రనగర్ సర్కిల్ హనుమాన్‌నగర్, భూపాల్‌రెడ్డి నగర్ తదితర ప్రాంతాల్లోని వివాదాస్పద స్థలాల్లో మురికివాడలు ఉన్నాయి. దీంతో అక్కడ ప్రీ ఫ్యాబ్రికేటెడ్ టాయిలెట్లు నిర్మించారు. మొత్తంగా 150 వార్డుల్లో అవసరమైన అన్నిచోట్లా మరుగుదొడ్ల నిర్మాణం పూర్తయిందని, ఒకటి రెండు రోజుల్లో హైదరాబాద్‌ను ఓడీఎఫ్‌గా ప్రకటించే అవకాశం ఉన్నదని అధికారులు వివరించారు.


స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా సికింద్రాబాద్ అడ్డగుట్టలో 'తిరంగా ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్' ఆధ్వర్యంలో 800 అడుగుల జాతీయ జెండాను ప్రదర్శించారు. నార్త్ జోన్ డీసీపీ సుమతి ముఖ్యఅతిథిగా పాల్గొని ఈ ర్యాలీని ప్రారంభించారు. - అడ్డగుట్ట

మరో 1620 'డబుల్' ఇండ్లకు నేడు శంకుస్థాపన

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: డబుల్ బెడ్‌రూం ఇండ్ల పథకంలో భాగంగా మరో 1,620 ఇండ్లకు బుధవారం గ్రేటర్ పరిధిలోని కుత్బుల్లాపూర్ మండలం డీ పోచంపల్లిలో పురపాలక, ఐటీశాఖల మంత్రి కే తారకరామారావు శంకుస్థాపన చేయనున్నారు. గ్రేటర్‌లో పేదలకోసం ఈ ఏడాది లక్ష డబుల్ బెడ్‌రూం ఇండ్లను నిర్మించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఇప్పటివరకు 58 వేల ఇండ్లకు టెండర్ల ప్రక్రియ పూర్తికాగా, 28 వేల ఇండ్ల నిర్మాణం ప్రారంభమైంది. 37 కాలనీల్లో పనులు వివిధ దశల్లో ఉన్నాయి. తాజాగా డీ పోచంపల్లిలో మరో 1,620 ఇండ్ల నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన చేస్తున్నారు. మొత్తం ఏడు ఎకరాల విస్తీర్ణంలో 11 బ్లాకుల్లో తొమ్మిది అంతస్తుల భవనాలను నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధంచేశారు.

టీఎస్ ట్రాన్స్‌కో యాప్

విద్యుత్ డిమాండ్ తెలుసుకునేందుకు రూపకల్పన

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ స్టేటస్ తెలుసుకునేందుకు వీలుగా టీఎస్ ట్రాన్స్‌కో 'తెలంగాణ విద్యుత్ శక్తి' పేరుతో యాప్‌ను రూపొందించింది. ఆండ్రాయిడ్ ఫోన్లలో గూగుల్ ప్లేస్టోర్, ఐవోఎస్ ఫోన్లలో యాప్ స్టోర్ ద్వారా ఉచితంగా ఇన్‌స్టాల్ చేసుకునేందుకు వీలు కల్పించారు. టీఎస్‌ట్రాన్స్‌కో సీఎండీ డీ ప్రభాకర్‌రావు సూచన మేరకు విద్యుత్ సమాచారం తెలుసుకునేలా యాప్‌ను అభివృద్ధి చేసినట్టు అధికారులు తెలిపారు. యాప్‌ను మొబైల్‌లో ఇన్‌స్టాల్ చేసుకున్న వారు జిల్లాలవారీగా విద్యుత్ డిమాండ్, వినియోగం వంటి వివరాలు తెలుసుకునే అవకాశం ఉంటుంది. అన్నివర్గాలవారికి అర్థమయ్యే రీతిలో వివరాలు పొందుపరిచినట్టు ట్రాన్స్‌కో డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ అండ్ గ్రిడ్ ఆపరేషన్) జీ నర్సింగరావు తెలిపారు.

'కిలిమంజారో' ఎక్కిన తెలంగాణ బిడ్డ

బేగంబజార్: హైదరాబాద్ నిజాం కాలేజీ విద్యార్థి దక్షిణాఫ్రికాలోని కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించారు. బీఏ ఫైనల్ ఇయర్ చదువుతున్న ఆనంద్ 5,595 మీటర్ల (19,341 అడుగులు) ఎత్తుతో ప్రపంచంలోనే అతిపెద్ద స్టాండింగ్ మౌంటేన్‌గా పేరుగాంచిన కిలిమంజారో పర్వత శిఖరంపైకి చేరి తెలంగాణ కీర్తిని చాటారు. ఈ పర్వతాన్ని అధిరోహించడానికి బయలు దేరిన 13 మంది సభ్యుల బృందంలో ఆనంద్ ఒకరు. ఆనంద్ పర్వతాన్ని అధిరోహించిన తర్వాత వంద అడుగుల జాతీయ పతాకంతో పాటు సీఎం కే చంద్రశేఖర్‌రావు చిత్ర పటాన్ని, ప్రభుత్వ లోగో, నిజాం కళాశాల లోగో ఉన్న పతాకాన్ని ఆవిష్కరించారు. ఆనంద్ 2014లో ఎవరెస్ట్‌ను అధిరోహించారు. ఈ సందర్భంగా ఆనంద్‌ను నిజాం కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సయ్యద్ రహమాన్, వైస్ ప్రిన్సిపాల్ బాల బ్రహ్మచారి అధ్యాపకులు అభినందించారు.



కిలిమంజారో పర్వతంపై సీఎం కేసీఆర్ చిత్రపటంతో ఆనంద్

శంషాబాద్‌లో థ్రిల్లింగ్ మాక్‌డ్రిల్

- స్వాతంత్ర్య వేడుకల్లో భాగంగా భద్రతా దళాల విన్యాసం
- హైజాక్, ఉగ్రదాడులను తిప్పికొట్టడంలో సామర్థ్యంపై సమీక్ష

శంషాబాద్: హైదరాబాద్ శంషాబాద్‌లోని రాజీవ్‌గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు ఏయిర్‌సైడ్ ఏరియా.. ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు.. సిబ్బంది ఎవరి విధుల్లో వారున్నారు.. ఇంతలో హఠాత్తుగా ఉగ్రవాదులు చొరబడి విమానాన్ని హైజాక్ చేసేందుకు ప్రయత్నించారు. అంతే ప్రయాణికుల అరుపులు, కేకలు, హాహాకారాలతో భయానక వాతావరణం నెలకొన్నది. వెంటనే ఎయిర్‌పోర్ట్ భద్రతాబలగాలు, అధికార యంత్రాంగం, ఫైర్, మెడికల్, ఇతర విభాగాల సిబ్బంది అప్రమత్తమయ్యారు. అందరిలోనూ తీవ్ర ఉత్కంఠ. భద్రతా సిబ్బంది వెంటనే పక్కా వ్యూహంతో, సాహసంతో దూసుకుపోయి ఉగ్రవాదుల నుంచి ప్రయాణికులను రక్షించారు.. ఇది 71వ భాతర స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో భాగంగా మంగళవారం శంషాబాద్ ఎయిర్‌పోర్టులో జరిగిన ఘటన. అయితే ఇదంతా నిజంకాదు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నిర్వహించిన 'యాంటీ హైజాక్ మాక్‌డ్రిల్'. భద్రతా దళాలు ఎమర్జెన్సీ ఎక్సర్‌సైజ్‌లో భాగంగా నిర్వహించిన ఈ మాక్‌డ్రిల్ అందరినీ ఆకట్టుకున్నది. ఏఏఐ, బీసీఏఎస్, క్విక్ రెస్పాన్స్ టీం, సీఐఎస్ఎఫ్, బాంబ్, డాగ్ స్క్వాడ్ తదితర భద్రతా వర్గాలు కలిపి సంయుక్తంగా మాక్‌డ్రిల్‌ను విజయవంతంగా పూర్తి చేశారు. కొంతకాలంగా ఉగ్రదాడులు, విమాన ప్రమాదాలు పెరిగాయి. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో ఇలాంటి అనూహ్య పరిణామాలు సంభవిస్తే ఎలా ఎదుర్కోగలుగుతారు? భద్రతా దళాల సామర్థ్యం ఎంత? ఏయే శాఖలు ఎలా స్పందిస్తాయి.. వంటి అంశాలు తెలుసుకోవాలన్న ఐసీఏవో, డీజీసీఏ, ఇతర నిఘా వర్గాల సూచన మేరకు ఈ మాక్‌డ్రిల్ నిర్వహించారు. దీనిని నిపుణులు, ఉన్నతాధికారులు పర్యవేక్షించారు. సిబ్బందికి తగు సూచనలు ఇచ్చారు.


మాక్‌డ్రిల్‌లో భాగంగా బస్సును తనిఖీ చేస్తున్న భద్రతా దళాలు



మంగళవారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన పంద్రాగస్టు వేడుకల్లో పాల్గొన్న డిప్యూటీ సీఎం మహమూద్ అలీ, హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి తదితరులు

అభివృద్ధి నిరోధకులు.. ప్రతిపక్ష నేతలు

హోంశాఖ మంత్రి నాయిని విమర్శ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సాగునీటి ప్రాజెక్టులను అడుగడుగునా అడ్డుకుంటూ ప్రతిపక్ష నేతలు అభివృద్ధి నిరోధకులుగా మారారని రాష్ట్ర హోంశాఖ మంత్రి నాయిని నర్సింహారెడ్డి విమర్శించారు. మంగళవారం స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా తెలంగాణభవన్‌లో డిప్యూటీ సీఎం మహమూద్ అలీతో కలిసి జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా నాయిని మాట్లాడుతూ పేదల సంక్షేమానికి సీఎం కేసీఆర్ అనేక పథకాలు చేపట్టారని అన్నారు. అభివృద్ధిని చూసి ఓర్వలేకనే విపక్షాలు రాద్ధాంతం చేస్తున్నాయని మండిపడ్డారు. ప్రతిపక్ష పార్టీల నేతలను ప్రజలు నిలదీయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పోలీస్ హౌసింగ్ బోర్డు కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్, టీఆర్‌ఎస్ కార్మిక విభాగం అధ్యక్షుడు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



మంగళవారం అసెంబ్లీ ఆవరణలో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న స్పీకర్ మధుసూదనాచారి



శాసనమండలి ఆవరణలో జాతీయ జెండాను ఆవిష్కరించి వందనం చేస్తున్న డిప్యూటీ చైర్మన్ విద్యాసాగర్

ఉత్తమ సేవలకు సన్మానం

పలువురికి అవార్డులు, పురస్కారాలు ప్రదానం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: విధి నిర్వహణలో ఆదర్శంగా నిలిచిన పలువురు అధికారులను స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు సన్మానించారు. విభాగాలవారీగా ఎంపికచేసిన అధికారులకు అవార్డులను బహూకరించారు. ప్రభుత్వ ప్రజాహిత కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు అవిరాళంగా కృషిచేసిన ఆల్ ఇండియా సర్వీస్ అధికారులకు అవార్డులు ప్రదానం చేశారు. కేసీఆర్ కిట్ల పథకాన్ని సక్సెస్ చేయడంలో విశేష కృషిచేసిన వాకాటి కరుణ, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలను సమర్థంగా నిర్వహిస్తున్నందుకు ఐపీఎస్ అధికారి ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్, పౌరసరఫరాల వ్యవస్థను గాడిన పెట్టినందుకు సీవీ ఆనంద్, మైనారిటీ గురుకుల పాఠశాలలను విజయవంతంగా నిర్వహిస్తున్నందుకు ఐఎఫ్‌ఎస్ అధికారి ఎండీ షఫీవుల్లాను సీఎం సన్మానించి పురస్కారాలు అందజేశారు. సాహిత్యరంగంలో విశేష కృషిచేసిన సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ, పాటల రచయిత జయరాజ్, సంస్కృత భాషా పండితుడు విజయసారథిలకు సీఎం విశిష్ట సాహిత్య పురస్కారాలను అందజేశారు. హరితమిత్రలుగా నిలిచిన పలువురితోపాటు, ఇతర విభాగాల వారికి సీఎం అవార్డులను ప్రదానం చేశారు.

అవార్డులు అందుకున్నవారి వివరాలు
పోలీసు పతకాలు అందుకున్నవారు..

1. **ఇండిపెండెన్స్ డే -2016 ప్రెసిడెంట్ పోలీసు మెడల్ గ్రహీతలు**
- **అంజనీకుమార్,** ఐపీఎస్ (అదనపు డీజీపీ శాంతి భద్రతలు)
- **రాజీవ్‌రతన్,** ఐపీఎస్ (డైరెక్టర్ జనరల్ అగ్నిమాపకశాఖ)

2. **రిపబ్లిక్ డే -2016 ప్రెసిడెంట్ పోలీసు మెడల్ గ్రహీతలు**
- **ఎన్ సూర్యనారాయణ,** ఐపీఎస్ (విశ్రాంత- ఓఎస్డీ, డీఐజీ వీఅండ్‌ఈశాఖ)
- **ఎం శివప్రసాద్,** ఐపీఎస్ (అడిషనల్ పోలీసు కమిషనర్ సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్)

3. రిపబ్లిక్ డే - 2015 ఇండియన్ పోలీసు మెడల్ గ్రహీతలు
- **టీ శరత్‌బాబు** (విశ్రాంత-అడిషనల్ ఎస్పీ సీఐడీ హైదరాబాద్)
- **నీలగిరి దివ్య చరణ్‌రావు,** అడిషనల్ డీసీపీ (ట్రాఫిక్ విభాగం)
- **టీ సుదర్శన్,** డీఎస్పీ, ఏసీబీ కరీంనగర్
- **ఉప్పు తిరుపతి,** ఏసీపీ మహంకాళి పోలీస్‌స్టేషన్, సికింద్రాబాద్
- **మదాడి రమణకుమార్,** ఏసీపీ మాదాపూర్, సైబరాబాద్
- **మాదంశెట్టి వెంకట్రావు,** ఆర్‌ఐ ఐఎస్‌డబ్ల్యూ, హైదరాబాద్
- **పట్లోళ్ల మధుసూదన్‌రెడ్డి,** ఎస్‌ఐ, ఎస్‌ఐబీ, ఇంటెలిజెన్స్, హైదరాబాద్
- **శవలి ప్రేమ్‌రాజ్,** (రిటైర్డ్) ఏఎస్‌ఐ, కమ్యూనికేషన్, ఐఎస్‌డబ్ల్యూ, హైదరాబాద్
- **సయ్యద్ యూసపుద్దీన్,** ఆర్‌ఎస్‌ఐ డీపీటీసీ నల్లగొండ
- **గజ్జెల లక్ష్మయ్య,** హెచ్‌సీ 1868, ఎస్‌బీ సైబరాబాద్
- **అన్ను దామోదర్‌రెడ్డి,** హెచ్‌సీ 1969, కౌంటర్ ఇంటెలిజెన్స్ సెల్, హైదరాబాద్
- **సిద్ధా సదానందం,** ఏఆర్‌పీసీ 2583 డీఏఆర్ వరంగల్

4 **ఇండిపెండెన్స్ డే - 2016 శౌర్యపతకాలు**
- **డీ సిద్ధయ్య,** ఎస్‌ఐ (మరణానంతరం)
- **సీ నాగరాజు,** పీసీ 3004 (మరణానంతరం) నల్లగొండ

1. **సాంస్కృతిక విభాగం**
- **సుద్దాల అశోక్ తేజ,** సినీ గేయ రచయిత
- **జయరాజ్,** పాటల రచయిత
- **శ్రీభాష్యం విజయసారథి,** సంస్కృత భాషా పండితుడు

2. **తెలంగాణ స్టేట్ ఇన్సెంటివ్ అవార్డులు**
- **జె రమేశ్,** డిప్యూటీ డీఎంహెచ్‌వో, ఆర్మూర్, నిజామాబాద్
- **గ్రూప్-1:** డాక్టర్ సీహెచ్ మధుసూదన్, అసోసియేట్ ప్రొఫెసర్, ఉస్మానియా మెడికల్ కళాశాల; సురేశ్‌బాబు, డీపీవో, సిద్దిపేట; పీడబ్ల్యూ జాన్సన్, డీఆర్డీవో, వికారాబాద్.
- **గ్రూప్-2:** ఖానాపూర్ చంద్రకళ - ఆర్డీవో హైదరాబాద్; జీ విశ్వనాథం గుప్తా - హెడ్‌మాస్టర్, రంగారెడ్డి; రమీజుద్దీన్ అహ్మద్, మండల్ ప్లానింగ్ అండ్ స్టాటిస్టికల్ ఆఫీసర్, పెద్దపల్లి.
- **గ్రూప్-3:** ఎం జయమ్మ - స్టాఫ్‌నర్స్, మహబూబ్‌నగర్; కే ప్రకాశ్, పంచాయతీ సెక్రటరీ, వరంగల్ రూరల్; డీ శంకర్‌కుమార్, పీఏ టు సీపీఆర్‌వో, ఐఅండ్‌పీఆర్.
- **గ్రూప్-4:** బీ దశరథ, సైకిల్ ఆర్డర్లీ, ఉమెన్ అండ్ సీడీ; కే గంగయ్య, ఆఫీస్ సబార్డినేట్, కామారెడ్డి; కే కిష్టయ్య, ఆఫీస్ సబార్డినేట్, యాదాద్రి.

3. **హరితమిత్ర అవార్డులు**
వై శేఖర్‌రెడ్డి, పీపుల్స్ రిప్రజెంటేటివ్, వరంగల్ (రూరల్), **పెద్ది సుదర్శన్ రెడ్డి;** పీపుల్స్ రిప్రజెంటేటివ్, వరంగల్ (రూరల్); **సీ శ్రీధర్‌రావు,** డిస్ట్రిక్ట్ ఫారెస్ట్ ఆఫీసర్, సిద్దిపేట; **ఎంపీపీఎస్,** మురపల్లి, జగిత్యాల; అటవీశాఖ, జనరల్ మేనేజర్, ఎస్సీసీఎల్, రామగుండం-1, ఏరియా పెద్దపల్లి.

4. **సోషల్‌వర్కర్ అండ్ స్కౌట్స్ అండ్ గైడ్స్**
పీ బసంత్‌రెడ్డి, సోషల్‌వర్కర్ (గల్ఫ్ సమస్యలు), మనోహరాబాద్, నిజామాబాద్; భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో ఎక్కువ కాలం సేవలు అందించినందుకుగాను జీ పరమేశ్వర్ (ఎస్‌వోసీ (ఎస్)- హైదరాబాద్), జీ లక్ష్మీనారాయణ (వైస్‌ప్రెసిడెంట్- కరీంనగర్), ఎం రాజగోపాల్ (స్టేట్‌ట్రెజరర్, హెడ్‌క్వార్టర్స్- హైదరాబాద్), ఏ సుగుణా రాజేంద్రం (ఎస్టీసీ (జీ), స్టేట్ హెడ్‌క్వార్టర్స్-హైదరాబాద్), టీ వెంకట లక్ష్మి (మహబూబ్‌నగర్).

5. **స్కూల్ ఎడ్యుకేషన్**
తెలంగాణ స్టేట్ రెసిడెన్షియల్ స్కూల్ (గర్ల్స్) తాటిపల్లి, మల్యాల్ మండలం, జగిత్యాల; జెడ్పీ హైస్కూల్, మిరాడపల్లి, ఆర్మూర్ మండలం, నిజామాబాద్

6. **ప్రత్యేక మెమెంటో- ఒడిశా స్టేట్‌పోలీసు కంటింజెంట్**

రేపటి నుంచి మూడు రోజులు భారీవర్షాలు

మొదటిపేజీ తరువాయి...

కురుస్తాయని వారు పేర్కొన్నారు. గురువారం నుంచి వానలు మరింత పుంజుకునే అవకాశం ఉన్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అన్నిప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన ఓ మోస్తరు వర్షాలు, అక్కడక్కడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని తెలియజేశారు. కాగా సోమవారం ఉదయం నుంచి మంగళవారం ఉదయం వరకు ధర్మపురిలో 5 సెం.మీ., బోథ్, చేవెళ్ల, లక్సెట్టిపేటల్లో 2 సెం.మీ. చొప్పున వర్షపాతం నమోదైంది.



ఔటర్ లోపలి గ్రామాలకు జలసిరులు

183 గ్రామాలు, ఏడు నగరపాలక సంస్థల పరిధిలో పట్టణ భగీరథ పనులు

రూ.628 కోట్లతో పనులకు జలమండలి శ్రీకారం ▪ నేడు శంకుస్థాపన చేయనున్న మంత్రి కేటీఆర్

ఏడాదిలో పనుల పూర్తికి గడువు నిర్దేశం ▪ ప్రాజెక్టు పూర్తయితే 10 లక్షల జనాభాకు జలఫలాలు

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: హైదరాబాద్ ఔటర్ రింగ్‌రోడ్డు పరిధిలో ఉన్న గ్రామాల తాగునీటి కష్టాలకు త్వరలో శాశ్వత పరిష్కారం లభించనున్నది. రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల పరిధిలోని 183 గ్రామ పంచాయతీలు, ఏడు నగరపాలక సంస్థల పరిధిలో సమృద్ధిగా తాగునీరు అందనున్నది. అర్బన్ మిషన్ భగీరథలో భాగంగా జలమండలి రూ. 628 కోట్లతో తాగునీటి పథకానికి శ్రీకారం చుట్టింది. సంస్థ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా తొలిసారి యాన్యుటీ విధానంలో (పూర్తిగా ప్రైవేటు నిధులు) చేపడుతున్న ఈ పనులను మెగా ఇంజినీరింగ్ సంస్థ దక్కించుకున్నది. ఈ ప్రాజెక్టు చేసిన వ్యయాన్ని ఏడేండ్ల వ్యవధిలో ఆ సంస్థకు చెల్లించేలా జలమండలి ఒప్పందం కుదుర్చుకున్నది. మొత్తం రూ.1,145 కోట్లను మెగా ఇంజినీరింగ్‌కు చెల్లించనున్నారు. ఈ ప్రాజెక్టులో ప్రధానంగా 1990 కిలోమీటర్ల మార్గంలో తాగునీటి పైపులైన్లు, 410 స్టోరేజ్ రిజర్వాయర్లను నిర్మించనున్నారు. ఏడాదిలోగా ఈ పనులను పూర్తిచేయాలన్న లక్ష్యంతో రంగంలోకి దిగిన అధికారులు.. ప్రాజెక్టు ద్వారా పది లక్షల జనాభాకు రోజూ 30 మిలియన్ గ్యాలన్ల నీటి సరఫరా చేయనున్నారు. నూతనంగా 1,50,000 నల్లా కనెక్షన్లు మంజూరు చేయనున్నట్లు అధికారులు అంచనా వేశారు. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు ఇప్పటికే రూ. 1900 కోట్లు ఖర్చు చేసి జీహెచ్‌ఎంసీలో విలీనమైన 12 మున్సిపాలిటీల ప్రజలకు అధికారులు తాగునీరు అందిస్తున్నారు. తాజాగా ఔటర్ లోపలి గ్రామాలకు సమృద్ధిగా తాగునీరు అందించే ప్రాజెక్టును చేపట్టడం రాష్ట్ర ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనంగా నిలుస్తున్నది. ఈ ప్రాజెక్టులో భాగంగా నిర్మించతలపెట్టిన కొంపల్లి, షాపూర్‌నగర్‌లోని రిజర్వాయర్ల నిర్మాణ పనులను రాష్ట్ర ఐటీ, పురపాలకశాఖల మంత్రి కే తారక రామారావు బుధవారం ప్రారంభించనున్నారు.

అర్బన్ మిషన్ భగీరథ ప్రాజెక్టు విశేషాలు

ప్రాజెక్టు వ్యయం	:	రూ.628కోట్లు
లబ్ధి పొందే గ్రామాలు	:	183
మున్సిపాలిటీలు	:	ఏడు
మండలాలు	:	12
జిల్లాలు	:	రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి
ఓవర్‌హెడ్ సర్వీసు రిజర్వాయర్లు	:	398
ఓవర్‌హెడ్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లు	:	12
ట్రంక్ మెయిన్స్ పైపులైన్ పొడవు	:	285 కిలోమీటర్లు
డిస్ట్రిబ్యూషన్ మెయిన్స్ పొడవు	:	1712కిలోమీటర్లు
లబ్ధి పొందే జనాభా	:	10 లక్షలు
ప్రస్తుత నీటి సరఫరా	:	రోజుకు ఏడు మిలియన్ గ్యాలన్లు
ప్రాజెక్టు పూర్తయితే నీటి సరఫరా	:	రోజుకు 30 మిలియన్ గ్యాలన్లు
ప్రాజెక్టు పనుల నిర్దేశిత గడువు	:	ఏడాది
కొత్తగా వచ్చే నల్లా కనెక్షన్లు (అంచనా)	:	1,50,000

పకడ్బందీ చర్యలు

భవిష్యత్‌లో కూడా మెరుగైన నీటి సరఫరాయే లక్ష్యంగా అర్బన్ మిషన్ భగీరథ పనులను చేపట్టాలని జలమండలి ఎండీ దానకిశోర్ నిర్ణయించారు. 183 గ్రామాల్లో ప్రస్తుతం సరఫరా అవుతున్న నీటి సరఫరా, డిమాండ్ తదితర స్థితిగతులపై అధ్యయనం చేశారు. ఇందులో భాగంగానే ఏ గ్రామంలో ఎంత పైపులైన్ వేయాలి? ఎక్కడ రిజర్వాయర్ నిర్మాణం చేపట్టాలి? భవిష్యత్‌లో తాగునీటికి ఢోకా లేకుండా చేయడంతోపాటు జనాభాకు అనుగుణంగా నీటి సరఫరా ఎలా ఉండాలన్న అంశాలను ప్రాతిపదికగా తీసుకున్నారు. సివిల్, మెకానికల్ విభాగాల్లో ఇంజినీరింగ్ చివరి సంవత్సరం చదువుతున్న సుమారు 60 మంది విద్యార్థులకు గూగుల్ మ్యాప్, ప్రత్యేక ప్రొఫార్మాలను అందజేసి వాటి సహాయంతో గ్రామగ్రామాన క్షేత్రస్థాయి సర్వే నిర్వహించారు. గ్రామాల్లో అందుబాటులో ఉన్న గ్రౌండ్ లెవల్, ఎలివేటెడ్ స్టోరేజ్ రిజర్వాయర్లు, ప్రస్తుతం ఉన్న మంచినీటి కనెక్షన్లు, జనాభా, నెలవారీగా ఆ పంచాయతీ చెల్లిస్తున్న నీటి బిల్లులు, పంచాయతీ పరిధిలోని కాలనీలు, మంచినీటి సరఫరా వ్యవస్థ లేని ప్రాంతాలు, విస్తరిస్తున్న కాలనీలు, ప్రస్తుత నీటి సరఫరా వ్యవస్థలో భాగస్వాములైన లైన్‌మెన్లు, నీటిని పంపింగ్ చేసేందుకు అందుబాటులో ఉన్న మోటర్లు, పవర్ బోర్లు, గ్రామ విస్తీర్ణం, వాల్వ్‌ల సంఖ్య, ప్రస్తుతం అందుబాటులో ఉన్న పైప్‌లైన్ల నిడివి, నూతనంగా ఏర్పాటు చేయాల్సిన నిడివి, ఆయా ప్రాంతాల వాసులకు రోజూ నీళ్లందించేందుకు తీసుకోవాల్సిన చర్యలు, స్థానికుల అభిప్రాయాలను సేకరించిన విద్యార్థులు ప్రత్యేక నివేదికలను రూపొందించి జలమండలికి అందజేశారు. ఈ నివేదిక ఆధారంగా పనులను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

20 చోట్ల పట్టాలెక్కిన పనులు

పైపులైన్ విస్తరణ, రిజర్వాయర్ల నిర్మాణానికి అనుకూలంగా ఉన్నచోట్ల పనులను ఇటీవల మొదలు పెట్టారు. ఉప్పల్‌పల్లి, హకీంపేట, గండిగూడెం, సుల్తాన్‌పూర్, కిష్టారెడ్డిపేట్, పటేల్‌గూడ, ఇల్లాపూర్, కుత్బుల్లాపూర్ మండలంలోని బౌరంపేట, ఇబ్రహీంపట్నం మండలంలోని ఆదిబట్ల గ్రామాల్లో రిజర్వాయర్ల నిర్మాణ పనులు మొదలయ్యాయి.

మండలాలవారీగా పనుల వివరాలు

కుత్బుల్లాపూర్‌లో రూ.79.49 కోట్లు, మేడ్చల్‌లో రూ. 6.40 కోట్లు, శామీర్‌పేట రూ.96.72 కోట్లు, కీసర రూ. 55.18 కోట్లు, ఘట్‌కేసర్ రూ.71.21 కోట్లు, హయత్‌నగర్ రూ. 29.08 కోట్లు, ఇబ్రహీంపట్నం రూ. 2.26 కోట్లు, మహేశ్వరం రూ.10.94 కోట్లు, సరూర్‌నగర్ రూ. 117.76 కోట్లు, శంషాబాద్ రూ. 23.07 కోట్లు, రాజేంద్రనగర్‌లో రూ.28.88 కోట్లు, పటాన్‌చెరువు, ఆర్సీపురంలో రూ.44.53 కోట్లతో పనులు చేపడుతున్నారు.

సమృద్ధిగా నీరందించడమే మా లక్ష్యం



సుజలాం-సుఫలాం అనే నినాదంతో ముందుకువెళ్తున్నాం. ప్రభుత్వ ఆదేశాలు, మంత్రి కేటీఆర్ సూచనల ప్రకారం ప్రజలకు తాగునీరు అందించడమే లక్ష్యంగా పథకాలు చేపడుతున్నాం. ఇప్పటికే రికార్డు సమయంలో శివారు తాగునీటి విస్తరణ పనులను పూర్తి చేసి 12 మున్సిపాలిటీల ప్రజల దాహార్తిని తీర్చాం. ఇదే స్ఫూర్తితో ఔటర్ లోపలి గ్రామాల ప్రజల దాహార్తిని ఏడాదిలోగా తీర్చాలని టార్గెట్ పెట్టుకుని పనులు చేపడుతున్నాం. ఈ పథకం కింద 10 లక్షల మంది జనాభాకు పట్టణ భగీరథ జలఫలాలు అందిస్తాం.

– దానకిశోర్, జలమండలి ఎండీ

భూసర్వే ఎలా చేద్దాం?

ఫొటోగ్రఫీ, డీజీపీఎస్, లైడార్‌సర్వేల్లో ఏ విధానం మంచిది?

అధికారులతో సీఎం కేసీఆర్ సమాలోచనలు ▪ 19న రెవెన్యూశాఖ సమీక్షలో తుది నిర్ణయం

తరువాత 3500 మంది అధికారులతో ముఖాముఖి సమావేశం!



హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

భూమి సమస్యలు లేని తెలంగాణ కావాలి.. రాష్ట్రంలో భూముల లెక్కలన్నీ పక్కాగా ఉండాలి.. సమాచారం అంతా పారదర్శకంగా ఉండాలని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు అభిలషిస్తున్నారు. ఇందుకోసం ఎలాంటి చర్యలు తీసుకోవాలి? సమగ్ర భూసర్వే-రికార్డుల కోసం ఫొటోగ్రఫీ, డీజీపీఎస్, లైడార్‌లలో ఎలాంటి పద్ధతులు అవలంబించాలనే విషయాలపై ఆలోచించాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. ఆదేశించడమే కాదు ఆయన స్వయంగా వారితో విస్తృతస్థాయిలో చర్చిస్తున్నారు. ఈ విషయమై ఈ నెల19న రెవెన్యూశాఖ సమీక్షలో సీఎం కేసీఆర్ తుది నిర్ణయం తీసుకోనున్నారు. ఈ సమావేశంలో తీసుకునే నిర్ణయాల ప్రకారమే సర్వే విధివిధానాల రూపకల్పన జరుగుతుందని, తరువాత 3500 మంది అధికారులతో ఆయన ముఖాముఖి సమావేశమై దిశానిర్దేశం చేయనున్నారని తెలిసింది. సమైక్య రాష్ట్రంలో 28 ఏండ్లుగా జమాబందీ జరుగకపోవడంతో రికార్డులు తారుమారయ్యాయి. ముఖ్యంగా హైదరాబాద్ నగరానికి సమీపంలో ఉన్న జిల్లాల్లోని భూములను అక్రమార్కులు కాజేశారు. ప్రభుత్వ భూములు, సీలింగ్, సర్ఫేఖాస్, కాందిశీకుల భూములు, గురుకుల్ ట్రస్ట్, భూదాన్, అసైన్డ్ భూములు.. ఇలా వివిధ రకాలుగా ప్రజా ప్రయోజనాలకు ఉపయోగించాల్సిన భూములను తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి కబ్జా చేశారు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తరువాత కూడా మియాపూర్‌లోని విలువైన భూములు కాజేసేందుకు ప్రయత్నించారు. ఇలాంటి దందాలకు పూర్తిస్థాయిలో ఫుల్‌స్టాప్ పడాలంటే.. ఏ భూమి ఎవరిదనే విషయంలో నక్షతో సహా స్పష్టంగా రూపొందించాల్సిన అవసరం ఉన్నదని సీఎం కేసీఆర్ భావిస్తున్నారు. ఈ మేరకు సమగ్ర భూసర్వే చేయాలని, రికార్డులన్నీ ఆధునీకరించాలని ఆదేశించారు. ఈ మేరకు అవుట్‌లైన్స్ ఇచ్చారు. ఇందుకు చేపట్టాల్సిన కార్యక్రమాన్ని రూపొందించడానికి రంగారెడ్డి జిల్లా కలెక్టర్ రఘునందన్ చైర్మన్‌గా కమిటీని నియమించారు. ఈ కమిటీ ఇప్పటికే కసరత్తు ప్రారంభించింది. ముఖ్యంగా గ్రామ ప్రజలు, రైతు సంఘాల సమక్షంలోనే నవీకరణ జరుగాలని సీఎం సూచించారు. ఈ పనుల కోసం మూడు గ్రామాలకు ఒక రెవెన్యూ అధికారిని నియమించాలని చెప్పారు. గ్రామాన్ని యూనిట్‌గా తీసుకొని సర్వే చేయాలన్నారు. సమగ్ర భూసర్వేపై ఉన్నతస్థాయి అధికారులతో మరోసారి కూడా సీఎం కేసీఆర్ సమాలోచనలు చేసి సర్వేకు ఏవిధానం అవలంబిస్తే లెక్కలు కరెక్టుగా వస్తాయి? ఎలా అయితే సర్వే త్వరగా పూర్తవుతుందని అడిగినట్లు తెలిసింది. వ్యవసాయానికి పెట్టుబడి కింద రైతులకు రూ.8 వేలు ఇచ్చే కార్యక్రమాన్ని సర్వే తరువాతనే ప్రారంభించాలని, కాబట్టి ఎట్టి పరిస్థితుల్లోనూ సర్వేను మూడు నెలల్లో పూర్తి చేయాలని సీఎం నిర్దేశించినట్లు సమాచారం. కాగా, ఫొటోగ్రఫీ, డిఫరెన్షియల్ గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్ (డీజీపీఎస్), లైడార్ అనే మూడు పద్ధతుల్లో సర్వే చేయవచ్చునని అధికారులు తెలిపారు. లైడార్ పద్ధతిలో మొత్తం సర్వేను 45 రోజుల్లో పూర్తి చేయవచ్చునని, డీజీపీఎస్ ద్వారా అయితే ఎక్కువ మిషన్లు కొనాల్సి వస్తుందని, ఒక్కో మిషన్‌కు కనీసం ముగ్గురు నుంచి నలుగురు సిబ్బంది అవసరమని వివరించారు. ఫొటోగ్రఫీ విధానంలో పనులకు చాలా సమయం పడుతుందని, కొలతల్లో చాలా తేడాలు వచ్చే అవకాశం ఉన్నట్లు వారు తెలిపారు. ఏ పద్ధతుల్లో సర్వే చేపట్టినా, మొదట కాంక్రీట్ పిల్లర్లతో కంట్రోల్ పాయింట్లను నిర్మించాలి. సర్వే ఆఫ్ ఇండియాకు చెందిన 130 కంట్రోల్ పాయింట్లు ఇప్పటి వరకున్నాయి. వాటిని బేస్ చేసుకొని గ్రామ గ్రామానికి కంట్రోల్ పాయింట్లు ఏర్పాటు చేయాల్సి ఉంటుందని వారు సీఎంకు తెలియజేశారంటున్నారు.



మంగళవారం హైకోర్టులో జాతీయ జెండా ఆవిష్కరించి వందనం చేస్తున్న తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్‌రంగనాథన్

లౌకికతత్వానికి మారుపేరు వల్లభ్‌భాయ్ పటేల్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: లౌకికతత్వం విషయంలో మహాత్మాగాంధీ ఆశయాలకు సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ నిజమైన శిష్యుడని ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్‌రంగనాథన్ పేర్కొన్నారు. హైకోర్టులో మంగళవారం ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో తెలంగాణ అడ్వకేట్ జనరల్ దేశాయ్ ప్రకాశ్‌రెడ్డి, తెలంగాణ హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు జెల్లి కనకయ్య, హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తులు, ప్రస్తుత న్యాయమూర్తులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

అనేక మైలురాళ్లు దాటాం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఇప్పటికే అనేక మైలురాళ్లు దాటామని, వాటి నుంచి స్ఫూర్తిపొంది మరింత ముందుకువెళ్లాలని జెన్‌కో సీఎండీ డీ ప్రభాకర్‌రావు పిలుపునిచ్చారు. మంగళవారం స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా విద్యుత్ సౌధలో త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. సీఎం కేసీఆర్ మార్గనిర్దేశం, ముందుచూపుతో విద్యుత్ రంగం గణనీయంగా అభివృద్ధి చెందిందని సీఎండీ పేర్కొన్నారు. మూడేండ్ల క్రితం 6574 మెగావాట్ల స్థాపిత విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంతో ఉన్న రాష్ట్రాన్ని నేడు 13095 మెగావాట్లకు చేర్చామన్నారు. దీనికి అదనంగా మరో 15149 మెగావాట్ల విద్యుత్ ప్రాజెక్టులు వివిధ దశల్లో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో జెన్‌కో, ట్రాన్స్‌కో ఉన్నతాధికారులతోపాటు, విద్యుత్‌సౌధ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.



మంగళవారం విద్యుత్‌సౌధలో జాతీయ జెండాకు వందనం చేస్తున్న జెన్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు

• ఢిల్లీ తెలంగాణ భవన్‌లో పంద్రాగస్టు వేడుకలు



న్యూఢిల్లీ, నమస్తే తెలంగాణ: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మంగళవారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఘనంగా జరిగాయి. ప్రిన్సిపల్ రెసిడెంట్ కమిషనర్ అరవింద్‌కుమార్‌జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా మదర్సాలో అనాథ పిల్లలకు మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి కేఎం సహానీ, తెలంగాణభవన్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మంగళవారం టీఎన్జీవో భవన్‌లో జాతీయ జెండాను ఎగురవేసిన కారం రవీందర్‌రెడ్డి. చిత్రంలో టీఎన్జీవో ప్రధాన కార్యదర్శి మామిండ్ల రాజేందర్, సహాధ్యక్షుడు మందాడి ఉపేందర్‌రెడ్డి, ట్రెజరర్ బండారు రేచల్, నగర అధ్యక్షుడు ఆర్ ప్రతాప్ తదితరులు



టీజీవో కార్యాలయంలో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవంలో పాల్గొన్న సంఘం అధ్యక్షురాలు మమత, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎంబీ కృష్ణయాదవ్, నగర అధ్యక్షుడు గండూరి వెంకటేశ్వర్లు, కార్యదర్శి వెంకటయ్య తదితరులు

రిలయన్స్‌పై 1700 కోట్ల పెనాల్టీ



న్యూఢిల్లీ, ఆగస్టు 15:

ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్(ఆర్ఐఎల్), దాని భాగస్వాములు బీపీ, నికోపై కేంద్ర ప్రభుత్వం తాజాగా 26.4 కోట్ల డాలర్ల (దాదాపు రూ.1,700 కోట్లు) జరిమానా విధించింది. 2015-16 ఆర్థిక సంవత్సరానికి కేజీ బేసిన్‌లోని డీ6 బ్లాక్ నుంచి లక్ష్యానికంటే తక్కువ గ్యాస్ ఉత్పత్తి చేసినందుకు గాను గుత్తేదారు సంస్థలపై ప్రభుత్వం ఈ పెనాల్టీ విధించింది. దీంతో ఏప్రిల్ 1, 2010 నుంచి గడిచిన ఆరేండ్లలో రిలయన్స్, బీపీ, నికోపై విధించిన మొత్తం జరిమానా 302 కోట్ల డాలర్లకు చేరుకుందని పెట్రోలియం మంత్రిత్వ శాఖ తెలిపింది. ఉత్పత్తి పంపిణీ ఒప్పందం (పీఎస్‌సీ) ప్రకారంగా.. ప్రధాన గుత్తేదారు ఆర్ఐఎల్ దాని భాగస్వాములైన బీపీ, నికో సంస్థలు కేజీబేసిన్ డీ6 బ్లాక్ గ్యాస్‌ను విక్రయించగా వచ్చిన లాభాలను ప్రభుత్వంతో పంచుకునేముందు అందులోంచి క్షేత్ర అభివృద్ధి, నిర్వహణకయ్యే ఖర్చులను మినహాయించుకునేందుకు వీలుంటుంది. అయితే, ప్రభుత్వ విధించిన జరిమానా విలువకు సమానమైన ఖర్చులను లాభాల నుంచి మినహాయించుకునే అవకాశాన్ని సంస్థలు కోల్పోతాయి. తద్వారా కేజీ బేసిన్ గ్యాస్ విక్రయం ద్వారా ప్రభుత్వానికొచ్చే లాభాల వాటా పెరుగుతుంది.గుత్తేదారు వ్యయ ఖర్చుల మినహాయింపుల్లో కొంత మొత్తానికి అనుమతివ్వకుండా ప్రభుత్వం అదనంగా 17.5 కోట్ల డాలర్ల లాభాలను క్లెయిమ్ చేసుకోవడం జరిగిందని అధికారి ఒకరు తెలిపారు.
పీఎస్‌సీ ప్రకారంగా.. కేజీ డీ6 బ్లాక్‌లోని ధీరూభాయ్ 1,3 క్షేత్రాల నుంచి రోజుకు 80 మెట్రిక్ మిలియన్ స్టాండర్డ్ క్యూబిక్ మీటర్ల (ఎంఎంఎస్‌సీఎండీ) గ్యాస్‌ను ఉత్పత్తి చేయాలి. 2011-12 ఆర్థిక సంవత్సరంలో రిలయన్స్ రోజుకు సగటున 35.33 ఎంఎంఎస్‌ఎండీ గ్యాస్‌ను మాత్రమే ఉత్పత్తి చేయగలిగింది. 2012-13లో ఉత్పత్తి 20.88 ఎంఎంఎస్‌సీఎండీ, 2013-14లో 9.77 ఎంఎంఎస్‌సీఎండీగా నమోదైంది. ఆ తర్వాత ఆర్థిక సంవత్సరాల్లో మరింత తగ్గుతూ వచ్చి ప్రస్తుతం 4ఎంఎంఎస్‌సీఎండీల దిగువకు పడిపోయింది. పీఎస్‌సీలో అలాంటి నిబంధనేం లేదంటూ గతంలో ప్రభుత్వం విధించిన పెనాల్టీను కోర్టులో సవాలు చేసిన ఆర్ఐఎల్, బీపీ, నికో సంస్థలు.. ఆ తర్వాత అంతర్జాతీయ మధ్యవర్తిత్వ కోర్టును కూడా ఆశ్రయించాయి. కేంద్ర ప్రభుత్వం 2010-11లో 45.7 కోట్ల డాలర్ల మేర ఖర్చులను మినహాయించుకునేందుకు నిరాకరించింది. 2011-12లో 54.8 కోట్ల డాలర్లు, 2012-13లో 79.2 కోట్ల డాలర్లు, 2013-14లో 57.9 కోట్ల డాలర్లు, 2014-15లో 38 కోట్ల డాలర్లు, 2015-16లో మరో 26.4 కోట్ల డాలర్ల ఖర్చుల మినహాయింపునకు కేంద్రం నిరాకరించింది. గడిచిన ఆర్థిక సంవత్సరంలోనూ గ్యాస్ ఉత్పత్తి లక్ష్యం కంటే తగ్గింది. కాబట్టి ఎంత మేర ఖర్చులను నిరాకరించాలనేది వచ్చే ఏడాదిలో లెక్కించనున్నారు. కేజీ డీ6 బ్లాక్‌లో రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు 60 శాతం వాటా ఉండగా.. బ్రిటన్‌కు చెందిన చమురు దిగ్గజం బీపీకి 30 శాతం, కెనడాకు చెందిన నికోకు 10 శాతం వాటా ఉంది.

కోడిగుడ్ల ధరలు

	నెక్	హెచ్‌ఎల్‌ఎఫ్‌ఏ
హైదరాబాద్	351-00	351-00
రంగారెడ్డి	351-00	351-00
మెదక్	351-00	351-00
కరీంనగర్	353-00	---
వరంగల్	353-00	---
రిటైల్ ప్రైస్	4-10	4-10

చికెన్ ధరలు

ఫారం ధర	72.00
రిటైల్ లైవ్	86.00
డ్రెస్డ్	120.00
స్కిన్‌లెస్	142.00

బిల్‌గేట్స్ భూరి విరాళం

గేట్స్ ఫౌండేషన్‌కు రూ.29,500 కోట్ల విలువైన 6.4 కోట్ల మైక్రోసాఫ్ట్ షేర్లు దానం



న్యూయార్క్, ఆగస్టు 15: ప్రపంచ కుబేరుడు, మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్ మరోసారి భూరి విరాళం ఇచ్చారు. తన వ్యక్తిగత చారిటీ సంస్థ బిల్ అండ్ మిలిండా గేట్స్ ఫౌండేషన్‌కు 460 కోట్ల డాలర్ల (దాదాపు రూ.29,500 కోట్లు) విలువైన 6.4 కోట్ల మైక్రోసాఫ్ట్ షేర్లను జూన్ 6న దానం చేశారు. సోమవారం యూఎస్ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్ ఫైలింగ్‌ల ద్వారా ఈ విషయం వెల్లడైంది. 1999లో బిల్‌గేట్స్ ఈ ఫౌండేషన్‌ను ప్రారంభించారు. అప్పుడు 1,600 కోట్ల డాలర్లు విరాళంగా ఇచ్చారు. తర్వాత ఏడాదిలో (2000 సంవత్సరంలో) మరో 510 కోట్ల డాలర్లు దానం చేశారు. ఆ తర్వాత బిల్ అండ్ మిలిండా గేట్స్‌కు ఇచ్చిన అతి పెద్ద విరాళం ఇదే. ఇప్పటివరకు బిల్‌గేట్స్ 5వేల కోట్ల డాలర్లకు పైగా విరాళాలు ఇచ్చారు. తాజా విరాళం తర్వాత మైక్రోసాఫ్ట్‌లో బిల్‌గేట్స్ వాటా 2.3 శాతం నుంచి 1.3 శాతానికి తగ్గింది.

9 వేల మంది.. 92 వేల కోట్లు!

ప్రభుత్వ రంగ బ్యాంకుల డిఫాల్టర్లు, వారు ఎగవేసిన బకాయిలు

న్యూఢిల్లీ, ఆగస్టు 15: గడిచిన ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వ రంగ బ్యాంకులకు (పీఎస్‌బీ) ఉద్దేశపూర్వక రుణ ఎగవేతదారుల (డిఫాల్టర్) బకాయిలు మరింత పెరిగాయి. ఈ ఏడాది మార్చి చివరినాటికి దాదాపు 9 వేల మంది డిఫాల్టర్లు పీఎస్‌బీలకు చెల్లించాల్సిన బకాయిలు రూ.92,376 కోట్లకు చేరుకున్నాయి. మార్చి 2016 చివరికల్లా డిఫాల్టర్ల బకాయిలు రూ.76,685 కోట్లుగా ఉన్నాయి. ఏడాదికాలంలో డిఫాల్టర్ల సంఖ్య 10 శాతం మేర పెరుగగా.. వారి బకాయిలు 20.4 శాతం పెరిగాయి. ఆర్థిక శాఖ వద్దనున్న సమాచారం ప్రకారం.. గత ఏడాది మార్చిలో పీఎస్‌బీలకు రుణం ఎగవేసిన వారి సంఖ్య 8,167గా ఉండగా.. ఈ ఏడాది అదే నెలలో 8,915కు చేరుకుంది. వీరిలో 1,914 మంది చెల్లించాల్సిన రూ.32,484 కోట్ల బకాయిలకు సంబంధించి బ్యాంకులు ఇప్పటికే కేసులు కూడా ఫైల్ చేశాయి. దేశంలో ఎస్‌బీఐ, దాని అనుబంధ బ్యాంకులతోపాటు మిగతా పీఎస్‌బీలన్నీ కలిసి 2016-17 ఆర్థిక సంవత్సరంలో రూ.81,683 కోట్ల రుణ బకాయిలను రద్దు చేశాయి. గడిచిన ఐదేండ్లలో రద్దు చేసిన బకాయిల్లో ఇదే అతిపెద్ద మొత్తం. 2015-16తో పోలిస్తే 41 శాతం అధిక బకాయిలను రద్దు చేశాయి. అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకైన ఎస్‌బీఐ, దానిలో విలీనమైన అనుబంధ బ్యాంకులే గతసారి రూ.27,574 కోట్ల బకాయిలను రద్దు చేశాయి. ఈ ఏడాది ఏప్రిల్ 1న ఎస్‌బీఐ, దాని ఐదు అనుబంధ బ్యాంకులతోపాటు భారతీయ మహిళా బ్యాంక్‌ను తనలో విలీనం చేసుకుంది.
ఈ ఏడాది మార్చి 31నాటికి పీఎస్‌బీల స్థూల నిరర్థక ఆస్తులు (గ్రాస్ ఎన్‌పీఏ) రూ.6.4 లక్షల కోట్లకు చేరుకున్నాయి. గత సంవత్సరంలో ఇదే సమయానికి రూ.5.02 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. ఉద్దేశపూర్వకంగా రుణాల ఎగవేతకు చెక్ పెట్టేందుకు ఆర్బీఐ నిబంధనలను మరింత పటిష్ఠం చేసింది. ఏదేని కంపెనీ డిఫాల్ట్ అయితే దాని ప్రమోటర్ కూడా బాధ్యత వహించాల్సి ఉంటుందని, ఆ వ్యక్తి సంస్థ బోర్డులో శాశ్వత కాల డైరెక్టర్ కాకపోయినా ఈ నిబంధన వర్తిస్తుందని ఆర్బీఐ స్పష్టం చేసింది. రుణ బకాయిలను తిరిగి చెల్లించే సామర్థ్యం ఉండి కూడా తప్పించుకోవడం, రుణ నిధులను మళ్లించడం, రుణ ఒప్పందం నిబంధనలకు కట్టుబడి ఉండకపోవడం, బ్యాంక్‌కు తెలియకుండా తనఖా ఆస్తులను విక్రయించడం వంటి చర్యలకు పాల్పడినప్పుడు ఆ ఖాతాదారుడిని డిఫాల్టర్‌గా పరిగణిస్తారు. ఉద్దేశపూర్వక రుణ ఎగవేతదారుల పేర్లు, ఫొటో, ఇతర వివరాలతో పత్రికల్లో ప్రకటనలు జారీ చేయడం ద్వారా వారిని పరువును బజారుకీడ్చేందుకు సైతం ఆర్బీఐ బ్యాంకులకు అనుమతిచ్చింది.



meil
Megha Engineering & Infrastructures Ltd

నదుల అనుసంధానంలో 'మేఘా' రికార్డు

హైదరాబాద్, ఆగస్టు 15: మౌలిక రంగానికి చెందిన ప్రముఖ సంస్థ మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (ఎంఈఐఎల్) మరో రికార్డును సాధించింది. నదుల అనుసంధానానికి సంబంధించి అనతికాలంలో మూడు ప్రాజెక్టులను పూర్తిచేసి తన రికార్డును తానే అధిగమించింది. దేశంలో మొట్టమొదటిసారిగా నదుల అనుసంధాన ప్రక్రియను పూర్తి చేసిన ఘనత ఎంఈఐఎల్‌దే. తొలిసారిగా చేపట్టిన మధ్యప్రదేశ్‌లోని 'నర్మద-క్షిపర-సింహస్థ'(ఎన్‌కేఎస్) ప్రాజెక్టు 2014లో పూర్తయిందని.. గడిచిన మూడేండ్ల కాలంలో మరో రెండు నదుల అనుసంధాన ప్రాజెక్టులను పూర్తి చేసినట్లు ఎంఈఐఎల్ తెలిపింది. అందులో పట్టిసీమ ప్రాజెక్టును అతి తక్కువ కాలంలో పూర్తిచేసి లిమ్కా బుక్ ఆఫ్ రికార్డుల్లోకి ఎక్కినట్లు సంస్థ వెల్లడించింది. తాజాగా గోదావరి-ఏలేరు నదుల అనుసంధానాన్ని స్వాతంత్ర్య దినోత్సవం నాడు ఏపీ సీఎం చంద్రబాబునాయుడు లాంఛనంగా ప్రారంభించారు. ప్రాజెక్టు మొదటి దశలో భాగంగా తూర్పు గోదావరి జిల్లా సీతానగరం మండలంలోని పురుషోత్తపట్నం వద్ద ఏర్పాటు చేసిన రెండు మోటర్లను నాయుడు స్విచ్‌ఆన్ చేసి పంపింగ్ ప్రారంభించారని సంస్థ తెలిపింది.

ఎల్‌పీజీ..కిరోసిన్.. ఆభరణాలు..కరెన్సీ

మొత్తం 153 వస్తువుల సరఫరాకు జీఎస్టీ ఈ-వే బిల్లు నుంచి మినహాయింపు



న్యూఢిల్లీ, ఆగస్టు 15: తరుచుగా ఉపయోగించే పలు వస్తువులు లేదా ఉత్పత్తుల రవాణాకు జీఎస్టీ ఈ-వే బిల్లు నిబంధన నుంచి మినహాయింపునిచ్చారు. అందులో వంటగ్యాస్ (ఎల్‌పీజీ), కిరోసిన్, ఆభరణాలు, కరెన్సీ కూడా ఉన్నాయి. జూలై 1 నుంచి అమలులోకి వచ్చిన వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) చట్టం ప్రకారం.. రూ.50 వేల కంటే విలువ చేసే సరుకును రవాణా చేసేందుకు ఎలక్ట్రానిక్ వే బిల్లు (ఈ-వే బిల్లు) పొందడం తప్పనిసరి. పన్నుల ఎగవేతను నియంత్రించడంతోపాటు సరుకు రవాణాలో పారదర్శకత పెంచేందుకు కేంద్రం జీఎస్టీ హయాంలో ఈ-వే బిల్లు విధానాన్ని ప్రవేశపెట్టింది. ఈనెల 5న కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ అధ్యక్షతన జరిగిన జీఎస్టీ మండలి సమావేశంలో 153 రకాల వస్తువుల సరఫరాకు ఈ-వే బిల్లు నుంచి మినహాయింపునివ్వాలని నిర్ణయించారు. ఈ విషయాన్ని ఆర్థిక మంత్రిత్వ శాఖకు చెందిన సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. ఆ జాబితాలో పశువులు, పందులు, చేపలు, కూరగాయలు, తాజా పాలు, తేనె, విత్తనాలు, తృణధాన్యాలు, పిండి ఉన్నాయి. అలాగే, తమలపాకులు, సారాయేతర మద్యము (కల్లు), ముడి పట్టు, ఖాదీ, మట్టి కుండ, మట్టి దీపాలు, పూజ సామాగ్రి, వినికిడి సహాయ పరికరాలు, మానవుల వెంట్రుకలు, వీర్యం, కండోమ్‌లు, గర్భనిరోధకాలకు సైతం మినహాయింపు లభించింది. అలాగే, వంటగ్యాస్, రేషన్ షాపుల్లో విక్రయించే కిరోసిన్, కరెన్సీ, వ్యక్తిగత అవసరాలకు ఉపయోగించే ఆభరణాలకు సైతం ఈ-వే బిల్లు అక్కర్లేదు. నాన్-మోటర్ వాహనాల ద్వారా సరుకు రవాణాకు సైతం ఈ-వే బిల్లు మినహాయింపు లభించింది. అంతర్జాతీయ నౌకాశ్రయాల నుంచి అంతర్వేరు నౌకాశ్రయాలకు కస్టమ్స్ అనుమతుల కోసం సరుకు రవాణాకు సైతం ఈ-వే బిల్లు అవసరం లేదు. ఈ-వే బిల్లు విధానం అక్టోబర్ నుంచి మొదలు కావచ్చు. అయితే, ప్రభుత్వం ఇంకా అధికారికంగా నోటిఫై చేయాల్సి ఉంది.

ఈ రెండేండ్లు 7.4% వృద్ధి

డాయిష్ బ్యాంక్ అంచనా



న్యూఢిల్లీ, ఆగస్టు 15: ప్రైవేట్ పెట్టుబడుల పునరుద్ధరణతో భారత ఆర్థిక వృద్ధి పుంజుకోనుందని, ఈ ఏడాదితోపాటు వచ్చే సంవత్సరం సగటు వాస్తవిక వృద్ధిరేటు (రియల్ జీడీపీ) 7.4 శాతంగా నమోదుకావచ్చని డాయిష్ బ్యాంక్ తాజా నివేదికలో అంచనా వేసింది. ముమ్ముందు సంవత్సరాల్లో సాధించబోయే 7.5-8 శాతం వృద్ధిని 2006-2008 మధ్యకాలంలో నమోదైన వృద్ధితో పోల్చడం సరికాదని బ్యాంక్ అంటున్నది. 2008 అంతర్జాతీయ ఆర్థిక మాంద్యం తర్వాత ఆర్థిక వ్యవస్థలో కనిష్ఠ వృద్ధి, కనిష్ఠ ద్రవ్యోల్బణ వాతావరణం చోటు చేసుకుందని రిపోర్టులో పేర్కొంది. ఇప్పుడు 7.5-8 శాతం వృద్ధి .. 2008 ఆర్థిక మాంద్యం ముందు నమోదైన 9-10 శాతం స్థాయి వృద్ధితో సమానమని అంటున్నది. ఈ ఏడాది మార్చితో ముగిసిన త్రైమాసికంలో వృద్ధిరేటు 6.1 శాతానికి పతనమైంది. దాంతో గత ఆర్థిక సంవత్సరం (2016-17) మొత్తానికి జీడీపీ 7.1 శాతానికి పరిమితమైంది.

ఈసారి జీడీపీలో 1.2 శాతానికి క్యాడ్: యూబీఎస్

అంతర్జాతీయ సంక్షోభాల ప్రభావ తీవ్రత తగ్గిన నేపథ్యంలో 2017-18 ఆర్థిక సంవత్సరానికి భారత్ కరెంట్ ఖాతా లోటు (క్యాడ్) జీడీపీలో 1.2 శాతానికి పరిమితం కావచ్చని యూబీఎస్ రిపోర్టు అంచనా వేసింది. వచ్చే ఆర్థిక సంవత్సరంలో (2018-19) 1.4 శాతానికి పెరుగవచ్చని అంటున్నది. అంతర్జాతీయ ఆర్థిక సేవల దిగ్గజం నివేదిక ప్రకారం.. ఇప్పటికీ భారత ఆర్థిక వ్యవస్థపై గ్లోబల్ సంక్షోభాల ప్రభావం ఉన్నప్పటికీ గడిచిన ఐదేండ్లలో తీవ్రత తగ్గుతూ వస్తున్నదని పేర్కొంది. 2012-13 ఆర్థిక సంవత్సరంలో 4.8 శాతానికి పెరిగిన క్యాడ్.. గతసారి (2016-17) 0.7 శాతానికి తగ్గింది. ముడిచమురు, పసిడి దిగుమతులు క్రమంగా తగ్గుతూ రావడంతో గడిచిన ఐదేండ్లలో లోటు కూడా తగ్గుతూ వచ్చింది.

20 వేల ఎకరాల ఆయకట్టుకు భరోసా



ట్రయల్‌రన్‌లో భాగంగా ఖమ్మం జిల్లాలోని పాలేరు ప్రాజెక్టు నుంచి కాల్వకు విడుదలవుతున్న నీరు

- పాలేరు కాల్వను ఆధునీకరించిన ప్రభుత్వం
- రూ.63 కోట్లతో మూడు నెలల్లోనే పనుల పూర్తి
- త్వరలో ప్రారంభోత్సవం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: దశాబ్దాలుగా ఆదరణకు నోచుకోకుండా అధ్వానంగా మారిన ఖమ్మం జిల్లాలోని పాలేరు కాల్వను ప్రభుత్వం పునరుద్ధరించింది. సాగర్ పాతకాల్వగా కూడా పేర్కొనే ఈ కాల్వను కేవలం మూడు నెలల వ్యవధిలోనే ఆధునీకరించి 20 వేల ఎకరాల ఆయకట్టుకు భరోసా కల్పించింది. కొత్త రూపం సంతరించుకున్న కాల్వ ఇటీవలే ట్రయల్‌రన్ కూడా పూర్తి చేసుకొని పునః ప్రారంభానికి సిద్ధంగా ఉంది. నిజాం కాలంలో తవ్విన ఈ కాల్వ నిర్వహణ సక్రమంగా లేక, గండ్లు పడి, వంతెనలు, యూటీలు ధ్వంసమై దాదాపు శిథిలావస్థకు చేరింది. నీళ్లు సక్రమంగా పారక రైతులు ఎన్నో ఏండ్లుగా అరిగోస పడుతున్నారు. సమైక్య రాష్ట్రంలో పాలకులు పట్టించుకోలేదు. పాలేరు జలాశయానికి, నాగార్జునసాగర్‌కు అనుసంధానంగా నిజాం కాలంలో ఈ కాల్వను నిర్మించారు. 320 క్యూసెక్కుల ప్రవాహ సామర్థ్యంతో 23.5 కిలోమీటర్ల మేర నిర్మించిన ఈ కాల్వ ద్వారా ఖమ్మం జిల్లా కూసుమంచి, నేలకొండపల్లి మండలాల్లో సుమారు 20వేల ఎకరాలకు సాగునీరు అందాలి. దీనిపై ఆధారపడి ఈ రెండు మండలాల రైతులు వరి, చెరుకు, మక్కజొన్న, మిరప, తదితర పంటలను సాగు చేస్తారు.పాలేరు జలాశయంపై ఏర్పాటు చేసిన నాలుగు షెట్టర్ల ద్వారా ఈ కాల్వకు నీటి సరఫరా జరుగుతుంది. పలు గ్రామాల మీదుగా కాల్వ పోతున్న దరిమిలా పలు చోట్ల వంతెనలు, పది ప్రాంతాల్లో వాగులపై యూటీ (అండర్ టన్నెల్స్) నిర్మించారు. ఇంజినీర్ నవాబ్ అలీజంగ్ బహదూర్ 1924లో రూపొందించిన డిజైన్ ఇది. కాలక్రమేణా నిర్వహణ లేకపోవడంతో ఈ కాల్వ అస్తవ్యస్తంగా తయారైంది. 320 క్యూసెక్కులకుగాను 200 క్యూసెక్కులు కూడా సక్రమంగా ప్రవహించని పరిస్థితి. దీంతో చివరి ఆయకట్టు రైతులకు నీరందక పంటలు ఎండబెట్టుకోవాల్సి వచ్చేది. స్వరాష్ట్రం వచ్చిన తర్వాత తెలంగాణ ప్రభుత్వం దీనిపై దృష్టి సారించింది. ఖమ్మం జిల్లాకు చెందిన మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఈ కాల్వ ఆధునీకరణపై ప్రత్యేక చొరవ చూపారు. ప్రభుత్వం రూ.68 కోట్లు మంజూరు చేసింది. ఈ ఏడాది ఫిబ్రవరి 16న రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి హరీశ్‌రావుతో కలిసి మంత్రి తుమ్మల పనులు ప్రారంభించారు. ఏప్రిల్ నుంచి జోరందుకున్న పనులు జూలై నాటికి పూర్తయ్యాయి. 23.5 కిలోమీటర్ల లైనింగ్, బెడ్ కాంక్రీట్ పనులు చేయించారు. 32 తూములు, కొత్తగా 9 యూటీల నిర్మాణం, రెండు వంతెనలు (డబుల్ లైన్) నిర్మించారు. దీంతో పాలేరు పాత కాల్వ కొత్త రూపాన్ని సంతరించుకుంది. ఈ నెల 12న అధికారులు ట్రయల్ రన్ నిర్వహించారు. పాలేరులోకి పూర్తిస్థాయిలో నీళ్లు రాగానే 20వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు రంగం సిద్ధం చేశారు. ఆధునీకరించిన కాల్వ ప్రారంభోత్సవం కోసం 23.5 అడుగుల ఎత్తున పైలాన్ నిర్మించారు. త్వరలో ప్రారంభోత్సవం జరుగనున్నది.

అంతర్రాష్ట్ర బదిలీల మార్గదర్శకాలపై

స్పష్టత ఇవ్వాలి

తెలంగాణ ఉద్యోగ సంఘాలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: అంతర్రాష్ట్ర బదిలీల మార్గదర్శకాలను స్పష్టంగా జారీ చేయాలని తెలంగాణ ఉద్యోగ సంఘాలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాయి. మార్గదర్శకాలపై ఉద్యోగుల్లో ఉన్న సందేహాలను నివృత్తి చేయాలని ఉద్యోగసంఘాల నేతలు కోరారు. పరస్పర బదిలీల్లో దరఖాస్తు చేసుకున్నవారి విజ్ఞాపనలను ఏ విధంగా పరిశీలిస్తారు? ఏపీ నుంచి తెలంగాణకు వచ్చే జోనల్, మల్టీజోనల్ క్యాడర్ ఉద్యోగుల దరఖాస్తులను ఏ విధంగా పరిశీలిస్తారు? మరోసారి రెండు రాష్ట్రాల సీఎస్‌లు ఎప్పుడు సమావేశమవుతారనే అంశాలపై ఇరురాష్ట్రాల సీఎస్‌లు స్పష్టత ఇవ్వాలని టీఎన్జీవో అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. శాఖాధిపతి కార్యాలయాల ద్వారా రీ-ఆర్గనైజేషన్ సెల్‌కు వచ్చిన దరఖాస్తులను పరిశీలించి వేగంగా నిర్ణయాలు తీసుకోవాలని టీజీవో ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ కోరారు.

NCL INDUSTRIES LTD.
NCL GROUP
4th Floor, Vaishnavi's Cynosure, Near Gachibowli Flyover, Gachibowli, Hyderabad – 500032
CIN: L33130TG1979PLC002521 www.nclind.com

EXTRACT OF UNAUDITED STANDALONE FINANCIAL RESULTS FOR THE QUARTER ENDED 30TH JUNE 2017

(₹ in Lakhs)

PARTICULARS	Quarter ended 30.06.2017	Quarter ended 31.03.2017	Quarter ended 30.06.2016	Year ended 31.03.2017
	Unaudited	Audited	Unaudited	Audited
Total Revenue from Operations(Net)	22,750.55	23,667.43	19,261.89	88,480.02
Net Profit for the period (before tax and Exceptional items)	2,472.84	1,521.67	1,127.86	6,165.78
Net Profit for the period before tax (after Exceptional items)	2,472.84	1,521.67	1,127.86	6,165.78
Net Profit for the period after tax (after Exceptional items)	1,626.47	1,468.88	913.17	5,472.99
Total Comprehensive Income (Net of tax) for the period	1,626.47	1,468.88	913.17	5,472.99
Equity Share Capital	3,673.28	3,673.28	3,673.28	3,673.28
Reserves(excluding Revaluation Reserve as shown in the Balance Sheet of Previous year)				20,375.61
Earnings per Share (of Rs.10/-each) (not annualized) Basic & Diluted :	4.43	4.00	2.49	14.90

1. The above is an extract of the detailed format of the Financial Results filed with the Stock Exchanges under Regulation 33 of SEBI (Listing and Other Disclosure Requirements) Regulations 2015. The full format of the Unaudited Financial Results are available on the web sites of Bombay Stock Exchange Ltd (www.bseindia.com) and National Stock Exchange Ltd (www.nseindia.com), and the Company's web site www.nclind.com.

Hyderabad
14-08-2017

By Order of the Board
For NCL Industries Limited
K. Ravi - Managing Director

NAGARJUNA CEMENT | NAGARJUNA RMC Powering Constructions | BISON PANEL Cement Bonded Particle Board | BISON Lam Pre-laminated Cement Particle Board


మేడ్చల్ జిల్లా కీసరలో జరిగిన స్వాతంత్య్ర వేడుకల్లో పాల్గొన్న హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి


కరీంనగర్‌లో పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న మంత్రి ఈటల రాజేందర్


నిజామాబాద్‌లో పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న మంత్రి పోచారం


ఖమ్మంలో గౌరవ వందనం స్వీకరిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు


జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని పరేడ్ గ్రౌండ్‌లో పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్


మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన వేడుకలో గౌరవ వందనం స్వీకరిస్తున్న వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సీ లక్ష్మారెడ్డి, పక్కన కలెక్టర్ రోనాల్డ్ రోస్


వికారాబాద్‌లోని పోలీస్ పరేడ్ మైదానంలో పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న రవాణా శాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి


ఆదిలాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో గౌరవ వందనం స్వీకరిస్తున్న మంత్రి జోగు రామన్న


హన్మకొండలో జరిగిన వరంగల్ రూరల్ జిల్లా వేడుకల్లో విప్ పల్లారాజేశ్వర్‌రెడ్డి


భువనగిరిలో పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న విప్ గొంగిడి సునీత


పెద్దపల్లిలో పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న శాసన మండలి చీఫ్ విప్ పాతూరి సుధాకర్‌రెడ్డి


మంచిర్యాల పరేడ్ గ్రౌండ్‌లో గౌరవ వందనం స్వీకరిస్తున్న ప్రభుత్వ విప్ నల్లాల ఓదెలు


సంగారెడ్డిలోని పోలీస్ పరేడ్ మైదానంలో గౌరవ వందనం స్వీకరిస్తున్న ప్రిన్సిపల్ సెక్రటరీ బీఆర్ మీనా


మహబూబాబాద్‌లో గౌరవ వందనం స్వీకరిస్తున్న రాష్ట్ర ప్రణాళిక విభాగం ప్రత్యేక ముఖ్య కార్యదర్శి బీపీ ఆచార్య



పంద్రాగస్టు వేడుకల సందర్భంగా మంగళవారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలో సఖ్యత చారిటబుల్ ట్రస్ట్, వనిత కోఆపరేటివ్ టైలర్స్ సహకార సంఘం సంయుక్త ఆధ్వర్యంలో 150 మీటర్ల పొడుగు గల జాతీయ జెండాతో భారీ ప్రదర్శన నిర్వహించారు. అంతకుముందు ఈ ర్యాలీని స్పీకర్ మధుసూదనాచారి ప్రారంభించారు. - భూపాలపల్లి టౌన్

అడ్డుకుంటే అభివృద్ధి ఆగదు

పంద్రాగస్టు వేడుకల్లో ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి


వరంగల్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన వేడుకలో గౌరవ వందనం స్వీకరిస్తున్న కడియం

వరంగల్ ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ: ఆరు దశాబ్దాల సుదీర్ఘ పోరాట ఫలితంగా సాధించుకున్న రాష్ర్టాన్ని బంగారు తెలంగాణగా పునర్నిర్మించుకోవాలన్న సీఎం కేసీఆర్ సంకల్పం తప్పక నెరవేరుతుందని డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి అన్నారు. అభివృద్ధిని అడ్డుకోవాలని కొంతమంది చేస్తున్న కుట్రలు ఫలించబోవన్నారు. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా మంగళవారం వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో జాతీయ జెండాను ఎగురవేసిన అనంతరం కడియం జిల్లా ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. హైదరాబాద్ తరువాత వరంగల్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నదన్నారు. ఉద్యోగ, ఉపాధి రంగాల్లోనే కాకుండా అభివృద్ధి, సంక్షేమంలో తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నదని స్పష్టం చేశారు. రాష్ట్ర గ్రామీణ ఆర్థిక వ్యవస్థను పరిపుష్టం చేసేందుకు ప్రభుత్వం, ప్రత్యేకించి సీఎం చేపడుతున్న పథకాలకు జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చిందన్నారు. ఉద్యోగ నియామకాలే కాకుండా కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, సింగరేణి కార్మికుల క్రమబద్ధీకరణ వంటి అనేక అంశాల్లో కొంతమంది కోర్టులకు వెళ్లి ఆ ప్రక్రియల్ని ఆపే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. సాగునీటి ప్రాజెక్టులపైనా కోర్టులకు వెళ్తున్న తీరును ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఎవరు ఎన్ని కుట్రలు చేసినా ప్రగతిని అడ్డుకోలేరని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కలెక్టర్ ఆమ్రపాలి, సీపీ సుధీర్‌బాబు, జెడ్పీ చైర్‌పర్సన్ గద్దల పద్మ, మేయర్ నన్నపునేని నరేందర్, ఎమ్మెల్యేలు దాస్యం వినయభాస్కర్, ఆరూరి రమేశ్, కుడా చైర్మన్ మర్రి యాదవరెడ్డి, టీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తక్కళ్లపల్లి రవీందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

టీఎస్ ఐపాస్‌తో సత్ఫలితాలు

సిరిసిల్లలో స్వాతంత్య్ర వేడుకల్లో మంత్రి కే తారకరామారావు


సిరిసిల్ల జిల్లా కేంద్రంలో జాతీయ పతాకావిష్కరణ అనంతరం ప్రసంగిస్తున్న మంత్రి కే తారక రామారావు

రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, నమస్తే తెలంగాణ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న టీఎస్ ఐపాస్ సత్ఫలితాలిస్తున్నదని, పరిశ్రమల స్థాపనకు ముందుకొచ్చే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు తెలంగాణ స్వర్గధామంలా మారిందని మున్సిపల్, పట్టణాభివృద్ధి, ఐటీ శాఖల మంత్రి కల్వకుంట్ల తారకరామారావు పేర్కొన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో మంగళవారం నిర్వహించిన స్వాతంత్య్ర దినోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం ప్రజలనుద్దేశించి మాట్లాడారు. టీఎస్‌ఐపాస్ పాలసీ కింద పారిశ్రామిక వేత్తలు రాష్ట్రవ్యాప్తంగా పరిశ్రమల స్థాపనకు ముందుకొచ్చారన్నారు. ఒక్క రాజన్న సిరిసిల్ల జిల్లాలోనే రూ.987 కోట్ల పెట్టుబడితో 81 పరిశ్రమలను స్థాపించేందుకు ప్రతిపాదించగా ఇప్పటివరకు 58 పరిశ్రమలు ప్రారంభమై 872 మందికి ఉపాధి కల్పిస్తున్నట్టు తెలిపారు. త్వరలో సిరిసిల్లలో సీఎం కేసీఆర్ చేతుల మీదుగా అపెరల్ పార్కుకు శంకుస్థాపన చేపట్టనున్నట్టు వెల్లడించారు. గంభీరావుపేట మండలం నర్మాలలో 50 ఎకరాలలో మెగా ఫుడ్ ప్రాసెసింగ్ పార్క్, సిరిసిల్ల మండలం పెద్దూరులో 120 ఎకరాల్లో, తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల గ్రామ సమీపంలో ఇండస్ట్రియల్ పార్క్‌లను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. సారంపల్లి వద్ద రూ.16 కోట్లతో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన డ్రైవింగ్ శిక్షణ, పరిశోధన సంస్థను త్వరలో ప్రారంభించనున్నట్టు వివరించారు. ఇలాంటి సంస్థ రాష్ట్రంలోనే ఇదే మొదటిది కాగా, దేశంలో రెండోదన్నారు. కొత్తపల్లి, మనోహరాబాద్ రైలు మార్గం పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో పాలకులు నిర్లక్ష్యం చేస్తూ వచ్చారని, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన వెంటనే సీఎం కేసీఆర్ ఈ ప్రాజెక్టును చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించారన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో కేంద్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టును చేపడుతుందని, వేములవాడ, సిరిసిల్ల మీదుగా ఈ రైలు మార్గం నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నట్టు తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తండాలను పంచాయతీలుగా మార్చుతున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో కలెక్టర్ కృష్ణభాస్కర్, ఎస్పీ విశ్వజిత్ కంపాటి, వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు, జెడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ తదితరులు పాల్గొన్నారు.

'కాళేశ్వరం'తో సస్యశ్యామలం

నీటి పారుదల శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు

సిద్దిపేట ప్రతినిధి, నమస్తే తెలంగాణ : కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంతో సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని భారీ నీటి పారుదల శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా మంగళవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని డిగ్రీ కళాశాల మైదానంలో జాతీయ జెండాను ఎగురవేశారు. పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన అనంతరం సభలో జిల్లా ప్రగతిపై మాట్లాడారు. సిద్దిపేట జిల్లాను సస్యశ్యామలం చేయాలన్న లక్ష్యంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా గోదావరి నీటిని మళ్లించేందుకు, జిల్లాలో సాగునీటి రిజర్వాయర్ల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నదని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా అనంతగిరి, రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మ రిజర్వాయర్ల నిర్మాణ పనుల ప్రక్రియ కొనసాగుతున్నదన్నారు. రంగనాయక సాగర్ రిజర్వాయర్ టెండర్ల ప్రక్రియ పూర్తి చేసుకొని నిర్మాణ పనులు మొదలు పెట్టామని, కొమురవెల్లి మల్లన్నసాగర్, కొండపోచమ్మ రిజర్వాయర్ల టెండర్ల పనులు తుది దశకు చేరుకున్నాయని తెలిపారు. అనంతగిరి రిజర్వాయర్ నిర్మాణానికి అవసరమైన భూసేకరణ 99 శాతం పూర్తి కాగా రంగనాయకసాగర్ రిజర్వాయర్‌కు 90 శాతం పూర్తయిందన్నారు. జూన్ 2018నాటికి పూర్తిచేసి వాటి కింద ఉన్న చెరువులు, కుంటలను నింపాలని ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. మిషన్ కాకతీయ కింద చెరువుల పూడికతీత, పునరుద్ధరణ పనులు చురుకుగా కొనసాగుతున్నాయన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ వెంకట్రామ్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఫారూఖ్‌హుస్సేన్ పాల్గొన్నారు.


సిద్దిపేటలో జాతీయ పతాకావిష్కరణ అనంతరం ప్రసంగిస్తున్న మంత్రి హరీశ్‌రావు. చిత్రంలో కలెక్టర్ వెంకట్రామ్‌రెడ్డి, ఇన్‌చార్జి సీపీ చంద్రశేఖర్‌రెడ్డి


ఒకే కాన్పులో జన్మించిన ముగ్గురు శిశువులు

ఒకే కాన్పులో ముగ్గురు శిశువులు

మెట్‌పల్లి టౌన్: జగిత్యాల జిల్లా మెట్‌పల్లి పట్టణంలోని ప్రభుత్వ సామాజిక దవాఖానలో ఇబ్రహీంపట్నం మండల కేంద్రానికి చెందిన సిల్వేరి శోభ ఒకే కాన్పులో ముగ్గురు శిశువులకు మంగళవారం జన్మనిచ్చింది. ఈ మేరకు తల్లీబిడ్డలు క్షేమంగా ఉన్నట్టు దవాఖాన సూపరింటెండెంట్ అమరేశ్వర్ తెలిపారు. కాగా స్వాతంత్ర్య దినోత్సవం రోజు ఒకే కాన్పులో ముగ్గురు ఆడశిశువులు జన్మించడంతో పలువురు గ్రామస్తులు దవాఖానకు వచ్చి శోభకు అభినందనలు తెలిపారు. బాలింతకు మూడు కేసీఆర్ కిట్లను అందజేశారు.

ఖమ్మ జిల్లాలో నలుగురు..

ఎర్రుపాలెం రూరల్: ఒకే కాన్పులో నలుగురు పిల్లలకు జన్మనిచ్చింది ఓ మాతృమూర్తి. ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం మామునూరు గ్రామానికి చెందిన దంతాల భవానికి ఆంధ్రప్రదేశ్‌లోని తిరువూరులో గల కల్యాణ్ నర్సింగ్‌హోమ్‌లో మంగళవారం ఉదయం ముగ్గురు ఆడ, ఒక మగ శిశువు జన్మించారు. అందులో సాయంత్రానికి ముగ్గురు ఆడపిల్లలు మరణించగా, మగశిశువు జీవించి ఉన్నట్టు కుటుంబసభ్యులు తెలిపారు.

కరీంనగర్‌లో భారీ వర్షం

కరీంనగర్ ప్రతినిధి, నమస్తే తెలంగాణ: కరీంనగర్ జిల్లా కేంద్రంతోపాటు తిమ్మాపూర్, మానకొండూర్, శంకరపట్నం మండలాల్లో మంగళవారం భారీ వర్షం కురిసింది. శంకరపట్నంలో సుమారు గంటకుపైగా పలు గ్రామాల్లో వర్షం కురియడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. మిగతా మండలాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షం పడింది.


కరీంనగర్ జిల్లా కేంద్రంలో జలమయమైన శివ థియేటర్ రోడ్డు

రోడ్డు ప్రమాదంలో బాలుడి మృతి

మడికొండ(వరంగల్) : వరంగల్ అర్బన్ జిల్లా కాజీపేట మండలం మడికొండలో టిప్పర్ ఢీకొని బాలుడు మృతి చెందాడు. ఎస్సై మధుప్రసాద్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పల్లపు జితేందర్ అలియాస్ సన్నీ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో ఆరోతరగతి చదువుతున్నాడు. మంగళవారం పాఠశాలలో జరిగిన జెండా ఆవిష్కరణ వేడుకల్లో పాల్గొని స్నేహితుడు గడ్డం జయవర్ధన్‌తో కలిసి సైకిల్‌పై స్కూల్ గేట్ నుంచి బయటికి రావడంతో టిప్పర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇరువురికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వెంటనే ప్రైవేట్ దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ జితేందర్ మృతి చెందినట్టు ఎస్సై తెలిపారు.


రంగారెడ్డి జిల్లా గచ్చిబౌలిలోని పోలీస్ పరేడ్ మైదానంలో జాతీయ జెండా ఎగుర వేసి వందనం చేస్తున్న డిప్యూటీ సీఎం మహమూద్ అలీ


జయశంకర్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో జెండావందనం చేస్తున్న స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి, కలెక్టర్ మురళి, ఎస్పీ


కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న శాసన మండలి చైర్మన్ కే స్వామిగౌడ్


మెదక్‌లో గౌరవ వందనం స్వీకరిస్తున్న డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డి


సూర్యాపేట జిల్లా కేంద్రంలో పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి


నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న పంచాయతీ రాజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు


నిర్మల్ జిల్లా కేంద్రంలో వేడుకల్లో మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి


భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని ప్రగతి మైదాన్‌లో గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎక్సైజ్ శాఖ మంత్రి పద్మారావు


వనపర్తి జిల్లా కేంద్రంలో జరిగిన వేడుకలో పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి


నల్లగొండ జిల్లా కేంద్రంలో జాతీయ జెండా ఎగురవేసి సెల్యూట్ చేస్తున్న శాసన మండలి డిప్యూటీ చైర్మన్ నేతి విద్యాసాగర్


జగిత్యాలలో పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న చీఫ్ విప్ కొప్పుల ఈశ్వర్


కామారెడ్డిలో పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న విప్ గంప గోవర్ధన్


జనగామలోని వేడుకల్లో మండలిలో విప్ బోడకుంటి వెంకటేశ్వర్లు


హైదరాబాద్ కలెక్టరేట్‌లో జెండా వందనంలో పాల్గొన్న ఇన్‌చార్జి కలెక్టర్ ఎం ప్రశాంతి తదితరులు

నెదర్లాండ్స్‌కు షాకిచ్చారు



- హాకీలో భారత్ అద్భుత విజయం

ఆమ్‌స్టర్‌డమ్: జూనియర్లతో కూడిన భారత హాకీ జట్టు అద్భుత విజయంతో మెరిసింది. ప్రపంచ 4వ ర్యాంకర్ నెదర్లాండ్స్‌కు షాకిచ్చి సంచలనం సృష్టించింది. ఆద్యంతం ఉత్కంఠగా సాగిన పోరులో భారత బృందం 2-1 గోల్స్ తేడాతో నెదర్లాండ్స్ ను చిత్తుచేసి సిరీస్ విజేతగా నిలిచింది. చెరోగోల్‌తో అలరించిన గుర్జాంత్ సింగ్ (4వ నిమిషం), మన్‌దీప్‌సింగ్ (51వ నిమిషం)ల ధాటికి అనుభవజ్ఞులతో కూడిన డచ్‌టీమ్ పూర్తిగా తలవంచింది. ఈ సిరీస్‌లో జూనియర్లతో అడుగుపెట్టిన భారత్‌ను సారథి మన్‌ప్రీత్ సింగ్ ముందుండి నడిపించాడు. ఆట ప్రారంభం నుంచే ప్రత్యర్థిపై విరుచుకుపడ్డారు భారత ఆటగాళ్లు. నాలుగో నిమిషంలో లభించిన పెనాల్టీకార్నర్‌ను గుర్జాంత్ గోల్‌గా మలిచాడు. గుర్జాంత్‌కిదే కెరీర్‌లో తొలి అంతర్జాతీయ గోల్ కావడం విశేషం. ఆ తర్వాత అదేఊపును కొనసాగించిన భారత్‌కు గోల్‌కీపర్ ఆకాశ్ చిక్టే అద్భుతమైన సేవ్‌లతో ప్రత్యర్థి అవకాశాలను అడ్డుకున్నాడు. 51వ నిమిషంలో స్ట్రయికర్ మన్‌దీప్ సూపర్ గోల్‌తో భారత్ ఆధిక్యం 2-0కు పెరిగింది. చివర్లో పోరాడిన డచ్ జట్టుకు శాండర్ డివిజ్ 58వ నిమిషంలో పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మలిచి భారత్ ఆధిక్యాన్ని 2-1కి తగ్గించాడు. ఆ తర్వాత నెదర్లాండ్స్ మరో గోల్‌కోసం చేసిన ప్రయత్నాలు ఫలించలేదు.

భారత్‌కు అఫ్రీది శుభాకాంక్షలు



న్యూఢిల్లీ: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా భారత్‌కు పాకిస్థాన్ క్రికెట్ మాజీ కెప్టెన్ షాహిద్ అఫ్రీది శుభాకాంక్షలు చెప్పాడు. పొరుగుదేశాలు ఎల్లప్పుడూ శాంతి, సౌభ్రాతృత్వంతో వర్ధిల్లాలని కోరుకుంటున్నానని అఫ్రీది ట్విట్టర్‌లో పోస్ట్ చేశాడు. 'భారత్‌కు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు. పొరుగుదేశ ప్రజలను మార్చలేం. శాంతి, ప్రేమ, ఓర్పు దిశగా కలిసి అడుగులేద్దాం. మానవత్వాన్ని పెంపొందించుకుందాం' అని అఫ్రీది ట్వీట్ చేశాడు.

కోహ్లీసేన పంద్రాగస్టు సంబురం



పల్లెకెలె: భారత క్రికెట్ జట్టు పంద్రాగస్టు వేడుకలను ఘనంగా జరుపుకుంది. ప్రస్తుతం శ్రీలంక పర్యటనలో ఉన్న కోహ్లీసేన స్వాతంత్ర్య దినోత్సవాన్ని చివరిటెస్టుకు వేదికైన క్యాండీలోనే చేసుకుంది. జట్టు కెప్టెన్ విరాట్ కోహ్లీ త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశాడు. జాతీయ జెండా ఆవిష్కరణ వేడుకకు కోచ్ రవిశాస్త్రి సహా జట్టు సభ్యులంతా తెలుపు రంగు దుస్తుల్లో హాజరయ్యారు. ఆ తర్వాత అందరూ కలిసి జాతీయగీతాన్ని ఆలపించారు. ఈ మేరకు క్రికెట్ జట్టు పతాకావిష్కరణ వీడియోను బీసీసీఐ ట్విట్టర్‌లో పోస్ట్ చేసింది. ఈ సందర్భంగా కోహ్లీ అందరికీ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపాడు. స్వాతంత్ర్యదినోత్సవమైన ఆగస్టు 15నే తన తండ్రి పుట్టినరోజు కూడా కావడంతో, ఈరోజు తనకెంతో ప్రత్యేకమని కోహ్లీ అన్నాడు. చిన్నప్పుడు స్వాతంత్ర్యదినోత్సవ వేడుకలను స్నేహితులు, కుటుంబసభ్యుల మధ్య జరుపుకున్న సంగతులను ఈ సందర్భంగా కోహ్లీ గుర్తుచేసుకున్నాడు. సోమవారంతో టెస్టు సిరీస్‌ను ముగించిన విరాట్‌సేన.. శ్రీలంకతో ఐదువన్డేల సిరీస్‌ను ఈనెల 20వ తేదీ నుంచి ఆడనుంది.

24 గంటలు.. 2వేల ఓవర్లు



లీడ్స్: ఇంగ్లండ్‌లోని యార్క్‌షైర్ సిటీకి చెందిన రోడ్లీ క్రికెట్ క్లబ్ సరికొత్త రికార్డు సృష్టించింది. ఈ క్లబ్‌కు చెందిన జూనియర్ ఆటగాళ్లు 24గంటల్లో 2వేల ఓవర్లు బౌలింగ్ చేసి ప్రపంచ రికార్డు నెలకొల్పారు. గిన్నిస్ రికార్డు కోసం ముందే దరఖాస్తు చేసుకుని రోడ్లీ క్లబ్ ఈ అరుదైన ఫీట్‌ను నమోదుచేసింది. క్లబ్‌కు చెందిన ఆటగాళ్లలో కొందరు బ్యాటింగ్ చేస్తుండగా.. మరికొందరు నిరంతరాయంగా బౌలింగ్ చేసి ఈ ఘనత సాధించారు. గతంలో 8గంటల్లో 734 ఓవర్లతో తమపేరిటే ఉన్న రికార్డును రోడ్లీ జట్టు తాజా ప్రదర్శనతో తిరగరాసింది.

టాప్‌టెన్‌లోకి రాహుల్

దుబాయ్: ఐసీసీ మంగళవారం విడుదల చేసిన తాజా టెస్ట్ ర్యాంకింగ్స్‌లో భారత ఓపెనర్లు లోకేశ్ రాహుల్, శిఖర్ ధవన్ తమ కెరీర్‌లో అత్యుత్తమ ర్యాంక్‌లను అందుకున్నారు. శ్రీలంకతో ముగిసిన మూడు టెస్ట్‌ల సిరీస్‌లో అర్ధసెంచరీలతో ఆకట్టుకున్న రాహుల్ (761 పాయింట్లు) రెండు ర్యాంక్‌లు మెరుగుపర్చుకుని తొమ్మిదో ర్యాంక్‌లో నిలిచాడు. మరోవైపు మ్యాన్ ఆఫ్ ద సిరీస్ దక్కించుకున్న ధవన్ (612).. ఏకంగా పది ర్యాంక్‌లు ఎగబాకి 28వ ర్యాంక్‌కు చేరుకున్నాడు. టీమ్‌ఇండియా నుంచి టాప్-10లో పుజార(876), కోహ్లీ(806), రహానే(760) వరుసగా నాలుగు, ఐదు, పది ర్యాంక్‌ల్లో ఉన్నారు. బౌలింగ్ విభాగంలో మహ్మద్ షమీ(618), ఉమేశ్ యాదవ్ (576) వరుసగా 19, 21వ ర్యాంక్‌ల్లో నిలువగా, జడేజా(884)నంబర్‌వన్ ర్యాంక్‌లో ఉన్నాడు. ఆల్‌రౌండర్ల ర్యాంకింగ్స్‌లో జడేజా(430) తన టాప్ ర్యాంక్‌ను షకీబల్‌హసన్(431)కు చేజార్చుకోగా, అశ్విన్(422) మూడో ర్యాంక్‌లో ఉన్నాడు.

నైజీరియా టీటీలో సార్థక్‌కు రజతం



న్యూఢిల్లీ: భారత టేబుల్ టెన్నిస్ యువ ఆటగాడు సార్థక్ గాంధీ నైజీరియా ఓపెన్ అంతర్జాతీయ టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్‌లో పతకంతో మెరిశాడు. పురుషుల సింగిల్స్‌లో సార్థక్ రజత పతకం సాధించాడు. లాగోస్ నగరంలో మంగళవారం జరిగిన సింగిల్స్ ఫైనల్లో సార్థక్ 6-11, 11-13, 6-11, 8-11తో ఈజిప్టుకు చెందిన ఒమర్ అస్సార్ చేతిలో ఓటమిపాలై రజత పతకంతో సంతృప్తిపడ్డాడు. దీంతో 23ఏండ్ల సార్థక్.. వరల్డ్ టూర్ చాలెంజ్ సిరీస్ టీటీ ఈవెంట్ ఫైనల్లో తలపడ్డ ఐదుగురు భారత క్రీడాకారుల్లో ఒకరిగా నిలిచాడు. సార్థక్ ప్రస్తుతం ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 356వ స్థానంలో కొనసాగుతున్నాడు.



పంద్రాగస్టు వేడుకల్లో భాగంగా ఎల్బీ స్టేడియంలో జాతీయ జెండాను ఎగురవేస్తున్న సాట్స్ చైర్మన్ వెంకటేశ్వర్ రెడ్డి. ఈ కార్యక్రమంలో సాట్స్ ఎండీ దినకర్‌బాబు, క్రీడా అధికారులు పాల్గొన్నారు.

మెడపై కత్తి!



మహేంద్రసింగ్ ధోనీ

భారత క్రికెట్ జట్టులో ప్రక్షాళన మొదలైంది. భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని పక్కా ప్రణాళికతో సెలెక్టర్లు ముందుకు వెళుతున్నారు. ప్రదర్శన ఆధారంగా ఆటగాళ్లను ఎంపిక చేస్తూ వచ్చే ప్రపంచకప్ నాటికి పటిష్ట జట్టును రూపొందించేందుకు సమాయత్తమవుతున్నారు. ఇప్పటికే యువరాజ్‌సింగ్‌ను పక్కకుపెట్టిన సెలెక్షన్ కమిటీ ఇక ధోనీని లక్ష్యంగా చేసుకుంది. 'నిలకడగా రాణిస్తే జట్టులో చోటు.. లేకపోతే ప్రత్యామ్నాయమే' అన్న సెలెక్షన్ కమిటీ చైర్మన్ వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనం. ఈ నేపథ్యంలో రాణించడమో లేదంటే రిటైర్మెంట్ ప్రకటించడమో అన్నట్లుగా మహీ మెడపై కత్తి వేలాడుతున్నది.

నమస్తే తెలంగాణ ఖేల్ విభాగం



యువరాజ్

'సమయం ఆసన్నమైంది మిత్రమా.. రాణిస్తేనే జట్టులో చోటు లేకుంటే వేటే' అన్న తరహాలో ఉంది మన సీనియర్ క్రికెటర్ల కథ. ప్రతిభ కల్గిన యువ క్రికెటర్లు రివ్వున దూసుకొస్తున్న వేళ జాతీయ జట్టులో యువరాజ్ సింగ్, మహేంద్రసింగ్ ధోనీ చోటుపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. కుర్ర క్రికెటర్లకు దీటుగా రాణిస్తేనే బెర్తు ఖాయమన్న తరహాలో సెలెక్షన్ కమిటీ వ్యవహరిస్తున్నది. ఇటీవల ఇంగ్లండ్ వేదికగా చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్లో దాయాది పాకిస్థాన్ చేతిలో పరాజయం తర్వాత సెలెక్టర్లు ఓ అంచనాకు వచ్చారు. 2019లో ఇదే ఇంగ్లండ్ గడ్డపై జరిగే ప్రపంచ కప్ నాటికి మేటి జట్లకు దీటుగా టీమ్‌ఇండియాను తీర్చిదిద్దాలనే సంకల్పంతో జట్టు మేనేజ్‌మెంట్ ఉన్నది. యువరాజ్, ధోనీ గురించి ఆలోచించాల్సిన సమయం వచ్చిందని దిగ్గజ క్రికెటర్, భారత 'ఎ' జట్టు కోచ్ రాహుల్ ద్రవిడ్ ఈమధ్యే చేసిన కీలక వ్యాఖ్యల నేపథ్యంలో సెలెక్షన్ కమిటీ తన పంథాను మార్చుకుంది. గత రికార్డులను దృష్టిలో పెట్టుకుని కుర్రాళ్లను కాదని సిరీస్‌లకు ఎంపిక చేసినా అంచనాల మేరకు రాణించడంలో యువీ, ధోనీ ఘోరంగా విఫలమవుతున్నారు. దీనికి విండీస్ పర్యటనే నిదర్శనం. అవును.. గెలిచే మ్యాచ్‌ను చేజేతులా కోల్పోవడం ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణ. దీనికి తోడు దేశవాళీ క్రికెట్‌లో యువ ఆటగాళ్లు అద్భుతంగా ఆడుతున్నారు. గతంలో జట్టుకు ఎన్నో అనితర సాధ్యమైన విజయాలను కట్టబెట్టడంలో ధోనీ, యువీ పాత్రను కొట్టిపారేయలేం. టీ 20 ప్రపంచకప్ (2007), వన్డే ప్రపంచకప్ (2011) లాంటి మెగా టోర్నీలో భారత్‌ను విజేతగా నిలుపడంలో వీళ్లు కీలకమయ్యారు. అలాగని జట్టులో ఎల్లకాలం వీళ్లను కొనసాగించడమూ కలువని ముచ్చట. శ్రీలంకతో వన్డే సిరీస్‌కు యువీని తప్పించిన ఎమ్మెస్కే ప్రసాద్ సారథ్యంలోని సెలెక్షన్ కమిటీ శార్దుల్ ఠాకూర్, చాహల్, కుల్దీప్, అక్షర్‌పటేల్ లాంటి యువ క్రికెటర్లకు అవకాశం కల్పించింది. యువీకి కేవలం విశ్రాంతి ఇచ్చామని, అతన్ని తప్పించలేదని చైర్మన్ ప్రసాద్ వ్యాఖ్యానించినా..లోగుట్టు మాత్రం మరోలా ఉంది. మరోవైపు ధోనీ ఎంపికపై స్పందిస్తూ 'ధోనీని గమనిస్తున్నాం.. ఒక దిగ్గజ క్రికెటర్‌ను అంత అలవోకగా తప్పించలేము. కానీ మా కంటూ కచ్చితమైన ప్రణాళికలు ఉన్నాయి. క్రమక్రమంగా మహీ జట్టుకు దూరమవుతాడు. భారత క్రికెట్ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని కొన్ని కఠిన నిర్ణయాలు తప్పవు. అవకాశాలకు అనుగుణంగా రాణిస్తే అతనికి ఢోకా ఉండదు. కానీ అలా జరుగని పక్షంలో ప్రత్యామ్నాయాల గురించి ఆలోచిస్తాం' అని ప్రసాద్ కుండబద్దలు కొట్టాడు. ఒక వేళ టెన్నిస్ దిగ్గజం ఆండ్రీ అగస్సీ లాగా లేటు వయస్సులో కూడా మెరుపులు మెరిపిస్తానంటే ధోనీకి ఢోకా ఉండదని ప్రసాద్ అనడం కొసమెరుపు. కానీ నాలుగు పదుల వయసుకు నాలుగేండ్ల దూరంలో ఉన్న మహీ మునుపటిలా ఆడుతాడా అన్నది సందేహమే.

నువ్వో సెలెక్టర్ మాత్రమే..!

న్యూఢిల్లీ: 'నిలకడగా ఆడితే జట్టులో చోటు నిలుపుకుంటాడు. లేకపోతే ప్రత్యామ్నాయాల గురించి ఆలోచించాల్సిందే' ధోనీని ఉద్దేశించి చీఫ్ సెలెక్టర్ ఎమ్మెస్కే ప్రసాద్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. క్రికెట్‌ను ఊపిరిగా భావించే అభిమానులు తమ ఆరాధ్య ఆటగాన్ని లక్ష్యంగా చేసుకుని అన్న మాటలు వార్తల్లో ప్రముఖంగా నిలిచాయి. దేశానికి చిరస్మరణీయ విజయాలందించిన మహీని ఉద్దేశించి మాట్లాడేందుకు అసలు నువ్వు ఎవరు అంటూ సోషల్ మీడియా వేదికగా అభిమానులు ఎమ్మెస్కేపై తమ కోపాన్ని వెళ్లగక్కారు. '2019 ప్రపంచకప్‌లో ధోనీ ఆడేది లేనిది నిర్ణయించేది నువ్వు(ప్రసాద్) కాదని గుర్తుంచుకో. నువ్వో సెలెక్టర్ మాత్రమే' అని ఒకరు పోస్ట్ చేయగా.. 'కెరీర్‌లో 6 టెస్టులు, 17 వన్డేలాడిన నువ్వు.. దిగ్గజ క్రికెటర్లు ధోనీ, యువరాజ్‌సింగ్, రైనా భవిష్యత్తును నిర్దేశించే స్థాయికి ఎదిగావా?' అని మరొకరు పోస్ట్ చేశారు.



ఎమ్మెస్కే ప్రసాద్

కుర్రాళ్లకు మరిన్ని అవకాశాలు

రానున్న సిరీస్‌లను దృష్టిలో పెట్టుకుని కుర్రాళ్లకు మరిన్ని అవకాశాలు ఇచ్చే అవకాశం కనిపిస్తున్నది. వచ్చే ఏడాది దక్షిణాఫ్రికాతో సిరీస్‌కు ముందు స్వదేశంలో శ్రీలంకతో భారత్ సిరీస్ ఆడనుంది. ఇందులో దేశవాళీ టోర్నీల్లో నిలకడగా రాణిస్తున్న యువ ఆటగాళ్లకు చాన్స్ ఇస్తే..సీనియర్ క్రికెటర్లను షెడ్యూల్ కంటే ముందే దక్షిణాఫ్రికాకు పంపించవచ్చు. దీంతో కుర్రాళ్లకు అంతర్జాతీయ క్రికెట్ ఆడిన అనుభవం వస్తుంది. మరోవైపు దక్షిణాఫ్రికాకు దీటైన పోటీనిచ్చేందుకు అవకాశం లభిస్తుంది. ఇన్ని కారణాల మధ్య రానున్న సిరీస్‌లకు జట్టు ఎంపిక భవిష్యత్ అంచనాలకు అనుగుణంగా సాగే అవకాశం స్పష్టంగా కనిపిస్తున్నది

కొత్త రొటేషన్ పాలసీ

రానున్న ప్రపంచకప్ కోసం జాతీయ సెలెక్షన్ కమిటీ త్వరలో కొత్త రొటేషన్ పాలసీని తీసుకురాబోతున్నది. 'లంక సిరీస్ నుంచి యువీని తప్పించారంటున్నారు. కానీ మేము క్లియర్‌గా ఉన్నాం. రాబోయే నాలుగైదు నెలల్లో 25 మంది ఆటగాళ్లను గుర్తిస్తాం. స్వదేశంలో జరిగే సిరీస్‌లతో పాటు విదేశాల్లోనూ వారి ఆటతీరును నిశితంగా పరిశీలిస్తాం. కీలకమైన ఆటగాళ్లను మారుస్తూ ఉంటాం. ప్రపంచకప్ నాటికి జట్టుపై ఓ అంచనాకు వస్తాం. అందుకే యువ క్రికెటర్లకు అవకాశం కల్పిస్తున్నాం. ఈ యేడాది చివర్లో ఏదో ఒక నిర్ణయం తీసుకుంటాం' అని ప్రసాద్ అన్నాడు.

ఫిట్‌నెస్ నిబంధనలు

ఆటగాళ్ల ఫిట్‌నెస్‌పై కూడా సెలెక్షన్ కమిటీ దృష్టిపెట్టింది. చాంపియన్స్ ట్రోఫీ సందర్భంగా ఆటగాళ్ల ఫిట్‌నెస్, ఫీల్డింగ్ ప్రమాణాలపై ప్రసాద్ నేతృత్వంలోని ప్యానెల్ తీవ్ర అసంతృప్తితో ఉంది. ఈ నేపథ్యంలో సరికొత్త ఫిట్‌నెస్ నిబంధనలను తీసుకొచ్చేందుకు సిద్ధమైంది. 'ఫిట్‌నెస్‌తో పాటు ఫీల్డింగ్ ప్రమాణాలను మరింత మెరుగుపర్చాలన్న పట్టుదలతో ఉన్నాం. దీనిపై త్వరలోనే బోర్డు నుంచి అధికారిక ప్రకటన వెలువడుతుంది. ఫిట్‌నెస్ ప్రమాణాలను నిర్దేశించబోతున్నాం. దీన్ని కచ్చితంగా అందరూ ఫాలో కావాల్సిందే. ప్రమాణాలను అందుకోవడంలో ఎవరూ విఫలమైనా సరే..వారి పేరును ప్రపంచకప్‌నకు పరిగణనలోకి తీసుకోం. అది ఏ స్థాయి క్రికెటర్ అయినా సరే. యువీ, రైనా జట్టులోకి వచ్చే అవకాశాలను మూసివేయలేదు. ప్రతి ఒక్కరికి చాన్స్ ఉంటుంది. అంచనాలకు అనుగుణంగా రాణిస్తే జాతీయజట్టుకు ఎంపికవుతారు' అని ప్రసాద్ పేర్కొన్నాడు.

నాలుగో నంబర్‌లో రాహుల్



రానున్న శ్రీలంకతో వన్డే సిరీస్‌లో ప్రయోగాలు చేయబోతున్నాం. లోకేశ్ రాహుల్‌ను ఓపెనర్‌గా గాకుండా నాలుగో నంబర్‌లో ఆడించేందుకు ప్లాన్ చేస్తున్నాం. ఓపెనర్లుగా ధవన్, రోహిత్‌శర్మ మంచి ఫామ్‌మీదున్నారు. అందుకే కీలకమైన నాలుగో స్థానంలో రాహుల్ సరిగ్గా సరిపోతాడు అని ప్రసాద్ అన్నాడు.

టైగర్ వుడ్స్‌కు జరిమానా



లాస్‌ఏంజెల్స్: అనుమానాస్పద రీతిలో సొంత కారులోనే నిద్రిస్తూ అరెస్టైన ప్రఖ్యాత గోల్ఫర్ టైగర్‌వుడ్స్ తేలికపాటి శిక్షతో బయటపడ్డాడు. మే నెల 29న తన ఇంటి సమీపంలో కారులో మత్తులో జోగుతున్న టైగర్‌వుడ్స్‌ను పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. అతను డ్రగ్స్ తీసుకుని డ్రైవింగ్ చేస్తున్నాడన్న అనుమానంతో అరెస్టు చేసిన పోలీసులు అనంతరం అతనికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కాగా, ఎలాంటి నిషేధిత ఉత్ప్రేరక అవశేషాలు వుడ్స్ శరీరంలో లేవని టాక్సాలజీ నివేదికలో తేలింది. వైద్యుని సలహా లేకుండా అతను చాలా శక్తిమంతమైన నొప్పి నివారణ మందులు (హైడ్రోకోడోన్, హైడ్రో మార్ఫిన్) వేసుకోవడంతోపాటు నిద్రలేమికి కూడా అంతే శక్తిమంతమైన ఔషధం(జోల్పిడెమ్) సేవించాడని ఆ నివేదికలో బయటపడింది. ఈ మందులు వేసుకోవడం నేరం కాకపోయినా, వైద్యుని సలహా, ప్రిస్క్రిప్షన్ లేకుండా ఔషధాలు తీసుకున్నందుకు కోర్టు వుడ్స్‌కు 250 డాలర్ల జరిమానా విధించింది. కోర్టు ఖర్చులు భరించడంతో పాటు 50 గంటలపాటు పౌరసేవ చేయాలని కూడా వుడ్స్‌ను కోర్టు ఆదేశించింది.

అబుదాబి చెస్‌లో హారిక శుభారంభం

అబుదాబి: అబుదాబి ఇంటర్నేషనల్ చెస్‌లో తెలుగమ్మాయి ద్రోణవల్లి హారిక గ్రాండ్‌గా శుభారంభం చేసింది. ఈ టోర్నీ తొలిరౌండ్లో భారత్‌కే చెందిన మిథిల్ అగావోన్కర్‌పై హారిక 34 ఎత్తుల్లో గెలుపొందింది. అజర్‌బైజాన్‌కు చెందిన రౌఫ్ మమెదేవ్‌తో హారిక రెండోరౌండ్ ఆడనుంది.

తరంగ కెప్టెన్సీలో లంక

పల్లెకెలె: భారత్‌తో ఈనెల 20న మొదలయ్యే ఐదు వన్డేల సిరీస్‌లో శ్రీలంక జట్టుకు ఉపుల్ తరంగ నాయకత్వం వహించనున్నాడు. అంజెలో మాథ్యూస్ రాజీనామా చేసిన తర్వాత తరంగ నాయకత్వం వహిస్తున్న తొలి సిరీస్ ఇదే. మొత్తం 15 మందితో ప్రకటించిన జట్టులో ప్రదీప్, గుణరత్నే గాయాల కారణంగా జట్టులో చోటు కోల్పోగా, సీనియర్ బౌలర్ మలింగ మళ్లీ జట్టుకొచ్చాడు.

కెన్యాలో 2023 ప్రపంచ అథ్లెటిక్స్!

నైరోబి: ఆఫ్రికా ఖండానికి చెందిన అతిచిన్న దేశం కెన్యా అతిపెద్ద క్రీడా ఈవెంట్‌కు ఆతిథ్యమిచ్చేందుకు సిద్ధమవుతున్నది. 2023లో జరిగే ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ ఆతిథ్యానికి కెన్యా బిడ్ దాఖలు చేయనుంది. 'ఇప్పటికే మాకు అప్పగించిన చిన్నచిన్న ఈవెంట్లను సమర్థవంతంగా నిర్వహించాం. ఇప్పుడు అతిపెద్ద ఈవెంట్ కోసం సిద్ధమవుతున్నాం. కచ్చితంగా మెగా ఈవెంట్‌ను కూడా విజయవంతంగా నిర్వహిస్తామన్న పూర్తి విశ్వాసం, సామర్థ్యం మాకున్నాయి' అని కెన్యా క్రీడామంత్రి హసన్ వారియో తెలిపారు.

గుజరాత్ పాంచ్ పటాకా



- ప్రొ కబడ్డీలో బెంగళూరుపై విజయం

అహ్మదాబాద్: ప్రొ కబడ్డీ లీగ్ ఐదో సీజన్‌లో అరంగేట్ర జట్టు గుజరాత్ ఫార్చ్యూన్ జెయింట్స్ దూసుకుపోతున్నది. వరుసగా నాలుగో విజయంతో జోన్ ఏలో టేబుల్ టాపర్‌గా స్థానాన్ని మరింత సుస్థిరం చేసుకుంది. ఇప్పటికి ఏడు మ్యాచ్‌లాడిన జెయింట్స్ జట్టు ఐదు విజయాలు, ఒక ఓటమి, ఓ డ్రాతో టోర్నీ హాట్‌ఫేవరెట్‌గా అవతరించింది. మంగళవారం బెంగళూరు బుల్స్ తో జరిగిన ఇంటర్ జోన్ లీగ్ మ్యాచ్‌లో గుజరాత్ 27-24 స్కోరుతో ఘన విజయం సాధించింది. రైడింగ్‌లో సచిన్ 4,రోహిత్ గుల్యా4, పర్వేశ్ బన్సివాల్ 4 పాయింట్లతో బుల్స్ జట్టు డిఫెన్స్‌ను చెల్లా చెదురు చేశారు. బుల్స్ జట్టు తరపున రోహిత్ కుమార్ 7, మహేందర్ సింగ్ 3 పాయింట్లు సాధించారు. ఓవరాల్‌గా గుజరాత్ జట్టు 13 రైడింగ్, 11 ట్యాకిల్, 2 ఆలౌట్, 1 ఎక్స్‌ట్రా పాయింట్ సాధించగా.. బుల్స్10రైడింగ్, 11 ట్యాకిల్, 2 ఆలౌట్, 1 ఎక్స్‌ట్రా పాయింట్ సాధించింది.

పల్టాన్ ఘన విజయం

జోన్ ఏలో భాగంగా జరిగిన మరో మ్యాచ్‌లో పుణెరి పల్టాన్ జట్టు 34-17 స్కోరుతో బెంగాల్ వారియర్స్‌ను చిత్తుగా ఓడించింది. పల్టాన్ జట్టు స్టార్ రైడర్ సందీప్ నర్వాల్ 7 రైడింగ్ పాయింట్లతో మెరువగా.. బెంగాల్ స్టార్ ప్లేయర్ జాంగ్ కున్ లీ కేవలం ఒకే పాయింట్‌తో సరిపెట్టుకోవడంతో వారి జట్టు కోలుకోలేకపోయింది. వారియర్స్ జట్టులో మనీందర్ సింగ్ 6 రైడింగ్ పాయింట్లు నమోదు చేశాడు. ఈ మ్యాచ్‌లో పుణెరి పల్టాన్ జట్టు 15 రైడింగ్, 10 ట్యాకిల్, 4 ఆలౌట్, 5 ఎక్స్‌ట్రా పాయింట్లు సాధించగా.. బెంగాల్ జట్టు10 రైడింగ్, 6 ట్యాకిల్, 1 ఎక్స్‌ట్రా పాయింట్‌తో సరిపెట్టుకుంది.



పంద్రాగస్టును పురస్కరించుకొని హైదరాబాద్‌లోని సెయింట్ రోజ్‌మేరీ (గోల్కొండ), ఆక్స్‌ఫర్డ్ మిషన్ హైస్కూల్స్‌లో ఖోఖో, ఫుట్‌బాల్ పోటీలు నిర్వహించారు. జీహెచ్‌ఎమ్‌సీ స్పోర్ట్స్ డైరెక్టర్ ప్రేమ్‌రాజ్ చిన్నారులకు ట్రోఫీలు అందజేశారు



చొరబాటుకు చైనా విఫలయత్నం

విజయవంతంగా అడ్డుకున్న భారత సైన్యం

లేహ్/ న్యూఢిల్లీ: జమ్ముకశ్మీర్‌లోని లేహ్ వద్ద సరిహద్దు దాటి ఇవతలకు వచ్చేందుకు చైనా సైన్యం రెండుసార్లు చేసిన ప్రయత్నాలను భారత సైనికులు విజయవంతంగా అడ్డుకున్నారు. లేహ్‌లో పేరొందిన పాంగాంగ్ లేక్ వద్ద చైనా ప్రజా విమోచన సైన్యం (పీఎల్‌ఏ).. ఫింగర్ ఫోర్, ఫింగర్ ఫైవ్ ప్రాంతాల్లో మంగళవారం ఉదయం ఆరు గంటలు, తొమ్మిది గంటల సమయంలో చొరబడేందుకు ప్రయత్నించింది. వారి ప్రయత్నాలను పసిగట్టిన భారత సైనికులు మానవహారం నిర్మించడంతో చైనా సైనికులు రాళ్లు విసిరారు. దీటుగా భారత సైనికులు స్పందించడంతో ఇరువైపులా స్వల్ప గాయాలయ్యాయి. అనంతరం ఇరుదేశాల దళాలు వెనక్కి తగ్గాయి. లేహ్ ఘటనపై స్పందించేందుకు ఢిల్లీలో సైనిక అధికార ప్రతినిధి నిరాకరించారు.

గ్రీటింగ్ కార్డు తయారీలో గిన్నిస్ రికార్డు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: 71వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 'పూర్వాంకర' సంస్థ 2,583 చదరపు అడుగుల భారీసైజు గ్రీటింగ్ కార్డును రూపొందించింది. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించుకున్న 'అందరికీ గృహాలు' లక్ష్యాన్ని ప్రధానాంశంగా తీసుకొని తయారుచేసిన ఈ గ్రీటింగ్‌కార్డుకు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు దక్కింది. మంగళవారం గిన్నిస్ బుక్ అధికార ప్రతినిధి.. పూర్వాంకర ఎండీ ఆశీష్‌కు సర్టిఫికెట్‌ను అందజేశారు. గ్రీటింగ్ కార్డు కాన్సెప్టు, డిజైన్‌ను రూపొందించడానికి 250 గంటలు శ్రమించినట్లు అశీష్ తెలిపారు.



'పూర్వాంకర' ఎండీ ఆశీష్‌కు సర్టిఫికెట్‌ను అందజేస్తున్న గిన్నిస్ బుక్ అధికార ప్రతినిధి

డిజిటల్ దండి యాత్ర

'ఎర్త్ వాయేజర్'లో సత్యాగ్రహ విశేషాలను జతచేసిన గూగుల్

న్యూఢిల్లీ: బ్రిటిష్ పాలకులు ఉప్పుపై పన్ను విధించడాన్ని వ్యతిరేకిస్తూ మహాత్మా గాంధీ నిర్వహించిన దండి యాత్ర గురించి తెలుసు కదా.. దాదాపు 90 ఏండ్ల కిందట జరిగిన ఈ సంఘటన గురించి ఎప్పుడూ పుస్తకాల్లో చదువడమే తప్ప యాత్ర మొత్తం ఎలా సాగిందో వివరంగా చూపించే వీడియోలు లేవు. సెర్చింజన్ దిగ్గజం గూగుల్ ఆ కొరతను తీర్చింది. దాదాపు 400 కిలోమీటర్లపాటు సాగిన 'దండి మార్చ్'కు డిజిటల్ రూపాన్ని ఇచ్చింది. దీనిని తన 'గూగుల్ ఎర్త్ వాయేజర్'కు అనుసంధానించి స్వాతంత్ర్య దినోత్సవ కానుకగా భారతీయులకు అందించింది. ఎర్త్ వాయేజర్‌లో ఏదైనా ప్రదేశం లేదా విషయం గురించి వెతికితే దానికి సంబంధించిన వివరాలతోపాటు, ఫొటోలు కనిపిస్తాయి. ఆడియో, విజువల్ రూపంలో ఆ ప్రదేశానికి సంబంధించిన వివరాలు ఒక కథగా మన ముందు ప్రత్యక్షమవుతాయి. ఇప్పుడు దండి యాత్ర గురించిన పూర్తి వివరాలు సేకరించిన గూగుల్.. ఎర్త్ వాయేజర్‌లో ఆ చారిత్రాత్మక ఘట్టానికి స్థానం కల్పించింది. 1930 మార్చి 12వ తేదీన గుజరాత్‌లోని సబర్మతి ఆశ్రమం నుంచి ప్రారంభమై దండి వరకు జరిగిన 400 కిలోమీటర్ల యాత్ర విశేషాలను ఇందులో పొందుపరిచారు. యాత్ర ఏయే మార్గాల్లో సాగింది. గాంధీజీ ఎక్కడెక్కడ ప్రసంగించారు. ఆ సమయంలో తీసుకున్న ఫొటోలను జత చేశారు. ఇలా 22 కీలక ప్రాంతాలకు సంబంధించిన వివరాలను పొందుపరిచారు. దండియాత్ర గురించి గాంధీజీ మనుమడు తుషార్ గాంధీ వ్యాఖ్యలను ఈ వీడియోకు జత చేశారు. దీనిపై గూగుల్ స్పందిస్తూ 'దండి యాత్ర సమయంలో ఉన్న పరిస్థితులను, భావోద్వేగాలను మా వినియోగదారులు ఈ వీడియో ద్వారా అనుభూతి చెందుతారు. యాత్రలో తాము కూడా పాల్గొన్న అనుభూతిని పొందుతారు' అని ఒక ప్రకటనలో పేర్కొన్నది.



మహాత్మాగాంధీ నేతృత్వంలో జరిగిన దండి యాత్ర (ఫైల్)

తమిళనాడు సీఎం రాజీనామా చేయాలి

- ట్విట్టర్‌లో కమల్‌హాసన్ పరోక్ష డిమాండ్
- మదురైలో దినకరన్ భారీ ర్యాలీ
- హాజరైన ఆరుగురు ఎంపీలు, 19 మంది ఎమ్మెల్యేలు



చెన్నై, ఆగస్టు 15: విలక్షణ నటుడు, జాతీయ అవార్డు గ్రహీత కమల్‌హాసన్ మరోసారి ఏఐఏడీఎంకే నేతృత్వంలోని తమిళనాడు ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోయిందని మండిపడ్డారు. పేరు పెట్టకుండానే తమిళనాడు ముఖ్యమంత్రి పళనిస్వామి రాజీనామా చేయాలని పరోక్షంగా డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన మంగళవారం వరుస ట్వీట్లు చేశారు. ధైర్యసాహసాలు కలిగిన ప్రజలు అవినీతికి వ్యతిరేకంగా నూతన స్వాతంత్ర్య పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. 'ఒక రాష్ట్రంలో జరుగకూడని ఘటనలు, అవినీతి చోటుచేసుకున్నప్పుడు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి రాజీనామా చేయాలి. పూర్తిస్థాయిలో నేరాలు జరిగినప్పటికీ ఏ ఒక్క పార్టీ కూడా తమిళనాడులో రాజీనామా కోరడం లేదు' అని పేరు ప్రస్తావించకుండా పళనిస్వామి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

నాదే అసలైన అన్నాడీఎంకే పార్టీ: దినకరన్

సీఎం పళనిస్వామిపై అన్నాడీఎంకే పార్టీ (అమ్మ) వర్గం నేత టీటీవీ దినకరన్ మండిపడ్డారు. తన నాయకత్వంలో ఉన్నదే అసలైన అన్నాడీఎంకే పార్టీ అన్నారు. పార్టీ వ్యవస్థాపకుడు ఎంజీఆర్ శతజయంతి సందర్భంగా సోమవారం రాత్రి దినకరన్ మదురైలో తను అనుచరులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. అన్నాడీఎంకేకు చెందిన ఆరుగురు ఎంపీలు, 19 మంది ఎమ్మెల్యేలతోపాటు పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.

బ్లూ వేల్ లింక్స్ తొలిగించండి

గూగుల్, ఫేస్‌బుక్, మైక్రోసాఫ్ట్‌కు కేంద్ర ప్రభుత్వం ఆదేశం

న్యూఢిల్లీ: బ్లూ వేల్ ఆన్‌లైన్ గేమ్ బారిన పడి యువత ప్రాణాలు తీసుకుంటున్న నేపథ్యంలో.. కేంద్ర ప్రభు త్వం చర్యలకు ఉపక్రమించింది. బ్లూ వేల్ లింకులను తొలగించాలని గూగుల్, ఫేస్‌బుక్, వాట్సప్, ఇన్‌స్టాగ్రామ్, మైక్రోసాఫ్ట్, యాహూ తదితర సోషల్ నెట్ వర్కింగ్ సంస్థలను ఆదేశించింది. బ్లూ వేల్‌తోపాటు, ఆ ఆటకు సంబంధించి వేరే పేర్లతో ఉన్న అన్ని లింకులనూ తక్షణం తమ డాటా నుంచి తొలగించాలని చేసింది. న్యాయ, ఐటీశాఖ మంత్రి రవిశంకర్‌ప్రసాద్ ఆదేశాల మేరకు ఈ నెల 11న ఆయా కంపెనీలకు లేఖ రాసినట్లు అధికారవర్గాలు పేర్కొన్నాయి. ఆత్మహత్యకు ప్రేరేపించే బ్లూవేల్ ఆట బారిన పడి.. ముంబై, కోల్‌కతాల్లో ఇద్దరు యువకులు ఇటీవల ప్రాణాలు తీసుకున్నారు. వివిధ దేశాల్లో ఈ ఆట కారణంగా పలువురు యువతీ యువకులు ఆత్మహత్యకు పాల్పడ్డారు.

అమెరికాపై డ్రాగన్ బుసలు

బీజింగ్, ఆగస్టు 15:

ట్రంప్‌ను హెచ్చరించిన చైనా



జిన్‌పింగ్ ట్రంప్

తమ మేధోసంపత్తి, టెక్నాలజీ హక్కులను చైనా చోరీ చేస్తున్నదంటూ అగ్రరాజ్యం అమెరికా చేసిన ఆరోపణలపై చైనా విరుచుకుపడుతున్నది. ఈ ఆరోపణలపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విచారణకు ఆదేశిస్తే గనుక ఇరుదేశాల మధ్య వాణిజ్య యుద్ధం తప్పదని చైనా మంగళవారం మరోమారు హెచ్చరించింది. ప్రస్తుతం ఇరుదేశాల మధ్య వాణిజ్య సంబంధాలు నిలకడగా ఉన్నాయని, అధ్యక్షుడు రెచ్చగొడితే మాత్రం ఉపేక్షించబోమని స్పష్టంచేసింది. అమెరికా మేధోసంపత్తి హక్కులను, తమ టెక్నాలజీని చైనా ఉల్లంఘిస్తున్నదన్న ఆరోపణలపై అమెరికా వాణిజ్య ప్రతినిధి రాబర్ట్ లైటైజర్ అందజేసిన వినతిపత్రానికి స్పందించిన అధ్యక్షుడు ట్రంప్ సోమవారంనాడు దానిపై సంతకం చేస్తూ.. దీనిని పరిశీలించాల్సిందిగా చీఫ్ ఎకనామిక్ అడ్వయిజరీకి సూచించారు. 'అమెరికా కంపెనీలకు నష్టంకలిగించేలా కాపీరైట్ హక్కుల్ని ఉల్లంఘించేందుకు ఏ దేశం ప్రయత్నించినా సహించబోం' అని ట్రంప్ పేర్కొన్నారు. ఉత్తర కొరియాను చైనా దారిలో పెట్టగలిగితే, చైనా సమస్యలను సున్నితంగా పరిష్కరించుకుంటామని సలహా ఇచ్చారు. అయితే ట్రంప్ వ్యాఖ్యలపై చైనాకూడా తీవ్ర స్థాయిలో విరుచుకుపడింది. అంతర్జాతీయ ఒప్పందాలను అర్థం చేసుకోకుండా మేధోసంపత్తి హక్కుల విషయంలో అమెరికా ఏకపక్షంగా విచారణకు దిగితే, అది ఇరుదేశాల వాణిజ్య ఒప్పందాలపై తీవ్ర ప్రభావం చూపుతుందని చైనా ప్రభుత్వ వాణిజ్య విభాగం ఓ ప్రకటనలో హెచ్చరించింది.

గ్వామ్‌పై ఉత్తరకొరియా క్షిపణి ప్రయోగం తాత్కాలికంగా నిలిపివేత

సియోల్ /గ్వామ్: జపాన్‌లోని గ్వామ్ ద్వీపం సమీప లక్ష్యంపై క్షిపణిని ప్రయోగించాలన్న ప్రణాళికను ఉత్తర కొరియా అధినేత కిమ్‌జోంగ్ ఉన్‌కు సైన్యాధికారులు వివరించారు. అయితే క్షిపణి ప్రయోగ ప్రణాళికను తాత్కాలికంగా నిలిపేయాలని ఆయన అధికారులను ఆదేశించారని ఉత్తర కొరియా అధికార వార్తాసంస్థ కేసీఎన్‌ఏ తెలిపింది. క్షిపణి ప్రయోగ యూనిట్లను కిమ్‌జోంగ్ ఉన్ తనిఖీ చేసినట్లు వెల్లడించింది.

ట్రంప్ సలహా మండలికి సీఈవోల రాజీనామా

జాత్యహంకార ర్యాలీని ఖండించనందుకు ముగ్గురు సీఈవోల నిరసన




ఇటీవల జరిగిన 'యునైట్ ది రైట్' ర్యాలీ

న్యూయార్క్, ఆగస్టు 15: అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు ప్రఖ్యాత కంపెనీల సీఈవోలు వరుసగా షాక్ ఇస్తున్నారు. మెర్క్, ఇంటెల్, అండర్ అర్మార్ సంస్థల చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లు వైట్ హౌస్ సలహామండలి నుంచి వైదొలుగుతున్నట్లు ప్రకటించారు. అమెరికాలోని వర్జీనియాలో గత శనివారం శ్వేతజాతీయులు, నయా నాజీలు 'యునైట్ ది రైట్' అనే పేరిట నిర్వహించిన జాత్యంహకార ర్యాలీ హింసాత్మకంగా మారింది. ఈ తరహా జాత్యంహకార ప్రదర్శనను అధ్యక్షుడు ట్రంప్ స్పష్టంగా ఖండించకపోవడాన్ని నిరసిస్తూ మెర్క్ సీఈవో కెన్నెత్ ఫ్రేజిర్, అండర్‌అర్మార్ వ్యవస్థాపకుడు, సీఈవో కెవిన్ ప్లాంక్, ఇంటెల్ చీఫ్ బ్రియాన్ క్రజానిక్ వైట్‌హౌస్ సలహామండలి పదవులకు రాజీనామా చేశారు. 'దేశంలో అసహనం, తీవ్రవాదం పెచ్చుమీరుతున్న పరిస్థితుల్లో.. దేశానికి ప్రమాదకరంగా పరిణమించే విషయాల్లో ట్రంప్ ఆలస్యంగా స్పందించడం సరికాదు' అని కెన్నెత్ ఫ్రేజిర్ తెలిపారు. దేశంలోని మిగతా వర్గాలకు భరోసా ఇవ్వాల్సిన సమయంలో అధ్యక్షుడి తీరు విస్మయపరిచిందన్నారు.

వైరస్‌పై 3డీ సినిమా

జీవితచక్రాన్ని వీడియోగా రూపొందించిన అమెరికా శాస్త్రవేత్తలు



వాషింగ్టన్, ఆగస్ట్ 15: మన శరీరంలోకి ఏదైనా వైరస్ ప్రవేశించినప్పుడు ఏం చేస్తుందో తెలుసా? ముందుగా మన కణజాలంలోని ఒక ఆరోగ్యవంతమైన కణంలోకి చేరి అందులో ఉన్న పదార్థాలను ఆరగించేస్తుంది. ఆ తర్వాత అందులో తన సంతతిని వందల సంఖ్యలో వృద్ధి చేస్తుంది. అనంతరం ఆ కణాన్ని పగులగొట్టి వందల సంఖ్యలో వైరస్‌లు విడుదలై ఇతర కణాల మీదికి దాడి చేస్తాయి. మనం గుర్తించలేనంత తక్కువ సమయంలో జరిగిపోయే ఈ ప్రక్రియ గురించి వివరించడానికి ఇన్నాళ్లూ సరైన ఆధారాలే లేవు. వైరస్ కణం మీద దాడి చేస్తున్న ఫొటో ఒకటి, వేలసంఖ్యలో వైరస్ కణాలు వృద్ధి చెంది బయటికి వచ్చే ఫొటో ఒకటి చూపుతూ పూర్తి ప్రక్రియను వివరించేవారు. అయితే అమెరికాకు చెందిన శాస్త్రవేత్తలు మన శరీరంలో వైరస్ వృద్ధి చెందే ప్రక్రియ మొత్తాన్ని 3డీ సినిమాగా రూపొందించి ఓ అరుదైన ఘనతను సాధించారు. విస్కిన్సన్–మిల్వాకీ యూనివర్సిటీకి చెందిన శాస్త్రవేత్తల బృందం వైరస్‌పై పరిశోధనలు జరిపి అవి మానవ కణాలపై దాడి చేస్తున్నప్పటి నుంచి కణంలోని ఇతర పదార్థాలను నాశనం చేయడం, వాటి సంతతిని వృద్ధి చెందించుకోవడం తదితర పరిణామాలను అన్నింటినీ 'ఎక్స్–రే ఫ్రీ ఎలక్ట్రాన్ లేజర్' కెమెరా సాయంతో కోట్ల సంఖ్యలో ఫొటోలు తీశారు. వాటన్నింటినీ వీడియోగా మార్చడానికి గణితంలోని జియోమెట్రీ, గ్రాఫ్ థియరీ, ఫిజిక్స్‌లోని పలు సూత్రాలను సంకలనం చేసి శక్తిమంతమైన 'ఆల్గారిథమ్స్'ను రూపొందించారు. దీని సహాయంతో ఫొటోలన్నింటినీ వీడియోగా మార్చి 3డీ రూపంలోకి తీసుకొచ్చారు. 'మేం రూపొందించిన ఈ విధానంతో వైరస్ తన రూపాన్ని ఎలా మార్చుకుంటున్నదో గుర్తించవచ్చు. ఇది వైరల్ వ్యాధుల అధ్యయనానికి ఎంతగానో ఉపయోగపడుతుంది. మరోవైపు శరీరంపై వైరస్ దాడిచేసినప్పుడు జరుగుతున్న పరిణామాలను తెలుసుకోవడం ద్వారా చికిత్స అందించడం సులభం అవుతుంది' అని పరిశోధక బృంద సభ్యుడు అబ్బాస్ పేర్కొన్నారు. వీరి పరిశోధన వ్యాసం 'నేచర్ మెథడ్స్' జర్నల్‌లో ప్రచురితమైంది.

వరద బీభత్సం



అస్సాంలోని మోరిగాన్ జిల్లాలో వరద ప్రభావంతో కొట్టుకుపోగా మిగిలిన రోడ్డుపై నిలబడి సహాయం కోసం ఎదురుచూస్తున్న బాధితులు

పాట్నా, ఆగస్టు 15: అస్సాం, బీహార్‌లలో వరద బీభత్సం కొనసాగుతున్నది. వరదల కారణంగా రాష్ట్రంలో మరో పది మంది మరణించారని అస్సాం అధికారులు మంగళవారం వెల్లడించారు. దీంతో వరదల కారణంగా ఇప్పటివరకూ ప్రాణాలు కోల్పోయిన వారి సంఖ్య 28కు పెరిగింది. రాష్ట్రంలోని మొత్తం 32 జిల్లాల్లో 25 జిల్లాలు భారీవర్షాలతో అతలాకుతలం అయ్యాయి. దాదాపు 33 లక్షల మంది ప్రజలు స్వస్థలాలను వదిలిపెట్టి సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లారు. మరోవైపు, వరద బీభత్సానికి బీహార్‌లో మృతుల సంఖ్య మంగళవారం నాటికి 56కు చేరింది. రాష్ట్రంలోని 13 జిల్లాలు జలమయం కాగా, 69.81 లక్షల మంది బాధితులుగా మారారు. వరదబాధిత ప్రాంతాలపై సీఎం నితీశ్‌కుమార్ రెండోసారి ఏరియల్ సర్వే నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా 1.61 లక్షల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించామని, వీరిలో 85,949 మందిని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన 343 సహాయక శిబిరాలకు తరలించినట్టు పేర్కొన్నారు.

నేపాల్‌లో పెరుగుతున్న మృతుల సంఖ్య

ఖాట్మండు: మూడురోజులుగా ఎడతెరపిలేకుండా కురుస్తున్న వర్షాలతో ముంచెత్తిన వరదలు, కొండ చరియలు విరిగిపడి నేపాల్‌లో మృతిచెందిన వారి సంఖ్య మంగళవారానికి 115కు చేరింది. మరో 40 మంది ఆచూకీ గల్లంతయ్యింది. దేశవ్యాప్తంగా 60 లక్షల మందిపై వరదలు ప్రభావం చూపాయి. చాలామంది ఇండ్లను కోల్పోయి.. మూడురోజులుగా తాత్కాలిక శిబిరాల్లోనే తల దాచుకుంటున్నారు. వరద ప్రభావిత మారుమూల ప్రాంతాలకు నేటికీ సాయం అందడంలేదు.

త్రిపుర సీఎం ప్రసంగం ప్రసారానికి డీడీ నో!

న్యూఢిల్లీ: త్రిపుర సీఎం మాణిక్ సర్కార్ స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగాన్ని ప్రసారం చేసేందుకు దూరదర్శన్ నిరాకరించిందని సీపీఎం ఆరోపించింది. కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న 'అనధికార ఎమర్జెన్సీ'కి వ్యతిరేకంగా పోరాడుతామని మంగళవారం తెలిపింది. దూరదర్శన్.. ఆరెస్సెస్–బీజేపీకి చెందిన ప్రైవేట్ సంస్థ కాదని సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి పేర్కొన్నారు. ఎన్నికైన సీఎంతోపాటు విపక్షాల గొంతు నొక్కి వేయాలన్న ప్రధాని మోదీ ఆదేశాల మేరకే ఇదంతా జరిగిందన్నారు. దీనిపై ప్రసార భారతి స్పందనేమిటో తెలియరాలేదు.

మాలిలో జంట 'ఉగ్ర' దాడులు

తొమ్మిది మంది మృతి

బార్మాకో: మాలిలోని వేర్వేరు ప్రాంతాల్లోని రెండు ఐక్యరాజ్యసమితి (ఐరాస) కేంద్రాలపై ఉగ్రవాదులు జరిపిన జంట దాడుల్లో తొమ్మిది మంది మృతి చెందారు. మృతుల్లో ఒక శాంతి దళ సభ్యుడు, ఒక కాంట్రాక్టర్, ఏడుగురు మాలి పౌరులు ఉన్నారని ఐరాస ఒక ప్రకటనలో తెలిపింది. అయితే భద్రతా సంస్థలు జరిపిన ఎదురు కాల్పుల్లో ఎనిమిది మంది ఉగ్రవాదులు హతమయ్యారు. మంగళవారం డౌయెంజా ప్రాంతంలోని మోప్తిలో, తింబుక్టు నగరంలో ఐరాస క్యాంప్ కార్యాలయాలపై ఉగ్రదాడులు జరిగాయి. ఈ దాడులను పిరికిపంద చర్యగా మాలీలోని ఐరాస ప్రత్యేక ప్రతినిధి అభివర్ణించారు.

అర్హులైన పాక్ పౌరులకు మెడికల్ వీసా

విదేశాంగశాఖ మంత్రి సుష్మా స్వరాజ్ వెల్లడి

న్యూఢిల్లీ, ఆగస్టు 15: వైద్య సేవలు పొందేందుకు అవసరమైన వీసా కోసం దరఖాస్తు చేసుకున్న పాకిస్థాన్ పౌరులకు మెడికల్ వీసా జారీ చేస్తామని విదేశాంగశాఖ మంత్రి సుష్మా స్వరాజ్ తెలిపారు. భారత స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మంగళవారం సుష్మా ట్విట్టర్‌లో.. అర్హులైన వారికి మెడికల్ వీసాలు జారీ చేస్తామని ప్రకటించారు. ఈ ట్వీట్‌ను పాకిస్థాన్‌లో భారత హైకమిషన్ ట్విట్టర్ ఖాతాకు ట్యాగ్ చేశారు.



శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో భాగంగా మంగళవారం ముంబైలో ఉట్టికొడుతున్న యువకులు. 'దహీ హండీ' పేరుతో మహారాష్ట్ర వ్యాప్తంగా జరిగిన ఈ వేడుకల్లో కిందపడి ఇద్దరు మరణించగా, 45 మంది యువకులు గాయపడ్డారు.

AEO తెలుగు మీడియం 9వ బ్యాచ్ ఆగస్టు 21న ప్రారంభం
Exclusive English Medium Batch starts from August 24th @ 10am
గ్రూప్-2, VRO, JAO న్యూ బ్యాచ్‌లు ప్రారంభమైనవి
HA హారీష్ THE BEST అకాడమీ
8341116915, 9493682595

DSC (TRT) SGT, SA (All) TPT, PET
కొత్త బ్యాచ్‌లకు అడ్మిషన్లు జరుగుచున్నవి
బాసర ఇన్‌స్టిట్యూట్
8686344155 7674883883

TRT (DSC) (Teacher's Recruitment Test)
SGT, SA (All Sub.), TPT, PET
మా ప్రత్యేకతలు: Daily Testలు, Weekly Grand Testలు నిర్వహించబడును
FREE DEMO: 20-08-17 at 10.08 am
RAMAIAH Competitive Coaching Centre
Dilsukhnagar, HYDERABAD Cell:8885555202 8885859000, 040-66778422

SI & కానిస్టేబుల్స్ - VRO E/M T/M
SI T/M న్యూ బ్యాచ్ ఆగస్టు 17 @ 8 am
PC & VRO-VRA Aug 17 @ 8 am
SI E/M 4th Batch Aug17 @ 2 pm to 8 pm
భాగ్యకిరణ్ ఇన్‌స్టిట్యూట్ DSNR, HYD
9848056352

SI-కానిస్టేబుల్స్ TM EM
VRO/VRA, G-IV, Forest
అడ్మిషన్లు జరుగుచున్నవి
రామయ్య ఇన్‌స్టిట్యూట్ Dilsukhnagar, Hyderabad
Cell : 8885555202, 8885859000, 040-66778422

TSPSC - GROUP-II
FREE DEMO
Sun 20-8-2017 @ 10.00AM
అడ్మిషన్లు జరుగుచున్నవి Fee: 9,999/-
GROUP-I Mains Weekend Batch available
గోల్కొండ అకాడమి
Ashoknagar, Hyd. ✆ 9515366571/ 72

S.I & కానిస్టేబుల్స్, VRO/VRA.
ఫారెస్ట్ బీట్ ఆఫీసర్స్,
Hydel New Batches
T/M & E/M Batch
New Batchలు 20-8-17
9533838639
భాగ్యనగర్ ఇన్‌స్టిట్యూట్ DSNR, HYD.
040-24064477,040-66338639


తరచుగా వచ్చే తలనొప్పిని అలక్ష్యం చేయవద్దు...పొంచివుండే పెనుముప్పు

యశోద హాస్పిటల్స్‌లో అత్యాధునిక 'న్యూరో' చికిత్సలు

డిపార్ట్‌మెంట్ ఆఫ్ న్యూరాలజీ అండ్ న్యూరో సర్జరీ
యశోద హాస్పిటల్స్ - హైదరాబాద్
సికిందరాబాద్, సోమాజిగూడ, మలక్ పేట్
ఫోన్ : 81210 22333

అదే పనిగా వేధించే, ఏకాగతను దెబ్బతీసే వ్యక్తి–పనిని ''ఇదో తలనొప్పి'' లేదా ''ఈయనో పెద్ద తలనొప్పి'' అంటూవుంటాం. ప్రాచుర్యంలో ఉన్న ఈ వ్యాఖ్యల వెనుక సాధారణంగా తలనొప్పి కలిగించే విపరీతమైన విసుగు, వేదన స్పష్టంగా కనిపిస్తుంటుంది. శిరోవేదన ఎంతగా బాధిస్తుందంటే దాంతో వ్యక్తి ఏ పనీ చేయలేని పరిస్థితిలో చిక్కుకుంటారు. మనతోపాటు ప్రపంచంలోని అన్ని దేశాలలోనూ తలనొప్పి బారినపడే వారి సంఖ్య చాలా ఎక్కువ. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూ.హెచ్.ఒ.) అంచనాల ప్రకారం ప్రపంచంలోని ప్రతీ ఇరవై మందిలో ఒకరు తలనొప్పితో బాధపడుతున్నారు. సాధారణంగా అత్యధికులు అత్యధిక సందర్భాలలో ఏదో ఓ నొప్పినివారణి టాబ్లెట్ వేసుకుని బయటపడటానికి ప్రయత్నిస్తుంటారు. కాని కొన్ని సందర్భాలలో తలనొప్పి టాబ్లెట్లు వేసుకుంటే కొంత తగ్గినట్లు కనిపించినా మళ్లీ రెట్టించిన తీవ్రతతో దాడిచేస్తుంది తప్పించి పెద్దగా ఫలితం కనిపించదు. అన్ని వయస్సులు, వృత్తి వ్యాపార రంగాలలో వేగం–వత్తిడి పెరిగిన ప్రస్తుతం సమాజంలో మొత్తం మీద తలనొప్పి తరచూ తలెత్తే ఆరోగ్య సమస్యగా తయారయ్యింది.

అందరికీ అనుభవంలోకి వచ్చినదే అయినా తలనొప్పిని నిర్వచించటం, ఖచ్చితంగా ఈ కారణం వల్లనే అని చెప్పటం మాత్రం కష్టం. అదే సమయంలో కేవలం తలనొప్పినే కదా అని విస్మరించనూలేము. రోజువారీ ఒత్తిడి మొదలుకుని మెదడులో రక్తస్రావం వరకు వివిధ అనారోగ్యాలను సూచించే తలనొప్పిని తెలికగా తీసుకోవటం ప్రమాదకరం కావచ్చు కూడా. తలనొప్పికి మరింత స్పష్టమైన కారణాలను కనుగొనేందుకు, తరచూవచ్చే తల నొప్పుల నుంచి విముక్తి పొందేందుకు గల అవకాశాలను గుర్తించి చికిత్సా పద్ధతులను రూపొందించేందుకు ఆధునిక వైద్యశాస్త్రం తీవ్రంగా ప్రయత్నిస్తున్నది. తలనొప్పిలోని రకాలు, అవి రావటానికి కారణాలు, తలనొప్పి వ్యాధా లేక ఇతర వ్యాధుల తాలూకు లక్షణమా గుర్తించేందుకు జరుగుతున్న పరిశోధనలు ఆసక్తికరమైన విషయాలను వెల్లడిస్తున్నాయి.



మన శరీరంలో తరచూ నొప్పికి గురయ్యే భాగం తల. అయితే తలనొప్పి కేవలం తలకు మాత్రమే పరిమితం కాదు. మెడపైభాగం లేదా తల నుంచి ఇది మొదలవుతుంది. తీవ్రమైన వేదననే 'తల నొప్పి'. కపాలం, మెదడు చట్టూ ఉండే కణజాలం –నిర్మాణంలో ప్రారంభమవుతుంది. మెదడుకు సంబంధించి నొప్పిని తెలియజేయ గల నాడులు (పెయిన్ ఫైబర్స్) లేవు. అందువల్ల దాని చట్టుతా ఉన్న కణజాలపు స్పందనలే తలనొప్పిగా వ్యక్తం అవుతుంటాయి. కపాలం, కళ్లు, చెవులు, సైనస్‌లను దాచి ఉంచే ఎముకలు–కండరాలను శరీర అంతర్భాగంలో పెరిస్టోరియం అనే పలుచని పొర కప్పివుంటుంది. ఈ పొరనే మెదడు, వెన్నుపాము, ధమనులు–సిరలు, నాడులను కూడా కప్పి ఉంచుతుంది. పలుచని ఈపొర కొన్నిసార్లు వాపువల్లనో లేక ఇరిటేట్ అవటం వల్ల తల నొప్పికి దారితీస్తుంది. ఈ నొప్పి తక్కువ తీవ్రతతో లేదా తీవ్రంగా, భరించలేనిదిగా ఉండవచ్చు. సాధారణంగా తలనొప్పి కొద్ది గంటల పాటు మాత్రమే ఉండవచ్చు లేదా రోజుల తరబడి విడవని వేదనగానో ఉండవచ్చు.

తల నొప్పి పలు రకాలు

ఇంటర్నేషనల్ హెడ్డెక్ సొసైటీ తలనొప్పిలో మూడు రకాలు ఉంటాయని వర్గీకరించింది. ప్రపంచ వ్యాప్తంగా శిరోవేదనతో బాధపడుతున్న వారి సంఖ్య పెరుగుతున్నది. వీరికి ఉపశమనం కలిగించేందుకు వేర్వేరు చికిత్సలు అవసరమవుతున్నాయి. దీంతో వ్యాధిగ్రస్థుల పరిస్థితిని ఖచ్చితంగా అంచనా వేసి చికిత్స నిర్ణయించి ఉపశమనం కలిగించటానికి ఉపయుక్తంగా ఉంటుందని చెబుతున్నారు. ఇంటర్నేషనల్ హెడ్డెక్ సొసైటీ (ఐ.హెచ్.ఎస్.) విడుదల చేసిన సవివరమైన వర్గీకరణను దష్టిలో పెట్టుకునని వైద్యరంగ నిపుణులు సూచనల ఆధారంగానే ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా తల నొప్పులకి చికిత్సలు జరుగుతున్నాయి. ఈ వర్గీకరణ ప్రకారం తలనొప్పులు ప్రధానంగా మూడు రకాలు:ప్రైమరీ హెడ్డెక్స్, సెకండరీ హెడ్డెక్స్, కార్నియల్ న్యూరాల్గియాస్, ఫేషియల్ పెయిన్. చికిత్సా సౌలభ్యం కోసం ఈ విధంగా వర్గీకరించినప్పటికీ ఒక వ్యక్తి ఒకటి కంటే ఎక్కువ రకాల తల నొప్పితో బాధపడుతూ ఉండవచ్చు. అవి కలిసి కట్టుగా ఒకేసారి వ్యక్తం అయ్యే అవకాశం కూడా ఉంటుందని కూడా ఐ.హెచ్చ్.ఎస్.సూచించింది.

ప్రైమరీ హెడ్డెక్స్: మెదడులో జరిగే రసాయనచర్యలు, మెడ–తల–కపాలంలోని రక్తనాళాలు, కండరాల వల్ల ఈ తలనొప్పులు వస్తాయి. ఇవి కొంతమందిలో వంశ పారంపర్యంగా వస్తున్నట్లు గుర్తించారు. ప్రైమరీ హెడ్డెక్స్‌లో ముఖ్యంగా మూడు విధాల తలనొప్పులు, మైగ్రెయిన్–టెన్షన్–క్లస్టర్ హెడెక్స్ ఉన్నాయి. శారీరకంగా, ఉద్వేగపరంగా ఏర్పడిన వత్తిడి కారణంగా టెన్షన్ హెడ్డెక్ వస్తుంది. ఇది హఠాత్తుగా వచ్చే సాధారణమైన తలనొప్పి. ఇది పురుషులలో కంటే స్త్రీలలోనే అధికంగా కనిపిస్తుంది. మన దేశంలో ఏడున్నర కోట్ల మంది దీనితో బాధపడుతున్నారు. పదే పదే వచ్చే, రెండో అతి సాధారణ తలనొప్పి మైగ్రెయిన్. పిల్లలు, పెద్దలు అందరిలో కనిపిస్తుంది. ఇది తీవ్రమైన వేదన కలిగిస్తూ, ఒక తలకు పక్కన వస్తుంది. ఒక్కోసారి ఒకవైపునకు వస్తుంటుంది. కడుపులో వికారం, వాంతులతో ఉండే ఈ తలనొప్పిలో వెలుతురు, శబ్దం భరించలేనివిగా తోస్తాయి. ప్రైమరీ హెడ్డెక్స్‌లో చివరిన క్లస్టర్స్ తలనొప్పులు అరుదైనవి. ఇరవైనుంచి ముప్పయ్ ఏళ్లలోపు పురుషులలో అధికంగా కనిపిస్తుంటాయి. తీవ్రమైన నొప్పితో నాలుగు నుంచి ఎనిమిది వారాల పాటు వేధించుతాయి.

సెకండరీ హెడ్డెక్స్: ఇవి భరించలేని వేదనతో కూడిన తలనొప్పులు. తల, మెడ ప్రాంతాలలో నిర్మాణ సంబంధమైన సమస్యల కారణంగా ఈ తలనొప్పులు వస్తుంటాయి. అంటే ఇవి ఒక రకంగా తల, మెడ ప్రాంతంలో ఆరోగ్య సమస్యలకు సూచికలు అన్నమాట. పంటి నొప్పి, సైనస్ వంటి సర్వసాధారణ అస్వస్థతలు మొదలుకుని ప్రాణాంతకమైన మెదడులో రక్తస్రావం, మెదడులో గడ్డలు, ఎన్ సెఫలైటిస్–మెనిన్‌జైటిస్ వంటి మెదడు ఇన్‌ఫెక్షన్లను ఈ తలనొప్పులు సూచిస్తాయి. తలనొప్పి మందులు మితిమీరిన పరిమాణంలో వాడటం, మద్యం–మత్తు మందుల అలవాటు కూడా ఈ రకమైన తలనొప్పులు కలిగిస్తుంది.

కార్నియల్ న్యూరాల్గియాస్, ఫేషియల్ పెయిన్: ఇవి నాడుల నొప్పి కారణంగా వచ్చే తలనొప్పులు. మెదడు నుంచి బయలుదేరి తల, మెడ భాగంలో కండరాలను అదుపుచేస్తూ వాటి నుంచి వెలువడే సెన్సరీ స్పందనలను మెదడుకు తీసుకు వెళుతుండే 12 కార్నియల్ నాడులు గాయపడటం, అంటువ్యాధులకు గురవటం, అనారోగ్యానికి లోనవటం, నిర్మాణపరమైన సమస్యలు ఎదురవటం కారణంగా తలనొప్పులకు కారణం అవుతుంటాయి. వీటిలో ప్రముఖమైనది ట్రైజెమినల్ న్యూరాల్గియా. ఇది నాడుల ముఖాన్ని కప్పి ఉంచే నాడి (కార్నియల్ నర్వ్)ను ప్రభావితం చేస్తుంటుంది. ఈ 12 కార్నియల్ నాడుల కారణంగా మొత్తం పలు రకాల తలనొప్పులు వస్తున్నట్లు గుర్తించారు.

తలనొప్పులను, ప్రత్యేకించి విడువకుండా వేధించే వాటిని తేలికగా తీసుకోవద్దని యశోద ఆస్పత్రిలోని న్యూరాలజీ విభాగపు వైద్యులు సూచిస్తున్నారు. తలనొప్పులు రోజువారీ ఒత్తిడి, స్వల్ప అస్వస్థతతోపాటు తీవ్రమైన అనారోగ్యానికి సూచికలని వారు తెలిపారు. ప్రాణాంతక వ్యాధులకు సూచనగా ఉండే ఇటువంటి తలనొప్పులను, వాటి వెనుక వ్యాధుల చికిత్సకు సంబంధించి అత్యాధునిక వసతులతో యశోద హాస్పిటల్స్‌లోని న్యూరాలజీ విభాగాన్ని అభివృద్ధి చేశారు. దాదాపు 1100 రకాల న్యూరొలాజికల్ కండిషన్స్, వ్యాధుల చికిత్సకు దీనిలో ఏర్పాట్లు ఉన్నట్లు ఆ వైద్య విభాగంలోని డాక్టర్లు తెలిపారు. ఏభై సంవత్సరాలకు పైబడిన వయస్సుగల వారిలో విడువని తలనొప్పి ఉన్నా, శిరోవేదనతోపాటు వ్యక్తి తికమకపడుతున్నట్లు–మాటలు తడబడుతున్నట్లు గుర్తించినా, భరించలేని తలనొప్పితోపాటుగా తీవ్రమైన జ్వరం వచ్చి తగ్గకుండా ఉన్నా వెంటనే వైద్య నిపుణుడి వద్దకు తీసుకువెళ్లాలని చెప్పారు.